

ఖర
మార్గశీర్షము

భారతి

సంపుటము 28
సంచిక 12

హృదయగీతము

శ్రీ బొడ్డు బాపిరాజు

౧

కమ్మని పూలవేకువ నొకానొకనాఁడెదలోని లోమవా
రమ్మును తట్టిలేపినటులయ్యెను; మీటిన వీణెతీగపై
గ్రమ్మ స్వరమ్ములౌచు దొలకాడెతలంపులు; పాడుకొందు పూ
రెమ్మల మూఁగగొంతు తెరలెత్తిన యామని కోయిలంబలెన్.

౨

నాడు జగమ్ము క్రొత్తగ గనంబడె! నీలిమొయిల్ శివల్లరా
పాడెను పాలవెన్నెలలు, పండువెదుళ్లు, తురాయిపూల క్రీ
నీడలు, సంజకెంపు లొడిచింపు బసంగిపోలాలు సన్న వెం
టాడు నిగారపుం దళుకు టందములన్ బలికింప పద్యముల్

3

చెలువపు రేకయా ప్రకృతిచిన్నది ప్రొద్దొక వన్నెగాఁగ నిం
పుల చెలికత్తె లారు ఋతువుల్ సవరించు పిసాళిసోయగ
మ్ములు మెరుగారగా గరగిపోయెదు తీయని తేటతేనె మూ
పల, నెలవంక వెన్నెలలు జానుతెనుంగులు పుల్కరింపగా!

౪

తెలియవు చీకటుల్ బ్రతుకు తెన్నుల రక్కసముల్లు; పాల పొం
గులతోలు జవ్వనంపు కళుకుల్ తళుకొత్తిన క్రొత్తనాళ్ల శి

న్నెలలను సన్నజాజులని నేను జగమ్మునుకొంటి ప్రేయసీ
చలదధరాగ్రరాగ మధుసంధ్యల చారు సితాభ్ర రేఖనై!

౫

గగనపు టంచుల న్నిలిచిగాన మొనర్తు సుఖమ్ములం, దధో
జగములకంట క్రుంగెడ విషాదభరమ్ముల మ్రోసి; రెంటికిం
దగులనిచోటు లీపుడమిదాగుచు మూతల యూటలోన నెం
దగపడ, వాగిపోయె నడుగాడక డస్సిన భావనాశ్వముల్!

౬

చల్లని నీడకై వెదుకి సాగి పథిశ్రమతీర నీమనం,
బెల్లెడ వేడిగాడ్పుబునలే యెదురయ్యెను! నవ్వుమోములో
నల్లని గుండెదాచుకొని నాటకమాడు జగమ్ము దెల్పనీ
పిల్లనగ్రోవిపై పలుకవే! కలనాదసుధా ప్రసాదముల్.

౭

పలవించున్ ప్రవహించు శాంతికసి; తత్పాదాగ్రముం జేరగా
గలదో! నిప్పెడరులం దికుకునో? కార్కొన్న గండ్రాతి కొం
డల వెన్నాడునో? దుర్నిదాఘ విపదంష్ట్రిజ్వాల పాలౌనో? నా
యలరుందేనెలవాక; ఎవ్వరు సమస్యాపూర్తిగానింతురే!

౮

“నాకులభించె దివ్యగగనాలయ కాంచన పద్మగంధి మం
దాకిని” యంచు పాడుకొనినాను; తదీయ సుధామయోర్మికా
శీకరముల్ హృదంతరము చిందియు చిందని యంతలోన వే
బోకలమంచుగా కరగిపోయిన దాశల రాల్చి స్వప్నమై!

౯

రాలిన వానలెల్ల! శిశిరావృత బాల తమాలశాఖగా
వ్రేలు నెడంద నేడు వినిపింపవు కావ్యకలావతీ పదో
చ్చాలిత నూపురధ్వనులు! చక్కని పూర్వవసంత సౌరభ
శ్రీలు మరొక్కసారి తరళింపవె యీ ప్రమదావనమ్మునన్!

౧౦

ఇది నవజీవన గీతము
కదలించు నగాధహృదయకాంతులు తమముల్;
విదియ నెలరేకయై దిగి
చిదికిన గుండెలను దీపశిఖ వెలిగించున్!

ఆంధ్ర వైష్ణవ వాఙ్మయము

★

శ్రీ నిడదవోలు వేంకటరావు

ఆంధ్ర సాహిత్య పరిషత్కార్యాలయమున గ్రం. సం. ౧౬౬౦ 'సింధుమతీ విలాసము' అను గ్రంథము గలదు. ఇది రెండాశ్వాసముల ప్రబంధము. దీనిని రచియించిన కవి 'గోపనమంత్రి' యని యీ క్రింది గ్రంథాంత గద్యవలన తెలియుచున్నది.

"ఇది శ్రీ మదాపస్తంబసూత్ర, భారద్వాజస గోత్ర, వరపనామాత్యపుత్ర శ్రీ వేంకటేశ్వర కరుణా కవిత విలాస శ్రీమత్ప్రతివాది భయంకర వేదాంత దేశికోపదేశ విమలీకృత శిక్షిత శ్రీమదష్టాక్షరీమంత్ర రాజ జపవిరాజమాన నిజహృదయ కమలకర్ణికా కార సుకవి జన విధేయ గోపన నామధేయ ప్రణీతంబైన సింధుమతీ విలాసం బను శృంగారరస ప్రధాన ప్రబంధంబున ప్రథమాశ్వాసము"

ఇందు మధురాపురమునందు జయుడను వానికిని, సింధుమతియను నొక వేశ్యాంగనకును గల సంబంధమే యిందు వర్ణితమైనది. మధ్య మధ్య సంస్కృత శ్లోకములు గూడ గలవు. మచ్చునకు—

శ్లో. సోయం సింధుమతీ విలాస
మఖిలం శృంగార సంపత్కరం
వాచామంజ్ర్ద వీయకం పటుమదం
నానావిధో ద్వాహకం
పశ్యన్నాధు జన స్సుకావ్య రచనః
కోవాత్మను స్వాపిచేత్
బిందుర్వా యది గీతివా బహువిధాః
పాతిర్మ్యమైవా యది.

పద్య రచన.

చ॥ కడు ధ్రువ జెంది గొంకుచు
వికారము నొందుచు భిన్నమూర్తియై
పొడమిన సెవ్వ గవ్వభుడు
భూరి దయారహితాత్ముడైన వా
నడరెడు పద్మినీ ముదిత
యందము నాబటు సాంద్రనాద పై
కడువక్తి రేకి సంఘము
కకారవమంటి సెలంగె దిక్కులన్.

ఈ ప్రతిని ప్రమోదూతనామ సం॥ శ్రావణ బ ౨ భౌమవారము సంపూర్ణముగా చందానాగలింగము వ్రాసికొనెను.

(ఆంధ్రసాహిత్య పరిషత్పుస్తక భాండాగారము సం ౧౫౦ సంపుటము ౨ పుటలు ౩౯౬—౩౯౭)

ఈ గోపన కవినిగూర్చియు, గ్రంథమును గూర్చియు గోలుకొండ కవుల సంచికలో పూర్వ కవి పరిచయము అను శీర్షిక క్రింద ౩౯౨ పుటలో నిట్లు వ్రాయబడి యున్నది.

౩౨ గోపమంత్రి. ని. (నివాసము) గార్ల. కా. (కాలము) క్రీ. శ. ౧౬౦౦ ప్రాంతము. ర (రచన) సింధు మతీ విలాసము. పద్య కావ్యము.

వి. విశేషములు. కవి భారద్వాజ గోత్రుడు. సింధు మతియను వేశ్యకు జయుడను యువకునకు గల సంబంధము దెలుపు శృంగార కావ్యము ఇందు సంస్కృతాంధ్రకవిత గలదు.

దీనినిబట్టి పైని యుదాహరించిన పరిషత్తులోని గ్రంథమును, నిదియును నొకటియే యనియు, కవియు నొకడేయనియు, గ్రంథవిషయముకూడ నొకటియేయని మనకు స్పష్టమగు చున్నది. మఱియు గోపన కవి తెలింగాణా ప్రాంతము వాడనియు క్రీ.శ.౧౬౦౦ ప్రాంతము వాడనియుకూడ తెలియుచున్నది. కాని గద్యయందలి 'శ్రీ మత్ప్రతివాది భయంకర వేదాంత దేశికోప దేశ విమలీకృత శిక్షిత శ్రీమదష్టాక్షరీ మంత్రరాజ జపవిరాజమాన నిజ హృదయకమల కర్ణికా కార' అను విశేషణ వాక్యమును చూచిన గోపన కవి విశిష్టాద్వైత మతమున ప్రత్యేక విశ్వాసము గలిగించిన శ్రీ వేదాంత దేశికుల వారిచే స్వయముగా నుపదేశ ముకొందిన వైష్ణవాగ్రేసరుడనియు నాతడుకూడ శ్రీ

వేదాంత దేశికుల కాలము వాడేయనగా క్రీ. శ. ౧౩౭౦ ప్రాంతము వాడనియు మనము నిశ్చయింప వచ్చును.

ఈ గోపన, విజనగర సామ్రాజ్య స్థాపనమైన మొదటి ఘట్టములో, మహమ్మదీయులను దక్షిణదేశములో కాలు నిలుపకుండ-యరికట్టిన చారిత్రక మహాపురుషుడు. ఈ క్రింది వివరించిన చారిత్ర కాంశముల వలన చారిత్రక పురుషుడగు గోపనయే సింధుమతీ పరిణయమును రచించిన కవియని, నిశ్చయింప వచ్చును. ఇందులో నుదాహరింప బడిన శాసనముల లోని విషయములు పై గ్రంథమునందలి గద్యలోని విషయములతో సమన్వయములగుచుండుటవలన, ప్రాచీనాంధ్ర కవులలో గోపన యొకడని నిర్వివాదముగా తేలుచున్నది. మఱియు కృష్ణమాచార్యుల వెనుక యాంధ్రవైష్ణవ వాఙ్మయమున నితడు రెండవ వైష్ణవకవియని యెన్నదగును.

దక్షిణదేశముపై క్రీ. శ. ౧౩౨౭ ప్రాంతమున మహమ్మదీయులు దండెత్తివచ్చి తొండెమండలమును జయించి శ్రీరంగ క్షేత్రమును కొల్లగొట్టివచ్చినప్పుడు, ఆ దేవాలయమునందలి యర్చకులు శ్రీ రంగనాథుని విగ్రహమును మైసూరి మండలమున నున్న తిరునారాయణ పురమను నామాంతరము గల మేల్కోటయందు కొన్ని దినములు భద్రముగా దాచిరి. ఆ వెనుక నా విగ్రహమును శ్రీ తిరుపతి క్షేత్రమునకు దీసికొనిపోయి శ్రీ వేంకటేశ్వర స్వామితో అచ్చటనే నిత్య పూజాదికములను నెఱవేర్చుచుండిరి.

క్రీ. శ. ౧౩౩౬ లో విజయనగర సామ్రాజ్య మేర్పడిన వెనుక సంగమ వంశీయుడగు హరిహర రాయలు, తన సోదరుడును సైన్యాధిపతియు నగు వీరకంపరాయని మహమ్మదీయులని వారించి తొండె మండలములను జయించుటకు పంపెను. ఈ వీరకంపరాయునికి సహాయభూతుడుగా నున్న సేనానాయకులలో సింధుమతీ పరిణయ ప్రబంధకర్త యగు గోపన యొకడు. ఈతడా కాలమునాడు 'చెంజీ' దుర్గమునకు పరిపాలకుడుగా నుండెను. మధురను గూడ వశపఱచుకొన్న మహమ్మదీయులను కంపరాయడు జయించి,1 దక్షిణదేశాంతర్గతములగు పాండ్య చోళ, రాజ్యములను విజయనగర పాలనక్రిందికి దెచ్చెను.

గోపన సేనాని శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుటకు తిరుపతి క్షేత్రమునకు వెడలి అచ్చట వేంకటేశ్వర దేవుని ప్రక్కనున్న మఱియొక విగ్రహము గాంచి యచ్చటి యర్చకులను ప్రశ్నించెను. వారది శ్రీ రంగనాథుని విగ్రహమనియు, మహమ్మదీయుల బారినుండి తప్పించి, యచ్చట భద్రపఱచుచుంటిమనియు నాతనికి ప్రత్యుత్తర మిచ్చిరి. అంత గోపన, రంగనాథుని విగ్రహము తిరిగి శ్రీరంగమున పునఃప్రతిష్ఠ చేయుటకు వారి యనుమతిని బడసి, యా విగ్రహమును, తిరుపతినుండి, తన రాజధాని యగు చెంజీ దుర్గమునకు చేరువనున్న సింగవర గ్రామమున రాతి దేవళములో నిలిపెను.

ఇంతలో మహమ్మదీయులు శ్రీరంగము నాక్రమించుకొనిరి. కాని మహమ్మదీయ సైన్యాధ్యక్షుని కా ప్రదేశము పసిగా నుండక పోవుటచే, శ్రీరంగమును విడిచి యాతడచ్చట కాలు పైశ్చదూరమున నున్న సమయవరమును రాజధానిగా జేసికొనెను. తురుష్కులిట్లు దేవాలయప్రదేశమునుండి తొలగి పోవుట,కంపరాయలుమధురాపట్టణమునుజయించుట-గోపన్న వైష్ణవభక్తిగలిగియుండుట శ్రీరంగమునందలి యర్చకు లెఱింగి, గోపన్నతో యుత్తరప్రత్యుత్తరములు జరుపుచుండిరి. గోపన్నయు సరియగు సమయము చూచుకొని, క్రీ. శ. ౧౩౭౧ లో బ్రహ్మాండమగు సైన్యమును గూర్చికొని, మహమ్మదీయులను పూర్తిగ నోడగొట్టి, సింగవరములో వేంచేసియున్న శ్రీరంగనాథుని విగ్రహమును, మహావైభవముతో శ్రీరంగమున ప్రతిష్ఠించెను.

ఈ మహాకార్యమున కత్యంతానందము నొంది, మహాప్రసిద్ధులగు శ్రీ వేదాంత దేశికులవారు గోపనను స్తుతియించుచు రెండు శ్లోకములను చెప్పిరి. అవి

1. ఈ జయవృత్తాంతమే 'కంపరాయ చరిత్ర' లేక మధురా విజయము అను సంస్కృత కావ్యమున వర్ణితమైనది. కంపరాయని రాణులలో నొకతెయు, కమనీయ కవయిత్రియునగు గంగాదేవి లేక గంగాంబ రచియించినది. ఇందులో సంస్కృత కవిస్తుతిలో తెనుగుకవి తిక్కయజ్వస్తుతి గలదు. ఈ కావ్యము క్రీ. శ. ౧౯౨౮ లో ముద్రితమైనది. దాక్షిణాత్య కవయిత్రులు రచియించిన కృతులలో నిదియు పరిగణింప దగినది.

రెండును, శ్రీ రంగము దేవాలయమున తూర్పు ప్రాకారమున శిలాశాసనరూపమున వెలయుచున్నవి.1 ఆశ్లోకములివి. ఈశాసనకాలము. క్రీ. శ. ౧౩౭౧ స్వస్తి శ్రీ బంధుప్రియే శాకాబ్దే.

౧. ఆనీయానీలశృంగద్యుతి రచిత జగ
ద్రంజనాదంజనాద్రే
స్స్వేచ్ఛానారాధ్య కాంచిత్సమయ
మయస్తే హనుష్కాన్ తురుష్కాన్
లక్ష్మీక్ష్మాభ్యాముభాభ్యాం సహనిజ
నిలయే స్థాపయన్ రంగనాథమ్
సమ్యగ్వర్యాం సపర్యాం కురుతనిజ
యశోదర్పణో గోపణార్యః.

౨. విశ్వేశం రంగరాజం వృషభగిరి
తటాత్ గోపణక్షోణిదేవో
నీత్వా స్వాం రాజధానీం నిజబల
నిహతోత్ సిక్తతౌలుష్కసైన్యః
కృత్వా శ్రీరంగభూమిం కృతయుగ
సహితాం తత్ర లక్ష్మీమహీభ్యామ్.
సంస్థాప్యైనం సరోజోద్భవ ఇవకురుతే సాధు
చర్యాం సపర్యామ్.

ప్రతివాది భయంకర బిరుదము ధరించిన వారిలో ప్రథములు వేదాంతదేశికులే, వీరు శతాధిక గ్రంథకర్తలై శతాధికముగ జీవించిరి. (క్రీ. శ. 1270–1832)

ఈ శాసనములోని మొదటిశ్లోకము గురుపరంపరా ప్రభావము అను తమిళ వైష్ణవ మతగ్రంథమున నుదాహృతమై యున్నది. మఱియును వైష్ణవ దేవాలయములను గూర్చి తెలుపు "కోయిలొలుగు" అను చారిత్రిక గ్రంథమునగూడ నీగోపన మహాత్మ్యము విశదీకరింప బడియున్నది. ఆ గ్రంథమున గోపన, శ్రీ రంగనాథుని ప్రతిష్ఠించు సమయమున నా దేవునికి ౫౨ గ్రామములను సమర్పించెనను విషయము గూడ గలదు.

గోపన యాంధ్రబ్రాహ్మణ నాయకుడైనను, యాతడు ద్రవిడదేశమునందు పరిపాలన మొనర్చుటచే నాతనిగూర్చిన శాసనము లరవభాషలో నున్నవి. అచ్చరపాకము శాసనమున,2 గోపన బ్రాహ్మణుడు, ఆపస్తంబ సూత్రుడును, భారద్వాజ గోత్రుడు నైనట్లు తెలుపబడి యున్నది. కాంచీపురము శాసనములలో మూడింటియందు, గోపన పేర్కొనబడి యున్నాడు. అందొక దానిలో గోపనకు అయ్యన అనుకుమారు డున్నట్లు తెలియుచున్నది.3

ఇక 'సింధుమతీ పరిణయము' ముద్రితమై ప్రకటితమైనచో, నదియాంధ్ర సాహిత్యమున కొక యమూల్యాలంకారమే యగును.

1. *Ranganatha Inscription of Gopanna S. S. 1293—Epigraphica Indica, Vol VI. No 33 Pages 322 - 330.*

2. *Epigraphical Report, (Achcharapakam (No. 250 of 1901).*

3. *South Indian Inscriptions* Vol. I *(No. 86-88 & E. P. R. No. 33 of 1890.)*

అమెరికన్ రాయబారి-ఛెస్టర్ బౌల్స్

★

ఛెస్టర్ బౌల్సు, కానెక్టికట్ రాష్ట్రానికి ౧౯౪౮లో గవర్నరుగా ఎన్నికయాడు. ౧౯౪౬ లో డెమోక్రాట్ పక్షంవారు ఇతన్ని రాజకీయ అభ్యర్థిగా నిలబెట్టటానికి సంకోచించారు. రాజకీయాలలో వృద్ధికి రావలసినవాడికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉండాలనీ అప్పటికి సాంప్రదాయంగా వస్తూన్న అవసర లక్షణాలు బౌల్స్‌కు లేవనీ డెమోక్రటిక్ పార్టీ నాయకులు అనుకొన్నారు.

బౌల్స్, గవర్నరు స్థానానికి అభ్యర్థిగా నిలబడతానని ౧౯౪౬ లో డెమోక్రాటిక్ పార్టీ అగ్ర నాయకులను కోరాడు. "నీవు ఇన్నాళ్లు గడిపిన వ్యాపారజీవనము, పద్ధతులూ, నీ విపరీత లక్షణాలూ రాజకీయాలకు పనికిరావు. నువ్వు ప్రజాదరణ పొంది ప్రజలను సన్నిహితులనుగా చేసుకొనే అవకాశం ఎంతమాత్రం లేదు. ముఖ్యంగా యుద్ధకాలంలో నీవు సర్వాధికారిగా పనిచేసిన శాఖన్నా, శాఖలో వ్యక్తులన్నా ప్రజలకు తలనొప్పి. అదీకాకుండా, కంట్రోళ్ళతో జనం విసిగిఉన్నప్పుడు నువ్వు కావాలని మూర్తించి కూర్చున్నావు. రూజ్వెల్టునాటి 'న్యూడీల్' పద్ధతులలో ఈనాడు అతివాదిగా మిగిలావు. నువ్వు గెలవకుండా ఓడిపోవటానికి కారణాలు వెదకదలిస్తే నక్షత్రాల సంఖ్య కూడా చాలదు" అంటూ అగ్ర నాయకులు బౌల్సును అప్పుడు నిరుత్సాహపరిచారు.

కాని బౌల్సుకు ప్రజలతో పరిచయం, ప్రపంచ జ్ఞానం, అడ్వర్టైజింగ్ ఏజెన్సీలను జయప్రదంగా నిర్వహించిన నాటినుంచేఉన్నాయి. ప్రజల కోర్కెలు, వాళ్ళకు కావలసిన వస్తువులు, దేనికి జనం ఎగబడతారు దేనికి జనం వెనుకాడతారు అన్న లోకజ్ఞానం అంతా రాజకీయనాయకులకంటే కూడా, "అడ్వర్టైజుమెంటు మనిషి"గా అతనికే ఎక్కువ ఉంది.

౧౯౪౬ లో ఇతన్ని కాదన్న అగ్రనాయకులకు ౧౯౪౮ లో గవర్నరు ఎన్నికకు మనిషిని నిలబెట్టవలసివచ్చేటప్పటికి బౌల్సుకన్నా రాజకీయ స్థాయిగల వ్యక్తి దొరకలేదు.

బౌల్సు ఎలక్షన్ ప్రచారం మహా విరివిగా చేశాడు. అయితే ప్రచారంలో తన పార్టీ ప్రసక్తి ఎక్కువ పెట్టుకోలేదు. గత రెండేళ్ళ చరిత్ర సభలో కిస్తే, ధరలు సౌకర్యాలు మొదలైన సాంఘికవిషయా



లన్నిటిలోనూ బౌల్సు చెప్పిందే యథార్థమయిందంటూ, పాటలూ పద్యాలూ అల్లి, రేడియోలు, సినిమాలు, బృందనాట్యాలు, పోస్టరు ప్రకటనలు మొదలైన అమెరికన్ అడ్వర్టైజ్‌మెంటు విధానాలన్నీ ఉపయోగించి, పల్లె అనక పట్టణమనక మూలమూలలా పర్యటించి తన్ను తను 'అడ్వర్టైజ్' చేసుకొని రిపబ్లికన్ ప్రత్యర్థికన్నా దాదాపు మూడువేల ఓట్లదాకా ఎక్కువ తెచ్చుకొని ఎన్నిక నెగ్గాడు. కానెక్టికట్‌లో గవర్నరే కాక, అక్కడి డెమోక్రటిక్ పక్షానికి అడ్డులేని నాయకుడుగా తయారయాడు.

బౌల్సుదంతా కొత్తనీటి వ్యవహారం. అమెరికన్ రాజకీయ భావాలలో "పాతనీటిని" చాలమటుకు తన వెల్లువతో కొట్టేశాడు. ప్రజలకు ప్రతిసమస్యా పరిష్కార విధానమూ కూడా, కథ చెప్పినట్లు, నాటక మాడించి చూపినట్లు, మనస్సుకు హత్తేలాగు చూపించాలని అతని వాదన.

కానెక్టికట్ గవర్నర్ గా కొన్ని సాంఘిక విషయాలకు అతను ప్రాముఖ్యమిస్తూ వచ్చాడు. ప్రభుత్వం సాంఘిక సేవాసంస్థలకు—పాఠశాలలు, వైద్యశాలలు, వృద్ధాప్యపు పెన్షన్లు, గృహనిర్మాణ సంస్థలు వీటికి ఎక్కువగా ధనసహాయం చెయ్యాలని పట్టుపట్టాడు. వారాని కొకసారి ప్రజలకీ ప్రబోధమంతా రేడియోద్వారా వినిపిస్తూ నిత్యం కరపత్రాలు వేస్తూ, ప్రజలకు సాంఘిక ప్రవర్తనలు వ్యవహార విధానాలు బోధచేస్తూ వచ్చాడు. ఈ ప్రచారమంతా, పండిత పామరులకు ప్రతిఒక్కరికీ సుబోధకమయే భాషలో, చెప్పేవాడు. విమర్శకులు ఇదంతా స్వార్థప్రయోజనాలను ప్రచండంగా వృద్ధిచేసికోట మని తీవ్రంగా విమర్శించసాగారు. బౌల్సుకు అధికార వాంఛలు లేకపోలేదు. కాని తన స్వార్థం సాధించుకొనే పద్ధతిలో సామాన్యప్రజల అభివృద్ధి కూడా మిళితం చేయటంలో ప్రజల్లో, ఆరోగ్యవంతమైన రాజకీయచైతన్యం, రాజకీయ సమస్యలను నిత్యం చర్చిస్తూ తన ప్రయోజనమేటుందో తెలిసికోవాలన్న కుతూహలం, విస్తృతంగా రేకెత్తించ గలిగాడు.

గవర్నర్ గా ఉండగా బౌల్స్ పెట్టినవాదాలు, అక్కడి ఆర్థికస్తోమతికల వ్యక్తులకు చాలా అలజడి కల్పించాయి. అక్కడి ధరలు ఎక్కువగా ఉన్నాయనీ ప్రభుత్వం కానెక్టికట్ నదివద్ద హైడ్రో ఎలక్ట్రిక్ స్కీము తయారుచేసి, విద్యుచ్ఛక్తి చౌకగా సరఫరా చేసి వస్తువుల ధరలు తగ్గించవచ్చునని చూచాడు. ప్రభుత్వం శాసన సభలు, చాలా పాత పద్ధతులలో వ్యవహరిస్తున్నాయని వాటిని సంస్కరించటానికి ఒక కమిషన్ని నియమించాడు. మార్గరిన్ (తయారీ వెన్న)కు లైసెన్స్ అక్కరలేదని, దానికి రంగు కలప నవసరంలేదనీ ఇతను వాదించేటప్పటికీ పాల సంఘాలవాళ్ళంతా ఎదురు తిరిగారు. ప్రభుత్వసైన్యాలలో చేర్చుకోటానికి నీగ్రోలమీద ఆంక్ష ఉండకూడద నేటప్పటికి పార్టీవాళ్ళకే అలజడి కల్గింది. పూర్వపు అమెరికన్లలో 'చేవ' చచ్చిపోయిందనీ, చేవగలవారంతా, ఏభై అరవైఏళ్ళలోపల అమెరికాకు వచ్చిన కుటుంబాల సంతతులవారేననీ అతనిఉద్ఘాటన. "కానెక్టికట్ను ఒక్కసారిగా నేనే మార్చేయగలనని ఆశించను గాని, నా తర్వాతవారికి, బాటలన్నా నిర్మించగలనని ఆశిస్తున్నాను" అన్నాడు బౌల్సు.

పార్టీలో పూర్వ సభ్యులూ బౌల్సూ పరస్పర మర్యాదలు చూపించుకొంటారు తప్ప పెద్ద చెప్పదగ్గ స్నేహం ఏదీ వీరిమధ్య లేదు. కానెక్టికట్ సుప్రీంకోర్టు ఆఫ్ ఎర్రర్స్కు ఉద్యోగిని నియమించాల్సి వచ్చేటప్పటికి, రిపబ్లికన్ ప్రతినిధి రేమాండ్ బాల్డ్విన్ కిచ్చి, ఆ శాసన సభ్యత్వ స్థానాన్ని నింపటంలో డెమోక్రటిక్ శ్రేణిలో వారినికాక తన పూర్వవ్యాపార స్నేహితుణ్ణి, విలియం బెంటన్ను నియమించాడు. కాని రాజకీయాల అలజడిలోని మనిషికికాక, ప్రత్యేక వ్యక్తికి ఈ స్థానం కట్టబెట్టటంలో కూడా పార్టీ పాతపద్ధతులకు లొంగక స్వాతంత్ర్యమే ప్రకటించాడు.

గవర్నరుగా బౌల్సు ఎక్కువ సంస్కారాలను ప్రవేశపెట్టే అవకాశం లేకపోయింది. కాని సాంఘిక సౌకర్యాల విషయంలో అందరికన్నా ప్రభుత్వంచేత ఎక్కువ ఖర్చు పెట్టించినవాడు బౌల్సు. అతని రాష్ట్ర శాసనసభ్యులకే ఈ విషయంలో చాలా గుబులుగా ఉండేది. "ఖజానాలో పొరపాటున దమ్మిడీ మిగిలిందని తోస్తే, కొత్త సంఘసేవంటూ ఖర్చు పెట్టేస్తాడు బౌల్సు" అని ప్రతికక్షులు అనేవారు.

"ప్రజలకు నెమ్మదిగా నచ్చ చెప్పాలి" అని ఉద్ఘాటిస్తాడు బౌల్సు. కాని తన సూత్రం తనే మరిచిపోయి, ఉగ్రంగా ప్రవర్తిస్తాడు. కేవలం ఆదర్శవాది అని కొందరు అపోహపడ్డారు. మళ్ళీ హెన్రీ వాలెస్ రకం అవుతాడేమో ననుకొన్నారు. కాని బౌల్సు పాదాలు ఎప్పుడూ భూమి మీదే ఉంటాయి; సాధ్యాసాధ్యాల విషయంలో చాలా లౌక్యవివేచనే చూపిస్తాడు.

వాషింగ్టన్లో అధ్యక్షుని కేంద్ర అధికార కార్యాలయంలో తరవాత పని చేశాడు బౌల్సు. అప్పుడు కూడా బౌల్సు ప్రకృతి చాలా మందికి

వింతగానే కనబడుతూ వచ్చింది. "అవసరమైతే యావత్ప్రపంచాన్నీ మరామత్తు చేస్తారు బౌల్సు." అని పత్రికా విలేఖరులు ఎద్దేవాగా అనేవారు. కాని బౌల్సులో సంస్కార దీక్ష కొంత ఎక్కువ పాలు లోనే ఉన్నమాట నిజం. బౌల్సు, రూజ్వెల్టు కొలా నికు చెందిన మన స్తత్వంవాడు. రూజ్వెల్టు లాగానే "న్యూడీల్" లో నమ్మకాడు. అతని చదువుల గదిలో రూజ్వెల్టు త్రివర్ణచిత్రం పెద్ద సైజుది తగిలించి ఉంది. దానికి కింధుగా ట్రూమన్ ఫొటో గ్రాఫ్ చిన్నది ఉంచేరు. ఆ యిద్దరి విషయంలో అతని మన స్సులో గౌరవం ఆ అంతరంలోనే ఉంటుంది.

బౌల్సు పొడగరి. కాయ పుష్టి కలవాడు. చిన నాడు ఏదో దంతవ్యాధివల్ల ఒక పెదవి కొంచెం పక్కకు తోసుకుపోయింది. అందుచేత నిత్యం నవ్వుతూతూ మాట్లాడుతూన్నట్టే ఉంటాడు. నీటైన దుస్తులు ధరిస్తాడు. ఉపన్యాసకుడుగా ప్రజాదరణ చూరగొనట మెల్లాగో బాగా తెలిసినవాడు. అసలు ఉపన్యాసకుడైనట్టు స్ఫురించనీయడు. సభలో అందరి తోనూ హాయిలా హాయిలాగా మరమమిడిసి మాట్లాడు తున్నట్టు భ్రమ కల్పించగలడు.

బౌల్సు ౧౯౦౧ లో మసాచుసెట్ రాష్ట్రంలో స్ప్రింగ్ ఫీల్డువద్ద జన్మించాడు. కాలేజీ చదువు పూర్తి కాగానే, విలియం బెంటన్ అనే సహాధ్యాయితో కలిసి బెంటన్ అండ్ బౌల్సు అడ్వర్టైజ్ మెంటు కంపెనీ ప్రారంభించాడు. (ఈ బెంటన్ తర్వాత అసిస్టెంట్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ అయ్యాడు.) ఊహా గానం, ప్లానులు వెయ్యటం ఆలోచనభాగం అంతా బౌల్సు వంతు. కార్యదీక్ష అంతా బెంటన్‌ది. కంపెనీ చాలా వృద్ధిలోకి వచ్చింది. అడ్వర్టైజ్ మెంటు వ్యాపార శిక్షణ రాజకీయ సంరంభానికి మంచి ప్రాతి పదికగా ఉపయోగపడింది.

ఊరక్క ఇల్లా బాగుపడుతోంటే ఇద్దరికీ తమకు తగిన పని తాము చేయుటం లేదని అసంతృప్తి కల్గింది. బెంటన్ కంపెనీలోనుంచి తప్పుకొన్నాడు. ౧౯౪౧ లో బౌల్సు కూడా ఆ వ్యాపారం నుంచి విరమిం చాడు. మొదటి భార్యతో విడాకులు పుచ్చుకొన్నాక డరొతీ స్టెబ్బిన్స్ అనే సాంఘిక సేవాకర్తురాలిని, పట్టభద్రురాలిని, పెళ్ళి చేసుకొన్నాడు. ఆమె చాలా ఉత్సాహి: బౌల్సు సాంఘికంగా అంతరం అంతరం పైకి రాకటానికి కూడా ఆమె కృషి చాలా తోడ్ప డింది. ౧౯౪౦ లో రాష్ట్ర రాజకీయాలలో ప్రవేశిం చాడు. రూజ్వెల్టు ఇతన్ని ప్రతినిధిగా ఎన్ను కొన్నాడు. ౧౯౪౨ లో రేషనింగ్ ప్రథమంగా ప్రవేశపెట్టినప్పుడు, ఇతన్ని డైరెక్టరుగా పెట్టారు. రాజకీయ ఉపనాయకుల ఒత్తిడులకు లొంగకుండా రేషనింగ్ చాలా సమర్థనీయంగా నిర్వహించినందుకు వాషింగ్టన్ వారు మెచ్చుకొని, అమెరికా ప్రభుత్వ రేషనింగ్ సంఘంలోకి తీసుకొన్నారు. వాషింగ్టన్‌లో ఉద్యోగ రీత్యా ఇతనికి చాలా మంచి పేరూ పలుకుబడీ ఉన్నాయి.

పారిస్‌లో జరిగిన యునెస్కోకు (క్రిందటి సారి) ప్రతినిధిగా వెళ్ళాడు.

భారతదేశ, అమెరికా సంబంధ బాంధవ్యా లలో అపోహలవల్లా, అపార్థాలు చేసుకోవటంవల్లా కొంత కలతలు కలిగే అవకాశం కొరియా యుద్ధం నాటినుంచే ప్రారంభించింది. అమెరికన్‌లను భార తీయ ప్రభుత్వం సరిగ్గా అర్థం చేసికోటం లేదని, తమ విషయాలను సరిగ్గా ప్రచారం చేసేందుకు ఛెస్టర్ బౌల్సువంటి అడ్వర్టైజ్ మెంటు అనుభవం, మంత్రాం గానుభవం, కలవానిని, భారతదేశంలో రాయబారిగా అమెరికా నియమించింది. ఈ దేశాల మధ్య మైత్రిని ఎడతెగకుండా బౌల్సు సాధించగలడనే అమెరికా నమ్మకం. బౌల్సు అడ్వర్టైజ్ మెంటు ఏజంట్ అన్న విషయాన్ని కొంత స్పృహలో ఉంచుకొని అతని వ్యావహారిక జ్ఞానాన్ని, కార్య దీక్షను వాస్తవిక దృష్టినీ, మిత్ర స్వభావాన్ని చక్కగా వినియోగించు కొగలిగితే, అమెరికన్ రాజనీతిలో మున్ముందంగా మునిగిపోనక్కర లేకుండానే, భారతదేశం సము పాయిదాలో అమెరికాతో మైత్రి నిర్వహించుకు రావచ్చును.

(మెర్క్యురీలో వ్యాసానికి కృతజ్ఞతతో)

ఆహుతి

★

శ్రీ కలపటపు రామగోపాలరావు

అహంకార మహాగ్నికాళి
అఘోరమయోర్ధ్వ నాట్యంలో
గుండె కండ ఖండాలై
కొట్టుకున్న భూమండలం
పోతిగోడు మహానాగు
మొహం మెక్కడ మొత్తిందో—
ఘోరని శవశల్యఘోష
పొంగి చెవులనొత్తిందో—
ధరనరదల వరరక్తం
తగిలి నెత్రురలెత్తిందో—
కోటి ఫణులనిపిరి జగం
కుమ్మెక్కాడాది శేషు!
చీకటి నోళ్ళాపులించి
లోకముక్క లార్చాయి!

* * *

కాలానికి కాళ్ళు తెగాయ్.
కంటికి కళ్ళడి పోయాయ్,
భోగి భోగయోగరి విడి
భూకళం క్రుంగింది!
దిగజారే వరగరళం,
ఎగజిమ్మే హాలాహలం,
భుగభుగ భూప్రపంచాన్ని
పొంగించాయ్ కలి జ్వరం!
రవిశశి నయనాల్లోపల
రక్తోష్ణం రగిలింది—
గగనశిరం తోగింది—
కడలిగుండె వేగింది—
కాలుజపం కణం కణం
గజ గజ గజ లాడింది!
గతిమాలిన మాలోకం

* * *

అతిలా కుతిలం కాగా,
ఉద్యోగుల కుమాన్యులు,
దేవుళ్ళకి దయాళ్యాలూ,
మాన్యాలకి, శంకరగిరి
మాన్యాలూ మన్యాలూ,
తారుమారు తబ్బిబ్బులు!

* * *

మతిమాలిన మాలోకపు
మహామ్మారి సంబరాల
పీనుగులను పీసుగొక్క
పిశాచాలు గెంతాయి!
శతసహస్ర కపాలాల
శవజీవత నవ్వాడు!

2

తండలుగా, మందలుగా,
తత్వశాల మొగసాలని
నరవానర పరిశీలన—
మరణవరం పంపకాలు—
కళ్లమూపు క్రౌరగీత,
కార్శితీపు కష్టవ్రాత,
కదుపు కరుపు కాకుపచ్చ,
గుండె బరువు కదోముచ్చ—
కనిపించని బ్రహ్మవ్రాత
కరగిపడగ ప్రతిరోమ్మున
పెద్దనైద్యు చేతిరంగు
సుద్ద సుద్దులాడి కాయి!
ఆక్షేపణ చిహ్నాలకి
అనువాదం విని రేగాయ్,
చిత్రగుప్త సన్నిధికే
జేలు చావుగోలుపునకు!
జీవించే శక్తిలేక,
చావన్నా కలిసిరాక,
తణుకులతో వలవలజే
తచ్చవాలు కదిలాయి!

* * *

సంఘాలకి, దేశాలకి,
సావ్యముల కావేషీలకి,
సంస్కరణా వేశాలకి,
సమస్తా వకాశాలకి,
ఆధారం, ఆహారం,
తందలు తందలు మందలు!
తస్తున్నాయ్ మొగసాలకి,
చస్తున్నాయ్ వనకాశల—
మధ్యవధ్య శాలాంగణ
మహోధ్వరా ధ్వాన్నంలో,

మరా, రణం, మరణం, మా
రణ మారణ మర మరణం,
చరణా మర నరహరణం,
పరక్రీడా కర శరణం,
మరణం మర కిర కిర కిర!

3

వందలు గా, మందలు గా,
వధ్యశాల మొగసాలకి
వస్తున్నాయ్ బలి పశువులు!
కండలు మండలు కోరికి
గాండ్రిస్తోందా కలి పులి!
పిండాకుకు జల్లి జనం
దండేస్తోందా కలి బలి!
వెనకా పులి—
ముందీ బలి—
కైవారం ఘోరకలీ—
వందలు గా,
మందలుగా,
ఆకలి!
ఆకలి!
ఆకలి!
కడుపునిప్పు కణ కణలకి
జన జగత్తు వణికింది!
చెలరేగిన జఠరాగ్నుల
జలధులు ఘూర్ణిల్లాయి!
ఆకాశం పేగులలో
ఆకలి పిడుగు గురిపింది!

* * *

ఘూకం తూతూ బాకా,
గుంటనక్క సంగీతం,
చితులారిన శ్మశానాల
శీధూతా లాడాయి!
వల్లకాటి గుడిగంటలు
వాయించే మొండిచేత
ఉరిపుచ్చుల శిరఖండాల్
మొర పెట్టా యరిబీలు!
ఎముకెముకని రాసుకున్న
వేనాటివో కలలు, కథలు—
ఎముకెముకని కీచుమన్న
శేపాటివో చిత్రితనలు—
కల్పాంతా కంపనలో,
కాళరాత్రి గర్భంలో
కళ్లు కాళ్లు కడతేరిన
కడుపుమంట దీపావళి!
కలిమి కొలిమి పూదరలు,
బలిమి జులుం బీదరలు,
వ్యధాక్షుభిత వేషాలు,
క్షుధాభుక్త శేషాలు—
వస్తున్నాయ్,
చస్తున్నాయ్,
వందలు, మందలు, మందలు!

4

ఒక్కొక్కడు వొక్క మనసు!
ఒక్క బ్రతుకు!
ఒక్క మనిషి!
మనిషే నిహతి;
మనిషే చితి,
మనిషికి మనిషే
ఆహుతి!
భూమిని స్వర్గం చేసే
పురోగామి వీడేనా?
విశ్వస్వప్నం దాపలి
ఈశ్వరాంశ వీడేనా?
అవధిలేని చైతన్యం
అతీంద్రియత ఇంతేనా?
సహనానికి అంతేనా?
ఇహమంటే అహమేనా?
శత శకాల పాటేనో
అతిలోకాలోకనలో
మతి చెదిరిన మానవోర్ధ్వ
గతి వెలుగులు చితులేనా?
హతభాగ్యుల వెతలేనా?
మనిషీ!
నీ పేరిప్పుడు
మారిందా?
అహంకార మార్గంలో
తిర తిరాల ఘోరంలో,
తెప్పడు సంసారంలో,
తిర తిమ కైవారంలో—
మారిందా
పేరిప్పుడు
మనిషీ
ఓమనిషీ?

కథానిక :

తప్పనిసరి

★

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

౧

"రాజీ, నిన్నొకటి అడుగుదామనుకున్నానే" అన్నది శాంత.

శాంతకేసి ప్రశ్నార్థకంగా చూసింది రాజ్యం. ఆమె ఏదో తనను అర్థించబోతున్నదని రాజ్యం ఊహించింది. శాంత గొంతులో ప్రార్థన వినిపించి కాదు; రాజ్యం శాంత ప్రార్థనలను వినదగిన స్థితిలో ఉండటంవల్ల—శాంతవరకు అమలు చేయదగిన స్థితిలోకూడా ఉండటంవల్ల. రాజ్యం వెయ్యిరూపాయల ఆర్జనగలవాడి కూతురు, శాంత నూటపాతిక రూపాయల సంపాదనగలవాడి కూతురు. ఇద్దరూ రెండేళ్ళపాటు ఇంటరు కలిసి చదివారు. అనేక కారణాలచేత ఈ ఇద్దరికీ మంచి దోస్తీ ఏర్పడింది. ఈ రెండేళ్ళ కాలంలోనూ రాజ్యం ఎన్నోసార్లు అనుకుంది—తనను శాంత ఏదో అడగబోతున్నదని. కాని ప్రతిసారీ ఆమె ఊహ అపోహ అవుతూనే వచ్చింది. శాంత తన కుటుంబదారిద్ర్యాన్ని ఇతరులదగ్గిర దాచినా రాజ్యం దగ్గిర ఎన్నడూ దాచటానికి ప్రయత్నించలేదు. అయితే ఆమె ఎన్నడూ రాజ్యాన్ని కించిత్తుసహాయం అర్థించలేదు. ఇద్దరూ ఇంటరు పాసయినారు. రాజ్యం బియ్యే చదువుతున్నది. శాంత చదువు మానేసింది. శాంత చదువు మానినందుకు రాజ్యమే ఎక్కువ విచారం వెలిబుచ్చింది. శాంత నవ్వేసింది.

"పిచ్చిదానా, మా అన్నకి సాగనిచదువు నాకేమిటి?" అన్నదామె.

చదువు సంబంధం తెగిపోయినా శాంత అప్పుడప్పుడు రాజ్యందగ్గిరికి వస్తూనే ఉండేది, కాలేజీ కబుర్లు వింటూండేది. రాజ్యంకూడా శాంతపట్ల ఇదివరకల్లేనే ప్రవర్తిస్తున్నదిగాని కొంచెమైనా మారలేదు. ఆమె కిప్పుడు కొందరు కొత్త సహాధ్యాయినులు ఏర్పడ్డా శాంతస్థానం ఎవరూ ఆక్రమించినట్టు లేదు.

"శాంతా, నీచేతి బంగారపుగాజు లేంచేశావు?" అన్నది రాజ్యం ఒకసారి.

"అమ్మేశాను."

"ఏం? అదేమిటే?"

"తప్పనిసరి."

కొద్ది నెలలకాలంలో శాంత అసలు రానిన మోడల్లే తయారయింది. రాజ్యం ఎన్ని ప్రశ్నలు వేసినప్పటికీ చిట్టచివరకు శాంతనుంచి ఒకటే సమాధానం వచ్చేది. "తప్పనిసరి."

ఇటీవల శాంతను చూసినప్పుడల్లా రాజ్యానికి ఒకవిధమైన నరాలలాగుడు ప్రారంభమయింది.

"ఈసారి నన్ను శాంత ఏదన్నా అడుగుతుంది. తప్పక అడుగుతుంది. నా సహాయంలేకుండా జరగని పరిస్థితి శాంతకు ముంచుకొస్తోంది" అనుకునేది రాజ్యం. ఆ అడిగేదేదో శాంత దబ్బున అడిగేస్తే బాగుండుననిపించేది రాజ్యానికి. ఈ "సస్పెన్స్" రానురాను దుర్భరమవుతున్నది.

శాంత దరిద్రస్థితిలో ఏమన్నా సహాయం తనను అర్థిస్తుందేమోనని రాజ్యం భయపడుతున్నట్టయితే పోనీ అనుకోవచ్చు. ఆమెకు అయిదో, పదో, పరకో కావాలన్నా శాంత ఇవ్వటానికి—కనీసం తన 'నాన్నారి'చేత ఇప్పించటానికి సిద్ధంగా నేఉందిగా. రెండేళ్ళక్రితం తన తల్లి పోయినప్పటినుంచీ తనను నెత్తిమీద పెట్టుకుని పూజిస్తున్న 'నాన్నారు' తాను కోరితే శాంతకు ఎంత సహాయమైనా చేస్తారాయె. శాంత ఎందుకు పస్తాయిస్తున్నదీ?

శాంత పస్తాయిస్తున్నదనుకోవటానికి కూడా నిజానికి రాజ్యానికి ఆధారంలేదు. ఆమే తనను ఏదో కోరబోతున్నదానల్లే కూడా ఎన్నడూ కనపడలేదు.

పోనీ తనకు తానై, "ఏం, శాంతా? నీకేమైన ఇబ్బందిగా ఉంటే నేను అంతో ఇంతో సహాయం చేస్తానే!" అందామంటే శాంత ఏమనుకుంటుందో. తమ ఇద్దరిమధ్యా ఎన్నడూ తలఎత్తని డబ్బు ఈ మాటతో వచ్చిపడి పండులాంటి స్నేహం పాడైపోతుందేమో.

ఒక్కొక్కసారి రాజ్యానికి తనమీద తనకే విసుగొచ్చేది. ఒంటిమీద ఉన్నదంతా వొలిచి అమ్ముకుంటున్న శాంతకులేని జంజాటం తనకెందుకూ? తనకు శాంత ఎరగదా? కట్టుకోకపోతే తనను దమ్మిడీ సహాయం అడక్కపోవటమేమిటే? పైపెచ్చు తనకీ ఆరాటమేమిటే?

౨

"మా అన్నయ్యకి ఎక్కడా ఉద్యోగం దొరకటం లేదు, రాజీ. ఎన్ని దరఖాస్తులో పెడుతున్నాడు. కాళ్లకి బలపాలుకట్టుకు తిరుగుతున్నాడు, పాపం. మీ నాన్నగారి ఆఫీసులోగాని, ఇంకెక్కడన్నా గాని ఉద్యోగం దొరికితే బాసుణ్ణు" అన్నది శాంత. రాజ్యం ఊహించలేని బాధాకరమైన పరిస్థితిని తన మనసులో ఎదుర్కొంటున్నదానల్లే. తరవాత ఒక క్షణంఉండి తల ఎత్తి, "మీ నాన్నగారితో కాస్త చెబుతావా?"

రాజ్యానికి దెబ్బ దిగినట్టయింది. శాంత గమనించకుండా నిశ్శబ్దంగా ఆమె ఒక దీర్ఘనిశ్వాసం విడిచింది. శాంత మాట్లాడుతుండగా దాదాపు నుష్వాతిక నిమిషంసేపు ఆమె శ్వాస విడవలేదు మరి.

"దాని కేం భాగ్యమే? అట్లాగే చెబుతాను. నాన్నారి ఆఫీసులో ఖాళీ ఉంటుందో లేదో చెప్పలేనుగాని ఆయన ప్రయత్నిస్తే మరోచోటనైనా దొరకొచ్చు" అన్నది రాజ్యం. తన కంగారు దాచుకోవటానికిగాను అవసరమైనదానికన్న ఒక వాక్యం అధికంగా చేర్చి.

కారణమేమంటే, శాంత "మా అన్నయ్య" అని ప్రారంభించగానే రాజ్యం ఆలోచన మరోమార్గాన పరిగెత్తింది. శాంత అన్నయ్య బాగుంటాడు. తెలివిగలవాడు కూడా. కిందటేడు రెండుమూడు మాసాల పాటు రాజ్యం అతని ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరయింది. అదేమిటో అతను చిన్న మనోవ్యాధి అయి కూచున్నాడు. ఏపని చేస్తున్నా సరే, ఏమి ఆలోచిస్తున్నా సరే అకస్మాత్తుగా అతన్నిగురించి ఆలోచన రావటమూ, చిలవలూ పలవలూ వెయ్యటమూ, ఆ ఆలోచననుంచి రాజ్యం బయటపడలేకపోవటమూనూ. క్రమంగా ఈ మనస్థితిలోనుంచి రాజ్యం బయటపడి, ప్రపంచంలో ఇంకా చాలమంది అందగాళ్లూ, తెలివిగలవాళ్లూ, విదేశాలు తిరిగివచ్చినవాళ్లూ, డబ్బూ, మేడలూ, కార్లూ గలవాళ్లూ ఉన్నారని గుర్తించగలిగింది. అయితే పాతగాయంలాగా కొద్దిపచ్చి ఇంకా ఏ మూలో మిగిలిఉంది. తాను శాంత అన్ననుగురించి కలలుగన్నకాలంలో శాంతకూడా తననూ ఆమె అన్ననూ కలిపి ఆలోచనలు జరిపిఉంటుందని రాజ్యం భ్రమ. అతనుకూడా తననుగురించి తనలాగే కలలుగని శాంతతో చెప్పిఉంటాడేమోనని ఆమెకు అనుమానం...కొంపదీసి శాంత, "మా అన్న నీకోసం మనోవ్యాధి పడుతున్నాడు. మీరిద్దరూ పెళ్లిచేసుకోకూడదా?" అనేస్తున్నదేమో ననుకున్నది రాజ్యం. కాని అటువంటిదేమీ జరుగలేదు.

ఇందువల్ల తనకు తృప్తి కలిగిందో, నిరాశే కలిగిందోకూడా రాజ్యం ఊహించలేకపోయింది. ఇప్పుడున్న మనస్థితిలో రాజ్యం శాంత అన్నను ఎట్లాగూ పెళ్లాడదు. కాని అతను తనకోసం బాధపడుతున్నాడని చెవులపడితే అదొక ఆనందంగా ఉండేది. తాను అతన్ని పెళ్లాడలేనందుకు—అతనంటే తనకు ఎంత గౌరవం ఉన్నా, శాంత తోబుట్టువని ఎంత ఆదరం ఉన్నా, పెళ్లాడటానికి అత్యవసరమైన అనిర్వచనీయ ప్రేమ అతనిపట్ల తనకు లేనందుకు—తన విచారాన్ని ఎంతో లలితంగా, శాంతకు—శాంతనుమించి ఆమె అన్నకు—ఏమాత్రమూ బాధకలగకుండా మాట్లాడటానికి ఎటువంటి మంచి అవకాశం!...

కాస్సేపు అదీ ఇదీ మాట్లాడి కాఫీతాగి శాంత వెళ్లిపోయింది.

రాజ్యం ఒంటరిగా కూచుని, తాను పెళ్లాడదన్న వార్త శాంత మోసుకుపోయినట్టయితే ఆమె అన్న ఏవిధంగా ఖేదపడేవాడో చాలాసేపు ఊహించుకున్నది.

3

భాస్కరరావుగారు ఏ చిత్తాన ఉన్నాడో గాని రాజ్యం చెప్పినమాట సాంతం వినిపించుకోకుండానే, "ఆఁ, ఉద్యోగాలెక్కడున్నై? ఇటువంటివన్నీ నువ్వు నెత్తిన పెట్టుకోకు" అన్నాడు.

శాంతకు ఆమాత్రం ఆశకూడా తాను ఇచ్చి ఉండటం పొరపాటే అయిందని రాజ్యం గ్రహించింది. "మా నాన్నారితో చెప్పటమైతే చెబుతాను

గాని నువ్వాట్టే ఆశపెట్టుకోకు. మీ అన్నను తన ప్రయత్నాలు మానవద్దని చెప్పు" అని ఉంటే చాలా బాగుండేది. శాంతమీద ఆమెకు చిరాకుకూడా వచ్చింది. ఆమె తనని ఇటువంటి ఇరుకులో ఎందుకు పెట్టాలి? ఇంతకాలమూ నోరు తెరిచి ఒక్క సహాయం అడగనిమనిషి తన చేతిలోలేని ఈ పని ఎందుకడగాలి?

శాంత మళ్లీ రెండుమూడుసార్లు వచ్చింది, కాని తన అన్న ఉద్యోగంసంగతి హెచ్చరించనేలేదు. పాపం, పిచ్చి రాజ్యం నరాలన్నీ బిగబట్టుకు కూచునేది ఎప్పుడడుగుతుందో, ఏం చెబుదామా అని. ఇట్లా చెబితే బాగుంటుందని రాజ్యం ముందు "రిహార్సల్స్" చేసుకోక కాదు. అదేం ఖర్మమో ఇటువంటి "రిహార్సల్స్" ఆమెకు ఎన్నడూ ఉపయోగించేవికావు. క్లాసులోకూడా అంతే. ఏ పాఠమో చదివేటప్పుడు మేస్టరుకు చెప్పాలిసిన సమాధానం ముందుగా ఎంతో జాగర్తగా తయారుచేసుకుని తీరా క్లాసులో ఇంకో విధంగా చెప్పేది. ఏతత్ క్షణానికి ఆమె బుద్ధి కట్టుబడి కాళ్ళూ చేతులూ ఆడించలేని పరిస్థితిలో ఉన్నట్టయిపోయేది. రాజ్యం ఇప్పటికీ అంతే.

అఖరుకు మూడోసారి వచ్చినప్పుడు శాంతే అన్నది.

"పాపం, మీ నాన్నగార్ని శ్రమపడవద్దని చెప్పవే. మా అన్నయ్యకేదో చిన్న ఉద్యోగం దొరికేటట్టుగా ఉంది."

రాజ్యం తప్పుకుకాకుండా చిన్న నిట్టూర్పు విడిచింది. శాంతకంటే ఉత్తమురాలు నిజంగా ప్రపంచంలో లేదనుకున్నది ఆమె. అయితే దురదృష్టవశాత్తూ ఈ అభిప్రాయం అయిదునిమిషాలైనా నిల్వకుండానే శాంత రాజ్యంమొహాన అణువు బాంబు పేల్చినంతపని చేసింది.

"రాజీ, ఓమాటడుగుతాను నిజం చెబుతావా?" అన్నది శాంత.

"ఏమిటే?" అన్నది రాజ్యం.

"మీ నాన్నగారికి మళ్లీ పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదా?"

అప్పటికీ అణువుబాంబును శంకించలేదు పిచ్చి రాజ్యం.

"ఏం! అట్లా అడుగుతున్నావ్?"

"ఏంలేదు, రాజీ. ఆయనకు చేసుకునే ఆలోచనుంటే నన్ను చేసుకుంటారేమోనని!"

"నిన్నా!!!" అణువుబాంబు దెబ్బతిని ఆ మాత్రమైనా రాజ్యం అనగలగటం ఆశ్చర్యమే.

శాంతమనస్తత్వం ఎటువంటిదోగాని ఆమె కాస్తయినా చెక్కుచెదరలేదు, పిచ్చిమొగం వెయ్యలేదు, మొహానికి చేతులడ్డంపెట్టుకుని రాజ్యం మొహం చూడలేక నేరుగా ఇంటికి పరిగెత్తలేదు. ఇటువంటివన్నీ చెయ్యాలనిపించింది రాజ్యానికి!

"తప్పేం, రాజీ?" శాంత గొంతు దీనంగా మటుకున్నది.

"నవ్వులకా? నిజంగా అంటున్నావా?"

"నిజంగానే, రాజీ!"

"నేనేమన్నా అనుకుంటాననైనా అనిపించటంలేదూ?"

"నీకన్న నాకు ఆప్తులెవరున్నారే?"

"ఇదేనా ఆప్తులతో అనేమాట?"

"నాకు తప్పు తోచలేదు సుమా!"

"మా నాన్నమీద ప్రేమఉండి పెళ్లాడతానంటున్నావనుకోమన్నావా?"

రాజ్యానికి ఉద్రేకంలోమాట, అనుకున్నదానికన్న చేవగానే వస్తున్నది.

"నే నామాట అనలేదే? నిజంగా నాకు ప్రేమంటే ఏమిటో తెలీదు రాజీ. మీ నాన్నగారంటే నాకు మొదటినుంచీ చాలా అభిమానం ఉంది. నే నెట్లాగూ ఎరగనివాణ్ణి చేసుకోవాలి—"

"వయసుమించినవాణ్ణి చేసుకోనవసరం లేదుగా?"

"ఎట్లా చెప్పగలవ్? మా నాన్న కుర్రవాళ్ళకి కట్నాలు పొయ్యలేడు."

"పొయ్యగలిగితే కుర్రాణ్ణి చేసుకోవాలని లేదూ?"

"ఉంటే?"

"అటువంటి కోరిక లోపల ఉంచుకుని మా నాన్నారిని చేసుకుంటాననటం మోసంకాదూ?"

"అదేమిటే, రాజీ? డబ్బుంటే మేడల్లోఉండా

లని కోరిక ఉండొచ్చు. అందుకని పూరికొంపలో ఉండటం మోసం అవుతుందా?"

దీనికేమనాలో రాజ్యం ఊహించలేకపోయింది. "మా నాన్నారి డబ్బు చూసి కాదా నువ్వాయనను చేసుకుంటానంటున్నది? ఆ సంగతి దాస్తావెందుకూ?" అన్నదామె ఆఖరుకు.

"నేను దాయటంలేదు, రాజీ. మీ నాన్నగారికి ఎవరు పిల్లనిచ్చినా డబ్బు చూడకుండా ఇవ్వరు. నిజానికి ఆయన డబ్బు ఆయన వారసులకు పోతుంది గాని నాకేం ఒరుగుతుంది? నాకు తిండీ, బట్టా తప్ప నగలుకూడా అక్కర్లేదు, రాజీ. నన్నెవరు బలవంతం చెయ్యటంలేదు. ఆయన ఇష్టపడితే నా అంతట నేను ఆయనను పెళ్లాడతాను. ఈమాత్రం గ్యారంటీ ఆయనకింకో సంబంధమైతే ఉంటుందా?"

రాజ్యం ఆలోచించింది. శాంత ప్రస్తావించే ఈ దిక్కుమాలిన విషయంగురించి తను ఆలోచించవలసి రావటంకూడా ఏమిటన్న ఆశ్చర్యం ఒక మూల ఉంచుకునే రాజ్యం ఆలోచించింది.

"నాకు సవితితల్లివి కావాలనా నీ ప్రయత్నం?" అన్నదామె చివరకు.

"నీకన్న ఆప్తురాలైన సవితికూతురు నాకు దొరుకుతుందా, రాజీ! మీ నాన్నగారిని కాస్త కనుక్కుంటావు గదూ?"

శాంత వెళ్లిపోయినాక రాజ్యానికి ఆలోచిస్తున్న కొద్దీ తిక్కెత్తుకొచ్చింది. శాంత ప్రస్తావించిన విషయం విడ్డూరంగా ఉంది. ఆమె తనతో ఈమాట అనటమేమిటి? దాన్ని గురించి తాను అంతసేపు వితర్కించటమేమిటి?

రాజ్యానికింకొకటికూడా తట్టింది. ఆనాడు శాంత తన అన్న ఉద్యోగంగురించి కనుక్కోమని అడిగినట్టే ఇవాళ ఈ విషయమూ కనుక్కోమంటున్నది! తన "నాన్నారి" మీద ఆమెకు ప్రేమ ఉన్నట్టయినా కాస్త నటించగూడదూ? పెళ్లిని ఉద్యోగంతో సమానం చేస్తుందా? ఛీఛీ! ఎంత సంస్కారంలేని మనిషి! తనకూ శాంతకూ సంస్కారంలో ఏమీ తేడా లేనట్టు ఇంతకాలమూ తాను భ్రమపడిందేగాని, లేకుండా ఎందుకుంటుంది? ఇదుగో! కనిపించటంలేదూ? తాను ప్రాణంపోసేమటుకు ప్రేమించనివాణ్ణి పెళ్లాడుతుందా? ఒకవేళ అది అక్షరాలా పాత్రపోషకపోగే పెళ్లాడినవాడిని ప్రేమించటానికైనా ప్రయత్నం చేస్తుందిగాని ఈ శాంత లాగా "తిప్పరిసరి" పెళ్ళిచేసుకుంటుందా? ఛీ ఛీ!

తనకు తిప్పరిసరి కానిది శాంతకు తిప్పరిసరి కావచ్చునన్నమాట రాజ్యానికి తట్టలేదు. ఆమె శాంతను తన ఇంటికి రాకుండా కట్టుదిట్టాలు చెయ్యటం మంచిదనుకున్నది.

ఆ రాత్రి ఆమె తన తండ్రితో, "ఏమిటండీ, నాన్నారూ, శాంత ఎంతో మంచిదని భ్రమపడ్డాను, ఛీఛీ!" అన్నది.

"ఏమమ్మా?!" అన్నాడు భాస్కరరావుగారు.

"అది మీమీద కన్నేసింది, నాన్నారూ!"

భాస్కరరావుగారు లోపల ఆశ్చర్యపోతూ, పైకి బిగ్గరగా నవ్వి, "నీ మొహం!" అన్నాడు.

"అవును, నాన్నారూ? మీరు మళ్ళీ పెళ్లి చేసుకుంటే తనను చేసుకోవాలిట."

"పెళ్ళల్లేసే ఉంది!"

"బాగా చెప్పారు!"

౮

"రాజీ?...రాజ్యం ఉందండీ?"

"ఇప్పుడే కాలేజికి వెళ్లిందే" అన్నాడు భాస్కరరావుగారు, శాంత అందాన్ని మునుపెన్నడూ ఎరగనట్టు చూస్తూ.

"తొమ్మిదికే?"

"ఏదో మీటింగుందన్నది."

"ఏంలేదు, ఒక్క మాట చెప్పిపోదామని వచ్చాను."

"ఏమిటది? కూచో."

శాంత నవ్వుతూవచ్చి భాస్కరరావుగారికి అంతదూరాన కుర్చీలో కూర్చుంది.

"ఏమీలేదు, మా అన్నయ్యకు దొరుకుతుందనుకున్న ఉద్యోగం కాస్తా వెనక్కుపోయింది. అందుచేత మీరేదన్నా చూస్తున్నట్టయితే మానవద్దని చెప్పుందామని వచ్చాను."

ఒక క్షణంపాటు శాంత ఏం చెబుతున్నదీ ఆయనకు అర్థం కాలేదు. శాంత అన్న ఉద్యోగం గురించి తాను పూర్వం వినిఉన్నట్టయినా ఆయనకు

జ్ఞాపకం లేదు. ఆపైన కిందటిమాటు కాంత తనతో అన్నమాటలు రాజ్యం తండ్రితో చెప్పనైనా లేదు. ఇన్నిటినీ మించిన కారణమేమంటే, రాజ్యం కాంతను గురించి చెప్పిన క్షణంనుంచీ ఆయన తీరికదొరికినప్పుడల్లా కాంతను తన భార్యగా ఊహించటానికి యత్నాలు చేస్తున్నాడు. ఈ యత్నాలు అంతకంతకూ ఫలోన్ముఖమవుతున్నై. ఇప్పుడామె తన ఎదురుగా కూర్చుని మాట్లాడుతుంటే ఆమెకూ తనకూ మధ్య అప్పుడే ఒక బంధం ఉన్నట్టే తోచింది భాస్కరరావుగారికి. ఈ ఆలోచనల్లోఉన్న ఆ పెద్దమనిషి కాంత ఎత్తిన విషయాన్ని గురించి సరిగా వినిపించుకోలేకపోవటం కూడా జరిగింది.

అయితే ఆయన కాంతినోట ఆమెఉన్న ఉద్యోగం విషయం వివరంగా తెలుసుకోక తప్పలేదు. అంతా విని ఆయన, "దానికేం భాగ్యం! అట్లాగే చూద్దాం. అతనికి ఉద్యోగమే దొరక్కపోతుందా?" అన్నాడు.

"థాంక్యూ!" అన్నది కాంత ఎంతో ఆప్యాయంగా.

"అయితే నీ పెళ్లి అనుకుంటున్నారుటగా?" అన్నాడు భాస్కరరావుగారు.

కాంత కొంచెం సిగ్గుగా నవ్వి, "రాజీ అన్నదా?" అని అడిగింది.

"కాదు. ఎవరో అనగా విన్నాలే."

"రాజీ అనిఉండదు లెండి. దానికి కోపం వచ్చింది" అన్నది కాంత చిన్నబుచ్చుకున్నట్టు.

"దేనికి? నువ్వేమన్నావేం?"

"ఏమంటేనేం లెండి. నేను అమాయకురాలినై అన్నానుగాని అనటం తప్పే. తరవాత నాకే తోచింది."

"ఏమన్నావని!"

"ఏమీలేదు. మావాళ్లు కట్నాలిచ్చుకోలేక మరీ అడ్డమైన సంబంధాలూ చూస్తున్నారు—"

"రెండో పెళ్లీ, మూడో పెళ్లీ కావాలు."

"లేకపోతే కుర్రవాళ్ళనెక్కువ భరించగలరు చెప్పండి. మా నాన్న నన్నడిగాడు రెండోపెళ్ళయితే అభ్యంతరమా అని. లేదన్నాను—"

"ఏమిట్లా? రెండోపెళ్లివాణ్ణి చేసుకునేకన్న ఏ పేదవాణ్ణో కుర్రవాణ్ణే చేసుకుంటే సరిపోనుగా?"

"పేదరికం ఒకటి అనుభవిస్తానే ఉన్నాం. దానికితోడు కుర్రవాళ్లుకూడా దేనికి? మా బంధువుల్లోనూ ఎరిగున్నవాళ్లలోనూ కుర్రవాళ్లు పెళ్లాలను పెడుతున్న తిప్పలుచూస్తే పగవానికూడా వద్దనిపిస్తున్నది."

భాస్కరరావు ఆశ్చర్యపడ్డాడుగాని కాంత మాటలు నమ్మగలిగాడు.

"ఇంతకూ రాజీతో ఏమన్నావు?"

"ఏమీ అనలేదు. రెండోపెళ్లి చేసుకోగలిగినప్పుడు ఎవరో ఎరగనివాళ్ళను చేసుకునేకన్న ఎరిగినవాళ్ళలో చేసుకుంటే బాగుంటుందనిపించింది. అమాటే రాజీతో అన్నాను."

"నన్ను చేసుకోవటానికి అందుకని ఒప్పుకున్నానన్నమాట."

కాంత ఆయనకేసి కాస్త బెదురుతున్నట్టు చూసి "రాజీ చెప్పలేదనుకున్నాను" అని తల వంచేసుకుంది.

"ఎందుకు చెప్పిందా అని పశ్చాత్తాప పడుతున్నావు కాదూ?"

"లేదు. రాజీతో అన్నందుకే పశ్చాత్తాప పడ్డాను. అది మీతో చెప్పినందుకు కాదు. మీరూ, రాజీ—ఎంతో దగ్గరవాళ్ళల్లే తోచి—" కాంత పెదిమలు మూసుకుచున్నది, ఏదో దిగమింగుతున్నదానల్లే.

"నిజం చెప్పు. పశ్చాత్తాప పడుతున్నావా, లేదా?"

"నేనన్నమాటకు రాజీ కోప్పడకుండా ఉంటే నాకేమీ పశ్చాత్తాపం లేదు."

"నాకు వలకైనాలు గేళ్లు. ఒప్పుకోగలను, జాగ్రత్త."

కాంత కళ్లు పైకెత్తకుండానే నవ్వి తల ఆడిస్తూ, "నాకేం భయంలేదు" అన్నది.

ఆ క్షణాన భాస్కరరావు కాంతను యువకుడల్లే ప్రేమించాడు.

"సరే నీ సంగతి చెబుతాను...అన్నట్టు మీ అన్నయ్యను ఇవాళ సాయంకాలం అయిదుగంటలలోగా మా ఆఫీసుకోకసారి రమ్మను" అన్నాడు.

నా ప్రభూ

శ్రీ బెళ్లారి శ్రీనివాసమూర్తి

వలదు మనోజ్ఞహర్మ్యసుఖ-
  వాసనలెవ్వియు-జీవితంబలో
తలపునలేని సౌఖ్యములు-
  త్వత్కరుణారసవాహినీసము
జ్జ్వల మధురాంబుపానములు
  నల్పుదు చిన్నికుటీరసీమ, నీ
చెలిమికి నాదుప్రాణములు
  సిద్ధముచేసితిరమ్ము నా ప్రభూ!

౨

ప్రేమయొకండె నిన్ను వల
  పించెడు వస్తువటంచు నాదు హృ
త్సీమకు దోచిపోయినది
  తీయని నాయనుభూతి యెల్ల నీ
ప్రేమకు ధారవోసితిని,
  తెక్కలు విచ్చిన పక్షిగాగ నా
ధామము చెంత వ్రాలుదుగ
  దా, క్షణమాత్రములోన నా ప్రభూ!

౩

అల్లన కంఠమెత్తి ప్రియ
  మారగబిల్చిన, నాస్వరంబులో
పల్లవితంబుగా మృదుల
  భావనలన్నియు గుర్తుపట్టి నా
యిల్లనివత్తు విమ్మెడకు
  నెమ్మెడకుం జనవింక, నేను పూ
వల్లరి, నీవు వృక్షమవు
  ప్రాకెద నీమదియెల్ల, నాప్రభూ!

౪

ఎన్నడు నీవు లేవో, భువి
  నెందును నేనును లేనుగాన, నా
కున్న సమస్త మీ వోకడ
  వోయను వెఱ్ఱిమె నాదిగాన, నీ
చిన్నెలులేని నాబ్రతుకు
  చేదయితోచునుగాన, నన్ను నీ
కన్నుల కౌగిలింత కడ
  గా నొనరింపగరమ్ము నాప్రభూ!

౫

నీ వోక బాటసారివయి
  నిల్తువు నా గృహసీమచెంత సం
ధ్యావిపులాంధకారముల
  నక్కట-ఆకలిదప్పి దీర్చి నీ
త్రోవకు చల్దిగట్టి పరి
  తోషమునన్ పయనింపజేతు మ
ద్భావ పరిమళంబు కను
  పక తొలివెల్గులలోన నాప్రభూ!

ప్రాచీనకాలంలో భూస్వామ్యాధిపత్యం

శ్రీ బి. యస్. శర్మ

ప్రాచీన భారతంలో భూమిపై ఆధిపత్యం ఎవరికుండింది? రాజునకా? రైతుకా? భూస్వామ్యాధిపత్యం ఎంత విస్తృతిపై ఉండింది? అనే ముఖ్య విషయాల గురించి చారిత్రకుల్లో భేదాభిప్రాయాలు ఉంటూన్నాయి.

"వస్తుతః భూమిపై సర్వాధిపత్యం రైతుకే ఉండింది. రైతు భూమిని తన యిష్టానుసారం విక్రయించుకుంటూండేవాడు. తన భూమిని, కొంత పరిమిత కాలంవరకు, అన్యవ్యక్తి దానినుండి లాభం గడించేందుకు యిస్తూండేవాడు. అంటే భూమిని కౌలుపై యిస్తూండే వాడన్నమాట. భూమి శిస్తు గాని, రాజ్యశుల్కం గాని సేద్యం చేసేవాడు యివ్వకపోయిన రాజు ఆ భూమిని జప్తు చేయించేవాడు. ఇలాంటి పరిస్థితి రాజుకు చాలా అరుదుగా సంభవించేది. కృషీవలుడు భూమినుండి మంచి ఫలితము గడించుచుండుటచే ఆతనికి శిస్తుగానీ, శుల్కంగానీ చెల్లించేందుకు యేమాత్రం భారంగా ఉండకుండేది... ఆ కాలంలో అతివృష్టి, అనావృష్టి, సస్యనాశనం, భూకంపం మొదలైన సృష్టిపరీత్యాలు సంభవించిన నాడే స్వయంగా రైతుని శిస్తునుండి, శుల్కంనుండి ముక్తుని చేసేవాడు......" అంటూ వొక ప్రఖ్యాత చరిత్రకారుడు మౌర్యయుగంనాటి భూమి విధానాన్ని సాకల్యంగా క్రోడీకరిస్తూ వివరించిన చారిత్రక విషయం ప్రత్యక్షంగా కనపడుతూన్నది.

దీన్నిబట్టి చూస్తే ఆ కాలంలో భూమిపై ఉండదగిన సర్వాధిపత్యం రైతుకే ఉండేదన్నట్టు స్పష్టమౌతూన్నది. భూమిని వినియోగపరచే సౌకర్యంతప్ప రైతుకు భూమిపై సర్వ హక్కులు కలిగి ఉండె ననడం నిశ్చయం.

మెగస్తనీస్ భారత వివరణ, కౌటిల్యుని అర్థశాస్త్రంలోని భూసంబంధ నియమాలు అన్నీపై స్పష్టీకరణాన్ని బలపరుస్తూన్నాయి.

ఇంతేగాదు. శ్రీ బెనర్జీ తన 'పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ యిన్ ఏన్షంటు ఇండియా'లో సహితం ప్రాచీన భారతమందు 'భూమియొక్క ఆధిపత్యం రైతుకే ఉండిందిగాని రాజుకు కుతరామూ లేకుండెడిది' అన్నాడు.

'హిందూ నియమముల, ఆచారాల, విధానముల పరిశీలిస్తే ప్రాచీన కాలంలో హిందూ పరిపాలకులు భూసంరక్షకులుగా మాత్రమే ఉండి రవడం నిస్సందేహ సత్యం. భూమిపై వాస్తవిక ఆధిపత్యం రైతుకే ఉండింది'

అని శ్రీ జైస్వాల్ తన 'హిందూ పాలిటీ'లో స్పష్టపరచాడు.

పాశ్చాత్య దేశాల్లో ప్రఖ్యాతిగాంచిన విన్సెంటుస్మిత్ అనే చరిత్రకారుని అభిమతం యీ విషయంలో విచిత్రంగా వుంటూంది. సజీవ నిదర్శనాలు, సాక్షిదృశ్యాలు లేవన్ని ఉంటూన్నా యీ చరిత్రకారుడు తన ప్రాచీన భారత చరిత్రలో యిలా వివరపరచారు:—

'...అనాదినుండి భారత దేశంలో, భారత రాజ్య విధానంలో భూమియొక్క వాస్తవిక అధిపత్యం రాజుదిగా అంగీకరింపబడింది. భూమిపై రైతుకుండిన అధిపత్యం కేవలం అద్దెపై ఉండేవాని మల్లేనే ఉంటూ వచ్చింది. రైతుభూమినుండి ఫలితం అనుభవించుచుండుటచే దాని ప్రత్యామ్నాయంగా అతడు రాజుకి నియమిత రూపంలో కొంత ఫలితం శిస్తు క్రింద, శుల్కం క్రింద చెల్లించేవాడు. భూమినుండి రైతుని బేదఖలు చేసే అధికారం సర్వకాల సర్వావస్థలందు రాజాధీనంగా వుండేది......' స్మిత్ నిర్ణయం కేవలం ఆ భూతికల్పన మనడానికి వీల్లేదు. కొన్ని ఆధారాలపైన్నే అతడిలా నిర్దేశించడానికి సాహసించాడు. హర్ష చక్రవర్తికాలంలో భారత భ్రమణ మొనర్చిన హుయన్ సాంగ్ యీ విషయాన్ని యిలా వర్ణించాడు.

'ప్రతి సంవత్సరం రాజ్యకోశానికి రాబడే ధన రాశిలో అధికభాగం రైతులనుండి శిస్తుల రూపాన వచ్చేధనమై ఉండెను. శిస్తులు రైతులకి బాధ కలిగించేట్టు అధికంగా లేకుండెడివి. భూమిపై వాస్తవిక అధికారం రాజునకే సంక్రమించి ఉండెడిది. భూమి నుండి ఫలితం అనుభవించేందుకు రాజు భూమిని నిర్ణీత కాలం మేరకు రైతులపరం చేసేవాడు (వాపిక్ అను వాదానుసారం)

గ్రాస్ అను ఆంగ్లచరిత్ర కారుడు ప్రాచీన ఆర్యుల గ్రామ్యజీవితాన్ని వర్ణిస్తూ వొకచోట యిలా రాశాడు :—

'...నగరముల, పట్టణముల కోలాహలముల కతి దూరంగా ఉంటూ ప్రతి గ్రామములోని కృషీవలులు, రైతులు గ్రామాధిపతి పర్యవేక్షణం క్రింద, రాజు ఆదేశానుసారం, వ్యవసాయపు పనులని నిర్వర్తించు చుండిరి. వ్యవసాయార్థం ఆ గ్రామాధిపతి—గ్రామంలోని ముఖ్యుడు—భూమిని రైతులకి పంచి పెట్టేవాడు. ఆ భూముల పంపకంలో కాలపరిస్థితుల ననుసరించి మార్పు కలుగుచుండెడిది.'

భూమ్యాధిపత్యం ఆ కాలంలో రాజాధీనమై ఉండినట్లు ఇది విశదపరుస్తున్నది.

కౌటిల్యుని అర్థశాస్త్ర ఆదేశానుసారం భూమ్యాధిపత్యం ప్రజాయత్తమై ఉండెడిది. అంటే యీ అధిపత్యం వ్యక్తిగతమై ఉండకుండెడి దన్నమాట. రాజు ప్రజల ప్రతినిధిగా ఉండడంవల్ల ప్రజల సౌకర్యార్థం రాజుకి శిస్తులు, సుంకాలు వసూలు చేసే అధికారం యేర్పడి ఉంటూంది. రాజ్యపు వ్యవసాయ శాఖనుండి రైతుల, వ్యవసాయకుల సౌకర్యార్థం గోశాలలు, భూసంరక్షణ, పశు సంరక్షణ వ్యవస్థలు నిర్ణీతమై యుండెడివి.

ఈవిధంగా ప్రజా ప్రతినిధిగా ఉంటూండిన రాజు—చంద్రగుప్త చక్రవర్తి—తన వాస్తవిక విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించడానికిగాను భూమిని, భూమినుండి పదార్థాల పండించే రైతులని సదా సంరక్షించి ప్రపంచానికొక సజీవ ఆదర్శాన్ని నెలకొల్పాడు.

దక్షిణ భారత ప్రాచీన పాలకుల రాజ్య నిర్వహణానికి ఆధారం, కౌటిల్యుని అర్థశాస్త్రంలో సమంగా మహత్వ పూర్ణమని లెక్కింపబడిన శుక్రనీతి సారం గూడ రాజునకే భూమ్యాధిపత్యం ఉండినట్లు స్పష్టపరచింది. కాని శిస్తుల విషయంలో మాత్రం దీని నియమాలు అర్థశాస్త్ర నియమాలకన్న చాలా ఉదారంగా వున్నాయి.

శుక్రుని మతానుసారం రైతునుండి రాజు నామకార్థం కొంత ధనం శిస్తు క్రింద రాబట్టుకొని ఫలితంలో కొంత భాగం పొందే అధికారం కలిగి ఉండెడివాడు. పూలమాలిక చేయువాడు యేరికూర్చిన పూలతో మాలికల తయారు చేయునట్లు రాజు రైతుల నుండి శిస్తుల వసూలు చేయాలి, అని నిర్దేశింపబడింది.

ముసల్మానుల నాటి భూమ్యాధిపత్యం

హిందూరాజులల్లో, ప్రజలల్లో పరస్పర విద్వేషాలు, వైమనస్యాలు, అసహనశీలత విపరీతంగా పెరుగుటచేత విదేశీయులకి, ముఖ్యంగా ముసల్మానులకి, భారతదేశంలో విజేతలుగా పరిణమించుటసంభవమైంది. ఈ విధంగా దేశంలో పాలకులైన ముసల్మానులు దేశీయుల సానుభూతికై, తమ పని నెరవేరేందుకు అరేబియా, టర్కీ భూమి విధానాల్ని అమల్లో పెట్టి పెద్ద పరివర్తనాన్ని కలిగించారు.

'ఒక కొట్టువాడు వివిధమైన వ్యాపార వస్తువులకు సుంకంచెల్లిస్తూ అతనికి కొట్టుపై యేర్పడియుండు అధికారమంతనే, ఒకభూమిని సాగుబాటుచేసి వ్యవసాయం చేస్తూ రాజుకి శిస్తు క్రింద పంటలో ౧/3 భాగం యిచ్చే రైతుకు ఆ భూమిపై ఆధిపత్యం కలిగి ఉంటుంది.'

అంటూ ముస్లిం అర్థశాస్త్రవేత్తలైన అల్బేరూని మాథ్యూక్ అరముల్ ఖుకేఫ్ మొదలగువారు నిర్ణయించారు.

కాని వస్తుస్థితి దీనికి విపరీతంగా ఉంటూవచ్చింది. ముస్లిం పాదుషాలల్లో జాగీరుల, అగ్రహారాల యిచ్చే ఆచారం వొకటి యేర్పడివుంది. ఏదో వొక సాకు కలిగించుకొని, గ్రామాలకి గ్రామాలనీ సర్దారులనీ తమ పక్షం చేసుకొనేందుకు యీ పాదుషాలు 'బక్షీస్'గా యిస్తూ ఉంటారు. పాదుషాలకి ఆసర్దారులపై కోపంవస్తే యిచ్చిన జాగీర్లని తిరిగి లాగుకోవడం గూడ జరుగుతూంటూంది.

ఈ విధంగా వ్యవసాయం చేసే రైతుల స్థితి మామూలీ ప్రజలకన్న కొంత మిన్నగా ఉండేది

రైతులకి, యితరులకి భేదం యేమిటంటే అన్యులు తమ యజమానులనుండి కూలి పొందుట, రైతు తాను పండించిన పంటలో కొంత భాగం యజమానికిచెల్లించుట. రైతులనుండి యీ పద్ధతితో రాబట్టుకొనే జమీందారులు, పెద్ద భూస్వాములు రాజ్యానికిఅనగా ప్రభుత్వానికి తమ రాబడిలో కొంత నిర్ణీతభాగాన్ని శిస్తుగా చెల్లించేవారు.

మరికొందరు ముసల్మాను పాదుషాలు శిస్తులని జమీందారులనుండి గాక నేరుగా రైతులనుండే వసూలు చేసుకొన్నట్లు గూడా గలదు.

భూమ్యాధిపత్యం సంక్రమించుటచేముసల్మాను జాగీర్దారులు, జమీందార్లు తమ భూములను యితర సర్దారులకి విక్రయమో లేక తాకట్టుగనో పెట్టుకొనుచుండిరి. దీనికి యేలాటి అభ్యంతరం లేకుండెడిది. ఇష్టమొచ్చినప్పుడల్లా తమ భూములని వొక రైతునుండి మరొక రైతుకు నిర్విఘ్నంగా మార్చు అధికారం కలిగియుండిరి.

అక్బర్ చక్రవర్తికూడా రైతులకి భూమిపై అట్టి అధికారాలేవీ యిచ్చినట్టు లేదు. వ్యవసాయకులనుండి యీ అక్బర్ శిస్తుక్రింద కొంత ధనం రాబట్టుకొని మరికొంత ధనం 'ప్రజా సంరక్షణార్థ సుంకం' అంటూ వసూలుచేయించినట్టు ఆతని దర్బారీయులు వ్రాసిన వివరాలు తెలుపుతూన్నవి.

ఆ కాలంలో రైతులు రాజుకి, జమీందారులకి సమంగా స్వామిభక్తిపరులై ఉండడంతప్ప వారికి మరొక గత్యంతరం లేకుండెను.

రైతులకి హిందూమహాయుగమందు రాజే యేకైక స్వామిగా వుంటూంటే యీ ముసల్మానుల పరిపాలనంలో రైతులకి కేవలం శిస్తులు చెల్లించడమే గాక జమీందారుల అవసరాలను పూర్తిచేస్తూ వారికి వెట్టి చాకిరి చేయాల్సి ఉండెడిది. జమీందారుల రాజవైభవాలన్నీ రైతుల కాయకష్టాలతో పూర్తి అగుచుండేవి. ఈ జమీందారులు రైతులను పీడించుట యింత అంతగా లేకుండెడిది. రైతుల బాగోగులు విచారించువారు లేకపోవడమే గాక వారి గోడవ రాజులుగానీ, జమీందారులు గాని విన్నపాపానికి వొడిగట్టలేదనడం చారిత్రికాంశం.

'రాజ్యంలోని వ్యావసాయక భూమికి ఎందరో అధిపతులనడం—మొదలు రక్షకునిగా పాదుషా రెండవవాడు సంపూర్ణాధిపతిగా జమీందారు, భూమిని సాగుబాటు చేసి వ్యవసాయంచేసే రైతు—తాత్కాలికాధిపత్యంవల్ల మూడవవాడు — పరమ సత్యం, నిర్వివాదాంశం'

అంటూ అక్బర్ పాదుషావద్ద మంత్రిగా నుండిన అబుల్ ఫజల్ తన 'అయీనె అక్బర్' గ్రంథంలో స్పష్టపరచిన రహస్యం గమనించదగింది.

వంశానుగతంగా భూములపై ఆధిపత్యం జమీందారులకి సంక్రమిస్తూవచ్చింది. కొందరు అక్బర్‌ని సామ్యవాదిగా తేల్చడానికి ప్రయత్నించినా అబుల్ ఫజల్ స్పష్టపరచిన పరమ సత్యం నిరాధారమని ఋజువు పరచుచున్నదనుట నిశ్చయం.

అక్బర్ సుగుణవంతుడే. కాని ఆతడు మాత్రం రైతులకి భూమ్యాధిపత్యం ఒసగలేకపోవడమే గాక భూమిపై స్వభావసిద్ధంగా రైతులకి యేర్పడే సహజ ఆధిపత్యాన్ని సహితం అంగీకరించినట్టు లేదు.

ఔరంగజేబు మనోవృత్తి యీ విషయంలో కొంత ఉదారంగా, ప్రగతిశీలంగా ఉండవచ్చును. ఆతడు చారిత్రకంగా అపఖ్యాతి గడించినను దీనియందు మాత్రం ముందడుగు వేసినవాడే.

ఔరంగజేబు విషయంలో ఆధారగ్రంథంగా అంగీకరించబడిన సర్ యదునాథ్ సర్కారు గారి 'మొగలు యిండియా అధ్యయనం'లో ఔరంగజేబు షాహీ ఫర్మానాలోని క్రింది సంగతులు గమనించదగినవి.

౧. బంజర్ భూములని సారవంత మొనర్చు వ్యక్తియే ఆ భూమియొక్క యజమాని.

౨. శిస్తు—ఖర్జ్ ఎముఅజ్జఫ్—నిర్ణీతమైన భూమియొక్క భూస్వామి శిస్తు చెల్లింపజాలకపోయిన, లేక యేదో కారణంవల్ల భూమిని వదలిపెట్టి మరొక ప్రాంతాని కేగిన, వెంటనే భూమ్యాధికారులు ఆ భూమిని వ్యవసాయ సామర్థ్యంగల మరొక వ్యక్తి పరం చేయడం అత్యవసరం.

౩. భూమిని వదలుకొనిపోయిన పూర్వపు స్వామి తిరిగివచ్చి వ్యవసాయ మొనర్చుటకు సంసిద్ధుడైయుండు పక్షమున వెంటనే ఆతనికి పూర్వపు భూమిని యిప్పించుట భూమ్యాధికారుల పరమ కర్తవ్యం.

విమర్శన దృష్టితో ఫర్మానాలోని పై ముఖ్యాంశాలని పరిశీలించిన యీ క్రింది రెండు నిర్ణయాలు తేలుచున్నవి.

౧. తనకు పూర్వము, తన కాలంలో సహితం అమల్లో ఉంటూన్న జమీందారీ విధానాన్ని నిర్మూలించి భూమిపై సర్వాధిపత్యం రైతుకే కలిగించేందుకి ఔరంగజేబు సంకల్పించెను. (కాని స్థానిక భూమ్యధికారులు, ప్రభుత్వంలోని అన్యఉన్నతాధికారులు స్వతఃజమీందారులుగా, జాగీర్దారులుగా ఉండడంచేత ఔరంగజేబు సంకల్పించిన సత్ప్రయత్నాన్ని విఫలపరుస్తూ వచ్చినట్టు యితర చారిత్రిక విషయాలు తేటపరుస్తూన్నాయి.)

౨. భూమిని సాగుబాటుచేయక దానిని నిర్వీర్యపరుస్తూ నిరుపయోగంగా ఉంచే సమయంలో నేభూవ్యవహారంలో రాజులే కలగజేసుకోవడం ముఖ్యమనే ప్రాచీన హిందూ రాజన్యుల సిద్ధాంతాన్ని అనుకరించేందుకి ఔరంగజేబు కృతనిశ్చయుడయ్యేను. ముసల్మానులు రచించిన అర్థశాస్త్రములందలాంటి నియమాలు యేవీ లేనందున ఔరంగజేబు హిందూ పాలకుల సిద్ధాంతాలకి సంసిద్ధుడై యుండెను.

'ధనసంప్రాప్తి, వ్యవసాయం, రైతుల అధిక సంఖ్యపై ఆధారపడి ఉంటూంది.'

అనే 'సియాసత్ నామా' సిద్ధాంతంపై అనుమానాన్ని సమర్థిస్తూన్నది. ప్రతి రైతు గరిష్ఠపరిమితిలో వ్యవసాయం ద్వారా పంటలు పండించడంవల్ల ఆ భూమిపై అతనికే సర్వాధిపత్యం ఉంటూందనీ, యేకైనా కారణంవల్ల అతడు భూమినుండి తగు ఫలితం సంపాదింపలేకపోయినను అధిపత్యం సుతరామూ ఆ రైతుకు లోపింప వీలుండదని ఔరంగజేబు నిశ్చయించినట్లుండెను.

ఔరంగజేబు స్వయంగా రాజకీయాల పేచీలల్లో యిరుక్కొనిపోవడంవల్ల యీవిధమైన ఉత్తమ సంస్కరణలని అమల్లోనికి తెచ్చే అవకాశం అట్టే అతనికి కలిగినట్టు కనుపించడంలేదు. దేశంలో జమీందారీ విధానం ఔరంగజేబు కాలంవరకే దేదీప్యమానంగా ఉంటూ ఉండింది. ఆ కాలంలో మహారాష్ట్రిలు, సిక్కులు, హిందూ రాజన్యులు కూడ భూమిపై సర్వాధిపత్యం జమీందారులకే ఉన్నట్టు నిశ్చయించి ఉండిరి.

పరివర్తనం లేని ఆంగ్ల పరిపాలనం

ఆంగ్లేయులు వ్యాపారం మిషపై భారత దేశంలో స్థావరం కలిగించుకొన్నారు. ఆ తరవాత దేశీయులల్లో పెంపొందిన పరస్పర విద్వేషాల సద్వినియోగ పరచుకొనుటకై వొక తెగవారిని తమచంకలో నిరుకించుకొని సామ్రాజ్య నిర్మాణానికి ప్రారంభించారు. వొకరిని భూషించడం, మరొకరిని దూషించడం వారు తమ నీతిగా నిశ్చయించారు. తమ ఆశ్రయులకి జాగీర్లనీ, యినాంలనీ యిస్తూ వారిని ప్రసన్నులుగా ఉంచుతూ వచ్చారు. అపరోక్షంగా ఆంగ్లేయులు కూడా జమీందారీ విధానాన్ని ప్రోత్సహిస్తూవచ్చారు.

దేశంలో ఆంగ్ల ప్రభుత్వం నాటుకొంటూన్న కొద్ది దేశీయ సంస్థానాలస్థితి మరింత అధ్వాన్నమౌతూ వచ్చింది. ఆంగ్ల సామ్రాజ్యాధిపతుల పరిపాలనా విధానం సంస్థానాధిపతులని విలాస పురుషులుగా, నిష్క్రియ ప్రియులుగా మార్చేసింది. రాను రాను సంస్థానాధిపతులు పెద్ద జమీందారులుగా, జాగీర్దారులుగా పరిణమించారు. దీనివలన సంస్థానాల్లో రైతుల శోషణ మితిమీరిపోయింది.

కొద్దిపాటి మార్పుతో భారతదేశమందు అమల్లో పెట్టబడిన ఆంగ్ల రాజ్యాంగ విధానంలో సిద్ధాంతరూపాన భూమ్యధిపత్యం, హిందూ రాజ్యాంగం మల్లే, రాజుదిగా లేక రాజ్యముదిగా అంగీకరింపబడి ఉంది. 'శిస్తు సక్రమంగా చెల్లిస్తూన్నంత కాలంవరకు రైతు సారవంతమైన భూములనుండి ఫలితం అనుభవించే అధికారం కలిగి ఉంటాడు. శిస్తు చెల్లింపలేకపోయిన పక్షాన ప్రభుత్వం అతనినుండి అభూమిని లాగుకొని అన్యుల కివ్వవలయును'ని ఆంగ్ల రాజ్యాంగ విధానంలో ఉంది. దీనివల్ల రైతుస్థితి భూమిపై అర్ద్రవానిగా, అస్థిరంగా ఉంటూన్నట్టు స్పష్టమౌతూన్నది.

కాంగ్రెసువారి భూమ్యాందోళన


బహుకాలంనుండి జమీందారీ విధాన నిర్మూలనానికి కాంగ్రెసు ప్రయత్నిస్తూన్నది. దేశం స్వతంత్రమైపోయింది. పరిపాలనం దేశీయుల పరమైంది. దేశంలో కాంగ్రెసు ప్రభుత్వం యేర్పడింది. కాని కాంగ్రెసు చెప్పినంత చేయడంలేదు.

భూమి సంబంధంలో ప్రభుత్వం సంస్కరణలు ప్రవేశపెట్టింది. కాని అవి కాంగ్రెసు ప్రజలకి చూపిన ఆశలని పరిపూర్తి చేయడం లేదు. దీనివల్ల రైతులలో ముఖ్యంగా అశాంతి యేర్పడడంచేత అసాంఘికశక్తుల విజృంభణకి తావేర్పడింది.

అనుకొనిన జమీందారీ, జాగీర్దారీ, తాలూక్దారీ విధానాలని నిర్మూలన పరుస్తూ రైతుకు భూమిపై ఉండే జన్మహక్కు ప్రసాదించి ఉంటే 'దున్నేవానిదే భూమి' అనే మంత్రం సార్థకమయ్యేది. ప్రశాంతంగా రైతు సముదాయం జీవితం గడుపుతూ ప్రభుత్వానికి వెన్నెముకగా ఉండేది.

రైతు అభ్యుదయం సర్వోపరిగా స్వీకరించబడుచున్నను ఆచరణ మాత్రం తాబేటి నడకగా జరుగుతూన్నది. దీనివలన అధికాహారోత్పత్తి కలరుత్తి నది; కాని ఫలితం శూన్యం.

ఇకనైనా భారత ప్రభుత్వం రైతుల అశాంతి నిర్మూలించుటకు రైతులకుండే స్వభావసిద్ధ అధికారాన్ని ప్రసాదించిన దేశం సుభిక్షవంతమై అన్నాహారాలకి అన్యుల ఆశించకుండా అభ్యుదయం బడయుట నిశ్చయం.



గన్నేరు - పేరంటం

శ్రీ కోట సుందరరామశర్మ

గన్నేరు అమ్మాయిగారు కాదు, పేరంటము చెయ్యనూ లేదు. ప్రాకృతభవములైన శబ్దాలు తెలుగు భాషలో ఎన్నో ఉన్నాయనీ, వానిని మనం గుర్తించవలెననీ ఉద్దేశ్యంలో వ్రాస్తున్న ఈ వ్యాసానికి ఉపలక్షణంగా ఈ రెండు శబ్దాలూ ఏరుకొని, చదువరులను ఆకర్షించడంకోసరం పై శీర్షిక పెట్టడమయింది.

ముందు పేరంట శబ్దాన్ని గూర్చి విచారిద్దాం. ఇది శబ్దరత్నాకరంలో దేశ్యమని ఇవ్వబడింది, పేరంటము రూపాంతరం అనిన్నీ "వివాహాది శుభకార్యములు నడపుటకు ముత్తైదువలు ఇరుగు పొరుగు ముత్తైదువలను రమ్మని పిలచుట" (లేక) "ముత్తైదువలు వచ్చిచేయు తత్సంబంధమైన కార్యము" అని అర్థము లిచ్చియున్నది. ఇది అందఱకు తెలిసినదే. ఇది దేశ్యముగునా యని ప్రశ్న కాదు, ప్రాకృతభవమని సమాధానము. హేమచంద్రుడు తన సిద్ధహైమశబ్దానుశాసనంలో ౮ వ అధ్యాయం, ౧ వ పాదం, ౬౫ వ సూత్రంలో "ఏతః పర్యంతే" అని దానికే వృత్తిలో (ఇదీ హైమమే) "పర్యంతే ఏకారాత్పరస్యైకారస్య రో భవతి పేరంతో; ఏత ఇతి కిం? పజ్జంతో" అని ఉంది.

పర్యంత మనగా చుట్టుప్రక్కల అని అర్థం సుగమమే కదా! శబ్దరత్నాకరంలో వఱబాక, దనుక అని ఈ పదాని కర్థాలు ఉన్నవి. "పరి+అంత" అనే విశ్లేషణ ప్రకారం చుట్టూ అనే అర్థం స్ఫురించడం లేదూ! లాక్షణికంగా "చుట్టుప్రక్కల" అనుకోవడంలో ఆక్షేపణ ఉండనక్కఱలేదు. ఆ ప్రాకృత "పేరంతో" పేరంటమయింది. "పజ్జ" వైకృతము, విశేష్యమని శ. ర. లో ఇచ్చినాడు. మంచిదే. పై వృత్తిలోని "పజ్జంతో" నుండియే ఈ పజ్జ యేర్పడినది. దీని అర్థము—ఇచ్చిన ఉదాహరణల సందర్భములను బట్టి—వెనుక, సమీపము అని అందే కలదు. రానురాను చుట్టుప్రక్కలనుండియే గాక దూర దూరము నుండియు పేరంటాండ్రు వస్తున్నారు. తమిళాది భాషలలో ఈ పేరంట శబ్దము లేదు, "పజ్జ" శబ్దమున్నూ లేదు. తర్వాత గన్నేరువంకకు తిరుగుదాం.

గన్నేరు

శబ్దరత్నాకరమున ఈ శబ్దము దేశ్యమని పేర్కొనబడినది. కరవీరమను సంస్కృత పర్యాయ మొసగబడినది. సూర్యారాయాంధ్ర నిఘంటువులో విశేష్యమని మాత్రము పేర్కొనబడినది. సంస్కృతి మూలమున్నచో యొసంగడివారేకదా యని మన మనుకొందుము. అనగా వారీయలేదు, లేదని మనమనుకొనుచున్నామని తాత్పర్యము. కాని సిద్ధ హైమ శబ్దానుశాసనంలో హేమచంద్రుడు ఎనిమిదో అధ్యాయం, ప్రథమపాదం ౧౬౮ వ సూత్రంలో "వేతః కర్ణికారే" (వృత్తి:—కర్ణికారే ఇతః సస్వరస్యం జనేనసహ ఏద్ వా భవతి—కణ్ణేరో, కణ్ణిఆరో) అని వచింపబడినది. అనగా "గన్నేరు" కర్ణికార శబ్ద భవమని స్పష్టముగా ఊహింప వీలగుచున్నది. ప్రాకృతము 'కణ్ణేరో' యను రూపమందించుచున్నది.

ఒక్క విషయము. సంప్రదాయ సిద్ధంగా కర్ణికార శబ్దానికి 'కొండగోగు' అని అర్థం వస్తోంది. శబ్దరత్నాకరమున ౧. కొండగోగు, ౨. ఈల అని వ్రాసియున్నది. సూర్యారాయమున ౧. పరివ్యాధము—ఒకానొక చెట్టు, ౨. ఆరగ్వధము—ఈల యని తెల్పబడినది. పరివ్యాధ మనుపదము శబ్దరత్నాకరమున కానరాదు. సూర్యారాయమున నింకను రాలేదు. మోనియర్ విలియమ్స్ రచించిన సంస్కృతాంగ్ల నిఘంటువులో నీటిలోయుండున పెరిగే ఒకానొక దంటు అను నర్థము వివరింపబడినది. ఇంత అగమ్యముగానున్న ఈ "పరివ్యాధ" మను పర్యాయమేల యీయవలయునో సూర్యారాయము.

కుమార సంభవకావ్యమున తృతీయ సర్గలో ౫౩ వ శ్లోకమున

"అశోక నిర్భర్త్సిత పద్మరాగం
ఆకృష్ట హేమద్యుతి కర్ణికారం
ముక్తా కలాపీకృత సిన్దువారం
వసన్త పుష్పాభరణం వహన్తీ." అని ఉన్నది.

"ఆకృష్ట హేమద్యుతిః అహృత స్వర్ణాభరణ వర్ణాని యస్మిన్ తత్తథోక్తం"—అని మల్లినాథ సూరి వ్యాఖ్య. బంగారపు నగలకు బదులుగా వానికన్న వన్నె మీరు కొండగోగు బూవులను, అని వేదం వేంకట్రాయ శాస్త్రి గారి తాత్పర్యము. సందర్భము ఏమిటంటే శివుడు తపస్సు చేస్తున్నప్పుడు, పార్వతి ఆయనకు సేవలు చేస్తున్న కాలంలో, మన్మథుడు దండయాత్ర చేసిన

సందర్భంలో వసంతర్తువు ఆ ప్రదేశంలో ఆవిర్భవించింది. పార్వతి ఆ వసంత పుష్పాలను ఆభరాణులుగా ధరించింది.

పై శ్లోకానికి తాత్పర్యం శ్రీ వేదంవారిచ్చింది ఇది—

"పద్మరాగములకు బదులుగా వానిని మించిన యశోకపుష్పములను, బంగారపు నగలకు బదులుగా వానికన్న వన్నె మీరు కొండగోగుబూవులను, ముత్తెపు సరవులకు బదులుగా వావిలిపూవులను ఈ తీరున ఆమనిపూవులనే ఆభరణములుగా దాల్చినదై పార్వతి యరుదెంచెను."

పై సందర్భాన్ని బట్టి కొండగోగుపూలు బంగారు పసపురంగు కలవని గ్రహించాలి. ఎఱ్ఱని, తెల్లని రంగులకు అశోకములు వావిలి ఉన్నాయి గనుక పచ్చరంగుకు కొండగోగులని మనం సులభంగా ఊహించవచ్చు. కాగా లోకంలో గన్నేరు ఎఱ్ఱగానూ, పసపుపచ్చగానూ మనకు అగుపిస్తున్నది.

ఇది గన్నేరుశబ్దము వ్యుత్పత్తినీ గన్నేరుపూవు రంగున్నూ గూర్చిన చర్చ. ఇది ప్రాకృతభవము అనడంలో సందేహింప నక్కరలేదు. దేశ్యమని నిఘంటువులలో ఉండటం ప్రమాద మనవలె. ఇట్లే ఎన్నెన్నో శబ్దాలు నిఘంటువులలో దేశ్యాలనుకొన్నవి సవరించవలసినవి ఉన్నవి.

ఇంకొక శబ్దం చూడండి "చెత్త" ఇది దేశ్యమని చెప్పి "తృణము" అని అర్థం చెపుతోంది శబ్దరత్నాకరం. సూర్యారాయం చెత్తఅని దీన్ని విడిచి పెట్టింది. భారతి ౧౭ వ సంపుటం ౫ వ సంచికలో "చిత్త" త్యక్తశబ్దభవమనీ అది శబ్దరత్నాకరకారుడు విడిచినాడనీ తెనుగును ఆర్యభాషాకుటుంబంలో కలపడానికి గ్రామీణశబ్దాలు విడువరాదనీ, ప్రాకృత అపభ్రంశభాషలను ఆంధ్రవిద్వాంసులు అధ్యయనం చెయ్యాలని "విమవాసు"గారు "శబ్దరత్నాకరం" అనే శీర్షిక క్రింద వ్రాశారు. ఎకారయుక్త చవర్ణము "చెత్త" శబ్దారత్నాకరంలో ఉన్నది. ఇది కేవలం తెలుగువారే అనడం లేదు. అరవలుకూడా "కుప్పం చెత్తం" అని అంటారు. జైనగ్రంథమయిన "పంచసుత్తం"లో (ఇది అర్ధమాగధీ ప్రాకృతభాషలో ఉన్న గ్రంథం) పరిచత్త అనే పదం 'పరిత్యక్త' అనే అర్థంలో వస్తుంది.

ఎండ

మరొక శబ్దం చూద్దాం. "ఎండ"

ఇది విశేష్యమనీ, ఎండు ధాతువునుంచి వచ్చినదనీ సూర్యారాయం. "ఎండ, దే. వి." అని శబ్దరత్నాకరం. పర్సివాల్, తన ఆంగ్ల–తమిళ కోశంలో ఎండు (*Dry*) అన్నదానికి సకర్మక క్రియలో కాయ్‌దల్, ఉలర్‌త్తు, వాట్టు, కువట్టు, వరట్టు అనే పర్యాయాలున్నూ, అకర్మక రూపంలో కాయ్, ఉలర్ అనిన్నీ, విశేషణం క్రింద కాయ్‌ంద, వరంద, ఉలర్ంద అనిన్నీ పర్యాయాలిచ్చాడు. తెలుగున అతి ప్రసిద్ధమైన ఎండు, ఎండలు ద్రావిడభాషా కుటుంబానికి మూలస్తంభమైన తమిళభాషలో అగపడవు. కన్నడంలో దీని సజాతీయ (*Cognate*) శబ్దం కనపడదు, వినపడదు. ఇక తెలుగున ఈ శబ్దం దేశ్యం అనడంకంటె ప్రాకృతభవం అనడం సముంజసం. "ప్రచండ" అనే శబ్దానికి ప్రాకృతభాషలో "పయండ" అనే రూపం గ్రంథాల్లో తఱచూ వస్తూ ఉంటుంది. "ప్ర" ఉపసర్గ. మిగిలిన 'యండ,' ఎండగా మారి తెలుగులో చేరినదనవచ్చు. అర్థవిశేషం లాక్షణికంగా తెలుగులో సిద్ధించింది—

ఈవిధంగా నిఘంటువులలోకి ఎక్కనివీ, ఎక్కి దేశ్యాలుగా ఉన్నవీ ఎన్నో ప్రాకృత, తదపభ్రంశాల అధ్యయనంవల్ల ప్రకాశితము లవుతున్నవి. నిఘంటురచయితలు ఈవిషయం మరువకూడదు. కీ॥ శే॥ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు చెప్పనే చెప్పారు, గిడుగువారి జన్మదినోత్సవ సంచికలో, తమ "ప్రాకృత గ్రంథకర్తలూ, ప్రజాసేవానూ" అనే వ్యాసంలో—"వేదవాఙ్మయ విమర్శకోసం పరిశ్రమించేవారూ, చరిత్రకోసం వెదకేవారూ కూడా ప్రాకృతం గాలించాలి. ఎన్నో దేశ్యాలూ, ఎన్నో కల్పనలూ, ఎన్నెన్నో వాక్యముశారాలూ, సరసభణితులూ, ఎన్నో చరిత్రాంశాలూ, ప్రాకృతం ఇస్తుంది'' అని—అప్పటికిగాని ఆంధ్రభాషా చరిత్ర సమగ్రం కాదని నా మనవి. మన విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేకంగా పాలి ప్రాకృత భాషల అధ్యయనం జరగాలి. నిఘంటువులలో నిరుక్తం సరిదిద్దాలి. తెలుగుప్రాకృతాలకు గల సంబంధం నిష్పాక్షికంగా తెలిసికోవాలి. ఇదీ ఈ వ్యాసపు టుద్దేశం. కొందరిదృష్టినైనా ఈ మార్గంగా ఆకర్షిస్తే ఈ నా వ్రాత సఫలమన్నమాట.

——

విషమకాలములో వివాహము

శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు

శ్రీమతి రు—అమ్మాళ్ చరిత్ర చాల విషాదకరమయినది. ౭ సం॥ ల లేతవయస్సులో ఆ బాలికకు బొమ్మపాత్రికల పెండ్లి వంటి వివాహము జరిగినది. 'హరవిలాస శారదా' గారి బాల్యవివాహ నిషేధ శాసనము వ్యాప్తిలో నుండిన కాలమే అది. ఐననేమి, శాసనము లెన్ని యున్నవో, శాసనోల్లంఘనమునకు ఉపాయములు నైతము అన్ని యుండుననుట మన యనుభవములోని విషయము. కార్యనిర్వాహకులగు పెద్దలు ఏదో ప్రయాసపడి నిరుపాధికముగ పెండ్లి తంత్రము నడుపగలిగినారు. కృత్రిమ శాసనములను కనుద్రోయుట, సామాన్యసాక్షులను స్వాధీనము చేసుకొనుట, ఇవి లోకతంత్రజ్ఞులకు సులభము కావచ్చును కాని, గ్రహయోగ శాసనములను ధిక్కరించి నెగ్గుటగాని, కర్మసాక్షిని లోబరచుకొనుటగాని, సామాన్య మానవులకు సాధ్యముగాని కార్యములు. ఏ దుర్విధిప్రాబల్యమో, పెండ్లియయిన అయిదవ నాటికో ఏమో ముడిచెడిపోయినదట! తరువాత ఏడాది లోపలనే ఈ చిన్నదానికి మాతృక్లేశము సంభవించినది. అటుమీద ఏడాదికే ఆమె భర్త వేరొకవధువును పరిణయమై ఈమెను మరచిపోయినాడు. పది సంవత్సరములవయసునకే ఆ బాలిక కిన్ని యనుభవములా ?

సవతితో సంసారయాత్ర చల్లగ జరుపుకొనుచు 'సత్సంతాన సౌభాగ్యములతో' భర్త సంతోషించుచుండగా, పునస్సంధానప్రస్తావనైన లేక ఈ బాలిక పుట్టినింటనే పెరుగుచు వచ్చినది. పాపము! తల్లిలేని బిడ్డ; భర్త పరిత్యజించినాడు! శరీరయాత్ర జరుపుకొనుటకై భరణమును కోరుటతప్ప, ఆమెకు గత్యంతరము లేకపోయినది. న్యాయస్థానమున కెక్కుటయే ఆ మాత్రపు సౌకర్యమునైనా వచ్చు పరిస్థితులు కానరాలేదు. ౧౬-౩-౧౯౪౨ నాటికి ఆమెకు ౨౧ సం॥ ల యుక్తవయసు వచ్చినది. వివాహబంధవిచ్ఛిత్తికి, భరణమును సహా, కోరుచు తరువాత కొన్నాళ్ళకే ఆమె భర్తపై న్యాయస్థానములో అభియోగము తెచ్చెను.

ఆమె భర్త భాగ్యవంతుడు. తన తండ్రి దుర్బోధనకు లోబడి భర్తయింటికి కాపురమునకు రాని దోషము ఆమెదే అనియు, ఆమెను తనయింటికి పిలుచుకపోయి భార్యగా ఏలుకొనుట తనకు సమ్మతమే అనియు, న్యాయస్థానములో అతడు వాదించినాడు. అట్టి సవతిపోరు కాపురము ఏ తరుణికి రుచించగలదు! అందులో, విడాకుల చట్టము జారీలో నున్న యీ కాలములో!


న్యాయస్థానములో ఈ అభియోగము విమర్శింపబడినది. ఉభయ పక్ష వాదములను విని న్యాయాధికారి తీర్పు చెప్పినాడు. పురోహితుని మంత్రములతో కట్టబడిన పుస్తెముడి న్యాయాధికారి కలముపోటుతో విడిపోయినది. న్యాయాధికారి వివాహ విచ్ఛిత్తిని తీర్మానించినాడు. పునర్వివాహము చేసుకొనుపక్షమున వాటిదాక, లేనిచో యావజ్జీవముగ, రు—అమ్మాళుకు నెలకు రు ౬౫—౦—౦ భరణమును మాజీభర్త అచ్చుకోవలసినదనియు తీర్మానమైనది. ఇంతటితో ఈ వివాహ కథకు స్వస్తి!!

వార్తా పత్రికలలో ప్రకటింపబడిన యీ కథవలన శ్రీమతి రు—జన్మదినము ౧౮—౫—౧౯౨౧ గా మన మూహించవచ్చును. ౫—౩—౧౯౨౮ నాడు ఈమె వివాహము నడచుట. ఈమె జన్మకాలము మనకు తెలియదు. ఇట్టి యనర్థక వివాహమునకు ఏ గ్రహయోగము బాధ్యత వహించెనో, విమర్శించుట లోకకల్యాణ దృష్టితో ప్రయోజనకారి.

జన్మదినమున నిరయన గ్రహము లిట్లుండ గలవు:—

రాహు కేతువుల మధ్యమునందే గ్రహములన్నియు నుండుటచే, ఈ జాతకురాలికి "కాలసర్ప యోగము" పట్టినదనియు, అదే ఈ విషాదగాథకు కారణమనియు, చెప్పువారు లేకపోరు. ఈ వివాహము విచ్ఛిత్తి అయినది కదా? పునర్వివాహము జరుగుట ఈ కాలములో అసంభవ మనరాదు. ఒకవేళ

అట్లు జరిగి ఆ తరువాత జీవితము జయప్రదముగ నడచుచు వచ్చెనేని, అప్పుడు చంద్ర మంగళ యోగము నకో, గజకేసరీ యోగమునకో, ఫలమును ముడిపెట్టుటయు సాధ్యమే. ఆనాడు నక్షత్రము ఉత్తరాషాఢ. కనుక మామూలు వింశోత్తరీ దశా పద్ధతిలో రవిదశలో జననము కావచ్చును. చంద్ర మహాదశలో వివాహమైనదనియు, ఆ చంద్రునికి షష్ఠాష్టమస్థితిలోనున్న రాహుమహాదశలో విడాకులు సంభవించినారనియు, దశాఫలములను సాగదీయవచ్చును కూడ.



కాని, ఈమాత్రపు సామగ్రి సూక్ష్మపరిశోధకులగు విద్యార్థులకు చాలదు. లగ్నమెయొకదానిని నిర్ణరించి వివాహమునకు, విచ్ఛిత్తిదినమునకు సహా, వింశోత్తరీదశలోనె తగిన సూక్ష్మప్రాణ దశల నేర్పరచి చూపగలిగిన శాస్త్రజ్ఞులు ఆ పనికి బూనుకొని విద్యార్థుల కృతజ్ఞతకు పాత్రులగుదురుగాక.

నూతన గ్రహములతోటి సాయనకుండలి నుపయోగించి ఏమైన సాధించుట సాధ్యమాయని పరీక్షింతము. కాని, వ్యక్తియొక్క శీలస్వభావాదులు, ఆకారచేష్టాదులు, మున్నగు వివరములు మన కేమియు తెలియవు. కనుక లగ్నము నూహించుటకు సామగ్రి చాల తక్కువ. ఇట్టి సందర్భములలో దేవమాన దశ మనకు కొంత సాయపడవచ్చును.

"సంవత్సర మహోరాత్రిం
యోజానంతి మనీషిణః"

అను సిద్ధాంతముపైన ఆధారపడినది దేవమానదశ. ఒక అహోరాత్రము, అనగా ౨౪ గంటలకాలము, ఒక సంవత్సరమునకు సమానముగ భావించుట దీని సంప్రదాయము. జన్మక్షణము మొదలుకొని ౨౪ గంటలకు ఖగోళములో కానవచ్చు గ్రహస్థితివలన కలుగవలసిన ఫలము జన్మాదిగ ఏడాదికి అనుభవము నకు రావలయుననుట ఈ దశ మర్యాద. జీవితములో చెప్పకోదగినట్టి ఫలములన్నియు ఇట్టి చలితగ్రహములకు రాగల అనుకూల ప్రతికూల గ్రహదృష్టులవలన సూచింపబడుచున్నవి. అట్టి ఫలముల ప్రాప్తికాలమును ఆయా సంవత్సరములలో చలిత చంద్రుడు చూపగలడు. చంద్రుని దినగతి రమారమి ౧౨ నుండి ౧౫ భాగలవరకు మారుచుండుటచేత, ఫలసూచకములగు సంవత్సరములలో తగిన గ్రహదృష్టి ఏ నెలకు చలితచంద్రుడు సంపాదింపగలడో, ఆ ప్రాంతికాలమున సామాన్యముగా ఫలము కలుగుచుండుట అనుభవసిద్ధము.

వివాహవిచ్ఛిత్తి అగునప్పటికి జాతకురాలికి ౨౩ సంవత్సరములు ౧౨ దినములు వయస్సగును. దేవమాన దశాపద్ధతిలో ఈ వయస్సు ౨౩ దినములు, ౪౭ నిమిషముల కాలమునకు సమానము. అనగా, జన్మక్షణము మొదలు ౨౩ దినములపైన ౪౭ నిమిషములు గడచునప్పటికి చంద్రస్థితి ఏదో ప్రబల దుష్టగ్రహ వేధను సూచించియుండవలయునని తెలియు.

జన్మదినము	౧౭-౨-౧౯౨౯
౨౩ దినములు చేర్చగా ...	౨౩-౦- ౦
వివాహ విచ్ఛిత్తిని సూచించు చలిత దశాదినము	౧౨-౩-౧౯౨౯
పైదినమున గ్రీనిచ్చి మధ్యాహ్న కాలములో చంద్రస్థితి	భా కల వృశ్చి ౨౮°-౧౯' కము
౨౪ గంటల కాలములో చంద్ర గతి	౧౧°-౫౦'

నాటి దినమున చంద్రునికి యీ క్రింద వివరించిన రీతిగా జన్మదినగ్రహములతో వేధవచ్చు సంభవమున్నదని చదువరులు సులభముగ గ్రహించగలరు :—

౧. జన్మ ఇంద్రునితో కేంద్రవేధ ౨౮-౪౯ వృశ్చికము
౨. జన్మరవితో కేంద్రవేధ ... ౨౪-౩౫ ,,
౩. జన్మయమునితో సార్ధకేంద్రవేధ ౦-౨౦ ధనుస్సు

పై వానిలో ఇంద్రవేధ ప్రకృతసందర్భమునకు తగినది కాదు. మోసమో, కనుకట్టో కావరాదు. బట్టబయలుగ, న్యాయస్థానములో జరిగిన తీర్మానపు ఫలము ఇది. ఒక విధముగా, రాజాజ్ఞయే అనవచ్చును. రవి వేధ ఇట్టి వియోగమును తెలుపజాలినదే. యముని వేధ బంధమోక్షమును సూచించగలది. వైవాహిక బంధ విచ్ఛిత్తికి ఇది సహా తగియుండును. సామాన్యముగ, ప్రబలమైన రెండు దృష్టియోగములు, సమాన ధర్మము గలవి, వెనువెంట వచ్చినప్పుడు, ఆ రెంటి సమష్టిఫలము ఆ రెండు దృష్టిస్థానముల మధ్య బిందువులో కేంద్రీకరించియుండగలదు. ఇనాటు, రవి

యముల వేధాస్థానముల మధ్య బిందువు. భా ౨౯-క ౨౭ వృశ్చికములో నుండును. ఇది ప్రబల గండసంధి యగుటచేత కలిగిన ఫలమునకు మిక్కిలి తగియుండును. కావున ఆనాడు చంద్రుడు వృశ్చికరాశిలో ౨౯°-౨౭' కి రాగల కాలము వివాహవిచ్ఛిత్తి వయస్సునకు జీవమానదశలో సరిపోగలదని మన మూహింపవచ్చును.

ఈ పద్ధతి ననుసరించి జన్మకాలమును సాధించుటకు ప్రయోగ మిది:—

౧౨-౩-౧౯౨౭ నాడు గ్రీనిచ్చి మధ్యాహ్నము తరువాత వృశ్చికరాశిలో ౨౯°.౨౭'౩ వచ్చుటకు చంద్రుడు జరుగవలసిన దూరము. } భా క ౧—౯

దినమునకు ౧౧°-౫౦' వంతున ౧°-౯' దూరము చంద్రుడు జరుగగల కాలము— } గం ౨—౨౦'

	రే.డి.	గం.	ని
చలితచంద్ర వేధాకాలము.	మార్చి ౧౨	౨	౨౦ P.M.
వయస్సునకు పరిధైన జీవమాన దశాకాలము	౨౩	౦	౪౭
తీసి వేయగా గ్రీనిచ్చి మధ్యమమానముతో జన్మ కాలము.	ఫిబ్ర ౧౯	౧	౩౨
స్థానిక రేఖాంశకాలము—	౦	౫	౧౧
చేర్చగా, జన్మకాలము(L.M.T)		౬	౪౩ P.M
ఈకాలమునకు లగ్నము ...		౭½° కన్య	

"ఆధానకాలపద్ధతి"ని ఉపయోగించి ఈ కాలమును, లగ్నమును సహా, సద్ధపరచిన యెడల, ౬-౪౪ *P. M. (L. M. T.)* జన్మకాలముగా, ౭°-౫౯' (కన్య) జన్మలగ్నముగా స్పష్టమగును.

లభించిన సామగ్రితో మనము సాధించగలిగినది చూపితిని. దీనికి భిన్నముగా జన్మకాలము వాస్తవముగా ఉండెనేని తజ్ఞులు దానిని ప్రకటించినచో శాస్త్రపరిశోధనమునకు మహోపకారము చేసినవారగుదురు.

పైకాలమునకు గుణించబడిన సాయన కుండలి ఇది—

కన్యాలగ్నము. లగ్నాధిపతి బుధుడు నీచపడినాడు. నిరయనముగా మీనమే బుధునికి నీచయగును గాని సాయన మీనము కాదనువారు ఉండకపోరు. ఉచ్చనీచ స్థానములు సాయన పద్ధతిలోనే గమనించి ఫలము చెప్పవలెనని యీ క్రింది సూత్రమున్నదని నా మనవి:—

"ఉచ్చత్రః సప్తమం నీచం, ప్రోక్తాంశైః పరనీచతా
ఇహకార్యః సాయనాంశైః కేచిద్యైః ఫలనిర్ణయః"
(జాతకోత్తమము)

ఈ సూత్రము పాశ్చాత్యులెవరో చెప్పినది కాదుగదా! అది యట్లుండె.

ఇట్టి లగ్నాధిపతియగు నీచ బుధుడు సప్తమభావములో వక్రించి యుండుట!

"లగ్నేశే సప్తమే యస్య,
తస్యభార్యా వినశ్యతి."
(బృహత్పరాశరహోర)

అను సూత్రమును స్త్రీ జాతకమునకు అన్వయించితిమేని, భర్తృవియోగము సూచించవలసియుండును కదా! ఇంత మాత్రమే చాలునని కాదు. రవి సప్తమ

బు10-1(వ)	శ 1-28 గు 5-19		X 9-55 రా 15-5
ర 28-39	సాయనజన్మకుండలి		యము 15-20
వె 24-59 చ 22-46 కు 22-41			ప్రుగ్య. 2-8 ఇ 27-47 (వ)
శ 17-52 కే 15-5		వివాహ 20-59	I 7-59

భావములోనే నిలిచియుండుట. "ఉత్సృష్టా రవిణా" అను వరాహమిహిరుని సూత్రము పతి ఈమెను పరిత్యజించునని చెప్పుచున్నది. ఈ రవిపైన ఇంద్రునినుండి సమసప్తక క్రూరదృష్టి కలదు. మోసము, జనాపవాదము, అవిశ్వసనీయ చిత్తవృత్తిగల పురుషులనుండి తొందరల పాలగుట, మున్నగు దుష్ఫలములు ఈ యోగము గల స్త్రీలకు సిద్ధించునని పాశ్చాత్యులనిరి.

"అస్తఖేర్కా రిభిర్దృష్టే భర్త్రా త్యక్తా భవేత్స్వయం" అను "హోరాసార" సూత్రము ఇచట బాగుగ అన్వయించగలదు.

ఇక సప్తమాధిపతి గురువు అష్టమ భావములో నున్నాడు. "ధనవంతుడగు భర్త లభించుట, అతని ఆస్తిని అనుభవించు విషయములో న్యాయస్థానమున కెక్కవలసిన తొందరలు గలుగుట," ఇవి దీనిఫలముగా పాశ్చాత్యులు వ్రాసిరి. చాలదని, వియోగ సంధాత యగు వరుణుడు ఈ గురువుతో చేరి అష్టమ భావమందే నిలిచియుండుట. నిదాకుల ఫలము

సమన్వయించుటకు ఎంతో అనుకూలమయినది. పాశ్చాత్యుల మతములో రవి సప్తమ స్థానములోనున్నపుడు న్యాయస్థానమున కెక్కినచో విజయము కలుగునట. ఈ రవికి భర్తృ పరిత్యాగఫలము ఉండనే ఉన్నది గదా! పుణ్యసహమము ఈ వరుణ గురువులకు అనుకూలదృష్టిలో నుండుట గమనించతగినది. ధనికుడగు భర్తతో వివాహము, భర్తచే, పరిత్యజింపబడుట, న్యాయస్థానములో అభియోగము, వివాహబంధవిచ్ఛిత్తి, మాజీభర్తనుండి మంచి భరణమును సంపాదించుట, ఇవన్నియు పై యోగముల కెంతయు తగియున్నవి.

ఇవి ఇట్లుండగా, పులిమీద పుట్రయన్నట్లు ప్రమాదకరమయిన కుజ, చంద్ర, శుక్ర సంయోగ మొక్కటి! అందులో, కుజ చంద్రులు పంచమ భావములో, శుక్రుడు షష్ఠభావములో, ఉండుట విశేషము. భావమధ్యమునకు వీరు చాల దూరముండుటచే భావఫలములపైన ఈ గ్రహముల కంతగా వ్యాప్తిలేకుండుట కొంత క్షేమమే. కాని, ఈ గ్రహములు భర్తృభావమునకు అర్ధకేంద్రవేధ నిచ్చుచుండుట మాత్రము చింతాకరము. లగ్నాధిపతి బుధునితో యీ షష్ఠస్థాన శుక్రునికి నికరముగ అర్ధకేంద్రవేధయే! గృహస్థాశ్రమ సుఖలోపమునకు ఇంకన్ని కావలయును?

ఈ జాతకమున వివాహసహమబంధువునకు చంద్ర కుజుల నిండు కేంద్రవేధయే కలదు. కుజుని వేధయే చాలియుండగా, ఆ కుజునికి అష్టమాధిపత్య దోష మొక్కటి. అష్టమభావము భర్తృవియోగమును, భర్తృమూలకసంప్రాప్తివిషయో తెలుపగలదని మనము గమనించితిమేని, కుజవేధ జాతకురాలి జీవితకథలో సార్థకత నొందినది.

చంద్రమంగళయోగము ధనార్జనమునకు పేరైనది. ధనస్థానాధిపతియగు శుక్రుడు వీరితో చేరుకొనుట మరింత మేలు. ఈ జాతకమున ఈ చంద్రమంగళ యోగము వివాహమును ద్వేషించుచున్నది. వివాహబంధమును తెగటార్చి, తన్మూలముగ ధనము నిప్పించుటే ఈ యోగముచేసిన మేలు. పతికి పరాధీనత లేదు; అత్తమామల పోరు లేదు; ఏరాండ్రతొందరలు లేవు; గృహకృత్య నిర్వహణక్లేశము లేదు; జీవనవృత్తికొరకై శ్రమపడవలసిన అవసరమును లేదు. నెమ్మదిగా, కాలుమీద కాలు వేసుకొని, సులభముగ నెలనెలకు రు॥ ౭౫ సంపాదించు ధనయోగ మెంత మందికి గలదు? దీర్ఘకాలము చెమటలూడ్చి కష్టపడి ఉద్యోగభారము వహించినవారిలో ఎంతమంది ఇంత పట్టి ఉపకారవేతనము సంపాదించినవారున్నారు? పట్టభద్రులై ఉపాధ్యాయవృత్తిలో నున్న విద్యావంతులకు ఇప్పటి స్థానిక స్వపరిపాలన సంస్థలు ఇంతమాత్రము వేతనమైనా ఇచ్చుచున్నవో, లేదో!

సరే కాని, వైవాహిక జీవితమును కోలుపోయిన ఈ జాతకురాలికి ఈ ధనయోగమువలన ఏమి సుఖమున్నది? అనవచ్చును. ఇది ఒక విధమగు దృష్టి. ఇప్పటి నవనాగరక తరుణులలో విద్యావతు లనేకులు వివాహ బంధక్లేశములకు ప్రాలుమాలి, ఉద్యోగ పదముల నార్జించుకొని, స్వతంత్రముగ జీవించుచున్నారు గదా! అట్టివారి దృక్పథముతో పరీక్షించితిమేని వారి జీవితములకన్న ఈమెది యోగజాతక మనవచ్చు. కష్టపడి ధనార్జన చేయవలసిన బాధ్యత వారికి ఉన్నది. ఈమెకు అట్టి దేమియును లేదు. ఈమె ధనయోగమును విన్నచో, ఆఫీసులలోనో, కంపెనీ కార్యాలయములందో, గుమాస్తాలుగా, టైపిస్టులుగా శ్రమపడుచుండు యువతుల కెందరకో నోరూరగల దనుకొందును.

ఇట్టి జీవితము స్త్రీలకాదర్శమా అందురేమో! అది వేరుమాట. మాతృత్వ ఫలమును, గృహిణీ ధర్మమును, కోరువారి దృక్పథము వేరు. అది యట్లుండె.

ధాత్రి సం... ఆషాఢ శుక్ల ౧౩ గురువారం (౨-౭-౩౬) నాడు జాతకురాలి వివాహము. ముహూర్తమెంత కాలమునకో తెలియదు. కేంద్రములలో బుధ, గురువులు, లాభములో కుజ, కేతు, రవి, శుక్రులు ఉండగలుగుటచే సాయన కన్యాలగ్నము నే ముహూర్తముగ పెద్దలు నిశ్చయించియుండుట అసంభవముకాదు. జన్మకాలమున రవి, బుధులు సప్తమ భావమునకు కార్యనిర్వాహకులుగ నున్నారు గదా! వివాహదినమున తాత్కాలిక రవిజన్మ బుధునికి పరిపూర్ణ త్రికోణదృష్టిలో నిలిచియుండుటచే, జన్మ

శ 22-32	పుణ్య 10-0	వ ౮-౧౦ వివాహ 9-0	X 11-45 బు 19-32
	(వివాహకుండలి) సాయనము		కే 8-12 కు 4-15 ర 10-6 శు 10-55 యు 26-30
రా 8-12			
గు 16-57R చ 10-0			1 10-0 ఇ 14-23

బుధస్థానమే వివాహకాలములో సప్తమ భాగముగ నుండుట యుక్తమను ఊహచే, కన్యారాశిలో ౧౦వ భాగ లగ్నముగా నుండునని మన మనుకొనవచ్చును. ఆ దినము ౧౦-౧౫ A. M. (I. S. T) కాలమునకు ఈ లగ్నము సిద్ధించును. అప్పటి గ్రహస్థితి ఇది :—

"ఉద్వాహే నియతిః నయ త్యతిబలా వేలాం సమాం ప్రాక్తనైః" (బలవంతమైన విధి తన కార్యమున కనుకూలించు ముహూర్తమే నే వివాహసమయమునకు తెచ్చిపెట్టగలదు.)

వరాహమిహిరాచార్యుని సూత్రి యిది. ఈ వివాహమున కిది వర్తించిన దేమో! చూతుము! ప్రబలమైన శుక్రమౌఢ్యదోషమున్నది. ఆదేశములో దీనిని గమనించరేమో! మనము గమనించినా, మానినా, గ్రహములు తమ తమ కార్యములను తాము చేయకమానవు. మట్టమధ్యాహ్నపువేళ ప్రయాణము చేసెడి బాటసారి తాను కన్నులు మూసుకొన్న మాత్రమున వేడిమి తగ్గదుగదా!

"నష్టే చంద్రే తథా శుక్రే
నష్టే చైవ బృహస్పతౌ!
మంగళాని తథోద్వాహం
త్వరితోఽపి న కారయేత్."

అనుచున్నది 'జ్యోతిర్నిబంధము.' ఎట్లయిన నేమి, ధనభాగ్యాధిపతియు, వైవాహిక సుఖకారకుడును, అగు శుక్రుడు రవిసంయోగమువలన చెడి కళదక్కియుండుట మాత్రము కాదనజాలముకదా! ఈ శుక్రరవులు జన్మబుధునికి నిండుకోణ దృష్టితో ఉత్తేజనము నిచ్చి వివాహమునకు త్వరపెట్టుచుండగా, వారికి నిండు షష్ఠాష్టమస్థితిలో గూర్చుండి చంద్రుడు జన్మబుధునికి కేంద్రవేధ నిచ్చుచు, "కానిండు, నా నల్లి వాది" అని బెదరించుచున్నాడు. ఈ చంద్రునికో గ్రహదోషమున్నది. సప్తమశుద్ధి నయితము లేదు. ఈ గండాంతికిని దౌర్భాగ్యము ఫలమని మునులు వచించిరి. గురుచంద్ర సంయోగము గజకేసరీయోగము నిచ్చినమాట వాస్తవము. కాని, ఇతర విధములంగా మంచిదైనా కాకపోయినా, వివాహవిషయములో మాత్రము దీనికి సత్ఫలము లేదు.

ఊహించిన ముహూర్తమే సత్యమయినచో, అప్పటికి చంద్రుడు జ్యేష్ఠానక్షత్రారంభమున నుండును. ఇప్పటి మన పంచాంగములకు నక్షత్రపు ఆద్యంత ఘటికల విషయములో ఐకమత్యము సామాన్యముగా ఉండదని మన అనుభవము. ఏ పంచాంగమైనా అప్పటికి అనూరాధా నక్షత్రములో అంత్య భాగమును చూపియుండక కాబోలు?

"ఇంద్రే పతినా సార్ధం
దుఃఖాన్యనుభూయ కన్యకా దశకే
వర్షే సా వైధవ్యం సమేతి
నోచే న్నృపతా నవమే."

అని ముహూర్తశాస్త్రసూత్రము. జ్యేష్ఠలో వివాహమైన కన్యక దుఃఖములపాలై, పదిసంవత్సరములకు పతివియోగమును పొందునట!

ఈ ముహూర్తపు కుండలిలో పుణ్యసహమము అష్టమభావమున నున్నది. పైగా, దీనికి రవిశుక్రులతో పూర్ణకేంద్రవేధ! వివాహసహమపు బిందువన్నదో, వియోగకారియగు వరుణుని అంకసీమ చేరుకొన్నది. ఏమి చిత్రము!

వివాహకాలపు చక్రమునకు జీవమానదశాపద్ధతి నన్వయించినచో, విడాకు లిచ్చిన వయస్సునకు ఈ క్రింది దుష్టదశాయోగములు చూపట్టుచున్నవి—

౧. చలితలగ్నమునకు వివాహకాలపు శని నుండి సమసప్తక వేధ. ఈ శని షష్ఠాధిపతి. అనగా భర్తృస్థానమునకు వ్యయాధిపతి;

౨. చలితపుణ్యసహమమునకు వివాహయముని నుండి కేంద్ర వేధ:

౩. చలిత శుక్రునికి వివాహయముని సంయోగము.

౪. చలితచంద్రునికి తాత్కాలికముగ ఇంద్రుని పార్శ్వకేంద్రవేధ.

ఇంత కష్టము చాలదా, ఇంకెన్ని కావలయును?

ఇంకొక విశేషము. మోక్షసహమము బిందువు ఒకటి కలదు. అది వివాహచక్రమున మిథునరాశిలో ౨౭°-౩౮' లో నున్నది. వివాహకాలపు శనితో దీనికి కేంద్రవేధ ఎంత తీవ్రముగ నున్నదో, చూతుము. ఇచట మోక్షమనగా, వైకుంఠప్రాప్తియో, కైలాసప్రాప్తియో అనుకొనరాదు. వివాహమునకు మోక్షము. అనగా, విడాకు లన్నమాటే! ఈ యర్థము సాధువా యని శంకించు వారుందురు. చూతుము. ౧౯౫౧ సం॥ మార్చినెలకు ఈ బిందువు చలనవశమున కర్కాటక రాశిలో ౪°-౧౫' కు వచ్చినది. అనగా, అష్టమాధిపతి యగు కుజుని పైననే అధిష్ఠించియున్నదనుట. కుజుడు మోక్షమున కాజ్ఞ ఇచ్చినాడు. శాసనమూలమున వివాహమునకు మోక్షము సిద్ధించినది. ఇదంతయు కేవల కాకతాళీయన్యాయమని చెప్పబూనుట సాహసము గదా!

వివాహమోక్షము వచ్చుట ౩-౩-౫౧ నాడు. అప్పటి గ్రహస్థితి చూతము.—

వివాహమోక్షమున కాజ్ఞ యిచ్చినవాడు కుజుడంటిమి. అష్టమాధిపతి గదా కుజుడు? అష్టమ భావమందున్న వరుణుడు ఆ భావమునకు కార్యనిర్వాహ

కుడు. జన్మకాలిక వరుణునిపై తాత్కాలిక కుజుడు వచ్చినప్పుడే వివాహమోక్షము కలిగెనని పాఠకమహాశయులు గమనించియుందురు. ఈ కుజునికి శని రెండు

రా 19-32 గు 18-21 ర 12-5 బు 5-15	శు 1-14 కు 8-4		
	వివాహవిచ్ఛిత్తి (సాయనము)		వ 5-27(వ)
చ 15-43	సాయంత్రి 5-35 P. M. (I. S. T.)		య 18-7
		కే 0-18(వ) ఇ 19-5(వ)	ల 19-32

రుగ నిలిచి పాపకార్యములకు పురిగొల్పినాడు. జన్మ వరుణునిమీద రమారమి ౧½ సంవత్సరమునకు ఒక మారు కుజుడు వచ్చుచుండును గదా! ఇప్పుడు మాత్రమే విశేష మేమి? అనవచ్చును. సత్యమే. కాని, చలితలగ్నము తులారాశిలో ౧½ భాగకువచ్చి జన్మ వరుణునితో సమసప్తక వేధపాలగుట ఇప్పుడు మాత్రమే. ఈ దశ జరుగు వయసులో కుజుడు వరుణునిమీద రాగలిగిన దినమే వివాహవిచ్ఛిత్తి జరిగినది. మరి, యింకెన్నడు జరుగగలదు?

మనము సాధించిన జన్మలగ్నమును ఏకొంచెము మార్చినా, ఈ ఫలము సిద్ధించదని చదువరు లూహించుకోగలరు. ఈ లగ్నము పైననే ఆధారపడునది పుణ్యసహమము. చలనవశేమున ఇది సింహరాశిలో ౨౩½ భాగకు పోవుటచే, చలిత శుక్రునితో నికరముగా సమసప్తక వేధ పాలగుట ఇప్పుడే. లగ్నము వ్యత్యాస మైనచో, ఈ యోగము సయితము సిద్ధించదు.

ఇంకొక్క పరీక్ష. సాధించిన జన్మకాలము నుపయోగించి గుణించినచో, దైనిక కేంద్రములు జీవితానుభవముల కెట్లు సరిపడునో చూతము:—

	దైనిక	
	లగ్నము	దశమము
౧. వివాహము ...	౧౬-౦ మకరము	౨౩-౦ తుల
౨. వివాహవిచ్ఛిత్తి ...	౨౧½ కన్య	౨౨ మిథునం

(౧) దైనిక సప్తమకేంద్రములో జన్మకాలిక యమగ్రహము ఆవాహనమైనాడు. పాపము! యముని యాజమాన్యములోనైన వివాహ మిది.

(౨) దైనిక సప్తమకేంద్రము నికరముగా చలితరవి పైననే నిలిచినది. పతిపరిత్యాగ సూచకుడే కదా ఈ రవి?

పోనిండు. ౧౯౩౬ సంవత్సరమునకు చలిత లగ్నము కన్యారాశి ౧౬½ భాగకు పోవుటచే చలిత సప్తమము జన్మరాహు కేతువులయొక్కయు జన్మ శనియొక్కయు సమష్టి కేంద్రవేధకు పాత్రమైనది. ఇది వివాహమున కనర్హమైన కాలమని వేరుగ చెప్ప వలయునా? సరేకాని, ఇంత విషమ దశాకాలములో వివాహప్రశంస ఏల రావలసివచ్చెనని ప్రశ్నింప వచ్చును. సామాన్యపరిస్థితులలో అట్టి సమస్య పుట్టియే ఉండదు. కాని, వివాహ సహమము చలించి అప్పటికి తులారాశి ౨౮½ భాగకు పోవుటచే జన్మ రవినుండి త్రికోణదృష్టి నార్జించినది. సప్తమ భావ కార్యనిర్వాహకుడగు రవి లాలించి బేలించి పెండ్లి పెండ్లి యని గోలపెట్టినాడు. గోచారరీత్యా గురు బలము (గురువు వ్యయములో) లేక అనిరుద్దైన గమనించక పెద్దలు ఎనిమిదేండ్ల కన్యకకు వివాహపుశాస్త్రము జరిపించినారు. వివాహసహమము చలించి ౧౯౫౧ కి వృశ్చికరాశిలో ౧౨½ భాగకు పోయినది. ఇది నికరముగ జన్మబుధయముల మధ్య బిందువు. ఇప్పుడే వివాహబంధ విచ్ఛిత్తి. రవి ప్రారంభించిన కార్యము బుధునితో ముక్తాయమునకు వచ్చినది. ఈ గ్రహములు రెండును వియోగమును తెచ్చుటకు సిద్ధముగ సప్తమభావమునందుండినవే.

వివాహమైన ౩వ దినమే చంద్రగ్రహణము. ఈ చంద్రుడు లాభాధిపతి. వివాహమువలన లాభమునకు అప్పుడే గ్రహణము కొట్టియుండును. రానున్న దుష్ఫలమునకు అప్పుడే బీజావాపము జరిగియుండుట అసంభవము కాదు. వివాహమయిన అయిదవ దినమునుండియే తన్ను భర్త వదలుకొన్నాడని జాతకురాలు న్యాయస్థానములో చెప్పుకొన్నదట! ఇట్టి యనర్థము జరుగుటకు ఆ కసికందయందలి దోషమే కారణమని యే పాపాత్ముడు చెప్పగలడు? దుష్టదశాపరిపాకములో, దుష్టలగ్నములో చేసిన వివాహపు ఫలము గాక!..."యదా గ్రహాణాం వైషమ్యం సర్వారంభం పరిత్యజేత్." అను పెద్దల వాక్యమును తిరస్కరించిన దోషపు ఫలముకదా ఇది? "అ చిన్నదాని ప్రారబ్ధమ ట్లున్నది. ఎవ రేమి చేయగలరు?" అను వైరాగ్యపు మాటలాడుట సులభము. ఎవరో చేసినది ఎనిమిదేండ్ల పడుచు తనంత తానే వివాహపుముడి తగిలించుకొన్నదని చెప్పగలమా? వివాహము చేయ కూడని దశ యిది యని శాస్త్రము చాటుచుండగా,

నిర్లక్ష్యము చేసి, దుర్ముహూర్తమున గ్రహణ సమీపములో, ఆ చిన్నదాని కంఠమునకు బంధ మొక్కటి తగిలించు పని యేమియుండెను ?

న్యాయము విచారించినచో, చలితలగ్నమునకు వరుణవేధ గడచుదాక ఈ జాతకురాలు అవివాహిత గానే ఉండియుండుట శ్రేయస్కరము. అనగా, ౨౮ సం॥ వయస్సు వచ్చుదాక వివాహము జరుగనిచో క్షేమమనుట. అలాగా యెప్పుడు వివాహము జరిగినా, చలితలగ్నమునకు అష్టమభావమునుండి యీ వేధా ఫలము కాచుకొని యుండును గనుక ఆ వయస్సునకు తరువాత వైవాహికజీవనము వచ్చియుండినచో, చలిత లగ్నమునకు వరుణవేధ ఉండియుండదు గనుక, వియోగ క్లేశమో, విచ్ఛిత్తిబాధయో, రానవసరముండదు. చలిత సప్తమము సప్తమాధిపతియగు గురువుపై వచ్చినపుడు సుఖప్రదమైన వైవాహిక జీవితము రావచ్చును. కాని అంతకాలము వివాహము నపేక్షించకుండుట సాధ్యమా! జాతకురాలికి చంద్ర,కుజ,శుక్ర సంయోగ మున్నదికదా? అందుచేతనో! అసాధ్యము కాదు. తగిన యుపదేశము, యోగ్యమయిన పరిసరములు, ఇతర సద్వ్యాసంగము, ఇవి సమకూడియుండినచో, సాధ్యమేల కారాదు? మాటవరసకనుకొందము. తగిన విద్యాభ్యాసము చేసి, లలిత కళలలో పాండిత్యము గడించి, యోగ్యమగు పరిసరములు గల సినీమా రంగము చేరి, విప్రలంభానుభవము వలని ఉద్రిక్త స్థితిని చూపగల నాయకీ పాత్రలను అభినయించు చుండి, ఇప్పటికీ జాతకురాలు ఆ సంబంధమును వదలుకొను పరిస్థితులలో న్యాయస్థానమున కెక్కవలసి యుండిన చిక్కుల ననుభవించియుండెడిదేని, ఈ గ్రహవ్యాఖ్యాన మంతయు ఒకవిధముగా దానితో వెల్లివోయి ఉండదా? భావిజీవితములో ఈమెకు శాంతిని, సౌఖ్యమును ప్రసాదించుమని భగవంతుని ప్రార్థింతము గాక !

దాదాపు ౧౨ సం॥ల క్రిందట ఒకానొక కన్యక జాతకమును పరీక్షించినపుడు, అప్పటికి రెండు సంవత్సరములలో ఆ చిన్నదానికి వివాహమును సూచించు గ్రహయోగము వచ్చుననియు, దశ చాల విషమముగా నుండు కారణమున అప్పుడు వివాహము చేయకుండుట శ్రేయస్సనియు, ఇరువది ఏండ్లు వయస్సు మీరుదాక ఆ చిన్నదానికి సుఖప్రదమైన వైవాహిక జీవితము రాదనియు, అమధ్యకాలమున విద్యాభ్యాసంగము యుక్తమనియు, ఆమె తండ్రితో చెప్పితిని. అతనికి ఈ శాస్త్రముపై తగినంత విశ్వాసము లేక రెండేండ్లకే ఆ కన్యకకు పెండ్లిచేసి ‘గనోద్యష్ఠి’ అనుకొనెను. కాని, కొన్నాళ్ళకే ఆమె భర్త ఆమెను నానాబాధలు పెట్టి పరిత్యజించి ఇలువెడలగొట్టి పునర్వివాహము చేసుకొన్నాడు. గత్యంతరము లేక ఆ చిన్నది కళాశాలచేరి క్రమముగ ఉన్నత విద్య నార్జించి జీవనోపాయము సంపాదించుకొనుటకు ప్రయత్నించినది. ఇంతలోనే ౨౧ సం॥ వయసు రాగా, జాతకములోనున్న వైవాహిక జీవిత ప్రతిబంధక సామగ్రి తొలగిపోయినది. తలవని తలంపుగా పూలలోపెట్టి పూజించు భర్త యొకడు ఆమెకు లభించినాడు. ఆ విద్యావతి ఇపుడు సకల సౌభాగ్యములతో సత్సంతానముతో వైవాహిక జీవితము ననుభవించుచున్నది. ఈ జీవితచరిత్రనుండి మనము గ్రహించదగినది లేదా ?

గ్రహములు సర్వదా విషమస్థితిలో నుండవు. దశలు మారుచుండును. మంచికాలము వచ్చువరకు ఓపికతో వేచియుండవలసిన బాధ్యత మనది. అట్లు కాక, రాగోరుచున్న దుష్ప్రారబ్ధమును ఆత్రపడి మంగళారతులతో ఆహ్వానించినచో, మనదే అజాగరూకత. మహాకవి కాళిదాసుని వాక్యము స్మరింతము—

“కస్యైకాంతం సుఖ ముపనతం
దుఃఖ మేకాంతతో వా,
నీచై ర్గచ్ఛత్యుపరి చ దశా
చక్ర నేమి క్రమేణ!”

(మేఘదూతము)



పథాంతరం

★

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

సాయంకాలం పని మనిషి వెళ్ళిపోయిన దగ్గర నుంచీ ఒంటరిగా డాబా మీద కూర్చొని ఉంది సుమిత్ర. అరటి పళ్ళున్నాయి, అవి తిని, ఒక గ్లాసుడు పాలుతాగి పడుకొంటే హాయిగా ఉంటుందనుకొని వంట ప్రయత్నం ఏమీ తల పెట్టలేదు. సామాన్యంగా శరత్కాలపు వెన్నెలలోని స్వచ్ఛత్వాన్నీ సౌందర్యాన్నీ మాత్రమే వర్ణిస్తారు గాని, ఈ చిత్రవిచిత్రములయిన వర్ణాలతో శోభాయమానంగా వెలిగే ఈ పలచని మెత్తని మేఘాలను గురించి ఎక్కువగా వర్ణించరేమా అనుకొంది—ఏమో వర్ణించే ఉన్నారేమో తాను అంత పరిశోధనగా పుస్తకాలు చదివితేకదూ!

ఇంతకీ మనుష్యులకి సహజంగా ఏవి ఎలా ఉంటే అలా ఆనందించే శక్తి తగ్గిపోయింది. ఇంతగా రంగులలో ఆకారాలలో రామణీయకత వెల్లివిరిసే ఈ మబ్బు దొంతరల్ని చూడ్డానికి ఎవ్వరికీ ఓపిక ఉండదు గాని, వాటి గురించి నేను ప్రాకృతిక కవి పుంగవుణ్ణి అని ముద్రవేసికొన్న ఏ విదేశీయ కవి రచించినవో పద్యాలను మిట్టమధ్యాహ్నం ఎండ మండిపోతూ ఉండగా, యాభైమంది ఉత్సాహ భరితులూ చంచల స్వభావులూ అయిన పిల్లలను స్తబ్ధంగా కూర్చోబెట్టి బోధించి, వాళ్ళచేత రాత్రి నిద్రాభరంతో కళ్ళు మూతలుపడుతూ ఉండగా గుడ్డిగా కంఠస్థం చేయించే వ్యవహారం అయిపోయింది ప్రకృతి దృశ్య పరిశీలన జనకమయిన సహజానందం.

సమీపస్థుడైన ఒక మనిషి కోపతాపాలకూ, ఆగ్రహానుగ్రహాలకూ ఎంతో ప్రాముఖ్యము అంటగడుతూ ఉంటాము. తీరా చేసి ఆ మనిషీ, మనమూ, మొత్తం అందరమూ ఈ సువిశాల సుందర సుగంభీర సృష్టిలో ఏ లేశమూ కామన్న మాట మరిచిపోతూ ఉంటాము. ఎంతసేపూ నేలకు పాకుకుపోయిన దృష్టి వల్లవచ్చే అనర్థం ఇదే. కాస్త తల పైకెత్తి నిదానంగా చూడగలిగితే! ఈ మబ్బులు, ఈ నెలవంక, ఈ చుక్కలు ఇవన్నీ ఉన్న సృష్టిలో మన క్షుద్ర జీవితాల గురించి ఎంతో విశేషంగా ఆలోచించడం ఎంత తెలివితక్కువో అర్థం కాకపోదు. ఎవ్వరేమయినా సరే తనకేమీ ప్రసక్తి లేదన్నట్టుగా ఈ భూమి తన పర్యటనం తాను చేసుకొంటూ ఉంటుంది. ఈ భూమి, తనకు పూర్తిగా వార్ధక్యం వచ్చేవరకూ ఇలా సంచరిస్తూ మానవజాతికి నెలవై ఉంటుంది. తరవాత, జీవమే ఉండదు——... బాగానే ఉంది; గాని, మానవులకి కావలసింది అనంతమయిన కాలం కాక, తమ జీవిత పరిమాణానికి సంబంధించిన కొద్దిపాటి కాలం మాత్రమేకదూ! ఈ స్వల్పకాలంలోనూ, కలిసి ఉండక తప్పని మనుష్యులు తమ నడుమ ఏవో పూడ్చబడని అఖాతాలను తవ్వుకోకుండా ఉండలేరు కాబోలు. లోటు ఎవరిదైతేనేమి తనకూ సుబ్బారావుకూ నడుమ ఏర్పడిన అఖాతము పూడ్చబడనిదే.

మబ్బుల మెత్తని రంగులను తిలకించడంలో తన్మయురాలైన తనకు ఇంతలో ఇంతటి గాభరా కలిగించే సామాన్య దైనిక జీవితానికి సంబంధించిన ఆలోచన రావడం ఎంతో విసుగుదల కలిగించింది సుమిత్రకు. తాను సామాన్యదైనిక జీవితానికి సంబంధించిన విషయాలను గూర్చి ఆలోచించడానికి భయపడుతుందని కాదు, వాటి విషయమై అట్టే ఆలోచించవలసింది లేదన్న నిశ్చయానికి తానిదివరకే వచ్చేసింది. తను ప్రస్తుతం అనుగమిస్తున్న పథాన్ని విడిచిపెట్టడం అన్నది నిశ్చయమే. కొత్తదారి ఎక్కడకు తీసుకొని వెళ్తుంది అన్నది ఇప్పుడు ఎంతగా ఊహించుకొన్నా తేలేదికాదు.

కాక, ఈ భూమిని చీమల పుట్టల్లా అంటిపెట్టుకొని ఉన్న భూభాగాలను, తన్నివాసులయిన

మానవ మాత్రులను గురించి, కొద్ది క్షణాలయినా ఆలోచించకుండా ఉండలేదా? ఇన్ని మహా నక్షత్రాలు, వాటిచుట్టూ పరిభ్రమించే గ్రహపుంజాలు, వాటిలో సరిగా మన ధరాతలంవంటి వెన్నెన్నో, వాటిలో సరిగా ఈ ముహూర్తమందే ఎన్నికోట్ల మంది తమ పరిస్థితుల కనుగుణంగా పరిసర వాతావరణంతో ఏకీభవించలేని తనవంటి అసంతృప్త జీవులున్నారో? లేరో? ఉన్నా, వ్యక్తిగతమయిన చికాకులనుమాత్రం ఎవరికి వారు పరిష్కారం చేసుకోవలసినదే. సరిగా మనలాగే ఇబ్బందులలో ఉన్నవారు, మనకంటె అధమస్థితిలో ఉన్నవారు చాలామంది ఉన్నారన్న నిబ్బరంవల్ల చేకూరే దేమీ లేదు; కొంతే మత్తుమందువంటి చేతకాని తనపు తృప్తి మాత్రమే. అందువలన, తన వ్యక్తిగతములయిన అవకతవకలను మరిచిపోయి, మేఘమండలానికీ నక్షత్ర మండలానికీ ఎగిరిపోయేట్టుగా చూస్తూ కూర్చోడం వల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. ఎంతసేపు మీదికి చూసినా తాను ఉన్నకంటె ఒక్క అంగుళం మీదికి వెళ్లలేదు. ఎప్పటి డాబామీదనే, ఎప్పటి కుర్చీలోనే ఉంటుంది. అసలు ఎగరగలిగిన పక్షులకు సైతం నిరంతరం ఎగరడ మన్నది అసంభవం. వాటికి, ముఖ్యంగా వాటికే, గూడుండాలి; గుడ్లను పొదిగి పిల్లలను పెంచి పెద్దవిచేసే బాధ్యత ఏవిధంగా చూసినా తప్పదు— అవీ పాపం రెక్కలున్నాయన్న మాటేగాని, ఎక్కడికో తెలియకుండా ఎగిరి తప్పించుకొని పారిపోలేవు. భగవత్సృష్టి అయిన పక్షులగతే ఇల్లా ఉంటే మానవ నిర్మితాలయిన విమానాల సంగతి చెప్పేదేముంది! అవి గాలిలోనికి ఎగరడానికీ దిగడానికీకూడా విశాలమైన స్థలమూ, అనేకమయిన ఏర్పాట్లూ కావాలి; ఎంతెంతో సిబ్బంది ఉండాలి. అంటే, ఎగిరిపోడం అన్నది అక్షరాలా సాధ్యమయినా, ఎక్కడికో ఎవరికీ అందకుండా తప్పించుకు పోవడం మాత్రం అసాధ్యమే. ఉన్న చిక్కులని చిక్కులుగా అంగీకరించి, సక్రమమయిన పద్ధతిని విడదీసుకోవాలి. అంతే కాని, కొద్దిసేపు ఏమీ సంబంధం లేనట్లుగా-ఇంత విశాలమైన సృష్టిలో ఈ భూమే అతి క్షుద్రమయినది; అందులోని పాంసురేణువుల వంటి నీవెంత నేనెంత - అని గమ్మత్తుగా అనుకొని లాభంలేదు. సృష్టి మొత్తం మీద భూమి చాలా చిన్నదయినా, నేను, చాలా పెద్దగా కనిపిస్తున్నంత కాలం, నా మిత్రులూ శత్రువులూ ఇతరులూ కూడా నా అంత పెద్దవారుగా కనబడడమే సహజం.

సరిగా ఆరింటికి వస్తానన్నాడు సుందరం. ఇప్పటికీ ఏజాడాలేదు, ఏడు కావస్తోంది. అయితే మాత్రం ఇదంటే తనకేదో మహా జీవన్మరణ సమస్యలాగుందిగాని, అతనికేమిటి, బంధమా బలవంతమా? అతని ఇష్టం, విలాసం. కాని అతను దగ్గర ఉండి మాట్లాడుతున్నప్పుడు మాత్రం ఇదంతా ఏదో అతనికి సంబంధించిన సమస్యలాగు తానేమో మహోదయార్ద్ర హృదయంతో త్యాగం చెయ్యడానికి సిద్ధపడుతున్నట్టు అనిపిస్తుంది. కాని, తనకేం ఆమాత్రం ప్రపంచజ్ఞానం లేకపోలేదు, అతను మంచివాడు గనుక తనమీద బాధ్యత అంతా వేసుకొంటున్నాడుగాని నిజానికి ప్రస్తుతపు అవసరము తనదే, అందుకు ఫలితమయిన అపవాద పడవలసిన సర్వబాధ్యతా తనదే. సుందరం కేవలం పరోపకార బుద్ధితో తనకు న్యాయంగా రావలసిన అపప్రథలో కొంత భాగం పంచుకొంటున్నాడు. అతని వంటివాడు కాపుగా ఉంటే ఎంతో ధైర్యంగా ఉంటుంది. అతని ప్రోత్సాహమే లేకపోతే తానింకా ఎంతో కాలం ఈపుంతనే పట్టుకొని జీవితయానం సాగిస్తూ ఉండి ఉండును, ఇప్పుడీ పథాంతరం గురించి మథనపడవలసిన ప్రసక్తి లేకపోవును.

అదుగో ఏడు గంటలు కొడుతున్నారు. ఇంకా రాలేదు. అసలు రానేరాడేమో? రాకపోయినా తన ప్రయాణం జరిగి తీరవలసిందేనా, కాదా? సుందరం రాకపోయినంతలో ఆగిపోయేంత దుర్బలంగా ఉందా తన జీవిత పథాంతర గవేషణా ప్రయత్నం? ఏమో అంతా గజిబిజిగా ఉంది.

అసలు ఇప్పుడీ బుద్ధి తనలో పూర్తిగా సుందరం ప్రోద్బలంవల్ల కలిగినదా? లేక తన భర్త సుబ్బారావు వెనుకటి అభిప్రాయాలకీ ఇప్పటి అభిప్రాయాలకీ, అసలు ఉన్న అభిప్రాయాలకీ ఆచరణకీ ఉన్న వ్యత్యాసం మూలంగా కలిగినదా? ఏమైనా ఒక విషయం మాత్రం సత్యం. తాను ఇక్కడ నుండి తప్పించుకొని వెళ్ళిపోయినంతలో, నూత్న మార్గం అంతా పువ్వులబాటగా ఉంటుందని హామీ ఏమీ లేదు. తాను అటువంటి భ్రమకు విరుద్ధంగానే ఉంది. సంపూర్ణంగా పరిసరాలకూ పరిస్థితులకూ అనుగుణంగా

ప్రవర్తించడం అన్నది తన స్వభావంలోనే లేదు. చిన్నప్పటినుండి తనది ఎదురు తిరిగే తత్త్వమే అయిపోయింది. ఇందు మూలంగా తాను సుఖపడక పోడం మాట అటుంచగా తనకు అత్యంతమూ సన్నిహితులుగా ఉండేవాళ్ళకు కూడా అనవసరంగా ఆందోళన. అయితే మాత్రం తన మనస్సు నిశ్చయంగా ఒక పద్ధతిని సూచిస్తూ ఉంటే, దానిని కాదని అణచిపట్టుకొని తిండికీ బట్టకూ లోటు లేకుండా గడిచిపోతే చాలునన్న సర్దుబాటు తత్వం, ఇంత వయసు వచ్చినా పట్టుబడకుండా ఉంది; ఏం చెయ్యడం?

అంతా నిశ్చయానికివచ్చి, మళ్ళీ మళ్ళీ ఆలోచన పెట్టుకొన్నందువల్ల వచ్చే అనర్థమేమిటి. అయినా ఏ పనీ లేకుండా ఇలా స్తబ్దంగా కూర్చుంటే పొల్లు ఆలోచనలు వచ్చాయంటే వాటిదా తప్పు? వెళ్ళి ఏవో పనిపాట్లు చూసుకోవాలి.

తనకు తెలియకుండానే కుర్చీలో నుంచి లేచి మెట్ల దగ్గరకు వచ్చేక ఎనక ఎప్పుడో విన్న సామెత జ్ఞాపకం వచ్చి తనలో తనకే నవ్వు వచ్చింది. మనువు విడిచిపోతూ పోతూ 'అత్తా నీ కొడుకు ఆకలి కూటివాడం'టట ఒక కోడలు. తానీరాత్రితో ఈ యింటినీ, ఈ సంసారాన్నీ విడిచిపోతూంటే, మరింకా చేయవలసినపనులేముంటాయి గనక? ఉన్నా, చేస్తే ఏమి లాభం, చెయ్యకపోతే ఏమి నష్టం?

రేపు సాయంకాలం ఈ వేళకు తానెక్కడుంటుందో? ఇప్పటికే కాదు. ఇంకా కొన్ని గంటల పర్యంతము తనదయిన ఈ యింటికీ తనకూ ఏ సంబంధమూ లేకుండా తెగిపోతుం దన్న మాట. తరవాత, ఏమవుతుంది? ఏం చేస్తుంది?... ఏమిటో తన ఒక్కతికే ఇంతగా దారీ తెన్నూ తోచకుండా చీకటిగా ఉందో భవిష్యత్తు లేక అందరి సంగతీ ఇంతేనా?... తన కిప్పుడు నిర్భయంగా ఉండడానికి ఇల్లుంది; తిండికీ బట్టకూ కూడా ఏవిధమయిన అవస్థ పడనక్కరలేదు; తన భర్త గౌరవనీయుడయిన గవర్నమెంటు ఉద్యోగి. అదీ ఏ గుమాస్తా గిరీయో కాదు, ప్రబలాధికార సమన్వితుడయిన ప్రాథమిక పాఠశాలల పరీక్షాధికారి. జీతం అన్నది కేవలం నామమాత్రమే గాన, ఇతరత్రా రెండుచేతులా ఆర్జించుకొంటున్న ప్రయోజకుడు. ఒకప్పుడు కాలేజీవిద్యార్థినిగా ఉన్న రోజుల్లో తానూ చాలా ముచ్చట పడింది ఇటువంటి ఉద్యోగం గురించే. అయితే మరి ఈనాడు తనకు తన భర్త అంటేనూ సంసారం అంటేనూ ఇంతగా వైముఖ్యం కలగడానికి కారణం ఏమిటి? కొన్ని గంటలలో తానీ సంసారాన్ని విడిచి పోవడానికి నిశ్చయం చేసుకొని, ఆ సందర్భంలో ఇంకొకరికి మాట ఇచ్చి ఇప్పుడింకా తన అసంతృప్తికి కారణాలు వెదుక్కొంటోంది. రేపు ఎక్కడికో వెళ్ళిపోయిన తరవాత కూడా ఇటువంటి సందేహాలే కలుగుతాయి కాబోలు. తనమట్టుకు తనకే ఇంత అనుమానంగా అనిశ్చితంగా ఉంది తన ప్రయాణ కార్యక్రమమూ, అందుకు మూలకారణమయిన అసంతృప్తి విషయమున్నూ. కాని, తనను విమర్శించే లోకులకు మాత్రం ఎటువంటి అనుమానాలూ ఉండవు, సర్వమూ కరతలామలకమే. అతి స్పష్టంగా తనప్రయాణానికి, కాదు, లేచిపోవడానికి కారణాలు చెప్పగలరు. తాను మాత్రం లోగడ ఎందరిగురించో, అంతా తను ఒక్కతెకే తెలిసినట్లుగా కాలేజీలో చదువుకొన్న మనస్తత్వశాస్త్రం పరిభాష ప్రకారం విభజించి, లేశమయినా అనుమానం లేకుండా మాట్లాడేది కాదా? ఇప్పుడు తనను గూర్చి అంతే జరుగుతుంది. దాన్లో విశేషమేమీ లేదు. అయితే లోకాపవాదానికి భయపడి తన మనస్సు చేసుకొన్న నిర్ణయాన్ని పాటించలేనంతటి భయస్థురాలు మాత్రం తాను కాదు...మరి తానిప్పుడేమీ ఆలోచించలేదు. సుందరంవస్తే బాగుండును.

అదుగో, అనుకొంటూ ఉండగానే వచ్చేడు. మాట బైటికి అనకపోయినా, మనస్సు లోపల్లోపల నూరేళ్ళాయుస్సు అనుకొంది. అతను తలుపు పిలవక మునుపే, 'వస్తున్నా నుండు సుందరం'అంటూ తొందరగా మెట్లుదిగి వెళ్ళి తలుపు తీసింది. సాయంకాలం ఆరుగంటలకల్లా వస్తానని ఇంత పర్యంతం రాకపోయినందుకు ఏదో సమాధానం చెప్తాడనుకొంది; కాని, కళ్ళతో కూడా మాట్లాడకుండా ఊరుకొన్నాడు. తనవెంటనే మెట్లెక్కి వచ్చేడు నిశ్శబ్దంగా. ఆమె తిన్నగా వెళ్ళి తన కుర్చీలో కూర్చొంది. సుందరం ఆమె అనుకొన్నట్టుగానే వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

ఒక నిమిషంపాటు మాట్లాడకుండా కూర్చొని లేచివెళ్ళి లైటు స్విచ్చివేసి మళ్ళీ వచ్చి కూర్చు

న్నాడు. కొంతసేపటికి ఆమె "ఏమిటి సుందరం! అంత పరీక్షగా చూస్తున్నావు నా మొగం? అందులో ఏమైనా కొత్త కొత్త మేఘాలూ మెరుపులూ కనబడడం లేదుకదా లైటు కూడా వేసేవు" అంది సస్మితంగా.

సుందరం వెంటనే ఏమీ సమాధానం చెప్పలేక పోయేడు, కాని, అతని దృష్టి మాత్రం ఆమె ముఖసీమనుండి క్రిందికి దిగింది.

"చూపుల్తోనే నన్ను చిత్రించేస్తున్నావేమిటి సుందరం, లేకపోతే ఏమిటీ ఆపాదమస్తక పరీక్ష." అంది సుమిత్ర. కాని, అందుకు కూడా సుందరం దగ్గర నుండి వెంటనే సమాధానం లేదు, చీర అంచుల క్రిందుగా కనిపించీకనిపించని ఆమె పాదాల మీదనే లగ్నమయి ఉంది.

"మూగనోము పట్టారా ఏమిటి మున్ముందు చేసుకోబోయే భార్య చిరాయురారోగ్యైశ్వర్యముల నిమిత్తం"

మరి సమాధానం చెప్పకుండా ఉండలేకపోయేడు సుందరం. "నాకు భార్యంటూ ఉండటమన్నది ఈ జన్మలో ఘటిల్లించే వ్యవహారం కాదులే, లేకుంటే, తప్పకుండా నువ్వు చెప్పినరకం సత్ఫలితాలు కలుగుతాయని నమ్మకం ఉంది. ఒక్క మూగనోము మాత్రమే కాదు, అంతకు పదింతలు క్లిష్టతరమయిన నోములూ వ్రతాలు పట్టడానికయినా అభ్యంతరం లేదు. అయితే ఈ మన పవిత్ర భారతదేశంలో నోములూ వ్రతాలు మొదలయినవన్నీ స్త్రీలు తమ భర్తల అభ్యున్నతి నిమిత్తం ఆచరించేటటువంటివే. ఏమయినా ఈ జన్మలో మరి అటువంటి విచారానికి సావకాశం లేదు. సరేగాని, నాకు ఎంత ఆలోచించినా ఒక నిశ్చయం అంటూ ఏర్పడలేదు, జన్మాంతరాలు ఉంటాయంటారా?"

"ఉంటాయంటే సంతోషమా? ఉండవంటే సంతోషమా?"

"మన సంతోష విచారాలను బట్టి నడుస్తుందా జగచ్చక్రము. అసలు నాబాధ ఏమిటి అంటే, ఈ జన్మలో ఎన్నెన్నో చెయ్యాలనుకొంటాము; చివరికి ఏమీ చెయ్యలేక పోతాము. ఇక, ఎన్నెన్నో చెయ్యకూడని పనులు చేసి వెనుక పశ్చాత్తాప పడతాము. మనం చేసిన సత్కర్మలకు అర్హమయిన ఫలితం లేదంటే, కొంత నిరాశగా ఉండదూ? ఫలాపేక్షతో కర్మలు చేయవద్దని చెప్తేమాత్రం, చేసిన ప్రతిపనికీ ఏదో ఒక ఫలితం అంటూ ఎట్ట ఎదురుగా కనిపిస్తున్నప్పుడు, ఈ జీవితం అంతా కలిపి గడిచిన దర్శకు ఫలితం అంటూ లేకుండా పోతుందా? ఉంటే అది జన్మాంతర రూపంలో అవ్యక్తే, అంటే నా ఉద్రేకం ఆ ఆత్మే అనుభవిస్తుందా? లేక ఏ ఒక్కడో చేసిన కర్మఫలం మూక ఉమ్మడిని సంఘం అంతా అనుభవించవలసినదిగా తయారయి కూరుకొంటుందా?"

"నీయీ ప్రశ్నలకు నేను సమాధానం చెప్పగలననే అనుకుంటున్నావా? ఒకవేళ చెప్పగలిగినా నీకు మరే అనుమానం లేకుండా సంతృప్తిగా ఉంటుందా?"

"చక్కగా అడిగేవు. నువ్వు సమాధానాలు ఎంత సక్రమంగా చెప్పగలిగేననుకొన్నా నాకు మాత్రం తృప్తి అంటూ ఉండదు. ఉండేమాటైతే ఇదివరకు నేను చదివిన పుస్తకాలూ విన్న బోధనలూ ఇవే చాలును. అయితే ఒకవేళ తృప్తి కలిగినా అది తాత్కాలికమే. మళ్ళీ ఒంటరిగా కూర్చునేసరికల్లా ఎప్పటి సందేహాలే కలుగుతాయి."

"నీకేమిటి మహారాజువి. ఈ జన్మని గురించి ఆలోచించవలసిన అవసరం లేదు గనక, జన్మాంతరాల గురించి హాయిగా ఆలోచించగలవు. మావంటి వాళ్ళకి ఈ జన్మలో ఇప్పటి కాలంలో చుట్టుముట్టి ఉన్న సమస్యలను గూర్చి ఆలోచించి పరిష్కరించుకోడమే దుర్ఘటంగా ఉంది. అందుచేత నీ అతిలోక సమస్యలకి సమాధానాలు నువ్వే ఆలోచించుకోవలసినదే."

"నిజమే, నా సమస్యలకూ నీ అనుమానాలకూ ఒక అంతు అంటూ ఉండదులేగాని......"

"మధ్యలో నన్ను కూడా కలుపుతావెందుకు? నాలో అనుమానాలున్నాయని నీకేం తెలుసు?"

"ఇంకా తెలియడానికేముంది? నేను వచ్చేసరికి, నువ్వు ఉన్న ధోరణే చెప్తుంది. ఇంట్లో ఎక్కడా దీపం లేకుండా, నువ్వు ఏమీ సర్దుకోకుండా ఏ విధమయిన అలంకరణ లేకుండా ఇలా ఉండటమే సాక్ష్యం నీలోని అనుమానాలకు."

"సరే బాగానే ఉంది. నీలో జగత్తంతటికీ సంబంధించిన ధర్మ సందేహాలూ, నాలో ఏవో నా క్షుద్ర వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనుమానాలున్నూ. మరి ఇవి తీరేవి కావులేగాని, ఇవాళ ఇంతసేపటివరకూ రాకపోడానికి గల కారణాన్ని నేను అడగలేదు నువ్వు చెప్పలేదు."

"చాలా చాలా క్షమాపణ చెప్పుకోవాలనే వచ్చేను; గాని, రాగానే నిన్ను చూసేసరికల్లా నేననుకొన్న మాటలన్నీ మరిచిపోయేను. మన ప్రయాణానికి కావలసిన వస్తువులు నాలుగూ కొనడంలో కొంత అవసరమైన ఆలస్యం అయింది. మొదట ఏమో ఒక అరగంటలో అయిపోదా అనుకొన్నాను. కాని, తీరా బజారుకి వెళ్ళిన తరువాత, ఒకటి తరవాత ఒకటి చొప్పున ఎన్నెన్నో అతి అవసరమయిన వస్తువులు కనిపించేయి. అయితే నాకు అవసరమని తోచినవే కొన్నాను. ఇంకా ఎన్నెన్ని మరిచి పోయేనో? కొన్నవయినా నీకు పనికివస్తాయో రావో, నిన్ను బజారుకి రమ్మంటే ఎలాగూ రావని తెలుసును. అందుచేత కేవలం నా ఊహ మాత్రమే వినియోగించికొన్నాను. నువ్వు మామూలుగా ఉత్సాహంగా ఉంటే వెంటనే మా యింటికి తీసుకొనివెళ్ళి, అన్నీ చూపించాలనుకొన్నాను. కాని, నీ సంగతి చూసే సరికల్లా...

"ఏమిటచెప్తా ఇవాళ నాలో అంత ప్రత్యేకంగా కనిపిస్తున్నది? నేనేం కొత్తమనిషిగా కనిపిస్తున్నానా? నామటుకు నాకేమీ వింత కనిపించడం లేదే."

"లేదంటే నేనేమీ అనలేను. అసలు మనం కోరుకోవలసినదీ అంతే, కాని, ఏదో పరధ్యానమూ అనాసక్తతా నీలో కనిపించక పోవడం లేదు"

"నువ్వు ఇవాళ మామూలుగా ఉన్నట్టు లేవు. లేకపోతే ఈ మూగనోమూ, ఈ నిదానమూ, ఈ లేని విశేషాలు గోచరించడమూ ఇదంతా ఏమిటి?"

"నిజమే, కొద్ది నిమిషాల్లో ఎన్నో వందల మైళ్ళు ప్రయాణం పెట్టుకొని, మనం ఆ ప్రసక్తే లేకుండా ఉండగలగడం చిత్రంగా లేదూ?"

"ప్రయాణం అంటూ ఉండేమాటైతే చిత్రమే."

"అంటే ఏమిటి నీ మాట, ప్రయాణంగాని, వాయిదా వెయ్యలేదుకదా?"

"ఏం అంత గాఢంగా అడుగుతున్నావు?"

"వాయిదా పడకపోతే గాభరా లేదుగాని, వాయిదా పడితే గాభరా కాదూ మరి. ఈమధ్యనల్లా అందుగురించే తయారవుతున్నాముకదా, అందులో ఇవాళ రోజంతా ప్రయాణ ప్రయత్నంతోనే గడిచిపోయింది. నీసంగతి చూస్తే మధ్యాహ్నం నేను వెళ్లిపోయిన దగ్గరనుండీ, ఇలాగే కూర్చున్నట్టున్నావు, కొంతసేపు క్రిందనూ, తరవాత ఇక్కడ డాబామీదనూ. సరే, ఏమైనా, నేను చెయ్యవలసిన ప్రయత్నాలన్నీ చేసేను. మనకి రైలు రెండుంపావుకి. నిద్రపోతే తరవాత అలారం పెట్టుకొని లేచినా, బద్ధకంగానే ఉంటుంది. అందుకని ఒక మంచిసుళువు ఆలోచించేను. నీకు ఇష్ట పడుతుందో పడదో?"

"అసలు నీ సుళువు ఏమిటో వినకుండానే ఇష్టపడిందనమన్నావా?"

"ఏమీ లేదు, ఇప్పుడు భోజనంచేసి సినీమాకి పోయేమంటే, తిరిగి వచ్చేసరికి ఒంటి గంట దాటుతుంది. వెంటనే తిన్నగా స్టేషనుకి వెళ్ళిపోయేమంటే సరిగా వేళకు వెళ్ళినట్టే అవుతుంది నీకిష్టమేనా?"

"ముందిప్పుడు సినీమాకి కదూ మనం వెళ్ళడం. అంటే ఇంకా చాలా వ్యవధి ఉందన్నమాటే."

"నీ ద్వంద్వార్థపు మాటలు వింటూంటే నాకు గాభరాగానే ఉంది. గాని పోనీ, సినీమావరకు ఒప్పుకొన్నావుకదా. మరి లేచి వేగం భోజనం కానీ."

"అంటే మరిప్పుడు సినీమాకి వెళ్ళక తప్పదన్నమాట?"

"అదుగో అదేనాకర్థంకాకుండా ఉంది. నీకిష్టం లేకపోతే మరి వెళ్ళినా వెళ్ళకపోయినా ఒకటే."

"అయితే నా కోసమే నువ్వు వస్తున్నావన్న మాట."

"మరి నువ్వు స్పష్టంగా మాట్లాడకపోతే నేనేమీ మాట్లాడలేను. నువ్వే చెప్పు, నన్నేం చెయ్యమంటావో?"

"చేస్తావా నేను చెప్పినట్టు?"

"ఎందుకు చెయ్యను? సబబుగా ఉంటే తప్పకుండా చేస్తాను."

"అదుగో హంస పాదు పెట్టేవు మళ్లీ."

"ఇంతకీ నువ్వు చెప్పేదేమిటో తెములకుండానే వాదనలోకి దించేసేవు."

"ఏమీ లేదు, నువ్వు వెళ్ళి హాయిగా భోంచేసి పడుకో."

"మరి నువ్వు?"

"నేనూ అంతే."

"అంతేనా? నాకయితే మా సుబ్బయ్యగారు వంటపడేస్తాడు. మరి నువ్వు ఏమీ వండుకొన్నట్టు లేదు. పోనీ ఈ రాత్రికి మా యింటికి భోజనానికి వచ్చెయ్యకూడదూ?"

"నేనా??"

"ఏమి రాకూడదా అంత వింతగా అడిగేవు?"

"వింతేముంది. రేపు ప్రొద్దుననుండీ మనమిద్దరం ఒకేదగ్గర ఉండబోతున్నప్పుడు."

"మరయితే ఎందుకీ అనుమానం. లే, పద, సినీమాకిమాత్రం ఆలస్యం ఎందుకూ? వేగం లేచి భోంచేస్తే మరి ఆట్టే వేళుండదు."

"సుందరం! ఇంత అమాయకుడివి, ఇన్నాళ్ళు పెళ్ళికాకుండా ఎలా ఉండిపోయేవో నాకు ఆశ్చర్యంగా ఉంది."

"ఈ ప్రక్కదారి కొత్తవింతకు అంతరార్థం ఏమిటో నా క్షుద్రబుద్ధికి అందకుండా ఉంది."

"విద్యారూప సంపదలు పుష్కలంగా కలిగి, అన్నిటికీ మించిన స్వాతంత్ర్యం కలిగిఉన్నటువంటి నీవంటే ఎంతయినా పోటీ ఉండవలసింది పెళ్ళికొడుకుల బజార్లో. నీవంటి వాడు దొరకడానికి పెళ్ళికూతుళ్లూ, వాళ్ల తల్లిదండ్రులు నువ్వు చెప్పినట్టు వెనకటి జన్మల్లో ఎన్ని తపస్సులు చేసిఉండాలో కదా!"

"ముప్ఫైఏళ్ళు పైబడిన నేను కూడా ఇంకా నీకంటికి కాబోయే పెళ్ళికొడుకులాగే కనిపిస్తున్నానా?"

"బొమ్మల పత్రికలలోని ఈనాటి నవదంపతుల బొమ్మలతో పోల్చిచూసినప్పుడు నువ్వింకా ఈడు రానంత చిన్నవాడివిగానే కనిపిస్తావు"

"అంగేల్లే. ఇంకా ఇతరుల దృష్టికి చిన్నవాడిలాగ కనిపిస్తూఉండనా, అని సంతృప్తి పడేట్టుగానే ఉందిలే ప్రస్తుత పరిస్థితి."

"నీవంటివాడికే అలా ఉంటే తక్కిన మాబోటి జనసామాన్యంమాట చెప్పేదేముంది."

"తక్కినవాళ్ళ కెవళ్ళకీ అలా అనిపించదనీ, ఇది నా ఒక్కడికీ ప్రత్యేకంగా ఉన్న దుర్లక్షణం అనీ నా నమ్మకం."

"ఈ ప్రపంచం ఇలా తయారవడానికి మరేమిటి కారణం. సగంమందికి ఏమీ తెలియకపోయినా అతి గర్వం; తక్కిన వాళ్ళకి అతి వినయం అనే పేరులో తమని తాము గుర్తించుకోలేకపోవడమున్నూ."

"నీ దయవల్ల నేను చేరితే మొదటి సగంలో నే చేరుతాను గాని, రెండవ సగంలో చేరనని నా నమ్మకం."

"నీ వ్యవహారం అంతా దానినే సూచిస్తున్నదిలే, గాని, సుందరం ఒక్కమాట అడుగుతాను, కోపం తెచ్చుకోవు కదా!"

"నేను అంతకోపం తెచ్చుకుంటానని భయంగా ఉంటే అడక్క గాని, మరెందు కాలస్యం, నువ్వు వేగం తయారయితే, భోజనం చేసి, సినీమాకి పోదాము."

"అలాగే గాని, నీకు నిజంగా ఇప్పుడు సినీమా చూడాలని ఉందా?"

"ప్రత్యేకించి, చూడాలని ఏమీ లేదు గాని, ఏదో కాలక్షేపం కావాలా మరి"

"అంటే, నీకిలా నాతో మాట్లాడుతూ ఉంటే, సక్రమంగా కాలక్షేపం జరిగినట్టు లేక, ఏదో వృథా అయిపోతున్నట్టున్న దన్నమాట? అయితే, ఇక మరి......"

"అదా నా మాట కర్థం? నాకిలా కొన్ని గంటలు కాదు, ఎన్ని గంటలయినా సరే నువ్వు మాట్లాడుతూ ఉంటే మరేమీ అక్కర్లేదు. అయితే ఉండిఉండి హఠాత్తుగా లేచిపోతావేమోనని భయం"

"ఇప్పుడు మనం చేస్తున్న పని అదే కదూ?"

"ఏమిటి?"

"మరేమిటి, లేచిపోవడం."

"ఓస్, ఇదా నీ అనుమానం. ఇప్పుడు తెలిసింది నాకు నీ ద్వంద్వార్థపు మాటల అర్థం."

"ఏమిటి చెప్మా తెలిసింది?"

"నీ అనుమానానికి, వెనుకంజ వెయ్యడానికీ కారణం. నేనిదివరకు ఇన్ని రోజులుగా చెప్పినకంటె ఎక్కువ చెప్పగలనని కాదు గాని, మరొక్కమారు చెప్తున్నాను."

"నీకు సంబంధించిన కారణాలవల్ల నే నేమీ వెనకంజ వెయ్యడంలేదని నీకూ తెలుసును. మరింత కంటె నే నేమిటి చెప్పజేరి?"

"చెప్పవలసింది నువ్వు కాదు నేను; నీకు ఇక్కడి దాంపత్యజీవితం బహుకారణాలవల్ల నచ్చని మాట వాస్తవం. ఇక, ఏదో విశమయిన నూత్న పద్ధతి ఏర్పాటుచేసుకోవేందుకు నాకు వీలయిన సాహాయ్యం చేస్తానన్నాను యదిన్వగనుయిన ప్రతిఫలాపేక్ష లేకుం డాను."

"మరి ఇందాకా, ఈ జన్మలోని సత్కర్మ అంతటికీ అర్హమయిన సత్ఫలితం మళ్ళీ జన్మలో ఉంటుందన్న నిశ్చయం లేకపోతే ఆశాభంగంగా ఉంటుందన్నావు!"

"అదా, అది నా ఒక్కడినుంచే అన్నటు వంటి మాట కాదు. లోకం మొత్తంమీద పునర్జన్మ అన్నటువంటిది ఉందా లేదా అని. అటువంటి సందేహం ఎవరికయినా ఏ కాలంలోనయినా కలగ వలసినదే. దాని మాటకేమి, ఇప్పుడు మన ప్రయాణం విషయంలో ప్రత్యక్షమయిన ఫలాపేక్ష ఏమీ లేదంటు న్నాను. అనవా ఒకవేళ ఉన్నా, అది నీలో, సుందరం ఒక విశ్వసనీయుడయిన మిత్రుడు, అన్న స్ఫురణను కలిగించుకోవాలన్నంతకంటె మరీ హీన మయినది కాదనుకొంటున్నాను. అందుకు ప్రతి ఫలంగా లేసమాత్రం అపకీర్తిని తలని ధరించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. అయినా మరి నువ్వు ఎందుకు సాకాకుతున్నావో నాకర్థం కాకుండా ఉంది."

"అందరికీ అన్ని సమస్యలూ అర్థమయి తీరా లన్న పూచీ లేదుకదా!"

"అయితే మొత్తానికి నువ్వు నేది స్పష్టంగా చెప్పు. మన ప్రయాణం ఉందా లేదా?"

"నీకేమిటి, సర్వథా స్వతంత్రుడివి. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళగలవు. ఇక నా సంగతి ఆలోచించు కోండికి, వ్యవధానం చాలా ఉందికదూ?"

"అన్ని విషయాలూ అంత నిశ్చయంగా విస్ప ష్టంగా మాట్లాడేదానివి, ఈ విషయంలో ఇంత సందిగ్ధంగా ఎలా తయారయేవో నాకు తెలియ కుండా ఉంది. నువ్వీ ముందు వెనుకల ఆలోచన లన్నీ నిజంగానే పెట్టుకొంటున్నావో, లేక కేవలం నన్ను పరీక్ష చేయడానికి అంటున్నావో బోధపడ కుండా ఉంది."

"నిజానికన్నా తమాషాకన్నా క్రియజరిగేది ఒక్కటే కదూ!"

"అంటే మరి ప్రయాణం ఉందో లేదో నువ్వు స్పష్టంగా చెప్పవన్న మాట!"

"నీయిష్టమే, నీకుండాలనుంటే ఉంది; లేకుం టే లేదు."

"అమ్మయ్య! అయితే నేను ఊరికినే గాభరా పడ్డానన్నమాట. సంశయ గ్రస్తదృష్టికి సర్వమూ శంకించవలసినది గానే కూపిస్తుంది కాబోలు. మరి, లేద్దామా?"

"దేనికి?"

"సినిమాకి. నువ్వేమీ ఈ సాయంకాలం వంట ప్రయత్నం చేసినట్టు లేదు. నీకు మాయింటికి రావడం మొగమాటం అయితే ఇక్కడికే పంపిస్తాను మా సుబ్బయ్యగారిచేత. నువ్వు భోంచేసి సిద్ధంగా ఉంటే, నేనిలా బండీ తీసుకొని వస్తాను. సరేనా?"

"నాకేమీ తినాలని లేదు. కాబట్టే వండుకో లేదు. పాలూ అరటిపళ్ళూ ఉన్నాయి. అయినా సరే, నీయిష్టం."

"పోనీ నా తృప్తికోసమే అనుకో. అయితే అవి పంపించినంతలో నాకు తృప్తి కలగదు. నువ్వు వాటిని సక్రమంగా ఉపయోగిస్తేనే నిజమయిన తృప్తి. మరి నేను వెళ్తున్నాను. నువ్వు లేస్తావు కదూ."

"అలాగే."

"సరిగా నేను తొమ్మిదింపావుకి వస్తాను. నువ్వు సిద్ధంగా ఉండాలిసుమా."

సుందరం రానంతసేపూ ఎందుకు రాలేదో అనిపించినా, అతను వెళ్ళిపోవడంలో ఏదో పెద్ద బరువు తీరినట్టు అమ్మయ్య అనిపించింది సుమిత్రకు. అనుకోకుండానే దాదా అంచువరకు వెళ్ళి, కిట్ట గోడ

మీాదుగా వెనుతిరిగి వెళ్లిపోతున్న సుందరం కనిపించినంతవరకూ చూసింది. తరవాత ఒకమారు పూర్తిగా డాబామీద చుట్టూ తిరిగి మళ్లీ తన కుర్చీలో యథాస్థానంలో కూర్చుంది.

మళ్లీ తన పత్రికలూ తానే మిగిలాయి. సుందరం దగ్గరున్నంత సేపూ తానొక పెద్ద ముఖ్యమయిన వ్యక్తిగానే కనిపిస్తుంది. కాని, ఇలా ఒంటరిగా ఉండేసరికి మాత్రం తన అశక్తి, తన అల్పత్వం స్పష్టంగా గోచరిస్తాయి. తన కష్టసుఖాలు, ఇష్టానిష్టాలు వీటితో ఏమి ప్రసక్తి ఉంది ఈ విశాల జగచ్చక్ర పరిభ్రమణానికి. ఊఁ హూఁ. మరి ఈ రకంగా ప్రకృతిలో పోల్చుకొని, తనకు, అప్రాధాన్యం ఆపాదించుకొన్నందువల్ల ఇదేమీ విడిపోయే సమస్య కాదు. తాను, మరి ఎటువంటి అనుమానాలు లేకుండా ఒక నిశ్చయానికి రావాలి.

ఇంతవరకూ ఏ అనుమానం లేకుండా ఉన్న మనిషి, తాను సుందరంతో మాట్లాడినప్పుడెందుకంత సందిగ్ధంగా అసలు ప్రయాణమే జరుగుతుందా లేదా అన్నట్టు మాట్లాడింది? అదంతా అతన్ని పరీక్షించడం కోసమా? ఎంత మాత్రమూ కాదు. అతను ఏదో మాట అనేసరికల్లా అప్రయత్నంగా తన నోటంట వచ్చిన మాటలే అవి. అంటే, నిజానికి వాటిలోనే తన అంతర్యంలోని అభిప్రాయం నిగూఢమై ఉండి ఉండాలి.

అంటే తనకిప్పుడీ ప్రయాణం ఇష్టంలేనే లేదా? అనగా తానీ సంసారయాత్రను సుబ్బారావు గృహిణిగా సక్రమంగా, శాశ్వతంగా సాగించగలదా? లేకపోతే ఇంతకంటె మేలైన తరుణం వేరే ఏదైనా ఉంటుందా? ఇప్పటికి తనను బిగించి ఉంచినది ఒక్క దాంపత్య బంధమే, ఇంకా ముమ్ముందు ఇంతకంటె బలమయిన బంధాలు కూడా ఏర్పడవచ్చును. అప్పుడు తన మార్గం మరింత దుర్గమంగా తయారవుతుంది.

చివరికి ఏమయితే అదే కానీ, అంతా భగవదిచ్ఛ అని, ఊరుకొన్నందువల్ల ఫలితం లేదు. ఎంత భగవదనుగ్రహం అయినా, కొంత మానవ ప్రయత్నం అంటూ ఉండకపోతే ఎలాగ?

ఇంతగా ప్రాపంచిక జ్ఞానం సంపాదించే ననుకొని, మనస్తత్వ పరిశీలనలో కృషిచేసి చివరికి స్వవిషయం వచ్చేసరికల్లా, ఇల్లా ఏదో తప్పించుకుపోయే, ఇతరులమీద బాధ్యత నెట్టివేసే, మనిషి కావటంకంటె హాస్యాస్పదమయిన సంగతి ఏముంటుంది? కాబట్టి మరి ఎటువంటి అనుమానమూ, తొందరపాటూ, అందువల్ల తరువాత కలిగిన అనవసరమయిన ఆరాటమూ, ఇవేవీ లేకుండా మనస్థితి ఏమిటో తేల్చుకొని, భవిష్యత్ కార్యక్రమం నిర్ణయించుకొని, అందుకు నూటికి నూరుపాళ్ళు బాధ్యత శిరసా వహించడానికి సిద్ధపడాలి

తా నాలోచించ వలసిన వాటిలో మొట్టమొదటి విషయం: తాను తన భర్త సుబ్బారావును విడిచి వెళ్లిపోడం తప్పనిసరి అన్నందుకు చెప్పుకొంటున్న కారణాలేమిటి?

ప్రధానమయినది సుబ్బారావు అధికార గర్వం. తాను చేస్తున్నది ఒక అతి సామాన్యమయిన నౌఖరీ మాత్రమేననీ, తన క్రింది వాళ్లని తాననుకొనే మాష్టర్లకంటె తానే విధంగానూ అధికుడు కాదని గుర్తించలేక పోవడం; తత్ఫలితంగా వాళ్లను చాలా హీనంగా చూడడమూ, అదంతా ఏదో మహత్తరమయిన అధికార లాంఛనంగా భావించడమున్నూ.

తరవాత, డబ్బే సర్వప్రధాన మనుకొని, ఏదో ఒక మాదిరిగా కాలక్షేపం జరిగేపాటి జీతం ఉంటున్నా, డబ్బునరించి, ఎక్కడలేని కక్కుర్తి పడడం. ఆ కక్కుర్తి అయినా తన క్షుద్రత్వమూ లోపమూ అని అంగీకరించక, ఏదో మహత్కార్యం చేస్తున్నట్టు, ఎందరికో అయాచితంగా ఎన్నెన్నో ఉపకారాలు చేస్తున్నట్టు, తను ఆత్మ వంచన చేసుకోడం మాత్రమే కాకుండా, స్వబంధు మిత్రులను కూడా నమ్ముకో మనడమూ. ఏమో. తాను వాళ్లను సంతృప్తి పరచడం నిమిత్తం ఈ కొద్దిపాటి లంచాలు పుచ్చుకోక పోయినట్లయితే తన చేతిక్రింది మాష్టర్లింత సుఖంగా కాలక్షేపం చేయలేరనీ, తను చేసిన ఉపకార పరంపరకు వాళ్లు ఆజన్మాంతం కృతజ్ఞులుగా ఉండాలనీను—

ఇక తన ఈ మహత్తరమయిన అర్జనాపాటవానికి తన చుట్టూ ఉన్న సంఘమంతా ఉబ్బి తబ్బిబ్బయి బ్రహ్మరథం పట్టలేదని ఆక్రోశపడడం.

తనకంటె ఉన్నతమయిన ఆశయాలు కలిగిన వారినీ, అందులోను ముఖ్యంగా పూర్వ మిత్రులను

సరిగా అర్థం చేసుకోలేక పోడమే కాదు; వాళ్లేమో తనకంటె ఎంతో వెనకబడిన వారనీ, తనపాటి ప్రయోజకులు కారనీ, తాను వాళ్లను చిన్న చూపు చూడ్డమే సబబు అని పట్టరాని దురహంభావము కలిగి ఉండడం.

వాచ్యంగా తనతో ముఖాముఖీని అవడానికి ధైర్యం చేయలేకపోయినా, ప్రాసంగికధోరణిని మాత్రం, భార్యాభర్తృ సంబంధం విషయమై పతివ్రత అనే పేరుతో అతిసంకుచితమయిన అభిప్రాయాలు వెలార్చుతూ ఉండడమూ; భార్య, భర్త ఎటువంటి వాడయినా, ఏవిధంగా సంచరించినా, మారుమాట్లాడకుండా జీతంబత్తెం కోరని సేవికగా పడిఉండాలని ధ్వనించేలాగా మాట్లాడుతూ ఉండడం.

తను కొన్న ప్రతి చీరకు, ఇంటికి తెచ్చిన వస్తువుకూ, అయాచితంగా దానంచేసినట్లుగా విశేషించి పొగడ్తవెయ్యాలనుకోడం. అనగా ఏమిటి, ఇంట్లో తన తిండి బట్టలకు కూడా అర్హతలేనట్లు, ఏదో ఔదార్యశాలి గనుక తాను సర్వార్థం పోషిస్తున్నట్టు అభిప్రాయపడడం.

ఇల్లాగే చిల్లరమల్లర విషయాలు, పనిమనుషుల విషయంలోనూ, ఇంటిఖర్చు వెచ్చాల విషయంలోనూ తనమాటే అంతిమనిర్ణయం అయినప్పటికీ తానేదో మహో పురోగమించిన అభిప్రాయాలు కలిగినవాడు కాబట్టి భార్య ఇష్టాన్ని పాటిస్తున్నట్టుండడం, స్పష్టంగా ఖర్చుపెట్టిన ప్రతికానీ పద్దురాని తీరా లవడానికి సంకోచం అయినా, అలాగని ఊరుకోలేక, ఏదో పరధ్యానంగా మాటల సందర్భాన్ని అడిగినట్టుగా, తానదివరకు ఇచ్చిన డబ్బు ఖర్చును గూర్చి అడుగుతూ ఉండడం...

ఇక మంచి బొమ్మలు చూడడం, పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, స్నేహితులతో మాట్లాడ్డం, ఇవన్నీ ఎందుకూ కొఱగానివాళ్లు ఏపనీ లేకపోబట్టి చేసేపనులనీ, అవసరం తన పేకాటపాటి అయినా చెయ్యవని ప్రబలమైన విశ్వాసం కలిగి ఉండడము.

సరే కారణాల కేమి, అలా పేర్చుకొనిపోవచ్చును. అయితే ఈ తాను చెప్పుకొన్న కారణాలు ఒక్క తనకు మాత్రం వర్తించేవా, ఇతరులకు కూడా వర్తించే టటువంటివా? లోకంలో చాలామంది భర్తలకంటె సుబ్బారావు చాలా అంశాల్లో నయం. అయినా, అంతమాత్రంలో, తనకు ఈ దాంపత్యజీవితం అసహ్యకరంగా ఉండడానికి అభ్యంతరం ఏమిటుంది? తన వ్యక్తిగతమయిన ఉద్దేశాలు ఇష్టానిష్టాలు తనవి. వాటికి ఇతరులతోడి సాపేక్షవలన ఏమీ ఉపయోగం లేదు.

అయితే ఇప్పుడీ విధంగా తాను వెళ్లిపోతే జనవాక్యం ఏ విధంగా ఉంటుంది? అందుకు తాను జడుస్తుంది, లేదు, అది వేరే అంశం. కాని, ఒక పని చేస్తే దాని ఫలితం ఏవిధంగా ఉంటుందో ఊహించుకోవడంలో పొరపాటేం లేదుకదా!

సుబ్బారావులో తను చూస్తున్న లోపాలను చూడలేకపోడమే కాకుండా, ఈరకంగా తాను విడిచిపెట్టిపోడం మూలంగా అతణ్ణి ఆదర్శప్రాయుడయిన భర్తగా పేరు చలామణీ చెయ్యగలదు లోకం. తనవంటి చదువుకొన్న దానిని చేసుకోడంలో అతడు చాలా తెలివితక్కువ పని చేసేడని చాటుగా మాటుగా అనుకొనే అతడి ఆప్తవర్గానికి తమ జోస్యం ఫలించిన తృప్తి విశేషంగా కలిగితీరుతుంది. తను భర్తను విడిచిపెట్టి వెళ్లిపోవడం అన్న ఒక్క కారణాన్ని ఆధారం చేసుకొని, తనలో ఏ కోశానా లేని ఎన్నెన్నో క్షుద్రప్రవృత్తులూ ఉద్దేశాలూ దుర్గుణాలు అంటగట్టబడతాయి. అంతే కాదు, తనతో పాటు ఈ అపప్రథాభారాన్ని అకారణంగా సుందరంకూడా భరించాలి. పోనీ, అతను ఇందువల్ల ఏమైనా ప్రతిఫలం ఆశిస్తున్నాడంటే, అదీ లేదు. కేవలంతనకు సహాయం చెయ్యడం నిమిత్తం, అతడు అపవాదును, అందులోనూ మిత్రద్రోహం కూడా మిళితమయిన దానిని, అకారణంగా భరించాలంటే అది అన్యాయంకాదా! తీరా చేసి వెళ్లిపోయిన తర్వాత, ఇప్పుడు సుబ్బారావుమీద ఆధారపడినట్లే, నిస్సహాయంగా సుందరంమీదే అన్నిటికీ ఆధారపడడంకంటె, తాను మరొక కార్యక్రమం ఏదీ నిశ్చయపరచుకోలేదు. సుందరం సుబ్బారావుకంటె మానసికంగా చాలా అభివృద్ధిచెందినవాడే. అయితేమాత్రం, ఇప్పుడిల్లా దూరంనుండి మెరుపులా కనిపించినట్లు కాకుండా పూర్తిగా అతని మీదనే ఆధారపడి

ఉంటున్నప్పుడు, అప్పుడు ఇంత శాంతంగాను సరదాగాను ఉండగలడా? అలా కోరడం మానవ స్వభావానికి సాధ్యమైనకంటె, ఎక్కువగా వాంఛించడం కదూ? సుబ్బారావు తన సరించిన సర్వ బాధ్యతలూ వహిస్తున్నాడంటే, అతనికి తాను ఏవిధమయిన కృతజ్ఞత చూపించలేక పోయినా, అసమం, అతనికి తన భార్య అనే హక్కయినా ఉంటున్నది. కాని, ఇప్పుడనుకొన్న ప్రకారం లేచిపోవడం జరిగితే అందువల్ల సర్వమూ ఇచ్చేవాడు సుందరం, పొందేది తానూ అవుతుంది. తనవల్ల అతను పొందగల ప్రతిఫలం ఏలవ వేళమూ లేకుండా, అతనిమీద తాను సంపూర్ణంగా ఆధారపడి ఉండడంకంటె నీచతరమయిన స్థితి ఇంకేముంటుంది? ఈ ప్రయాణపు వైనం విన్న తర్వాత ఏ యువతి రేపు అతన్ని నిర్భయంగా వివాహం చేసుకోగలదు? ఇదంతా కేవలం స్వప్రయోజనార్థం సుందరాన్ని అతని భవిష్యత్సుఖ జీవితాన్ని త్యాగం చెయ్యడంకంటె వేరే ఏమీ కాదు.

అంతేకాని, తానింకొక ముఖ్యమయిన విషయాన్ని గూర్చి ఆలోచించలేక పోతున్నది. వంచితులయిన భర్తల, కేవలం వంచితుడు కాకపోయినా భార్య ఇంకొకడితో లేచి వెళ్లిపోయిన భర్తల ప్రవర్తన ఎన్నెన్ని వింత వింత, పంథాలు తొక్కగలిగిందీ తనకు తెలియనిది కాదు. అటువంటి పరిస్థితిలో, సామాన్యంగా మానవుడు చెయ్యని ఎన్నెన్ని రాక్షస కృత్యాలయినా జరగడానికి సావకాశం ఉంది. అట్టి ప్రమాదం, తనకు ఎల్లానూ తప్పదు. మరి సుందరాన్ని కూడా అందుకు సరి చెయ్యడం ఏమి న్యాయం?

సుందరం వంటబ్రాహ్మణుడు సుబ్బయ్య వచ్చి, తలుపుతీసి ఉండడంవల్ల, పక్లా భోజనపదార్థాలు వంటింట్లో పెట్టి, మెట్లెక్కి వచ్చి "అమ్మా, భోజనం తెచ్చేను. తలుపు తీసిఉంది, వేసుకోండి" అని చెప్పి మెట్లుదిగి వెళ్ళిపోయేడు. వెంటనే దిగి వెళ్ళి, గడియ వేసి, నిద్రలో నడుస్తున్న మనిషిలాగ మళ్లీ డాబామీదికి వచ్చి కూర్చుంది.

వెన్నెల స్వచ్ఛంగానే ఉంది, గాని, కొద్దిపాటి చలిఅనదగిన చల్లదనం లేకపోలేదు. అయినా క్రిందకు దిగిపోవాలనిగాని, అధమం కొంచెం వెచ్చగా ఏదయినా కప్పుకోవాలనిగాని, ఆమెకు బుద్ధిపుట్టలేదు. అలాగే కూర్చుంది. కాని, ఆలోచనా సూత్రం మాత్రం తెగిపోయింది.

ఇటువంటి స్నిగ్ధశీతలమయిన వెన్నెలలోనే తాను మొట్టమొదటిసారి సుబ్బారావును చూసింది. అప్పటికీ ఇప్పటికీ మనిషిలో ఎంత భేదం వచ్చేసింది? తనలోనూ కొంత భేదం ఉండకపోదుగాని, తనకది అంత సులభంగా గోచరించదు. తప్పులెన్నువారికి తమ తప్పులు కనిపించసాగాయంటే, వాళ్లు మరి ఇతరుల తప్పు లెంచే పనికి అనర్హులు కాకతప్పదు. తమ తప్పులు కనిపిస్తూనే ఉన్నా, వాటిని సాధ్యమయినంతవరకు మరిచిపోవాలి; ఆ విద్యలో నిజంగా సుబ్బారావు ఉత్తీర్ణుడు కాబట్టే, అంత నిర్విచారంగా తను చేస్తున్నది ఉత్కృష్టమయిన దేశసేవ అని నమ్ముకో గలుగుతున్నాడు. అలాగే తాను దైనికావసరాలకు లోటులేని సామాన్య గృహిణి అనీ, తనకంటె ఎందరో ఎన్నో మనుసులు తక్కువవారనీ తాను తృప్తిపొందలేకపోవడమే తనలోని పెద్దలోటు. అయితేమాత్రం లేనిసౌఖ్యం ఉందనుకొనే ఆత్మవంచన మూలకమయిన తృప్తి ఎంతకాలం నిలుస్తుంది?

ఇక్కడి ఈ జీవితాన్నీ అసంతృప్తినీ వదల్చుకోవాలనే ప్రయత్నంలో తాను వేరే మరి కొన్ని బంధాలకు, చిక్కులకు లొంగిపోదని హామీ ఏమీ లేదు. ఒకప్పుడు ఇంతకంటె హీనమయిన పరిస్థితులను ఎదుర్కోవలసి రావచ్చును. తన ఉనికికి ఈ మాత్రం నిర్భయత, నిరపాయత కూడా ఉండకపోవచ్చును. తన గౌరవాన్ని కాపాడుకొనే ప్రయత్నంలో తాను ఏదయినా తొందరపాటుపనులు చేయవచ్చును. వాటి ఫలితంగా ఎన్నాళ్లో వ్యధననుభవించవచ్చును. అయినా ప్రమాదపుసావకాశాలన్నీ ఇతరులకంటె తనకే బాగా తెలుసును. అయినా తననిశ్చయం మార్చుకోడం పిరికితనమూ, కార్యనిర్వహణ తత్పరత లేకపోడముకంటె వేరేమీ కాదుకదా! ప్రమాదాలు జరగడానికి సావకాశం ఉంటున్నాదికదా అని ప్రయాణము, విమాన ప్రయాణాలు సైతం మానుకొంటున్నారా? అలాగే తన ప్రయాణమున్నూ. భవిష్యత్తు ఎలా ఉంటుందీ ఎవ్వడూ చూసివచ్చినది లేదు. ఎవరు చేసినా ఊహ మాత్రమే. కాక, ఏవో ప్రమా

జాలు లీలగా కనిపిస్తుంటే మాత్రం, వర్తమానంలోని సమస్యలను సక్రమమార్గాన పరిష్కరించుకోకపోతే ఎలాగ?

ఇప్పుడింత నిశ్చయంగా ఉన్న అభిప్రాయాలే, అతను, సుందరం, వచ్చేసరికి మాత్రం ఎందుకంత అనుమానాస్పదంగా తనకే నిశ్చయం లేనట్టుగా తయారవుతాయో? సరే, ఇక మరి సందేహం లేదు, అంతా నిశ్చయం అయిపోయినట్టే. అయ్యో పాపం, అతను సినీమాకు బయలుదేరి వచ్చేవేళయింది, తానింకా ఇలాగే కూర్చుంది. లేచి వేగం తెమలాలి...అదుగో, బండి రానే వచ్చింది. కానీ అతను వచ్చికూర్చున్నాకే లేవవచ్చును భోజనాదికానికి.

ఈమారు తలుపు తియ్యగానే అతను ముందుగా మెట్లెక్కొచ్చి కుర్చీలో కూర్చున్నాడు. ఆమె తరువాత వచ్చి తన కుర్చీలో కూర్చొంది.

సుందరం: మరి ఆలస్యం ఎందుకు, సుమారు వేళయింది; బయలుదేరుదామా?

సుమిత్ర: అలాగే నేను సిద్ధంగానే ఉన్నాను. ఇలా రమ్మంటే ఇలాగే వచ్చేస్తాను. కాని, మీపని మనిషిని వెంటపెట్టుకొని వచ్చేవేమో నని నలుగురూ అనుకోకుండా ఉండే నిమిత్తం మరొక చీర కట్టుకొందికి వ్యవధి ఉంటే...

సుందరం: అంటే. ఆమాత్రం అవసరం గుర్తించేస్థితిలో ఉన్నారన్న మాట. మధ్యాహ్నంనుండి, కదలిక లేకుండా పరధ్యానంగా కూర్చోడాన్ని బట్టి చూస్తే, చీర మంచిది కట్టుకోడమూ సామాన్యంగానయినా అలంకరించుకోడమూ లేశమయినా అవసరం లేనివని తేలింది. అందుకు తోడు భోజన ప్రయత్నం కూడా చెయ్యకపోడం వింతగానే రూపించింది. ఏమైతేనేమి, నీఅంతట నువ్వే మామూలు లోకానికి వచ్చి అలంకరణావసరాన్ని గుర్తించేవు కాబట్టి ఆ వరసనే, భోజనంకూడా కానిస్తా వని నమ్ముతున్నాను. రేపు రైలులో సరిగా భోజనం ఉండదు కదా అని, ఇలాగే, రేపటికికూడా సరిపడేంతగా తినడానికి వీలయినట్టు వండిసున్నాను. అందులో నాకు మరీ నచ్చినవి, నీకు నచ్చుతాయో లేదో తెలియదు, నీకోసం ప్రత్యేకించి వండించేను. నా యీ అహంభావాన్ని తుష్టి పరచడం నిమిత్తం అయినా తినకూడదా?

సుమిత్ర: తినడానికి చాలా చిత్రమయిన కారణం చెప్పావు; ఇంకా చిత్రమయినవి ఎన్నో చెప్పవచ్చునేమో? కాని, నాకు తెలిసింది మాత్రం ఒక్కటే కారణం; అది ఆకలివెయ్యడం. అయితే ఇందాకా పరధ్యానంగా కూర్చుంటే అట్టే లేదు గాని, ఇప్పుడు ఆకలికూడా బాగానే వేస్తోంది. అందుచేత నీ బలవంతం, బహుమానం విశేషం అక్కర లేకుండానే భోజనం చేస్తాను. ఒకళ్లు పదిమార్లు బలవంతంచేసినప్పుడు నిజంగా కావలసిన వస్తువయినా అక్కరలేనిదిగానే కనిపిస్తుంది. కాని, వాళ్ళు తీరా ఇవ్వకునేసరికి ఎక్కడలేని ఆశాభంగమూను...సరేమరి కబుర్లకేముంది, ఆలస్యం అయిపోలేదు కదా. నేను భోజనం కూడా చేసివచ్చేసరికి వేళ ఉంటుందా?"

సుందరం: ఎందుకుండదూ? ఆ బాధ్యత నాది. ముందుగా నువ్వు భోంచేసిరా. అలాగని తొందరపడి అర్ధాకలిగా లేవకు.

సుమిత్ర: ఏకంగా మానేస్తే మానెయ్యాలిగాని భోజనం దగ్గర కూర్చొన్న తరవాత మొగమాటం పసప మన్నది వట్టి చాదస్తం. మరెందు కాలస్యం ఇప్పుడే వస్తాను. నీకు పేపరుగాని, పుస్తకంగాని ఏమయినా కావాలా?

సుందరం: ఏమీ అక్కర్లేదు. నువ్వు వేగం తయారయివస్తే చాలును.

మరి ఈ మాటకి ఏమీ సమాధానం చెప్పకుండా సుందరం కుర్చీదగ్గరకి కాళ్ళుపెట్టుకోనే బల్లఒకటి లాగి, విశ్రాంతిగా కూర్చోఅని చెప్పి, అతనిమాట వినిపించుకోకుండానే కిందికి దిగి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్లిపోగానే అతను చేతివాచీ వంక చూసేడు, తొమ్మిదీ ఇరవై; అంటే తన వాచీ కావాలని పదిహేనునిమిషాలు ముందుగా ఉంచేడు. ఆమె భోంచేసి అలంకరించుకొని రావడం తన వాచీ ప్రకారం తొమ్మిదీ నలభైఅయిదయినా ఇంకా కావలసినంత వేళుంటుంది. లేకపోతే మాత్రం ఇప్పుడు సినీమా చూడ్డం అంత ప్రధానమయిన సంగతి కాదు కదా! కాని, ఏమో, సుమిత్ర ధోరణి మాత్రం వింతగా ఉంది; అసలు ప్రయాణానికే సుముఖంగా ఉన్నట్టులేదు. సరే ఆ విషయంలో తానేమీ బలవంతపెట్టలేదు. ఆమె ఇష్టప్రకారం

జరగవలసిందే. అన్నం తింటానంది గాని, నిజంగా తింటుందో తినదో; వెళ్లి చూస్తే, నామాటమీద నమ్మకం లేకపోయిందా అని కోపం రావచ్చును. ఏమీ మాట్లాడకుండా ఊరుకోడమే కర్తవ్యం.

ఆమె సిల్కుచీర, ఇతర అలంకరణమూ అతని కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. ఆమెను తెలిసిన రెండు సంవత్సరాలలోనూ ఎన్నడూ కనబడనంత కొత్తగా అందంగా కనిపించింది సుమిత్ర. పోనీ అక్కడితో ఊరుకోందా; "ఎలా ఉన్నాను సుందరం?" అంది. అతనికి వెంటనే ఏమీ సమాధానం స్ఫురించలేదు. కొంచెం సర్దుకొని, "ఏం చెప్పమన్నావు? నే నేమి చెప్పినా అత్యుక్తిగానే ధ్వనిస్తుంది. అయినా ఇంతకీ, ఈ అరగంటసేపూ నీ ఎదురుగా నిలబడి, మూగ భాషలో నీతో మాట్లాడిన నీ నిలువుటద్దం కంటె యథార్థం ఎవరు చెప్పగలరు?" అన్నాడు ఎటూ దొరకకుండా.

"మొత్తానికి నీమాట ఏమిటో నాకర్థం కాలేదు గాని, అసలు సినీమాకి వెళ్లడం ఉందంటారా లేదా?"

"నీ సౌందర్యాన్ని నే నొక్కణ్ణే చూచి తీరాలన్నంతటి స్వార్థపరుణ్ణి కానులే పద."

"అంటే ఏమిటి నీమాట కర్థం? నన్నొక ప్రదర్శనపు వస్తువుగా థియేటరులో కూర్చోమనా? ప్రదర్శనాలలోని వస్తువులనయినా, తగిన మూల్యం చెల్లించి ఏ ఒక్కరో స్వంతం చేసుకోవచ్చును. కాని, నీ ఉద్దేశం ప్రకారం, నేనుమాత్రం అమూల్యంగా అంటే లేశమయినా మూల్య మన్నది లేకుండా, పడిఉండా లన్నమాట. ఏమంటావు?"

"ఇందుకు సమాధానం నేను ఇప్పుడే చెప్పాలా? దార్లో జట్కాలో నిదానంగా చెప్పవచ్చునా?"

"ఏదైనా పనిచేసేవాడికి ఒకటే పద్ధతి గాని, తప్పించుకొనేవాడికి అనంతమయిన పద్ధతులు."

తరువాత వారు జట్కాలోనూ సినీమా హాల్లోనూ ఉన్నంతసేపూ ఆమె అదివర కెన్నడూ లేనంత ఉత్సాహంగా ఉల్లాసంగా కబుర్లు చెప్ప సాగింది. సుందరానికి కూడా సామీప్య ఫలితంగా తన నిరంతర నిరుత్సాహముద్ర సడలి నూతనోత్సాహం కలిగింది. ఆమె ఏమందో తా నేమని సమాధానాలు చెప్పేడో అన్ని మాటలూ స్పష్టంగా జ్ఞాపకం లేవు అక్కడక్కడ కొన్ని తప్ప.

"సుందరం! ఇలా మనమిద్దరం ప్రక్క ప్రక్కను కూర్చుంటే, ఈ ఊళ్ళోఅంతా తెలిసినవాళ్ళు గనక ఫలానా ఇనస్పెక్టరుగారి భార్య, సుందరం బాబుగారు అని తెలుసును, గాని, ఎవళ్లయినా కొత్తవాళ్లయితే ఏమనుకొంటారు? ఇంత చక్కటి చిన్న కుర్రవాడు ఇంత ముసలిపెళ్లాన్ని ఎందుకు చేసుకున్నాడు చెప్మా అని అనుకోరూ?"—అందుకు తాను వెంటనే ఏమీ సమాధానం చెప్పలేకపోయేడు. తరవాత కూడా ఏమి చెప్పేడో సరిగా జ్ఞాపకం లేదు. ఆమె ఈ రకంగా మాట్లాడుతుందని తాను స్వప్నేపి ఊహించలేకపోబట్టి వెంటనే ఏమీ సమాధానం చెప్పలేకపోయేడు. కాని, ఆమె చేసిన ఊహలో విశేషం పొరపాటు లేదు. తనూ ఆమె కలిసి ప్రయాణంచేస్తే, కలిసి ఒక ఇంట్లోనే ఉంటే, ఏమనుకొంటారు లోకులు? తప్పక భార్యాభర్తలనే అనుకొంటారు. అయితే ఆమె మాటలోని చివరి భాగం మాత్రం తమాషాకి అన్నదే. తనమట్టుకు తాను మొదట్లో ఆమె వయస్సు ఇరవై దాటిందంటే నమ్మలేకపోయేడు, ఎంతో విశ్వసనీయమయిన ఆధారాలు చూసేవరకు. ఇప్పుడయినా ఆమెకు మహా ఎక్కువ వేస్తే పాతికకంటె ఎవరూ ఎక్కువ అంచనా వెయ్యరు. నిజానికి కూడా ఆమె వయస్సు ఇరవైఆరే. అంటే తనకంటె బాగా ఆరేళ్ళు చిన్న. నిజంగా ఆదర్శదంపతుల నడుమ ఉండవలసినపాటి వ్యత్యాసమే ఉంది, తమ వయస్సుల నడుమను.

అంతసేపూ ఆమె సందిగ్ధస్థితిని విమర్శించిన సుందరానికి తీరా సినీమా హాల్లో కూర్చున్నప్పుడు కొద్ది గంటలలో తాను చెయ్యవలసిన ప్రయాణం సంగతి ఏమీ స్పష్టంగా ఊహించ బడకుండా అయిపోయింది. కాని సుమిత్ర వైఖరి చూస్తేమాత్రం, మరి ఇందాకటి అనుమానాలు ఏమీ ఉన్నట్టు లేవు. అందుకే ఇంత ఉల్లాసంగా మాట్లాడ గలుగుతోంది.

మాటలలో వెనుకబడినా చేతలలో మాత్రం వెనుకంజ వేయలేదు సుందరం. హాలునుండి బైటకు రాగానే, మామూలు ప్రయాణాలకు సంబంధించిన వ్యావహారికపు జగత్తులో పడ్డాడు. నౌఖరు రాముడుకి స్టేషనుకి వెళ్లి రెండు సెకండు క్లాసు టిక్కట్లు తీసుకొని ఉంచమని డబ్బిస్తూ ఉండగా సుమిత్ర వారించింది. ఎలాగూ స్టేషనుకి వెళ్తూ, "ఇంతలో

ముందుగా పెళ్లి టిక్కట్లు కొనమనడం ఎందుకు? వెళ్లిన తరవాతనే కొనుక్కోవచ్చును" అంది.

ఆమెను కాదని లాభంలేదని సుందరంఊరు కొని జట్కాలోకి ఎక్కిపోయేడు. రాముడు మామూలుగా నడిచేకంటె నెమ్మదిగా, తల గోక్కుంటూ నడవసాగాడు. జట్కాబండి గలగలలాడుతూ నడక సాగించింది.

సుందరం దారిలో అన్నాడు. "ఇప్పుడే మరొక బండీకూడా తీసుకొంటే,మనకొకటి, సామానుకొకటీ పనికి వస్తుంది. నీవి రెండు పెట్టెలకంటె ఎక్కువ ఉండవనుకొంటాను, పరుపు దుప్పట్లు మొదలయిన వేవీ నువ్వు పట్టుకో నక్కర్లేదు. అవన్నీ నేను ఏర్పాటు చేసేను. నీకు అతి అవసరంగా కావలసిన కొద్దిపాటి బట్టలు వస్తువులు పట్టుకొంటే చాలును. అటువంటివి కూడా నీకు ఉపయోగిస్తాయని నాకు తోచినవి కొన్ని కొన్నాను. మరేమయినా కావలసినా అక్కడకు వెళ్ళాక కొనుక్కో వచ్చును. ఏమంటావు?"

సుమిత్ర వెంటనే తన నిశ్చయాన్ని తెలియ జేయలేకపోయింది. అందుకు బదులుగా ఏదో ఒక ప్రశ్న వేసింది. "అయితే ఇప్పటి మన ప్రయాణపు ఉద్దేశం ఏమిటి?"

"అదంతా మళ్ళీచర్చించగలమా? నీకు ఇక్కడి జీవితం అంటే రోతగా ఉంది అందుచేత."

"ఈ రకంగా స్త్రీలందరూ జీవితం ఏమో మహా ఆనంద దాయకంగా లేదని సంసారాలను విడిచి పోయేమాటైతే, మరి సంఘం గతి ఏంగాను?"

"వ్యక్తులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకొనే సందర్భంలో సంఘం మొత్తం గురించి ఆలోచించకూడదని నువ్వే చెప్పినట్టు జ్ఞాపకం."

"అంటే నేను ఎప్పుడెప్పుడో అనాలోచితంగా అన్నమాటలు భగవద్గీతలోని శ్లోకాలలా జ్ఞాపకంగా ఉంచుకోవలసిన వన్నమాట?"

"విలువయిన మాటలు ఎప్పుడు ఎవరి ముఖతః విన్నా జ్ఞాపకం ఉంచుకోవలసిందే. అయినా జ్ఞాపకం ఉంచుకోవా లనుకొన్న మాటలన్నీ జ్ఞాపకం ఉండవు; కొన్ని కొన్ని మాటలు అప్రయత్నంగానే జ్ఞాపకం ఉండిపోతాయి. అందుకు సమయము, స్థలము సందర్భము- అన్నిటికంటె ముఖ్యంగా ఆ మాటలు అన్న వ్యక్తీ,ఇవన్నీ కారణ భూతులు కావచ్చును. సరే మరి ఈ పిష్టపేషణ మెందుకు? ఇక్కడనుండి నీకు వెళ్ళిపోవాలని ఉంది. అందులో నా దృష్టికి ఏమీ పెద్ద పొరపాటు గోచరించడం లేదు. ఈ సందర్భంలో నాచేత నయిన సహాయం చెయ్యడం నా విధి అనుకొంటున్నాను. అందుకు తోడు ఇందులో నా స్వార్థంకూడా ఒకింత ఇది వరకు అంగీకరించనిది మిళితమయి లేకపోలేదు."

"ఏమిటేమిటి?" అంది తన ఆత్మత నణచుకొందికి ప్రయత్నిస్తూ సుమిత్ర—

"నీకు తెలియనిదికాదు. నీకు పత్రికా నిర్వహణంలో ఎంత ఉత్సాహం ఉందో నాకూ సుమారు అంతే ఉంది. అయితే నా అంతట నేను అటువంటి వ్యవహారం సాగించలేనని పూర్తిగా తెలుసును. కాగా, నువ్వు సంపాదకత్వపు భారం వహిస్తానన్నావు; ఇక తక్కిన తాపత్రయం అంతా నేను పడగలను.మన స్వల్పశక్తికి అనుగుణంగా ఏకొంచమో, దేశసేవ అంటే నీకిష్టంలేదు, మానవసేవ చేసే ప్రయత్నం చేస్తాం. ఇంతంటె మరే కారణం కావాలి ప్రయాణానికి. ఇదంతా నీకు తెలియనిది కాదు ఊరికే మళ్ళీ మళ్ళీ నన్ను పరీక్ష చెయ్యడానికి ఇల్లా వాగిస్తూ ఉంటావు."

"అదేం కాదు సుందరం. కాని నాకు ఒక్కటే తమాషాగా కనిపిస్తుంది. నువ్వేమో పత్రికా స్థాపనకీ నిర్వహణకీ సర్వథా సమర్థుడవే, అయితే నీ స్థాపించబోయే పత్రికకి సంపాదకత్వం వహించడానికి ప్రతిభాశాలురు కారు చౌకగా దొరికే ఈ దేశంలో నేనే నీకు కనిపించడం చిత్రంగా లేదూ? నువ్వియ్యబోయే ఉద్యోగానికి నాకు గల అర్హత లేమిటి? ఏనాడు ఎప్పుడో కాలేజీలో చదువుకొనే కృతయుగపు రోజుల్లో అందరికీ అతి సామాన్యంగా కలిగి పాతబడిపోయిన అభిప్రాయాలను పూర్వపు నాటకాల ధోరణికి కాంగ్రెసు ఉపన్యాసాల ధోరణిని మిళితం చేసి సమాసాలు యతిప్రాసలు పేర్చుకొని రాసిననే కదూ. ఆమాత్రపు రచనలకే ప్రాముఖ్యం ఇచ్చి ఎవ్వరూ ఒక పత్రికా సంపాదకుణ్ణి నిర్ణయించుకో రనుకొంటాను. అంతకంటె నువ్వు—నేను తియ్యబోయే సినీమాలో నువ్వు నాయిక వేషం వెయ్యాలి.

అంటే కొంచెం నమ్మడానికి సావకాశం ఉండును. ఏమంటే బుద్ధి కుశలతకి ఉన్నపాటి స్పష్టమయిన శోధన సాధనాలు అందానికి లేవు గనక, ప్రతివ్యక్తికీ తన బుద్ధి కుశలత మీద కంటె అందం మీద ఎక్కువ మమకారం ఉండడానికి సావకాశం ఉందికదా!"

"బాగానే ఉంది. (నీ శక్తి సామర్థ్యముల విషయం నీకు తెలిసిన కంటె నాకు బాగానే తెలుసును. అంతగా నీకు తలకు మించిన పనిగా రూపిస్తే అప్పుడు మరొక విధంగా సర్దుకోవచ్చును. అంతే కాని ఇప్పుడే అనవసరపు అనుమానాలు పెట్టుకొంటే ఏం లాభం? మనం మాటల్లోపడి చూడనే లేదు, మీ యిల్లు వచ్చేసింది. నీసామాను పట్టుకొని, మాయింటికి వెళ్ళిపోతే, అక్కడ తక్కిన సామాను తీసుకొని స్టేషనుకి వెళ్ళిపోవాలి. అట్టే వ్యవధికూడా లేదు.— అని అతను జట్కా దిగేడు. వెంటనే ఆమె ఏమీ మాట్లాడకుండాదిగి కొత్తగా పరిచయమయినరోజుల్లో లాగ, రెండు చేతులూ జోడించి తలవంచి నమస్కరించి, "సెలవు" అంది.

అతనికేమీ అర్థం కాలేదు. తన గాభరా సర్దుకొని, ఏమో అనుకుదామనుకొంటూ ఉండగా, ఆమె అంది.

"సుందరం, నేను సకాలంలో ఒక నిశ్చయం చేసుకోలేకుండా నీకనవసరంగా శ్రమ కల్పించినందుకు, నీకు ఎంతగా కోపం వచ్చినా, చివరికి నన్ను క్షమించలేకపోవు. మరి మన ప్రయాణం జరిగేసంగతి కాదు. నువ్వు వెళ్ళి నన్ను గురించి తిట్టుకోవలసినంతగా తిట్టుకొన్న మీదట హాయిగా నిర్విచారంగా నిద్రపో, నీ స్నేహ ధర్మానికి ఎటువంటి లోటూ లేదు. ఆ విషయంలో నువ్వు విచారించవలసినదేమీ లేదు. ఒకటే నా విచారం, ముందుగా అక్షమం సాయం కాలండాబామీదనయినా నేను ఈ మాత్రం స్పష్టంగా నీతో చెప్పలేకపోడం. మరి సెలవు"...అని ఏమాత్రమూ తడబాటు లేకుండా మెట్లెక్కి తాళంతీసి తలుపు తెరుచుకొని, లోపల ప్రవేశించి గడియవేసుకొనే ముందు "మరి నువ్వు వెళ్ళు, ఎందుకుమంచులో నిలబడడం, సెలవు" అంది, ఆమె గడియ వేసిన చప్పుడూ, లోపలిపద ధ్వనీకూడా వినిపించకుండా పోయిన తర్వాతగాని, అతనికి తనను గూర్చిన ఆలోచన కలగలేదు. నాటకం చూస్తూ, తనఎదుట ఎటువంటి రసవత్తరమయిన సంఘటనలు జరిగిపోతున్నా, తాను మూగగా కూర్చోడమేగాని, ఏ విధమయిన చలనమూ కనపరచలేని ప్రేక్షకుడిలా అయిపోయేడు తాను ఆమె ఎదురుగ ఉన్నంతసేపూ. ఎక్కడో ఎప్పుడో జరిగిన సంఘటనగానే తప్ప, ఇప్పుడే ఇక్కడే తనకి సంబంధించిన సంఘటన ఈ విధంగా సమాప్తమవుతున్నదనే స్ఫురణ లేకుండా పోయింది. మాట్లాడకుండా జట్కా ఎక్కి కూర్చున్నాడు; జట్కావాడికే కాదు, గుర్రానికికూడా అర్థమయినట్టే వుంది తన పరిస్థితి. నెమ్మదిగా నడిచి తన మేడ వద్ద ఆగింది. పరధ్యానంగా జేబులో డబ్బులు తీసి ఇచ్చి వెళ్ళి మంచంమీద పడుకొన్నాడు. ప్రయాణం నిశ్చయమయిన కారణాన కాబోలు, రాముడు పక్క సరిగా దులిపి పరవలేదు. అయినా ఇప్పుడు సర్దుబాటు చేసుకోడం అంత సులభంగా సాధ్యమయేదా? ఈ రాత్రికి ఎలాగో గడిపెయ్యాలి. మధ్యాహ్నం అంతా శ్రమించి తాను కొని చక్కగా సర్దుబాటుగా కట్టిన ప్రయాణపు సామాన్లు తనను హేళన చేస్తున్నట్టు కనిపించడంతో, కిటికీ వంక తిరిగి పెరటి తోటలోని పువ్వుల మొక్కలమీది గాలిని అనుభవించడంలో తనను తాను మరచిపోవా లనుకొన్నాడు. ఎంతోసేపు మేలుకొని ఉన్నట్టనిపించింది కాని, ఒక అరగంటలో నే నిద్రపట్టిపోయింది.

నిద్రలో తాను రైలులో ప్రయాణం చేస్తున్నట్టు, తనతో కూడా ఎవరో ఉన్నారు గాని, ఆ ఎవరో సరిగా తనకే తెలియనట్టు, అంతలోనే రైలుబండికి నిప్పంటుకొన్నట్లు, ఏమిదారి ఏమిదారి అని అందరితోపాటు తాను హడావుడిపడినట్లు, వెనుక ఎప్పుడో గోదావరిమీద పడవలో వెళ్ళినట్లు, తానూ సుబ్బారావు వెళ్తున్నట్లు, ఎవరో నీటిలో మునిగి పోతున్నారని సుబ్బారావు కేకలు వేస్తున్నట్లు, తాను నీటిలో దూకితే ఎంత చలిగా ఉంటుందో అని ఒక్క క్షణం తటపటాయించి దూకినట్లు, తరవాత ఎవరో ఆడమనిషి కనబడకుండా తనని పిలుస్తున్నట్టు, ఎటు చూసినా ఎవ్వరూ కనబడనట్టు, అయినా స్పష్టంగా ఎవరో తననే పేరు పెట్టిపిలుస్తున్నట్లు...ఎన్నెన్నో చిత్ర చిత్రమయిన కలలు వచ్చేయి.

కలలెన్ని వచ్చినా, మధ్యలో మాత్రం పూర్తిగా మెలకువ రాలేదు. ఉదయం కూడా మామూలుకంటె

బాగా ఆలస్యంగానే మెళకువ వచ్చింది. తరవాత నయినా అతనిచర్య చూస్తూ నిద్రలో నడిచే మనిషి చర్యలాగే ఉంది. రేడియో ఎంత పెద్ద ధ్వనితో మ్రోగుతున్నదీ అంత దగ్గరలో కూర్చున్నా అతనికి సరిగా తెలియలేదు. చూస్తున్న పత్రికలోని పెద్ద శీర్షికలలో ఉన్న వార్తలను ఒక మాటు చదివినవి మళ్ళీ పేజీ తిరగవేసే సరికల్లా మరిచి పోతున్నాడు. రాముడూ సుబ్బయ్యా చెప్పిన మాటలకు ఉచిత మయిన సమాధానాలే చెప్పినప్పటికీ, ఆ తరవాత వాళ్ళేమడిగినదీ తానేమిచెప్పినదీ గుర్తులేదు. ఉదయం పదిగంటలవుతూ ఉండగా రాముణ్ణి పిలిచి "ఒరేయి, రాత్రి సరిగా నిద్రలేదు. బద్ధకంగాను, తలదిమ్ముగాను ఉంది. బాగా తల అంటగల మంచి మంగలి వాణ్ణి తీసుకొనిరా," అన్నాడు. అభ్యంగనమూ, భోజనమూ అయిన వెంటనే అట్టే ప్రయత్నం అక్కర లేకుండానే ఆశించిన కంటె గాఢంగానే నిద్ర పట్టింది.

మధ్యాహ్నం మూడు గంటలకు లేచి, మొగం కడుక్కొని సుబ్బయ్య తెచ్చిన కాఫీ తాగుతూ ఉండగా, రాముడు తెచ్చి ఇచ్చేడు మధ్యాహ్నం తాను నిద్రపోతూ ఉండగా వచ్చిందని ఒక కవ రుత్తరం.

మొదట పరధ్యానంగా టేబిల్ మీద పడెయ్య మన్నాడు; కాని, అంతలోనే మళ్ళీ బుద్ధి పుట్టి సుబ్బయ్యను అందుకోమన్నాడు. సందేహ మేమీ లేదు, ఇంత చక్కని దస్తూరీ సుమిత్రకు తప్ప తనకు తెలిసినవాళ్ళలో మరెవరికీ లేదు. అయితే ఏమో తర వాతగాని ఉద్దేశం మార్చుకొందేమో, అయినా ఇక్కడికెక్కడికి ఉత్తరం రాస్తుందా, ఎన్నడూ అటు వంటి అలవాటులేదే. కాఫీ తాగడం తొందరగా ముగించి, సుబ్బయ్యను పంపించి చదవడం మొదలు పెట్టేడు, మొదటిమారు ఎంత శాంతంగా చదివినా ఏమో చదివినట్టనిపించలేదు. ఇప్పుడు తాను ఎంత తొందరపడినా ఏమీ ఫలితం లేదు కదా అని సర్దు కొని మళ్ళీ నిదానంగా చదవడం ప్రారంభించేడు "సుందరం!.

ఈ ఉత్తరం అందేసరికి నేను నీకు చాలా దూరంగా ఉంటాను. ఎట్టఎదురుగా ఉన్నప్పుడు నీతో ఎంతో స్పష్టంగా మాట్లాడాలనే ఉంటుంది. కాని, తీరామాట నోటి చివరికి వచ్చేసరికి, ఏదో తమాషాగా మనకు అట్టే సంబంధంలేని సంగతులు మాట్లాడడమే జరుగుతుంది. ఇందు మూలంగానయినా నీతో నిర్మొగమాటంగా మాట్లాడుదామని ప్రయ త్నిస్తున్నాను. రైలుకింకా అరగంటపైగా టైముంది. బైట గ్రుడ్డి దివ్వెల. ఇక్కడ దీపపు వెలుగుకి కూడా నేను అంత దగ్గరగా లేను. అందుకు తోడు మసక మసకను అటూ ఇటూ నడిచే మనుష్యుల నీడలు. అయినా నా అక్షరాలు (నువ్వు ఎంతో కుదురుగా ఉంటాయని మెచ్చుకొనే టటువంటివి.) చదవటా నంత గజిబిజిగా ఉండవని నమ్ముతున్నాను.

నిన్ను అంత కటువుగా వెళ్ళి పొమ్మన్నాను, నామటుకు నాకే కష్టంగా తోచింది. నేను చేసిన పాపానికి; అయితే ఇందులో పెద్ద దురుద్దేశం లేక పోదాన్ని నువ్వు గుర్తించగలవు.

ఇందాకా సాయంకాలం నీతో డాబా మీద మాట్లాడుతున్నప్పుడు నిజంగానే నాకు ఒక నిశ్చయం అంటూ లేదు. తరవాత ఎప్పుడు కలిగిందో కూడా స్పష్టంగా తెలియదు. కాని, మొత్తానికి నిన్ను ఉంచేసి నేను ఒక్కతెనే వెళ్ళిపోవాలన్న నిశ్చ యానికివచ్చేను. సినిమా చూస్తూ ఉండగానే ఎప్పుడో కలిగి ఉండాలి ఈ అభిప్రాయం. అంత వరకూ నే నసలు బయలుదేరుతానా లేదా అనే అనుమానంగాని బయలుదేరేమా టైతే మనమిద్దరమూ కలిసే అని నీలాగే అనుకొన్నాను. సరే దాని మాటకేమి, ప్రస్తుతం నా ప్రయాణానికి కారణాలు నాకు తెలిసినంతగా నీకు తెలుసును. అయితే మొదట అనుకొన్న దానికి విరు ద్ధంగా నిన్ను విడిచిపెట్టి. నేను ఒక్కతెనే వెళ్ళిపో డానికి కారణం తెలియజేయడం నా విధి కదా!

నన్ను తెలియక పూర్వం నుండి నువ్వూ సుబ్బారావు స్నేహితులు, నా మూలంగా మీ యిద్దరి స్నేహం భంగం కాకూడదన్న ఉద్దేశం ఒకటి; పోనీ మీ స్నేహ[illegible]నా, అంతకంటె మనమిద్దరమూ సన్నిహితులము కాగలిగే సావకాశం ఉన్నా మన ప్రయాణానికి నాకు అభ్యంతరం లేక పోయివుండును. నీకు కేవలం నాకు సహాయంచేసే ఉద్దేశం తప్ప, నా వల్ల పొందగలిగే ప్రతిఫలం అంటూ ఏమీ లేదని స్పష్టంగా చివరివరకూ తెలుస్తూనే ఉంది. అయితే నా అంతట నేను ప్రోద్బలంచేసి నీకు నేను కావాలి

అనిపించుకోడం ఏమంత కష్టమయినపని కాదని నాకు తెలుసును. అయితే ఆవిధంగా నిన్ను నీకు తెలియకుండా దిగలాగడానికి తగినంతగా నేను దిగజారలేక పోయేను.

ఎంతో వేగం రాస్తున్నట్టనిపిస్తున్నా, రాసిన కాగితాలనుబట్టి మాత్రం తాపీగానే రాసి ఉండాలి. రైలు రావడానికి ఇక పదినిమిషాలు మాత్రమే వ్యవధి ఉంది.

నిజంగా నీతో కలిసి బయలుదేరితే, నాకు, నా గురించి ఏమీ ఆలోచించవలసిన అవసరం లేకుండా ఉండును. ఇంతవరకూ నా గురించిన సర్వబాధ్యతలూ భర్త అనే హోదాలో సుబ్బారావు భరిస్తున్నట్టే, అప్పుడు నువ్వు వేరొక హోదాతో భరించి ఉండేవాడివి. అయితే ప్రతిఫలం ఏమాత్రం పొందకుండా నువ్వు నా గురించి పరిశ్రమించడం నాకిష్టం లేదు.

ఇప్పుడు నా భవిష్యత్తు ఎంత అవకతవకగా ఉండాలో అంత అవకతవకగానూ ఉంది. అయితే నన్ను నా శక్తిని పరీక్ష చేసుకొందికి ఇంతకంటె మహత్తరమయిన సావకాశం మరొకటి ఉండదు. నేను వెళ్ళి ఏదో ఉద్యోగం చెయ్యడానికి ప్రయత్నిస్తాను. అయితే నా వంటి ఆదర్శవాదిని అయిన వ్యక్తి, ఎందులోనూ అట్టే కాలం ఉండలేదులే. అంతే కాదు, అసలు ఉద్యోగమే దొరకక పోవడానికూడా వీలు లేకపోలేదు. ఏమీ దొరకక, ఎందుకూ శక్తి చాలదని రుజువయిపోయి, తక్కిన ప్రపంచానికి అక్కర లేక పోయినా, నీ సహాయం మాత్రం తప్పకుండా దొరుకుతుందన్న నమ్మకం మాత్రం బలంగానే ఉంది.

ముందుగా తిన్నగా మాస్నేహితురాలు సుభద్ర పోస్టల్ డిపార్టుమెంటులో పనిచేస్తున్నది; ఆమె యింట్లో బసచేసి, నా ప్రయత్నాలు సాగిస్తాను. తరవాత సందర్భాన్ని బట్టి ఉత్తరాలు రాస్తాను అవసరంగా ఉంటే.

నీ వేదాంత ప్రియత్వం ఎంత గాఢమయినదో నేను సరిగా ఊహించలేను. అయినా నా దృష్టికి, అన్నీ సమృద్ధిగా ఉన్న నీవంటి వాడు హాయిగా పెళ్ళి చేసుకొని, పిల్లలూ పాపలూ కలిగి ఉండడం ఎంతో ముచ్చటగా ఉంటుంది.

నీవంటి హృదయం ఇచ్చే మిత్రులు దొరకడం నిజంగా అదృష్టమే. మన మైత్రి లోకుల నోళ్ళలో మరొక విధంగా అపవిత్రం కాకుండా, ఈ రకమయిన పరిణామానికి దారితియ్యడం ఒక విధంగా బాగానే ఉంది. ఇందుమూలంగా మనం నష్టం కంటె లాభాన్నే ఎక్కువగా పొందగలము.

ఎంతో స్పష్టంగా ఎటువంటి డొంకతిరుగుడూ లేకుండా మాట్లాడాలనుకొని కూడా ఏమేమో చాదస్తంగా ఇంత గ్రంథం రాసేను. అసలు స్పష్టంగా మాట్లాడుకోడం, రాయగలగడం కూడా ఒక కళే, అది అందరికీ సులభంగా పట్టుబడేది మాత్రం కాదు.

సుబ్బారావుకి ఉత్తరం రాయడానికి ఇప్పుడు వ్యవధి లేదు. రైల్లో కూర్చొని రాస్తాను: మన ఉభయులం కలిసి ప్రయాణం చేయదలచుకొన్న అంశం గురించి రాయడం అనవసరమనుకొంటున్నాను.

ఇంత నిశ్చయంగా ఉత్తరం రాస్తున్నానా, అయినా ప్రయాణం తప్పిపోయినందుకు చికాకు వేసి, నువ్వు ఎక్కడైనా వెళ్ళాలని బయలుదేరి రాకూడదా, మనం ఇద్దరం కలిసి, వేరే వేరే లక్ష్యాలతోనే కాని, ప్రయాణంచేసే సావకాశం ఏర్పడకూడదా అని లోపల్లోపల ఆశ వదలక పోవడంలేదు. తొందరగా గాభరాగా రాసిన ఈ ఉత్తరంలో ఎన్నెన్ని పదగత వాక్యగత, అన్వయగత, దోషాలున్నా నీకు నామనసులోని అభిప్రాయం మాత్రం స్పష్టంగానే అర్థం అవుతుందని నాకు తెలుసును, మళ్ళీ నిదానంగా రాస్తాను

సుమిత్ర—"

తరువాత తరువాత నీరసుడు నిరుత్సాహి అయిన సుబ్బారావును చూసినప్పుడల్లా సుందరానికి తమ యిద్దరిలో ఎవరి గురించి ఎక్కువ జాలి పడవలసి ఉందా అని అనుమానం కలుగుతుంది. దాంపత్యపు పరీక్షలో తప్పిపోయినవాడు సుబ్బారావు; పరీక్షకు కూర్చుందికే శక్తి సామర్థ్యాలు చాలక వెనక్కి తగ్గిపోయినవాడు తాను. అయినా తనతో సహా లోకుల అందరి సానుభూతి సుబ్బారావుకే. సుబ్బారావు గురించి తాను జాలిపడగలడు గానీ, అంతమాత్రంలో సుమిత్రను ద్వేషించి తీరాలని నిర్బంధం ఏమిటో! అయితే తాను ఆమెను సమర్థించడానికి ఏమి మాట్లాడినా తాను ఆశించిన దానికి విరుద్ధమయిన ఫలితం మాత్రమే కలుగుతుంది. ఆ మాత్రం ప్రాపంచికజ్ఞానం తనకు లేకపోలేదు.

ఆహారములో పిండి పదార్థం యెలాంటిదో మనిషి అనుభూతుల్లో నమ్మిక అలాంటిది.

రేపు పదిగంటలకు మంచి ముహూర్తం. అన్ని విధాలా దివ్యమైన ముహూర్తమని శాస్త్రుల్లుగారు నొక్కి చెప్పారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా పెళ్లి విశాపట్నంలో వ్రాలి తీరాలని వెంకట్రావ్ భీష్మించుకున్నాడు.

ఈ రాత్రి యెంత ప్రయత్నించినా నిద్ర రావటంలేదు. ఆశేష్యమైగా ఆ మంచంమీదే తన గతించిన భార్యతో నిద్రపోయాడు. తన ఆనందం, సౌఖ్యం శాంతికోసం నమ్రతతో ఆమె తలవంచి రాత్రనక పగలనక కష్టపడి సర్వస్వాన్ని అర్పించుకుంది. కొడుకు వుయ్యాల్లలో గోలపెట్టిన రోజుల్లో ఆగతిలో తన ఆసహనం యెదుట ఆమె యెంతో సహనాన్ని ప్రదర్శించింది. నిండు హృదయంతో, నిండు ముఖంతో కొడుకు యేకుర్శే మురిసిపోయే ఆ మాతృశ్రీ జోలపాట నిజానికి వెంకట్రావ్ చెవుల్లో గింగురుమనిపించి తన కళ్లలో నీరు కార్పించ వలసింది. కానీ వెంకట్రావ్‌లో యీ విముహాల్లో ఆ అనుభూతుల్లేవు. విసిగి పెళ్లానికి విడాకులిచ్చి యింకో యువతి గాఢా లింగనంలో మునిగిపోయిన వాని మళ్ళీ మురిసిపోతున్నాడు. ఆ మంచంమీద కొద్దిరోజుల్లో తన ఆరాధ్య దేవత మనోహరంగా వ్రాలిపోతుంది—కాదు! ఆయన మనోవీధిలో ఆమె వ్రాలిపోయివుంది. ఒక తియ్యని వూహకు మధ్యగా ఒక గాఢమైన నిట్టూర్పు విడిచినట్లు భ్రమపడి యిటూ అటూ చూసి లేచాడు. చల్లని గాలి, ప్రశాంత వాతావరణం, తన మేడవెన్నెలలో వెలిగిపోతోంది. పలుకులేని రాచిలుకను ప్రేమతో పద్మిని పూలచెట్లలో వెన్నంటుతున్నాడు. తళుక్కుమని మెరుస్తున్న తన వలపు తలపులకు తెరలా ఒక విషయం అడ్డువచ్చింది. తలెత్తి చూశాడు. మబ్బు కప్పిన చందమామ కనిపించాడు.

వెంకట్రావు నాలుగేళ్లక్రితం విశాఖపట్నంలో చూసిన వెంకమ్మ ఆవిడ విధవకూతురు సరోజ యింకా అక్కడే వుంటారా? లేకపోతే ఒకప్పుడు సరోజ చదువుకుంటోంది గదా! ఆమె ఒళ్లు పొందిక అందచందాలతో యెవరినైనా ఆకర్షించ గలుగుతుంది. అలాంటప్పుడు యెవడైనా ముందుకు రాడా? ఈ తలపే తన నిస్పృహకు కారణమైంది.

కల్ల నిజంగా తీసుకొని మురిసిపోయే టప్పుడు అడ్డుగా వచ్చే వూహల్ని ఛేధించటానికి అన్ని తెలివి తేటల్ని వుపయోగించటం మానవునికి పరిపాటి. జీవితం అంతా ఆనందాన్ని, సౌఖ్యాన్ని కాంక్షించటం మానవుని లక్షణం. ఈ ఆనందాన్ని, సౌఖ్యాన్ని తన కష్టాలవలనే పొంది ఫలింపజేసుకున్నాడనేది యెవరూ గుర్తించటానికి సాహసించరు.

వెంకట్రావ్ మరికొన్ని వూహలని కత్తిదూసినట్లుగా మనసులోనికి చొప్పించాడు. మళ్లీ మొదటి వూహల్లో నిండుకున్న మనసుతో తలెత్తేసరికి మబ్బు మెల్లగా జారిపోయి చందమామ చల్లని హాసాన్ని వెదజల్లింపజేసింది. మళ్లీ తన కోరికకు చలనం లేనట్లుగా వూకొట్టూ నిల్చున్నాడు.

ఒక సుందరమైన ప్రకృతి దృశ్యాన్ని, ఒక అందకత్తె చూపు నీ మనసులోనించి వేగంగా తుడిచి పెట్టడం యౌవ్వనంలో జరిగేపని కాదు. కరుడుకట్టిన శాస్త్రాల నమ్మిక నల్లమందులా పనిచెయ్యొచ్చు. కాని ఒంట్లో వున్న ఆ జబ్బుమాత్రం మట్టుకోలేవు.

నాలుగేళ్ళక్రితం తలవని తలంపుగా ఒక స్నేహితునితో వెంకమ్మ యింటికి వెళ్ళేటప్పుడు ఆమె గోత్రాలనుంచీ సుంటకాయలవరకూ మాట్లాడినా తను ఆ గదిలో ఒకమూల వుబికివచ్చే పదహారేళ్ళ యౌవ్వనంతో తొణికిసలాడుతున్న సరోజవేపు చూస్తూనేఉన్నాడు. ఆమె ముఖకళ, శరీరపుపొందిక, నడత పరిశీలించే అవకాశం తనకుకలిగినందుకు యెంతో గర్వపడి ఆమెయొక్క సౌందర్యరేఖ చూచి, పాపిష్టి సంఘంలో ఆమె వుండరాని గంధర్వాంగన అనుకున్నాడు. అప్పుడే తను బ్రహ్మచారియై యుంటే...కాదు...తన చెప్పు చేతలలో లేని అందం లేని భార్య కాస్త—ఈ రెండోది వూహామాత్రంగానే వుండిపోయింది. ఎంచేతంటే సాంఘికవిద్య—మనిషి గొడ్డుకాదు, మనసూ మేధస్సూ వుపయోగించుకొని, మంచిచెడ్డల తీర్పుకు అంతరాత్మ వున్నవాడని తెలియజేస్తుంటుంది.

వెంకమ్మ తను కోరి ఛేదించుకుంటున్న ఆలోచనలకు అతుకుతూ జీవంపోసినట్లుగా సరోజ ప్రసక్తి తెచ్చి అన్నది: "చూడు నాయనా! నేను కళ్ళు మూస్తే దాని గతేంగాను. అందుకే చదివిస్తున్నాను!

ఏం ఆస్తిపాస్తులున్నాయని నాయనా బతుకుతుందన డానికి! ఎవరు అక్కరచేస్తారు దానికి. ఏదో...!

వెంకట్రావ్ శరీరంఅంతా పెళ్ళి అని ప్రతి ధ్వనించింది. ఆ ఒక్క నిముషం తన అంతరాత్మ లేదులేదు అని ఘోషించి మరీ తన ఆలోచనలకు దారంవిడిచిపెట్టిన గాలి పడగలా వదిలేశాడు. సిగ్గు, లజ్జ, బిడియం, వదలి హాసవదనంతో సరోజ వేపు వుత్సాహంగా చూశాడు. సరోజ రావదు! రావదు?...?

నా భార్య!... పైకొచ్చే పెద్ద నిట్టూర్పు లోనికి అణచుకోవటంతో గాలి పడగదారం తెగి పోయింది. వాలిపోతున్న గాలిపడగలా ముఖమే కాదు శరీరంఅంతా వంచేశాడు.—

వెంకట్రావ్, నాలుగేళ్ళ తరవాత యీ రాత్రి మగత నిద్దరకమ్ముతుంటే ఆవులింతలుతీసి "నాలుగేళ్ళక్రితమే నా భార్య చచ్చిపోయివుంటే" అనుకున్నాడు.

౨

వేకువఝామునే తెలివివచ్చింది. నవ్వుతూ లేచి లైటువేసి వాలుకుర్చీమీద కూర్చొని సిగరెట్ వెలిగించాడు. ఎదురుగా భార్య ఫోటో నవ్వుతూ కనిపించింది. తన మనసులో ఒక వూహ తన ఆజ్ఞ లేకుండా గొర్తుకురావటంవలన ముఖంకోరి ప్రక్కకు త్రిప్పివేశాడు. బహుశః చనిపోయిన భార్య ఆత్మ ఆ ప్రశ్న వేసివుంటుంది. తెగిన గాయానికి వెంటనే సున్నం తగిలించినా రక్తం చిమ్మకమానదు. లేచి పోయి వరండాలోనికి వచ్చేసి యిటూఅటూ వడిగా పచారుచేశాడు. ఆ గదిలోనికి వెళ్ళటానికి ప్రయత్నిస్తే ఆ గదంతా ఆ ప్రశ్నతోనే ప్రతి ధ్వనిస్తోంది. మళ్ళ తలగోక్కొని గదిలో కాలుపెట్టి సిగరెట్టుపెట్టె అగ్గిపెట్టె తీసుకొని సిగరెట్ మీద సిగరెట్ ముట్టిస్తున్నాడు. సిగరెట్ పెట్టె, అయిపోయింది. కానీ ఆ ప్రశ్న ప్రతి కణంలోనికి ప్రాకి పోయి ప్రతి ధ్వనిస్తోంది. ఆవేశంతోపాటు బాధ ముల్లులతో పొడిచివేస్తోంది.

వెంకట్రావ్ తూరుపు తెలతెలవారటంతో సాహసించి గదిలోనికి వెళ్లాడు. భార్య ఫోటో యీసారి మరీ గట్టిగా పరిహసించి ప్రశ్న వేసింది... "నాలుగేళ్ళక్రితం మీరే చచ్చిపోయివుంటే..."

గదిఅంతా శూన్యం—శూన్యంలో యేమువు. ఆనిముషములో చచ్చిపోయిన తను చూస్తున్నాడు! సరోజలా తనభార్య చదువుకుంటోంది...ఎవడో యువకుడు చూస్తున్నాడు. లేదులేదు చదవటానికి వీల్లేదు—నా పేరు నిలబెట్టడానికి పురాణాలు, వేదాంతం చదువుతోంది... వెంకట్రావ్ మళ్ళ కళ్ళువిప్పాడు. ప్రపంచం వెలుగుతోంది. వెలుగున్నప్పుడే అన్నీ చక్కబెట్టుకోవాలి. వెలుగుండేటప్పుడు కళ్ళు గట్టిగా మూసుకొని చీకటి చేసుకోటం వెఱ్ఱితనం! కనిపించే సత్యాన్ని సౌఖ్యాన్ని విడనాడి కనుపించని సుఖాలకోసం, సత్యంకోసం వెతుక్కోవటం మానవుని మనుగడకే ప్రమాదం. జీవితంలో ఆదర్శాలకీ, ధర్మపన్నాలకీ, త్యాగానికీ ఒక హద్దు అంటూ వుండాలి. తనజీవితంలో వీటిని ఒక హద్దు పెట్టుకొనే యిప్పటివరకూ ఆచరించాడు. చచ్చిపోయిన మనుషులకు ద్రోహంతలపెట్టామనుకోవటం మన వెఱ్ఱితనాన్ని సూచిస్తుంది సంఘంలో నిషేధింపబడటంవల్ల, గొప్ప అందమైన పూలచెట్టు ఎండిపోయింది. అది చిగిర్చి పుష్పించి, ఫలభరితంచేసి మనోహరమైనదిగా ప్రపంచానికి అందిస్తున్నాడు తను. ఈ మహా కార్యానికి, యీ పుణ్యానికి దేవు డడ్డువచ్చినా ఆగేదిలేదు — ఆగేవాడుకాదు. ఆ ధైర్యంతోనే తను వేడదిగిపోయాడు.

కావలసిన సరంజామాతో స్టేషనుకు బయలు దేరాలని యింటికి తాళంవేస్తుండగా తపాలా బంట్రోతు యెదురై వుత్తరం అందించాడు. జట్కా యెక్కముందు కవరుచింపి 'పోనీవోయ్' అన్నాడు. జట్కా కదులుతోంది. ఉత్తరం చదవటం పూర్తి చేసి కోటుజేబులో చిరాకుగా కుక్కాడు. మళ్లీ ఆ వుత్తరాన్ని చించేయాలని తీశాడు. అది చేతులో నలిపిన వుత్తరాన్ని మళ్లీ పారవేయలేకపోయాడు.

జట్కావాడు చక్రానికి కొంచెం తగిలించిన కొరడాకర్రవలనవుత్పన్నమైనశబ్దంతో విసుక్కొని ఆగవోయ్ అని అరచాడు. జట్కావాడు జట్కా ఆపుతూ వెనక్కు చూసేసరికి వెంకట్రావ్ అప్పుడే జట్కాదిగి పోయి యెదరగా వున్న కాఫీహోటల్లోకి వెళ్లాడు.

కొంత సేపటికి రుమాలుతో ముఖంమీద

చెమట ఒత్తుకుంటూ వచ్చి జట్కా మీద కూర్చున్నాడు. జట్కా వడిగా పోతోంది!

కాఫీ కడుపులో పడటంతో తనొక నిర్ధారణకు రాగలిగాడు. ఎప్పుడైతే తను సరోజను పెళ్లి చేసుకోడానికి నిశ్చయించాడో, యిక తన కొడుకు ఒక్కడే తన ఆస్తికి వారసుడు కాడు తన ఆస్తి పాస్తులకు వారసు లింకా పుట్టవలసివుంది. కొడుకు బాగోగులు చూసి శ్రమపడి చివరకు సుఖపెట్టేవారు తన మామగారు. ఆయన భార్యనూ. ఆయనలో సహజంగా వుండే మమకారం కొడుకుయందు వెల్లువలా ప్రవహించలేక పోవటమే యీ నిశ్చయానికి కారణం.

మమకారం లేని మనిషిగా తను వర్తిల్లడానికి కారణం తన భార్య అని నిందించటానికి కూడ సాహసిస్తాడు. పిల్లలను అతీతమైన ముద్దుతో పెంచటం, చివరకు వద్దమ్మలను చెయ్యటానికేనని ఆయన వూహ. భార్య యందుండే యీ యీర్ష్య యొక్క ఫలితం కొంత కొడుకు వరకూ యెగ్రాకింది. ఇంతే జ్ఞానాన్ని విప్పి ఆలోచించుకోడానికి యింకో స్త్రీయందుండే మోహం అడ్డుగా బలంగా వుంది. తనలో నున్న మమకారం అంతా సరోజ దోచుకుంది.

వెంకట్రావ్ కొడుకు జ్ఞానం లేని చిన్న వయస్సు కాబట్టి తను జ్వరంతో బాధపడుతున్న యీ సమయంలో యింకేమీ ఆలోచించలేక "అమ్మా నాన్న" అని పలవరిస్తున్నాడు. ఆ అమ్మ అన్న పలవరింపును ఆకలివల్ల తల్లికోసం పరితపించే గొర్రెపిల్లలా వుంటటంచేత, ముసలి ఆలుమగలు దుఃఖంతో మునిగిపోతున్నారు. ఇక ఆ కుర్రవాడు ఆప్యాయతతో పలవరించే మనిషి యీ ప్రపంచంలో ఒక్కడే—ఆయన యీ విచారకరమైన వార్తని తెలియపర్చే వుత్తరాన్ని నలిపి సిగరెట్ పొగ వదులుతూ జట్కా మీద రాజమండ్రి స్టేషను చేరుకుంటున్నాడు.

స్టేషను చేరాక రెండుసార్లు బుకింగ్ కౌంటరు దరి దాపులకు వెళ్లి తిరిగి వచ్చాడు. బహుశః తనలో కాఫీ చొప్పించిన ధైర్యం వుత్సాహం దిగజారే సమయమేమో. ఐనా తను పెళ్లి చేసేదేముంది? డాక్టరు మందిస్తున్నాడు. సేవ చెయ్యటానికి యెందరు లేరు. అంత సీరియస్ గా వుంటే టెలిగ్రామే యిచ్చి వుందురు. సరోజను కలుసుకోటానికి యింతకంటే మంచిసమయం ముహూర్తం దొరకటం దుర్లభం. తను విజయవాడ వెళ్తే కుర్రవాడి వంట్లో నయం అయ్యేవరకు వుండాలి. ఈలోగా అక్కడ యేమైనా సంబంధాలు వస్తే కావలసిన వారని మామగారు బలవంతం చేస్తే తను సరోజని విడిచి పెట్టవలసి వస్తుంది. తను అందర్ని యెదిరించే బలులు లుండగా సరోజని కలుసుకొని అన్ని స్థిరం చేసుకొని తరవాత విజయవాడ వెళ్లవచ్చునని నిర్ధారించుకోవటం, గంట మ్రోగటం కూడా జరిగింది. టిక్కెట్టు తీసుకొని ప్లాటుఫారంమీదకు వెళ్లాడు.

3

తాళం పడ్డయింటిని చూడగానే యింత వుత్సాహం వురిపెట్టుకుంది. ఆ నిముషంలోనే, ప్రక్కయింటి గుమ్మందగ్గర నిల్చున్న తన ఆరాధ్య దేవత అగుపించటంతో మళ్లీ బ్రతికాడు. చావుకు బ్రతుకులకు మధ్య యెంత ఆరాటం?

సరోజ వెంకట్రావ్ ని పోల్చింది. ఆమె వేషధారణలో వచ్చిన మార్పు మనసులో పెట్టుకోలేదు గాని యీసారి ఆమె కన్నుల్లో కలువ పువ్వులా వికసించిందని యెంతో తన్మయుడై పోయాడు. అందమైన ప్రతి వస్తువు నాగరికతా చిహ్నమే. ఈ నాగరికతా చిహ్నం తనదని ఆ చిహ్నాన్ని తన చెప్పు చేతలలో వుంచి ఆరాధించి అనుభవించే సదవకాశం కొన్ని రోజుల్లోనే వుందని మురిసిపోతూనే యింటిలో కాలు పెట్టాడు. ఆ తలతోనే యెందరు చెప్పినా వినకుండా, యీనాడు తలకు వాసననూనె రాసుకొని వుంగరాల జుత్తును అట్టె పెట్టాడు.

సరోజ అంగటి గదిలో అప్పుడే కుర్చీ వేసింది. సిగ్గు ఆడవాళ్ళ సహజమైన సొత్తు. సిగ్గులేక పోతే ఆడవాళ్ళ అందానికి ముసుగులేదు. ఆ ముసుగు లేకపోతే మగవాళ్ళ ఆరాటమూ లేదు. వెంకట్రావ్ రెండోగది తలుపు చాటున నిల్చుని సిగ్గుతో తల వంచుకున్న సరోజవేపు చూశాడు.

మాటలు మొదలు పెట్టేముందు సిగరెట్ వెలిగించి మరీ, "అత్తయ్యగారేరీ" అన్నాడు.

కొంత సేపటివరకూ జవాబు లేకపోటంతో ఆత్రుతగా సరోజవేపు చూశాడు. ఆమె చిరకోం

సతార కళ్ళు తుడుచుకుంటోంది. దుఃఖం అనేది మమకారంపు ముద్దుబిడ్డ. కని, పెంచి ఆరాటపడి ప్రాణాల విడిచిన తల్లి ప్రసక్తి రావటంతో ఆమెలో దుఃఖం పొంగి పొరలిపోయింది.

వెంకట్రావ్ కి సిగరెట్ పొగ పీల్చుతున్నా, ఆలోచన పోలేదు. సంశయాలు దొంతరలుగా తన మెదడులో యిరుక్కొని ఆలోచనకు అవకాశం యివ్వలేదు. ఇప్పుడెవరిదగ్గరవున్నట్టు అని అడగటానికికూడా నోరు పెగిలిందికాదు... తలెత్తి ప్రశ్నార్థకంగా చూసిపోయాడు. గులాబిపువ్వుపై పొగమంచు ప్రాకుకొనివుంది.

లోనుండి పిల్లాడు శ్వాసపడుతున్నట్లు మూలుగు ఒక్కసారి వినపడింది. వెంకట్రావ్ ఆశాపూరిత హృదయం నిరాశ ధాటికి పగిలిపోయిందా అనిపించింది. ఏమడగటానికి శక్తిలేక తలవంచేశాడు. మళ్ళీ తలెత్తేసరికి యెదురగా సరోజలేదు. సరోజ మాటలు మాత్రం వినిపిస్తున్నయ్. దురాశతో బ్రతికేవాళ్ళకి నగ్నసత్యాన్ని గట్టిగా పలికినా ఇది నిజమా అన్న సంశయంమాత్రం కొట్లాడుతుంటుంది. తేవాలనుకున్న వెంకట్రావ్ కు శక్తిలేకపోయింది. కుర్రాడ్ని బుజ్జగించిన సరోజ మళ్ళీవచ్చి నమ్రతతో నిల్చుంది.

ఈసారి వెంకట్రావ్ పిడికిలి పట్టాడు. ఎవరా అబ్బాయి అని ప్రశ్నించాడు. సరోజ మెల్లగా "ఆ అబ్బాయితల్లి చచ్చిపోయింది" వెంకట్రావ్ కు యీ మాట యెంతో సుఖాన్నిచ్చాయ్. ఇక వెంకట్రావ్ కు ఆ కుర్రాడి చరిత్రతవ్వే అవసరం లేకపోయింది. గొంతుకపట్టిన కోయిల మామిడిచిగుళ్ళ మందుతో గొంతువిప్పిన సమయమది. తన జీవితంలో వసంతమాస ఘడియలు!

పెద్దగాలివానలా అప్పుడేవచ్చి పడ్డాడొక వ్యక్తి. మనిషి నల్లగావున్నాడు. మాసిపోయిన కాకీ నిక్కరు. నలుపునంటుకొనియున్న బట్టలలో వున్నాడు. తనకంటికి యేకోశాన సంస్కారంవున్న వ్యక్తిలా కనపడలేదు. ఆ హిందూషిప్ యార్డ్ కార్మికుని కలవరం వెంకట్రావ్ కు యెంతో అసహ్యాన్ని కలిగించింది. వచ్చినవెంటనే తనవేపు చూసిన చూపు వెంకట్రావ్ కు తీరని అవమాన బాధకలిగించింది. అంతతో సరిపోలేదు. సరోజను తన నడత, మాటలలో అవమానపరచాడని వెంకట్రావ్ మనసులో నుండిపోతున్నాడు. ఈ ఆకతాయి అర్థం లేకుండా గాబరాపడుతూ తనహద్దును దాటిపోతున్నాడు. తనలో పురికివచ్చే అసహనాన్ని కోపాన్ని ప్రవహించకుండా చేస్తోంది. సరోజ వాడియందు చూపించే విధేయతలో.

ఇంతకీ జరిగింది యిది. ఆ కార్మికుడు గదిలో కాలుపెట్టగానే వెంకట్రావ్ వేపుచూచి గబగబ జ్వరంలో బాధపడుతున్న కొడుకుదగ్గరకువెళ్లి బుజ్జగించాడు. ఇవతలేవచ్చిన సరోజ నుద్దేశించి సహజమైన వుత్కంఠతో "డాక్టరుకోసం పంపించావా లేదా?" అన్నాడు. పాపం కుర్రాడ్ని బ్రతిమాలి ఫలానా డాక్టరుదగ్గరకు పంపించానంది. దానితో కార్మికుడు ఉక్కెత్తిపోయాడు. "ఆ డాక్టరు మంచి డాక్టరుకాడు. వాడు నా కొడుకును మందివ్వటానికి వీల్లేదు...వీల్లేదు ... కుర్రాడిదగ్గరవుండు — మంచి డాక్టరును తీసుకవస్తాను..." అంటూనే అంగటి గదిలోనికి వచ్చాడు. ఒక కారు రోడ్డువెంబడి వెళిపోవటం చూచి పరుగెత్తాడు. కారువెంట (డాక్టరుగారూ డాక్టరుగారూ) అంటూ కేకలువేసుకుంటూ తను కోరిన డాక్టరుని తెచ్చుకోవటంలో కృతకృత్యుడయ్యాడు. డాక్టరుగారు వచ్చారు. పరీక్ష చేశారు. తనవంత ఆస్పత్రికపంపవద్దని, కొద్దిరోజుల్లో నేనయమౌతుందనిచెప్పి మందివ్వటాని తనతో కార్మికుని కారులో తీసుకపోయాడు. వళ్ళేనుండు పిల్లాడిదగ్గర వుండమని సరోజతో చెప్పి మరీ వెళ్లాడు.

ఈ దృశ్యాలన్నీ కళ్లప్పచెప్పి హేతువాదానికి మనసులో తావివ్వకుండా వెంకట్రావ్ చూస్తున్నాడు. ఒక సేవకుడు ఒక మహారాజ్ఞిని ఆజ్ఞాపిస్తున్నాడు. ఆ మహారాజ్ఞి ఆసేవకుని ఆజ్ఞలను శిరసావహించటానికి కారణాన్నిమాత్రం ఆలోచించలేదు.

కుర్రాడు నిద్రపోతున్నాడు. సరోజమెల్లగా మొదటిస్థానానికివచ్చి నిల్చుంది. ఆ పలుకలేని ప్రతిమ బొమ్మను చూడగానే వెంకట్రావ్ ఒళ్ళంతా పులకరించింది. ఈ అందాన్ని యీ లాలిత్యమైన పసుపుకుంకుమకళని ఆమె యిన్నాళ్లూ తనకోసమే దాచిపెట్టింది!

ఒక మొగలాయీ కాలపు మనోహరి చిత్రాన్ని చూస్తున్నట్లుగాని, సినీమాలో తనతోపాటు భర్తతోసహా సినీమా చూడడానికివచ్చిన ఒక

అందాలరాణివేపు చూస్తున్నట్టుగానీ లేక వర్ణించలేని అందచందాలతో మిసమిసలాడే స్వంత చెల్లాయివేపు చూస్తున్నట్టుగానీ వెంకట్రావ్ సరోజవేపు చూడలేకపోయాడు. ఆయన చూపు పదహారణాల స్వార్థంతో కూడివుంది. సరోజ తనది, ముమ్మాటికీ ఆమె యౌవ్వనపు మాధుర్యమంతా గ్రోలేది తానేనని మోహంపులాలింపులో మోదపడుతున్నాడు.

సరోజ తలవని తలంపుగా ఒక ప్రశ్నతో తనని నిరాశవేపు బలవంతాన త్రోసివేసింది. మూగతనాన్ని త్రుంచి ఆమె ప్రశ్నించింది. "అక్కయ్యగారి, పిల్లలు బాగున్నారా ?"

వెంకట్రావ్ యేవిధంగానూ జవాబు చెప్పలేకపోయాడు. ఈ విషయంనుంచి మనసు మళ్లించటానికి మాటలవరస మార్చబోయాడు. కానీ ఒక విషయం స్ఫురణకువచ్చి తను తనభార్య మరణం చెప్తేగానీ తను తలపెట్టే మహాకార్యానికి నాందీ ప్రస్తావన కాదని ఆ మరణవార్తని ముక్తసరిగా చెప్పాడు. మొదటి పెళ్లాం మరణవార్త తన రెండో పెళ్లికి నాందీ ప్రస్తావన!

సరోజ కలకలలాడి కళ్ళంటనీరు తెచ్చుకుంది. ఫలితాన్ని తెలుసుకోలేక యింతపని సరోజ చేసిందని వెంకట్రావ్ విచారించాడు. ఈ విషయంనుంచి ఆమె మనస్సు మళ్లించి అసలు విషయానికి వద్దామనుకొనేసరికి కుర్రాడు మూలుగు వినిపించింది.

సరోజ సుబకబడళ్లటం వెంకట్రావ్ కేమీ నచ్చిందికాదు. ఒకపిల్లాడికోసం ఆమె యెందుకంత ఆరాటపడాలి! ఆమె ఆరాటపడవలసినరోజులు ముందున్నాయ్.

ఈసారి సరోజ కళ్ళు నీళ్ళతో నిండివచ్చి నిల్చింది. వెంకట్రావ్ మాట్లాడేముందుగానే ఆమె అంది—"ఆయనకు ఆ పిల్లాడితోనే అంతా..."

ఈ సంబోధన వెంకట్రావ్ కు నచ్చకపోవటంచేత యింకా ఆమె మాటాడబోతుంటే తను రెండవ ప్రశ్న వేసి ఆపాడు. సరోజ యీ ప్రశ్నకు జవాబు యివ్వలేదు. యిచ్చే అవసరంగాని విధంగానీ ఆమెకు తోచిందికాదు. ఆ యింట్లో ఆమె యెందుకుందో వెంకట్రావ్ కు కావాలి. ఈ యిల్లు, తనజాతిగాని వాని యీ యిల్లు, ఆమె బంధువులతో యిది నా యిల్లని యెలా చెప్పగలుగుతుంది. ?

ఆమెకోరి ఆ కుర్రాడిగురించే మాట్లాడింది. "టిఫిన్ కారియరు మోసుకెళ్ళే మనిషి కుర్రాడికి జ్వరంవచ్చిందని చెప్పేవుంటుంది. భోజనం చెయ్యకుండా పనివదలి పరుగెత్తుకొచ్చారు."

వెంకట్రావ్, "నా ప్రశ్నకు జవాబు చెప్పు సరోజా" అన్నాడు.

ఆమె వినిపించుకోనట్టే అన్నది. "పిల్లాడిని ప్రాణంగా చూచుకుంటే చచ్చిపోయినభార్య ఆత్మకు శాంతికలుగ జేస్తామని ఆయన నమ్మకం!

వెంకట్రావ్ కు సరోజలోని ఎస్కేపిజం నచ్చలేదు. ఆమె తను మూడుసార్లు మరిడీపెట్టి అడిగిన ప్రశ్నకు జవాబు యీయకపోవటంతో, పంతం, పంతంతోపాటు ఫలితంయందు లేశమాత్రం ఆశ నమ్మకంకలగటంచేత మనసులో విచారం, కోపం, అశాంతి, అసూయ ఒక్కసారి పెనవేసుకున్నాయ్. ఇప్పుడు తనుమనిషి! మనిషిలోని వివిధరకాలు అనుభూతులు యిప్పుడే అతనిలో రేగినై! సరోజ తన ప్రశ్నకు జవాబు చెప్పాలి! చెప్పితీరాలి!

తను యింట్లో కాలుపెట్టినదగ్గరనుంచీ జవాబు ఎదురుగానేవుంది. తన మోహాంధకారంలో అగపడలేదతనికి!

సరోజ కళ్లుకప్పుకొని అప్పటినుంచి తిన్నగా కుర్రాడి మంచందగ్గరకు వెళ్ళిపోయి కూర్చుండిపోయింది. ఆమె వెక్కి వెక్కి యేడుస్తోంది. ఆమె జీవితకాలంలో, చేసినతప్పులేమీలేవు కానీ యిక ఆమెకు మిగిలిన జీవితంలో యేడుపేశరణ్యం! ఆ దుఃఖం కొంతవరకు తను ఆమె నోటివెంబడి చెప్పకుండా దాచిపెట్టింది. అది వెంకట్రావ్ యిప్పుడు వూహించుకోవలసిన పరిస్థితివచ్చింది. వెంకమ్మ జబ్బులో పొరుగునవున్న యీ కార్మికుడు సహాయపడ్డాడు. వెంకమ్మ చనిపోయింది. వాడికి భార్య లేదు. సరోజకు దిక్కులేదు. ఆకలిగొన్న కడుపు ఆకలిగొన్న యౌవ్వనంఒకటే! అందుకే యీ మహారాణి ఆయన పాదాల సంటవలసివచ్చింది. మేళకూ లేవరకూ పువాదులు కట్టలేదని తెలుసుకోలేకపోయాడు వెంకట్రావ్!

ఉద్రేకాలతో మానవత్వాన్ని మరిపించే ఘట్టాలు జీవితంలో క్షణికమైనవి. వాటిని నిరాశ వెన్నంటుకునే వుంటుంది. వెంకట్రావ్ వెళిపోతున్నాడైనా సరోజతో చెప్పలేకపోయాడు. చేతిలో మందుసీసాతో పరుగునవకలతో తను యేకోశానా సంస్కారం లేదనుకున్న కార్మికుడు వెళిపోతుంటే రిక్షామీదనుంచేచూసి సిగ్గుతో వెంకట్రావ్ తలదించుకున్నాడు.

ఆయన జీవితంలో యింతకంటే మంచి ముహూర్తం అంటూ యికవుండదు. విజయవాడకు టిక్కెట్ తీసుకొని రైల్లో కూర్చున్నాడు. బరువెక్కిపోతున్న తలను కిటికీమీదవాల్చి తల గోక్కుంటూ మనసులో బాధగా యేడ్చుకుంటూ అనుకున్నాడు—"నెలరోజులక్రితం నేనే చచ్చిపోయివుంటే...!!"

విశ్వకర్మ పురాణము
కొన్ని చరిత్రాంశములు

•

శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు

జగత్సృష్టికర్తయగు విశ్వకర్మ ప్రభావము వేదములలో పెక్కుతావుల వర్ణింపబడినది. అందు ముఖ్యముగా ఋగ్వేదములోని అష్టమాష్టకమున తృతీయాధ్యాయాంతమునను, కృష్ణ యజుర్వేద తైత్తిరీయ సంహితయందు చతుర్థకాండ షష్ఠ ప్రపాఠకమునందును, ఈషద్భేదముగా శుక్లయజుర్వేదమునందును విశ్వకర్మ సూక్తము చెప్పబడియున్నది. ఈ విశ్వకర్మ సూక్తమంత్రములకు విద్యారణ్యస్వామి విపులముగా భాష్యము వ్రాసియున్నారు. వేదములను విడిచినచో సంస్కృతభాషలోని పెక్కు పురాణములలో విశ్వకర్మ చరిత్రలు వర్ణింపబడియున్నవి. అందును ముఖ్యముగా పద్మ, వాయు, వైవస్వత, స్కాందపురాణములలోని విశ్వకర్మోపాఖ్యానము లెంతయు ప్రసిద్ధములు. స్కాందపురాణములో మొట్టమొదటి దగు నాగరఖండము సంపూర్ణముగా విశ్వకర్మ మహిమానుభావముల నే వర్ణించుచున్నది.

"ధరలోనన్ దశవాష్ట నామము ప్రసి
ద్ధప్రక్రియన్ బొందుచున్
స్థిరమై యొప్పు పురాణముల్ వరబుధ
శ్రేణుల్ ప్రమోదించి చూ
డరు విభ్రాజిత విశ్వకర్మ మహిమా
స్తోకంబునై యొప్పు "నా
గరఖండంబు దనర్చు ఖండములలో
స్కాందాగ్రభాగంబునన్."

—ఆంధ్ర నాగరఖండము.

ఇదిగాక సంస్కృత భాషలో "మూలస్తంభ" మను నొక పురాణము విశ్వకర్మ మహిమలను, దర్శనముయొక్క విధులను వర్ణించునదైయున్నది. దీని హస్తప్రతి జర్మనీదేశములోని ఓరియంటల్ లైబ్రరీలో నున్నదనియు, మనదేశములోని ప్రతి పెక్కు తప్పులతో నిండియున్నదనియును శ్రీ బి. జి. సరస్వతి స్వాములవారు వ్రాసియున్నారు.

సంస్కృత విశ్వకర్మ పురాణము

పై రెండు గ్రంథములు గాక సంస్కృతభాషలో విశ్వకర్మపురాణము ప్రత్యేకముగా మఱొకటున్నది. తద్గ్రంథ సంఖ్యాదికమును గూర్చి నాగరఖండ మిట్లు చెప్పుచున్నది. నారదుడు సాంబమూర్తితో ననుచున్నాడు:—

"కనుగొంటి మేరు దక్షిణ
ఘనతర దిగ్భాగమున సుఖస్థితిని జగ
జ్జనకుని మహేశ్వరుని బ్రా
జ్యను మూర్తిని విశ్వకర్మ మహిమోదాత్తున్."

"కాచియుండితి నే బహుకాల మచట
నతని వ్యాఖ్యాన సామర్థ్యమతని చరిత
మతని దర్శన జనిత పుణ్యంబు నిట్టి
దట్టిదని యెన్న బ్రహ్మకునైన వశమె!"

"మఱియు నచ్చట నే గార్గ్యమౌని వలన
విశ్వకర్మ పురాణంబు వినియుదియును
పదియు రెండగు లక్షలపైని గ్రంథ
సంఖ్య పదుమూడు వేలుగ జదివినాడ."

అందు.

"జగతియందును ద్వాదశగ్రంథ ; మొక లక్ష
పాతాళమున ; సరిత్పతుల వసువు
లక్షద్వయంబు; కైలాసంబుపై నంది
సవిధదేశమున లక్షత్రయంబు ;
నాకలోకంబున నాలుగులక్షలు ;
చక్రిలోకమున లక్షద్వయంబు ;
కంజాతబంధు లోకమున సహస్రంబు ;
వెలసెనీ రీతిని విశదబుద్ధి

విశ్వకర్మ పురాణంబు విబుధ తిలక
యేను వ్యాఖ్యాన మొనరించి తేను నిద్ధియు
నెందులుగల్గు పురాణసమూహ మెల్ల
నతని తనువందు జనియించి యతిశయిల్లె."

—ఆంధ్రనాగర ఖండము.

దీనింబట్టి విశ్వకర్మ పురాణగ్రంథ సంఖ్య పది రెండులక్షల పదుమూడువే లనియు, నందు పదిరెండు వేల గ్రంథము భూలోకమున నున్నదనియు దెలియు చున్నది. మఱియు నీ విశ్వకర్మ పురాణము మొదలు కొని సర్వపురాణ సమూహములును ఆ విశ్వకర్మ శరీరము నుండియే పుట్టినవట. ఏయే యవయవములయందే పురాణము లుద్భవించినదియు నాగరఖండములో నే వర్ణింపబడియున్నది. కాని యిటీవలి గ్రంథములలో నీ విశ్వకర్మ పురాణ మష్టాదశ పురాణాంతర్గతమయి నట్లు చెప్పబడియుండలేదు. దాని స్థానమును మఱొక టాక్రమించి యుండవచ్చును.

ఆంధ్ర విశ్వకర్మ పురాణము

ఆంధ్ర విశ్వకర్మ పురాణమును రచించినది గాయత్రీ పీఠాధిపతులును, మన్మథస్థాపనాచార్యు లును అను శ్రీ పీపూరి వేంకటాచార్యస్వామి. వేంకటశైలవాసు డాయనకు స్వప్నములో నగపడి ఆయన కవితా వైభవాదికమును ప్రశంసించి విశ్వకర్మ పురాణముం జెప్పి తన కంకితమిమ్మన్నాడట—

"కావున గవివరు లెన్నం
గావింపుము వేగ విశ్వకర్మ చరిత మే
ధావిద్యా విద్యాభవ
శ్రీ విలసిత హృదయ! మాధురీవాక్య విభా!"
"మా చరిత్ర చెప్ప మహి నెవ్వ రుండెడి
వారు గలరు మాకు వరదు డైన
విశ్వకర్మచరిత శాశ్వతగతి జేయు
ధన్యు గాన నెందు ధరణిలోన."

ఒక అపూర్వవిషయము

శ్రీనాథుడు విశ్వకర్మ పురాణమును రచించి నట్లు బుధలోకములో ప్రసిద్ధియున్నదనియును, ఆగ్రంథ మిప్పుడగపడుటలేదనియు దిగువ పద్యమును బట్టి తెల్లమగుచున్నది—

"శ్రీనాథుండొనరించెనంచు విబుధుల్
చెప్పన్వరవిశ్వన్నదే
కానెందుక్ గనమా జగద్గురుని ప
శ్చాత్కారుణ్య దివ్యప్రభా
వానూనస్థిర శేముషీ మహిమ; వి
ద్యాశ్రీనిధుల్ మెచ్చగా
నానార్థంబుల నీవు చెప్పవలయుక్
సర్వం సహామండలిన్."

శ్రీనాథుడీ పురాణమును రచించిన దెప్పుడను విచారణేదు. కాని యీపద్యమునుబట్టి వేంకటార్యుని నాటికి పండితలోకములో నట్టి ప్రసిద్ధి గలదని తెలి యుచున్నది. ఒక వేళ భీమేశ్వర పురాణమువలె కవి సార్వభౌముడీ విశ్వకర్మ పురాణమును వార్థక మున రచించియుండిన నుండవచ్చును. అది అతని దారిద్ర్య భూయిష్ఠమగు తుది జీవితములో గణనకు రాక నశించి యుండవచ్చును. శ్రీనాథ మహాకవి ప్రౌఢదేవరాయలను దర్శింప బోయినపుడీ గాయత్రీ పీఠాధిపతికి బూర్వుడగు మున్మనాచార్యుని సహాయ నమునందియున్నాడు. ఆ మున్మన ప్రేరేపణమున శ్రీనాథుడు విశ్వకర్మపురాణమును రచించియుండ వచ్చు ననియు, తోచుచున్నది. ఈ విషయమింకను దరువాత స్పష్టము కాగలదు.

దీనికి మూలము

వేంకటాచార్య కవి తన గ్రంథమును "మూల స్తంభ" పురాణమును, నాగరఖండమును ఆధార ముగా జేసికొని వ్రాసితి ననుచున్నాడు—

"మూల స్తంభం బన నే
కాలము నుతి గాంచు విశ్వకర్మపురాణం
బాలోక సుఖదమై యీ
భూలోకములోన వెలయు బుధ జనులెన్నన్"

కావున నీయుద్దిష్ట విశ్వకర్మపురాణంబు గావింపుము." అని శ్రీ వేంకటనాథుడు గ్రంథకర్త కాదే శించియున్నాడు. ఈ విశ్వకర్మ పురాణమును మార్కండేయుడు ధర్మరాజునకు చెప్పుచున్నట్లు ఈకవి చిత్రించుచున్నాడు. మార్కండేయుడు గూడ లోగడదాను శివునివలన వినియున్నాడు గావున ఆ చరిత్రమును సాంగముగా వినుచున్నా డట—

"అన విని యీశ్వరుడలరా
మును దావిని యుండుగాన మోదంబునన

ఖ్యాని విశ్వకర్మ కథల
జనపాలునితోడ దెల్పసంభ్రమ పరుడై."

"మను జవర నమ్ము నీవు వేడిన తెలుగున
భావ జారాతి బ్రార్థించి పరమ నిష్ఠ
తేర్మిమును విని క్రౌంచాద్రి భేదనుండు
నాదిమ బ్రహ్మచరిత స్వాంద్యంతముగను."

"అని యాస్కాందపురాణం
బున నాగరఖండమందు బొలుపొందు నా
ఘనవాహన చరితం బి
ట్లని చెప్పదొడంగె విశ్వలాయత మతియై."

కావున నీ యాంధ్ర విశ్వకర్మ పురాణమునకు "మూల స్తంభము"ను స్కాందపురాణములోని "నాగర ఖండము"ను మూలములని తెలియుచున్నది. సంస్కృత విశ్వకర్మ పురాణమును గూర్చిన ప్రశంస యిం దెచ్చటను జేయబడి యుండలేదు. నాగర ఖండములోని కథాంశములనైన నీత డానుపూర్విగ గ్రహింపలేదు. కొన్ని కథలను మాత్రమే స్వీకరించినాడు. దాని కిది యనువాదము గూడ కాదు. స్వతంత్ర గ్రంథము. మూల స్తంభములోని విషయములను గూడ కొలదిపాటిగ మాత్రమే యీ కవి గ్రహించెను. నానా పురాణములలోగల విశ్వకర్మసంబంధములగు కథలను గ్రహించి దీని నొక పురాణముగా నీకవి రచించిన ట్లగపడుచున్నది. పురాణత్వసిద్ధి కిందు "సర్గప్రతి సర్గవంశ మన్వంతర వంశాను చరితము"లను గూడ వర్ణించి యుండెను. ఈ పురాణములో వర్ణించు నాయా విషయముల నుగ్గడించి కవి చివరి కిట్లనుచున్నాడు—

"అలర భారత భాగవతాది కథలు
గలిగి మిక్కిలి లోకవిఖ్యాతమైన
విశ్వకర్మ పురాణంబు వెలయు గల్ప
తరువు కైవడి నభిమతార్థంబు లొసగి."

ఇప్పటి విశ్వకర్మ పురాణములోని యవతారిక చేత పెక్కు చరిత్రాంశములు తెలియుచున్నవి.

పీఠత్రయము

ద్విజత్వమునకు మూలజననియు, వేదమాతయని ప్రసిద్ధి గన్నదియు గాయత్రీదేవి. ఈ గాయత్రీ మంత్రము నుపనీతులగు ద్విజమాత్రు లెల్ల రుపాసింప వలయును. "న గాయత్ర్యాః పరం మంత్రమ్" అని తన్మంత్రము సర్వశ్రేష్ఠముగా చెప్పబడియున్నది. గాయత్రి ప్రశంస వేదములందును పెక్కుతావుల గలదు. పంచశీర్షయగు నీ గాయత్రియు, ఇరువదినాలుగక్షరములతో నలరు నీ గాయత్రీ మంత్రమును ముముక్షువుల కనేక వేదాంతార్థములను బోధించుచున్నవి. ఈ గాయత్రి త్రిసంధ్యలయం దుపాసింపబడుచు గాయత్రీ సావిత్రీ సరస్వతులను మూడు నామములచే బిలువబడుచున్నది. అనాదికాలము నుండియు ద్విజత్వమును బ్రబోధించుటకై యీ మూడు పేరులతో పీఠములు ప్రచారములో నున్నవి. అవియే గాయత్రీ సావిత్రీ సరస్వతీపీఠములు. ఈ పీఠముల కధిపతులు విశ్వకర్మ ఋషివంశజులగు బ్రాహ్మణులు. ఆదిమదంపతులును, జగత్కర్తలును అగు గాయత్రీ విశ్వకర్మలు స్వరూపస్వభావాదులలో స్త్రీ పుంభేదమును మాత్రమే గలిగి, యన్నింట సదృశులై యుంటచే నీ పీఠముల యాధిపత్యము వీరికి చెందియుండెనేమో యని తోచుచున్నది.

సావిత్రీ పీఠమును కనుపర్తివారును, గాయత్రీ పీఠమును ఈపూరివారును బాలించుచు ధర్మప్రచారము జేయుచున్నారు. సావిత్రీ పీఠాధిపతులగు కీ॥ శే॥ వీరభద్రాచార్యులవారిని పదిసంవత్సరముల క్రిందట నేను నెల్లూరిలో గలసికొని యున్నాను. వీరు నైజాం రాష్ట్రమునుండి మైసూరువరకును గల ఆంధ్రదేశమున ధర్మప్రచారము చేయుచు భిక్షాదక్షిణలు వసూలుచేయుట కధికారము గలిగియున్నట్లు పెక్కురు ప్రభువులిచ్చిన ధర్మానాలు వీరివద్ద నే జూచితిని. ఈ వీరభద్రస్వాములవారి మరణముతో నీ పీఠము మూలబడినది. వీరి పూర్వులలో నొకరగు ధూర్ధరాచార్యులు వేదములకు భాష్యములను గూడ వ్రాసియున్నారు. అది ధూర్ధర భాష్యమని ప్రసిద్ధి వహించినది. వీరి ముత్తాత బసవాచార్యస్వామి యుద్దండ పండితుడు. పేరూరిలోని దిగ్దంతులవంటి పండితులను వాదములో నోడించి వారిచే బ్రహ్మరథము పట్టబడి "పేరూరి బ్రహ్మరథారూఢ" అను బిరుదము నందినాడు. ఈయన సంస్కృతమున వ్రాసిన "రథకారాధికరణము" విశ్వవిద్యాధరణము అను గ్రంథములును, తెలుగులోని "వర్ణాశ్రమ ధర్మనిర్ణయము" అను గ్రంథమును సుప్రసిద్ధములై యున్నవి.

వీపూరి శాసనాంకులు

గాయత్రీ పీఠపాలకులు వీపూరి శాసనాంకులని బిరుదుగన్నవారు. వీపూరను గ్రామమును బరిపాలించుటచేతనే వీరికి వీపూరి శాసనాంకులని పేరు వచ్చియున్నట్లున్నది. కాని అది యేవీపూరో యేమో తెలిసికొనుటకు ప్రత్యక్షాధారము లింకను గోచరింపలేదు. ఈ వీపూరివారిది గూడ గొప్ప పండిత వంశమును, రాచరికమును నెఱపిన వంశము నని యీ విశ్వకర్మ పురాణావతారిక సూచించుచున్నది. ఇది యాంధ్రుల పీఠమేమైనను ప్రస్తుతము మద్రాసు రాష్ట్రములోని సేలంజిల్లాలో కావేరీ పట్నమున నున్నది. మద్రాసు మైసూరురాష్ట్రములలో నీ మఠము సంచారము చేయుచుండును.

౧౯౩౮ సం॥ ప్రాంతమున పీఠము గుంటూరు మండలమునకు సంచారము వచ్చుటయు, గుంటూరు పౌరులు పీఠాధిపతికి రజతకిరీటమును బంగారు తురాయిని బహూకరించి యర్పించుటయు ప్రసిద్ధమైన విషయములు. ప్రస్తుత పీఠాధిపతి వేదవేదాంత నిష్ణాత వర వెంకటాచార్య గురుస్వాములు. ఈపీఠాధిపతులకు అయిదారు తరములనుండి వేంకటాచార్య నామము తప్పకుండ వచ్చుచున్నది. ద్వైతసిద్ధాంతము వీరికి నచ్చుటంబట్టి గాబోలు విష్ణుపారమ్యముతో వీరు పూర్ణప్రజ్ఞ మతావలంబకులుగా గన్పట్టుచున్నారు. సరస్వతీ పీఠమును గూర్చిన యుదంత మింకను బూర్తిగా సేకరింప బడలేదు. ఈ పీఠము గూడ మొన్న మొన్నటివఱకు ప్రచారములో నున్నదని మాత్రము వింటిని. ఆదిమునులను నీ పీఠముల ననుసరించియే శ్రీశంకర భగవత్పాదులు వేదాంత ప్రచారము సాగుటకు శ్రీవిద్యాపీఠముల నెలకొల్పినట్లు తోచుచున్నది. కొంతకాలము క్రిందట కీ. శే. వడ్డెపాటి నిరంజన శాస్త్రిగారు "గినిగెర"యను బళ్లారిజిల్లాలోని యొకగ్రామములో శ్రీ సాంబమూర్తి స్వామివారిని గాంచితిననియు, వారును పీఠాధిపతులే యనియును "ప్రబోధిని" పత్రికలో వ్రాసిరి. ఆ పీఠమును పేరును వారు సూచింపలేదు. బహుశః అది సరస్వతీ పీఠమై యుండునేమో విచారింపవలసి యున్నది.

ఈ విశ్వకర్మ పురాణకర్త వీపూరి వెంకటాచార్యుడు. వీరు చిరకాలమునుండియు గాయత్రీ పీఠాధిపతులై యున్నందున విజయనగరరాజుల యాస్థానములందును విద్యాధికారులు, ధర్మాధికారులునై గౌరవముల నందియున్నారు. ఈకవి తన వంశావతారమును వర్ణించుచు తనకు పూర్వమేడవతరమునుండి చరిత్రము నెత్తుకొనుచున్నాడు. విశ్వకర్మ తనయుడగు అభువన ఋషి వంశములో నాగన్న యుదయించెనట. ఆయన పుత్రుడు గంగన.

"అభువన సగోత్రపవిత్రుం
డభినవమను సూత్ర పాత్రుడెల ఋక్శాఖా
ప్రభు డతడు పంచశరస
న్నిభు డాగంగనకు సాటి నేర్తురె పోలన్.

పై పద్యమును బట్టి వీపూరి వారు మనుసూత్రులనియును, ఋక్శాఖాధ్యాయులనియును తెలియుచున్నది. ఆ గంగనార్యునకు "కసవన" అనువాడుదయించెను. ఆయన పుత్రుడే మమ్మనాచార్యుడు. ఈతడు మహా విద్యాధురంధరుడు. దశక్రియా పరిజ్ఞాత. ప్రౌఢ దేవరాయల యాస్థానములో ధర్మాధికారియు, విద్యాధికారియునై యుండి అగ్రహారాది బహుమానముల నందినవాడు.

"ఆకసవన కుదయించెన్
లోకమ్ము మమ్మన మహాయశోధనుడై వా
ణీకాంతో మా కాంత ర
మాకాంతుల మించు గుణసమాన నిరూఢిన్."

"ఆర్యులు మెచ్చగాను గడు
సందడిలో ఘనమాన మానితా
చార్యుడు ధైర్యశాలి యతి
ధన్యు డతండు స్థిరం దశక్రియా
చార్యుడు మేఘవాహనుడు
సత్య యశోనిధియైన మమ్మనా
చార్యుడు ధాత్రి నొప్పెసను
సాధు జనాన్వితుడై మహోన్నతిన్."

"ఆ మమ్మన నిజ కవితా
శేముషి మెప్పించియంద సింధుర తురగ
స్తోమంబులు భూషణములు
గ్రామంబులు ప్రౌఢదేవ రాయలవలనన్."

పై పద్యములనుబట్టి మమ్మనాచార్యుడు మంచి కవి యనియును, సజ్జనాగ్రేసరు డనియును, వాస్తు శిల్పాదులలో "దశక్రియాపరిజ్ఞాత" యని పేరందిన ఘనుడనియును విస్పష్టమగుచున్నది. మఱియు ప్రౌఢ

దేవరాయుల యాస్థానములోనున్న డిండిమభట్టు మున్నగు విద్వత్కవులలో నీతఁడగ్రేసరుఁడనియు దెలియుచున్నది. డిండిమభట్టాదులు పరోత్కర్షను సహింపలేని యసూయాపరు లనుట శ్రీనాథుని వాద సందర్భము చేతనే తెల్లము. కావుననే డిండిమభట్టు గర్వము నణంప లేదా స్థానములో స్థానము సంపాదింప వచ్చిన శ్రీనాథ మహాకవి యీ మమ్మకవి సాయముతోడనే రాయలకొల్వులో ప్రవేశించినాడు. తనకు రాయలసభలో ప్రవేశ మిప్పింప శ్రీనాథుడు మమ్మకవినిట్లర్థించినాడు. ఈ యంశమును గూర్చి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ చాటు పద్య మణిమంజరి రెండవభాగము ౧౩ వ పుటలో నిట్లు వ్రాసియున్నారు—

"కర్ణాటాధీశ్వరుఁడగు ప్రౌఢదేవరాయల యాస్థానమున ధర్మాధికారిగా మమ్మకవి యను పేరి విద్వత్కవి యుండెనట! మందుగా శ్రీనాథుఁడా కవీశ్వరుని దర్శించి యీ క్రింది పద్యములు చెప్పెనట.

"పంపా విరూపాక్ష బహుజటా జూటికా
రగ్వధ ప్రసవ సౌరభ్యములకు,
తుంగభద్రా సముత్తుంగవీచీ ఘటా
గంభీర ఘుమ ఘుమారంభములకు,
కళసాపుర ప్రాంత కదళీవనాంతర
ద్రాక్షా లతా ఫల స్తబకములకు,
కర్ణాట కామినీ కర్ణ హాటక రత్న
తాటంక యుగధాళ ధళ్యములకు
నిర్నిబంధ నిబంధమై నెనయు కవిత
తెలుఁగునను సంస్కృతంబున బలుక నేర్తు
ప్రౌఢ దేవేంద్రరాయ భూపాలవరుని
సమ్ముఖంబున దయజూడు మమ్మసుకవి !"

మమ్మ కవియుఁడ నీవిధముగా వార్తను దెలిపెను." తరువాత రాయల యాస్థానములోని కవి పండితులఁడ్డ వాట్లు వేసినను మమ్మకవి శ్రీనాథుని రాయలయొద్దకు జేర్చినాడు. ఇట్లు శ్రీనాథునంతవాని చేత ప్రార్థితుఁడై సుకవి యనిపించుకొన్న మమ్మన సామాన్యుఁడా ? ఆతఁడు మహాపండితుఁడును, పీఠాధిపతియు, సజ్జనుఁడుగావున శ్రీనాథునితో మైత్రి నెఱపి యుండవచ్చును. అట్టి మైత్రి పెంపుననే తనపంతుకు బడిని వినియోగించి శ్రీనాథునితో జెప్పి మమ్మకవి విశ్వకర్మ పురాణమును రచింపజేసి యుండ వచ్చుననుట సత్యమని నిరూపింప వీలగుచున్నది. భీమేశ్వర పురాణాదుల తెలుఁగు చేసిన యమ్మహాకవి తనకు గూర్పవాడైన మమ్మకవి వాంఛను ద్రోసి రాజనియుండఁడు. ఇది శ్రీనాథుని మరు త్తరాట్చరిత్ర శాలివాహన సప్తశతి, మున్నగు గ్రంథములవలెనే యగపడదయ్యెను.

ఈ మమ్మన్నకు అంబన జనించెను. ఈతఁడు కవిస్తోమ కల్పకము. ఈయనకు కొండన పీరన యను సుతులు బలాఢ్యులుదయించినారు. వీరిలో పీరన వేద శాస్త్ర సంచారుఁడు ధార్మికుఁడునట. రెండవవాఁడగు కొండన శాస్త్రవేది, మహాదాత. ఈతఁడు పెంకోటలో నుండి ప్రభుడై వెలిగినట్లు దిగువ పద్య పాదములు వెల్లడి చేయుచున్నవి—

"ఎవ్వని పట్టణం బినుపకోట గలకోట
పెంకోటయై చాల పేరుగాంచె"
....
రసికుఁడు డీపూరి కొండనార్య ప్రభుండు.

ఈ కొండన ప్రభునిగూర్చి మహాఘనమైన చాల వర్ణనము చేయబడియున్నది ఈతని పట్టపు దేవియగు నందమాంబను గూర్చి గూడ చాలగా ప్రశంసింపబడి యున్నది. ఈ కొండనార్య ప్రభుఁడు పెంకోటను తన పట్టణముగా జేసికొని పాలనము నెఱపిన సంగతి విచారింపవలయును.

కొండనార్యునకు పురుషోత్తముఁడు, తిరుమలార్యుఁడు, వెంకటాచార్యుఁడు, నరసార్యుఁడునని నల్వురు సుతులు గల్గిరి. వీరిలో పురుషోత్తమార్యుఁడు నిగమోద్ధార మొనర్చినాడట. దశక్రియా చతురుఁడు గూడనట.

శా॥ చూచెన్ సర్వదిగంతరాశముల రా
జాళ్యేత్య్చ నర్థాదులన్
మోచెన్ దుర్ఘట శబ్దశాస్త్రవిదయ
మ్మ్రాల్ నైరులన్నెలతో
రాచెన్నమ్మదిమించు వేడుకల మి
శ్రిస్తోమమంగాచెనీ
యాచార్యుండలఘుండు కాదెకన స
ర్వాంభోధి వేలావనిన్ ?

ఈయన తమ్ముడు తిరుమలార్యుఁడు మంచిపండితుఁడు. ఆయన సోమయార్య సిద్ధాంతములను గ్రంథముల నుద్ధరించినాడట. ఈ యుద్ధరణ మే రూపమైనదో!

ఆ॥ అఖిలపూజ్యుడైన యాయన తమ్ముండు
తిరుమలార్యుడనగ ధరణి వెలసె
శ్రేమమీఱ సూర్య సోమ సిద్ధాంతము
లుద్ధరించి వంశ ముద్ధరించె.

మామిడి సింగమంత్రి క్రీ. శ. ౧౪౧౮ లో సోమసిద్ధాంతమునకు వ్యాఖ్యానమును రచించినాడు. వీరిలో నింకను జెప్పదగిన పాండిత్య ఖండితుడు వేంకటాచార్యుడు. ఈతడు తన గాయత్రీపీఠములో జెక్కు దేశములకేగి అటనట దటస్థించిన శాస్త్రవాదములలో జెక్కురు పండితులను గెలిచి కీర్తి సంపాదించినట్లు దిగువ పద్యము సాక్ష్యమిచ్చుచున్నది.

సీ॥ చాళేగి మాళవ కళింగ కురునాట కరహాట
భోజకర్ణాటక భూములందు
మూల్పత్తి మాళవ సింధురవత్స ఘూర్జర
శకయుగంధర రాజ్యసమితియందు
జల్లించి మాళవ మత్స్య విరాట కాశ్మీర
సౌరాష్ట్ర మగధ దేశములయందు
గాలించి మాళవ కొంకణ చోళమాళవ
గౌళ నేపాళ చక్రములయందు
గీ॥ దనకు మాఱుద్ది లేమి తత్వ ప్రసంగ
మార్గతార్కిక వైదికామ్నాయ శాస్త్ర
కావ్య దీక్షా సమర్థ సంగతుల వేరు
కైర్య డీపూరి వేంకటాచార్యుడెందు.

దీనింబట్టి యీతని వేదశాస్త్ర పాండిత్యమపారమనియు, కావ్య నాటక ప్రజ్ఞలో గూడ నీతడుమిన్నయనియు, నించుమించు యావద్భారత దేశమునందును సంచార మొనర్చి యీతడు విజయపత్రికల నందినాడనియును దెలియుచున్నది. మఱియొక సీసపద్య గీతములో నీ మహనీయుని గూర్చి—

గీ॥ అతడు సామాన్యుడే నిఖిలావనీంద్ర
సముఖ విద్వన్నుతోద్ధత శబ్దశాస్త్ర
సమర నిశ్శంకు డీపూరి శాసనాంకు
డార్య జనహారి వేంకటాచార్య సూరి.

అని వర్ణింపబడినది. కావున నీతని వ్యాకరణ శాస్త్ర జ్ఞానమత్యున్నతమైనదని తోచెడిని. మఱొక పద్యములో గూడ—"శబ్దశాస్త్ర ప్రసంగ దీక్షా గురుండు, సకలవిద్యాజ్ఞానాధార సారకీర్తి"అని ప్రశంసింపబడెను. ఇట్టి విద్వత్తుచేత నీతడు లోకోత్తరుడైయుండుటంబట్టి నీతని విడిచి యుండొక్కని గురువుగా నెన్నుకొనుటకు జనులు సాహసింప లేదట—

మ॥ పటువేదాగమ శబ్ద సూక్తులు గజిం
పన్నేర్చి యాగ స్త్వరు
ద్ఘట వంశంబది యుద్ధరించి(?) మతి కె
క్కెం జాలి యాపూరి వెం
కట వర్యుండిటులుండ నీ భువిని ద
క్కన్ వేఱ యాచార్య
నెన్నుట కెంతేనియు సిగ్గుకాదె భువిలో
నూత్న ప్రభావోన్నతిన్.

ఈ వేంకటాచార్యునకును అన్నపూర్ణాంబకును గలిగిన పుత్రుడే విశ్వకర్మపురాణ కర్తయును వేంకటాచార్యుడు. ఈయన గూడ "పాద భిక్ష లేదే యన నెంతవాని నెనుదియ్యక కొట్టు"నట. ఈ వేంకటాచార్యుడు భిక్షార్థమై పాటూరు నేలుచున్న కొండవ సోదరులకడకేగి యట్లన్నాడట.

ద్విపద మూల స్తంభము.

క॥ ఈ మూల స్తంభము జగ
దామోదముగా గనందియల గురుచే మీ
మామ పురుషోత్తముడు గుణ
ధాముడు యాగంటి పతికి దగనర్పించెన్.

క॥ అది ద్విపద, పద్యకావ్యం
బిది, బుధజనహితము వేంకటేశ్వరునకు నిం
పొద వగ నంకితముగ జే
సెద మీరు నా మాట మీరు చేకొనవలయున్.

పై పద్యములను బట్టి మూల స్తంభ పురాణము వేంకటాచార్యునికి బూర్వమే ద్విపద కావ్యముగా నాంధ్రీకృతమై యాగంటీశ్వరున కంకిత మీయబడినదని తెలియుచున్నది. కాని దాని కర్త పురుషోత్తముడని స్పష్టముగుట లేదు. పురుషోత్తముడొక కవిని ప్రేరేపించి వ్రాయించి యాగంటీశ్వరుని కంకిత మిప్పించె నేమో! ఆ ద్విపద మూల స్తంభము దొరకిన గాని విషయము తెలియదు. వెంకటార్యునిచే ప్రేరితులైన పాటూరి ప్రభువులు. "మేలు మహాప్రసాదమని మీ వచనంబు మహాకవీంద్రులే చాలగ సమ్మతింపవిన జాలమె మేమన నెంతవార" మని యంగీకరించి సాహ్యుల వారిని సత్కరించినారు.

పాటూరి ప్రభువులు.

విశ్వకర్మ పురాణము పాటూరి బోడి, కొండ నార్యులు శ్రోతలుగా వెలయించిన ప్రబంధము. ఈ పాటూరి కొండ నాదులు చాలకాలము నుండియు పాటూరిని పాలించుచు గజపతుల యొక్కయు, కర్ణాట రాజుల యొక్కయు కొందఱు మహమ్మదీయ ప్రభువుల యొక్కయు గౌరవ సత్కారముల నందినట్లు ఈ గ్రంథముచే తెల్లమగుచున్నది. ఈ పాటూరే జిల్లాలోనిదో మాత్రము స్పష్టమగుటలేదు. నెల్లూరి జిల్లాలో కోవూరి తాలూకాలో నొక పాటూరు గలదు. కాని అది రాజ్యస్థానమై నట్లగపడుట లేదు. పోగా నీ పాటూరి ప్రభువులకు గజపతులతోడను, నవాబులతోడను నేస్త మగపడుచున్నది గావున నైజాం రాష్ట్రములో చేరిన పాటూరున్నదేమో యోచింపవలసియున్నది. లేక పెంగోటవలెనదిగూడ రూపతిపోయినదేమో. అసలు చరిత్రాంశములు దొరకినంతవఱకు బయట పెట్టినచో చరిత్ర పరిశోధకులు వానిని పరిశీలించి సంగతి తెల్పుట కవకాశముండును గావున విశ్వకర్మ పురాణావతారికనుబట్టి లభించినంతవఱకు పాటూరి శాసనాంకుల యుదంతమును ఇచ్చట ప్రస్తావింతును. కవి విశ్వకర్మ పురాణకృతి శ్రోతలగు పాటూరి బోడన కొండనార్యుల వంశ చరిత్రము నాలు తరములనుండి వర్ణించుచున్నాడు. పాటూరి ప్రభువుల గోత్రకర్త అభువన ఋషి. ఈ అభువన గోత్రములో బసవార్యు డుద్భవించినాడు. ఈయన దశ క్రియాచార్యుడు, షోడశ మహాదాన ధురీణుడునట. ఆ బసవన సుపర్ణస గోత్రమున జనించిన బసవాపాత్రుని కూతురగు బసవాంబికను పెండ్లాడినాడట. అందువలన బసవా పాత్రుడు—

చ॥ అరణముగా నొసంగెనత
డల్లునికిం బహురత్న భూషణాం
బరపుటభేదనావళు ల
పారముగా గజరాజమండలే
శ్వర పరిదత్తము ల్కుతుబు
షా విభుదత్తములైన గంధ సిం
ధుర వరఘోట కాదులు బు
ధు ల్మది మెచ్చగ నిచ్చలోన్నతిన్.

పై పద్యమును బట్టి బసవా పాత్రుడు గూడ నొక సామంతుడనియును, అతని నెయ్యురగు గజపతుల వలనను గోలకొండ ప్రభువగు కుతుబ్షా వలనను బొందిన యపార సంపదలను గ్రామములను అతి డల్లునకరణముగా నిచ్చియున్నాడనియును దెలియుచున్నది. ఈ బసవనకు మామకువలె "పాత్రు" డను బిరుదముగూడ నున్నది. ఈ పాత్ర శబ్దము కళింగ దేశమున నెక్కువగా వాడబడుననుట స్పష్టమేకదా! కావున నీ పాటూరు కృష్ణా గోదావరీ నదుల కుత్తరము నందే యుండవచ్చు.

శా॥ పాటూ రేలుచునుండె నంతి బసవా
పాత్రుండసరు ధైర్యశౌ
ర్యాటోపంబులు దిక్కుతిన్గొలువ ను
ద్యద్భ్యంద్రికా వైఖరీ
శాటీఘోటక రత్నజాలములు ని
చ్చల్కానుకల్వెట్టి క
ర్ణాటక్ష్మాధరులెంతయుం బొగడుచుం
డన్భోగ దేవేంద్రుడై.

పాటూరిని పాలించుచున్న బసవాపాత్రుని శత్రువులు శౌర్య ధైర్యములు గోల్పడి యాతనిం గొలుచుచున్నారనుటయు, కర్ణాటాధీశ్వరులు (విజయనగర రాజులు) గూడ శాటీఘోటక రత్నముల, గానుకలుపెట్టి కొలుచుచున్నారనుటయుం బట్టి మాడ నీ పాటూరి ప్రభువులు కొంతమంది సామంతులనుగూడ గలిగి యున్నారని తెలియుచున్నది. మఱియు భోగ దేవేంద్రుడనుటయు నాతని రాజ్య సమృద్ధిని సూచించుచున్నది.

బసవా పాత్రుని కొడుకు రామవిభుడు. ఈతని పుత్రుడు బోడన. ఇతడు నయవేత్త. సత్యసంధుడు. ధర్మజ్ఞుడు. ఈతనికి పాపాపాత్రు డుదయించినాడు. ఈతడు బలశాలి. దయాళుడును. ఈ పాపా పాత్రునికి బయ్యమయను సతియందు ఐదుగురు పుత్రులుదయించిరి. ౧ పాపన. ౨ పొట్టన. ౩ ఎఱ్ఱన. ౪ మాద మూర్తి ౫. చిన్నమాచు. వీరిలో పొట్టిప్రభుడు పార్వతిని లింగాంబను వివాహమాడెను. ఈ పొట్టి ప్రభువునకును లింగమ్మకును ౧ బోడన్న. ౨ సిద్దన్న. ౩ మాచు. ౪ నలకొండన అను నల్వురు సుతులుదయించిరి. వీరిలో మొదటివాడగు పాటూరి బోడి ప్రభుడే విశ్వకర్మ పురాణ ప్రధానశ్రోత. ఈతని పట్టపురాణి ఒంటిమిట్ట పురుషోత్తము కూతురు సిద్ధమాంబ.

ఈ పాటూరి ప్రభుసోదరుల సద్గుణగణములను శౌర్యౌదార్యసాహసాదులను గూర్చి కవి పెక్కు పద్యములలో వర్ణించినాడు. అయినను చరిత్ర కవసరమయినంత వఱకే నే నీ వ్యాసమున సంగ్రహించితిని. వీరిలో పాటూరి కొండన ప్రభుకు "ఏదులశాహు" (ఆదిల్ షా, కావచ్చునని) చే ననేకములను సత్కారముల నందినాడట.

సీ॥ ఇల నేదిలాసుఁడై దులశాహుచే పెక్కు
నవలొత్తఁదగిన మన్ననలు వడసె
మహినేమహోత్కృడార్తి హరించి సకలార్థి
తతితోడ వసువసంతంబులాడె
పస నేరసజ్ఞధీరస మెన్న టెకి లేక
రసికశేఖరుల మార్గమువహించె
భువి నేకవిస్తుతుం డవిరళప్రఖ్యాతిఁ
గులములో వన్నె కెక్కుచుఁ జెలంగ
గీ॥ నతఁడు మానవమాత్రుఁడే శశిముఖోద్ధ
ఖగ్గగంధర్వ గంధర్వకమలజన్మ
మానినీనారదాహీంద్రముంజకీర్తి
కుశలుఁడహోరి పాటూరికొండశౌరి.

కవి పాటూరి ప్రభువులలో గొప్ప దాతృత్వమును కవితా సాహితీరసికతను, శత్రు ధిక్కారసామర్థ్యమును, ఆశ్రిత పోషణమును, అతిథి సంతర్పణమును మిక్కిలిగా వర్ణించినాడు. వలగొండన్నను, అతని భార్య అక్కమాంబను, ఆమె అతిథి సంతర్పణ ప్రవణతను మిక్కిలిగా చెప్పినాడు.

ఉ॥ ఆ వలగొండ దివ్యభవ
నాంగణసీమఁ జెలంగుచుండు స
త్యానుభవ ప్రసంగము, ల
హార్నిశహోమము, లాప్తశోధన
ధ్యానము, లర్థిసంచయము,
లాగతబంధుసమాజమభ్యగ
ధ్యానము, లస్తివాక్యములు,
నర్బుదసంఖ్యల రత్నజాలముల్.

ఈ పద్యము ఆముక్తమాల్యదలోని "ఆ నిష్ఠానిధి గేహసీమను" బోలియున్నది. ఇట్లు వర్ణించి కవి— "ఇట్లఖిలభోగంబుల గొప్పైరు నప్పాటూరి శాసనాంకులకు బునః పునః ప్రవర్ధమాన సామర్థ్య శేముషీ మహిమంబును, బుత్రపౌత్రాభివృద్ధియు. సమస్త వస్తువాహన సమృద్ధియు, సతత నిశ్చలావధానంబును, నసంభ్రమాభిమానంబును, సాధుజన రక్షణోపాయంబును, సాహిత్యవిద్యావిలాసంబును, సకల లోకోన్నత సామ్రాజ్యంబును గలుగ బ్రసాదించు శ్రీ వేంకటేశ్వర మహిమా విశేషంబు లభివర్ణించెద, నని కృతినాథుని వర్ణనము నుపక్రమించినాడు. పాటూరి శాసనాంకులకు "సకల లోకోన్నత సామ్రాజ్యము" కావలయునని యనుటచేత నిదివఱకున్న సామ్రాజ్యము సకల లోకోన్నతము కావలయునని తోచుచున్నది. దీనింబట్టి చూడ పాటూరి ప్రభువులది గొప్ప రాజ్యమని స్పష్టమగుచున్నది. లేకున్న గజపతులును, గోలకొండప్రభులగు కుతుబ్ షాలును, బిజాపురపు ఆదిల్ షాలును, కర్ణాటాధీశ్వరులును వీరిని సమ్మానించు టెట్లు పొసగును ?

పాటూరినగర రాజ్యకాలము

సుమ్మనాచార్యుడు ప్రౌఢ దేవరాయల యాస్థానములో ధర్మాధికారి విద్యాధికారి పదవులను నిర్వహించి యున్నాడని విస్పష్టము. ఈ సుమ్మన కైదవతరమువాడు విశ్వకర్మ పురాణకర్తయగు వెంకటాచార్యుడు విశ్వకర్మపురాణ శ్రోతలగు పాటూరి బోడికొండనలు వెంకటాచార్యునికి సమకాలికులును వయస్సులో నించుమించాతనికి సమానులు నైయుందురు. వీరికి పూర్వ మైదవతరము పురుషుడు పాటూరి రామవిభుడు. ఈ రామవిభుని తండ్రియే బసవా పాత్రుడు. ఈ బసవా పాత్రుడే సువర్ణఋషి గోత్రుడగు కసవాపాత్రుని తనూజను జెండ్లాడి మామగారిచేత సరణముగా గజరాజ మండలేశ్వర పరిదత్తములు, కుతుబుషా విభుదత్తములు ననుగంధ సింధురఘోటకాదులను బహుమానములుగా బడసినాడు. మఱియు కర్ణాటక్ష్మావరులుగూడ "ఉద్యచ్చంద్రికా పైకినీ శాటీఘోటకరత్న జాలములు" కాన్కలు ఇట్టి పొగడుచున్నదియు గూడ నితనినే. ఈ కర్ణాట క్ష్మావరులు ప్రౌఢదేవరాయాదులే కదా! కావున పాటూరి రామవిభుడు ౧౪౦౦–౧౪౩౫ ప్రాంతముల రాజ్యము సేయుచున్న ప్రౌఢ దేవరాయలకు సమకాలికుడు కావలయును. ఇది తరముల సంఖ్యను సరిపుచ్చి చూచిన లెక్క. రామవిభుని తండ్రి బసవా పాత్రుడు ప్రౌఢ దేవరాయల కొక పురుషాంతరము పూర్వుడు గావున క్రీ. శ. ౧౩౩౦, ౪౦ ప్రాంతము

వాడై యుండు ననుకొందను. ఆ పక్షమున విజయనగర పరిపాలకుడగు వీర బుక్కభూపాలునితో గూడ వీనికి స్నేహము కలిగియుండవచ్చునని యూహింపవీలగుచున్నది. ఒకవేళ విశ్వకర్మ పురాణ కృతికర్త ప్రోతల తరముల సంఖ్యలో ఒకటి ఎచ్చులొచ్చుగానున్నను, మొత్తముమీద సంవత్సరముల సంఖ్య సరిపడి పాటూరి ప్రభుడగు బసవా పాత్రుడు ప్రౌఢ దేవరాయలు క్రొత్తగా రాజ్యమునకు వచ్చునప్పటికే విద్యావయోధికుడై లబ్ధప్రతిష్ఠుడై రాజ్యమేలుచున్నవాడై యుండవచ్చును. అట్లగుచో సుమ్మనాచార్యుని ద్వారమునగూడ కులసంబంధమును బురస్కరించుకొని పాటూరి ప్రభువులకును కర్ణాటాధీశ్వరులకును మైత్రి చేకూరియుండవచ్చునని నాయూహ. ఏ విధముగా చూచినను క్రీ. శ. ౧౩౪౦నుండి ఆఱు తరముల వఱకు, అనగా తరమునకు ౩౦ సంవత్సరములుగా లెక్కవేసిన ౧౫౧౦ వఱకును పాటూరి ప్రభువులు రాజ్యము చేసినారని చెప్పవచ్చును. విశ్వకర్మ పురాణ ప్రోతలలో నొక్కరుడగు పాటూరి కొండనార్యుడు "ఏదులశాహు" చే లగినమున్నను లందినాడని యిందు చెప్పబడెను. ఈ ఆదిల్‌షా బిజాపూరు నేలినవాడై యుండును. తల్లికోటయుద్ధానంతరము బిజాపురపు నవాబులు విజృంభించి యుండిరుగదా! ఆ బిజాపురపు నవాబులతో గూడ నీపాటూరి కొండన్న మైత్రి నెఱపియుండెనని తెలియుచున్నది. వీరు హిందువులయ్యును హిందూ సామ్రాజ్య వినాశకులగు మహమ్మదీయ ప్రభువులతో మైత్రిచేసి యుండుట వీరి రాజ్యము వారికి పరిసర ప్రాంతమై యుండుటచే గావచ్చును. కనుకను పాటూరు నిజాం రాష్ట్రములోని దేమోయని నాయూహ. చారిత్రకులింకను బరిశోధింపవలయును.

విశ్వకర్మ పురాణ రచన.

సుమ్మన ౧౪౩౦ ప్రాంతమువాడు గావున ఆయనకు నాల్గు తరములు పిమ్మటివాడగు విశ్వకర్మ పురాణకారుడు, ౧౫౬౦ ప్రాంతము వాడు కావలయును. ఈ వేంకటాచార్యకవి తనకు స్వప్నములో నగపడిన వేంకటశైలనాథుడు తన్నీరీతి నాదరించి నాడని చెప్పుకొనుచున్నాడు—

సీ॥ అలరంగ ధవళధూళి యర్థగౌరవమును
    గాళిదాసుని యలంకార మహిమ
ముద మొప్ప నలదండి పదలలితత్వంబు
    ముక్కు తిమ్మనకవి ముద్దుపలుకు
ధర నల్లసాని పెద్దన్న యల్లికబిగు
    వన్న బరాతమప్పన్న సొంపు
నల రుద్రసుకవి శబ్దాడంబరంబు, పాం
    దూరి తేగన చమత్కార రచన.
గీ॥ రొలమినా పాండురంగ కవీంద్రుమురువు
    తనరు ధూర్జటి జాతి వార్త ప్రశంస
నీకు గలవంచిచూడ నిన్నియును గూడ
    విలసితాచార్య పీపూరి వేంకటార్య!

దీనిని బట్టి యీతడు కృష్ణరాయల యుగపు కవీశ్వరుల రచనల నన్నింటిని జదివినాడని తెలియుచున్నది. ఇందు ప్రశంసింపబడిన "బరాతమప్పన్న" "పాందూరి తేగన" లెవరో వారి కృతులేవో తెలియుట లేదు. అయినను ఈ కవి తాను పేర్కొన్న వారి రచనా మార్గముల నన్నింటిని ననుసరించి తన కావ్యమును మనోహరము చేయబూనినాడు. విశేషించి ఆముక్తమాల్యదలోని పద్యములను వసుచరిత్రములోని పద్యములను బోలిన వింటుకొన్ని గలవు. ఆముక్తమాల్యదలోవలె నిందును సుపర్ణ స్తోత్రము, హనుమత్ స్తుతి చేయబడినవి. ఆ పద్యముల తీరులుగూడ కృష్ణరాయల పద్యముల తీరునవే యున్నవి. ఇట్లీతని కవితలో నాయా పూర్వకవుల కవితారీతులు దోచుటచేత నీతని గ్రంథము ౧౬ వ శతాబ్దము చివర రచితమై యుండునని తోచుచున్నది. లేదా ౧౭ వ శతాబ్ది తొలి దశాబ్దిలోనైనం గావలయును.

క్రీ. శ. ౧౫౮౫ నుండి పెండోట పాలకుడుగా రాజ్యము చేసిన ధవళేశ్వరపు మార్కండేయ ప్రభుని ఆస్థాన కవులగు తుర్కా రాజకవి అయ్యంకి బాల సరస్వతియును కవులు నాగర ఖండము నాంధ్రీకరించి యుండిరని ౧౯౩౧ ఏప్రిల్ భారతిలో "పెండోట పురము—మార్కండేయ ప్రభువు" అను వ్యాసమున నేను వ్రాసి యుంటిని. నాగరఖండరచనము, ఈ విశ్వకర్మ పురాణరచనము కొంచెమించుమించేక కాలముననే జరిగియుండునని యూహింపవలసివచ్చుచున్నది. ఈ వేంకటాచార్యకవి ఆ నాగర ఖండ విషయమునుగాని, పెండోట ప్రభువుల విషయమును గాని యిందు ప్రస్తావింపడయ్యెను. నాగర ఖండ కవులుగూడ విశ్వకర్మ పురాణ కర్త ఒక మహా శిలా

పాటూరి ప్రభువులు.

కశ్యపబ్రహ్మ (మూలపురుషుడు)
- అభువనఋషి. (గోత్రకర్త)
  - ౧. బసవాపాత్రుడు. (పాటూరి ప్రభువు) భార్య॰ సవాంబ.
    - ౨. పాటూరి రామవిభుడు.
      - ౩. బోడన.
        - ౪. పాపాపాత్రుడు. (పట్టపుదేవి బయ్యమ)
          - ౫. పాపఘనుఁడు.
          - పొట్టి భార్యలింగమ)
            - ౬. బోడన్న.
            - సిద్దు.
            - మాచు.
            - నలగొండన్న (భార్యఅక్కమాంబ) (పట్టపుదేవి సిద్దమ్మ)
          - ఎఱ్ఱన
          - మాచమూర్తి.
          - చిన్నమాచు.

వీపూరి శాసనాంకులు

విశ్వకర్మ (మూలపురుషుడు)
- అభువనఋషి (గోత్రకర్త)
  - ౧. నాగన
    - ౨. గంగన
      - ౩. కసవన
        - ౪. ముమ్మన (దశక్రియాపరిజ్ఞాత ప్రౌఢదేవరాయుల ఆస్థాన కవి. ధర్మాధికారి)
          - ౫. అంబన
            - ౬. వీరన (వేదశాస్త్రసంచారుడు)
            - కొండన పందమాంబపట్టపుదేవి)
              - ౭. పురుషోత్తముడు.
              - తిరుమలార్యుడు.
              - వేంకటార్యుడు.
              - నరసార్యుడు. (భార్య, అన్నపూర్ణమ్మ)
                - ౮. వేంకటాచార్యుడు. (విశ్వకర్మ పురాణకర్త.)

పతులైనను వాని ప్రస్తావన చేయరైరి. మరియు వేంకటాచార్యుడు—

క॥ అని యా స్కాంద పురాణం
బున నాగరఖండమందు బోలుపారెడు నా
ఘన వాహన చరితం బి
ట్లని చెప్పదొడంగె నిశ్చలాయతమతిరై

అనుచు తన కథకు గూడ సంస్కృత నాగర ఖండము మూలమని యంగీకరించుచున్నను ఆంధ్ర నాగరఖండమును గాని తత్కవులను గాని ప్రశంసింప కుండుట జూడ సమకాలీన కవులకంటె ప్రాతవా యిది యని యూహింపవలసివచ్చుచున్నది. మరియు నీతడు తన తాత కొండనార్య ప్రభుడు పెందోటలో నున్నాడని కొంచెంతగా నాతినిగూర్చి వర్ణన చేసి యున్నాడు. తన కాలపు పెందోట వృత్తాంతమును దత్ప్రభువును గూర్చి తెలుపదయ్యెను. ఇందుకు గారణము లాలోచింప వలసియున్నవి.

వీపూరి శాసనాంకులు.

గాయత్రీ పీఠాధిపతులు వీపూరి శాసనాంకులుగా ప్రసిద్ధి వందినట్లు తెలిపియుంటిమి. ఈ వీపూ రెక్కడిదో తెలియదు. కొన్ని పద్యములలో "వీపూరి శాసనాంకులు" అని వ్రాసినాడు కావున వీరికిగూడ ప్రభుత్వ ముండి యుండవచ్చును. అది స్పష్టముగా నిందు సూచితము కాలేదు. లేకయా శాసనాంక శబ్దము వీరప్రభువు లనుటచే వచ్చిన దయినం గావచ్చును. ప్రభుశబ్దముగూడ భూయిష్ఠముగా వాడబడినది. "ఆ నాగ కుదయించెనా జ్ఞానాధికుడైన గంగన ప్రభుడారా!" "ఆ ఘను గురువదాన్యుండై ఘను డీపూరి శాసనాంకుండని" "శబ్దశాస్త్ర సమర నిశ్శంకు డీపూరిశాసనాంకుడు" అని వ్రాయబడి యున్నది.

కొండన ప్రభుడు పెందోటలో నున్నట్లును, ఆయన పట్టపుదేవి నందమాంబ యనియును ఆతడు బ్రాహ్మణులకు భూరి ధనరాసు లిచ్చినట్లును నిందు వర్ణింప బడియున్నది.

ఆ॥ అట్టి సుతులగాంచి యాకొండనార్యుండు
చాలహర్షవార్ధి దేలియాడి
భూరిధనజయంబు భూసురకోటికి
నిచ్చుగోరినట్టు లిచ్చు మెచ్చ.

ఉ॥ దండిగనిచ్చె గాయక బు
ధప్రకరంబుల కాయఖండదో
ర్దండనయానుపాలితసు
రప్రతిభాంకుడు కీర్తికాంతుడా
కొండనవంశపావనుడు
కోరినవస్తువు లర్థికోటికిన్"

ఈత డింకను పెక్కుగుళ్లను గోపురములను భూమండలమున గట్టించి ప్రసిద్ధికెక్కినాడట. ఈతడు ముమ్మడయొక్క పౌత్రుడు. కావున క్రీ. శ. ౧౫౧౦ ప్రాంతమువాడు కావచ్చును. ఆ కాలమున నతడు పెందోటను పాలించుచున్నాడా? స్పష్టముగా జెప్ప వీలులేదు. అప్పుడు భవశేఖర ప్రభువులే పెందోట నేలుచుండినట్లు నాగరఖండము చెప్పుచున్నది. అయిన పెందోటరాజ్యములోని కొంత భూభాగమున కీత డధిపతియైన గావచ్చును. లేకున్న నింతగా ధనమును దానముచేయుటకును యజ్ఞయాగాది క్రతువులు చేయుటకును వీలుండదు. కాని యీ వైభవము విశ్వకర్మ పురాణకర్తనాటికి క్షీణించినది. కావున నే యతడు భిక్షులకు బయలుదేరి పోటూరి ప్రభువుల సాయముతో నీవకృతిని బూర్తి చేయవలసి వచ్చినది.

వేంకటాచార్య కవిగూడ తాను గ్రంథమును రచించు నాటికి పెందోటలోనో, లేక పరిసరప్రాంతములందో నివసించుచున్నాడు. విశ్వకర్మ పురాణములోగూడ నీతడు పెందోటపురమును అభిమానముతోడనే వర్ణించినాడు. ఆశ్వాసాంత గద్యములో—

"ఇది శ్రీ మద్విశ్వకర్మవంశ పయఃపారావార రసుధాకర భువనగోత్ర పవిత్రాచార్యజన స్తోత్రపాత్ర వేంకటాచార్యసన్నపూర్ణాంబికా పుత్ర శ్రీ మచ్చెన్నకేశ్వరవర లబ్ధకవితా నిరాతంకవీపూరిశాసనాంక వేంకటాచార్య ప్రణీతంబయిన విశ్వకర్మ పురాణంబు" అని చెప్పినాడు. ఇందు ప్రస్తావింప బడిన చెన్నకేశ్వర స్వామి మాచర్లలోని చెన్నకేశవ స్వామియేకదా! కావున మొత్తముమీద పెందోట సంబంధము ఈయనకు లేకపోలేదు.

మొత్తముమీద నీ విశ్వకర్మపురాణావతారిక అనేక చారిత్రకాంశములకు నెలవైయున్నది. దాని నాధారముగా జేసికొని శాసనాదులను బరిశీలించి పోటూరి ప్రభువుల చరిత్రమును నిర్మింప వలసిన యవసరముగనబడుచున్నది. మాలుమూల నున్న యీ

గ్రంథము కవితా విషయకముగను, దేవతా విషయకముగనే కాక చారిత్రికముగా విలువగలదనుట నిస్సంశయము. దీనింబట్టియే వీపూరి శాసనాంకుల సంగతియు, శ్రీనాథుని విశ్వకర్మ పురాణ రచన వృత్తాంతమును, మమ్మనకు ఆయనకు గల మైత్రినిగూర్చియు స్పష్టమయ్యెడిని. ఇంకన్న ప్రాచీన కాలమున వాస్తుశిల్పజ్యోతిషాది విద్యలలో ప్రవీణులను దశక్రియా పరిజ్ఞాత లెందరో యుండెడి వారనియు స్పష్టమగుచున్నది. ఈ కావ్యముయొక్క కవిత్వగుణములను గాని యితర విషయములను గాని ప్రస్తుతము ప్రస్తావించుట నా ముఖ్యోద్దేశ్యము గానందున విరమించుచున్నాను.

వీపూరి శాసనాంకులు

ఈ గ్రంథములో వీపూరు, ఈపూరు అని రెండు పదములును వాడబడినవి. గోత్రనామమును "అభువనఋషి." పదము వేదములో "అహూభువనఋషి." యని కలదు. ఈ కవి దానిని 'అభువన, అని వాడినాడు. లేక వారి దృష్టిలో అహూభువన, అభువన, పదములు వేరో తెలియుటలేదు.

పురాణశ్రోతలు.

పాటూరి ప్రభువులను గూర్చిన యొక పద్యముతో నీవ్యాసమును ముగింతును—

మ॥ క్రమ మొప్పన్ మఖ యన్న తమ్ములసరా
గంబుం గృపాలీలని
క్రమవిద్యార్థ్యపసంబు గీర్తియును ధ
ర్మాసర్మ పారీక్షణం
బుమహోశాంతియు నిత్యసత్యమునయం
బుండోడి క్రోడంద్రమూ
టమియుం బాటూరి వారియందె మను పు
ట్టింబోలు ధాత్రీస్థలిన్.

వలచీనాడమ్మా!

★ శ్రీ పెనుమర్తి వెంకటరత్నం

వలచీ నాడమ్మా
మనసు
కలచీ నాడమ్మా......

* * *

దారంట మగతీవి
తారసిల్లును; వాని
కాలి ధూళిగ మారి
రాలిపోయిన చాలు
॥వలచీ॥

* * *

గుండెలోతులు దొలిచే
గోరువెచ్చన వాని
వాలు కన్నులలోన
కాలిపోయిన చాలు
॥వలచీ॥

మాటలోపల యేదో
మంత్రమున్నదె వాని
కవుగిట్లో కడసారి
కన్నుమూసిన చాలు
॥వలచీ॥

పాటపాడితె చాలు
తోట పులకించేను;
వింటూనె ప్రాణాలు
విడిచినా చాలమ్మ
॥వలచీ॥

శంఖుస్థాపన

★

శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

పాత్రలు:—

సుబ్బారాయుడు – ప్రెసిడెంటు
తిమ్మయ్య – సెక్రటరీ
శంకరం – ట్రెజరరు
రాజారావు – కమిటీ మెంబరు
కోదండరావు – ఆర్కిటెక్టు
మంత్రి, ఎలక్ట్రీషియను, మాలీ, బంట్రోతు సీతయ్యా, వాలంటీర్లూ, అతిథులున్నూ.

కాలం : ఈ మధ్యనే
స్థలం : మన దేశంలో ఓ పట్నం

"లోకంమరమ్మతు సంఘం"—దానికి ఓ భవనం నిర్మించాలని తీర్మానం జరిగింది. దాని శంఖుస్థాపన మంత్రిగారిచేత జరిపించడానికి యేర్పాట్లు జరిగేయి. ఆ ముచ్చటే యీ నాటిక. అయితే నాటి సమావేశానికి పత్రికా విలేఖరులనే గాని రచయితలని ఆహ్వానించలేదు ఆ సంఘంవారు—వారి దృష్టిలో రచయితలు ఓ న్యూసెన్సు కెండి! అంచేత చెవినిపడ్డ ముక్కలు విన్నట్టూ వివరిస్తాను.

[తెర తొలగేసరికి తోరణాలూ వాటితో అలంకరించిన పెండాలులాగ కనిపిస్తుంది—రంగం మధ్యగా అధ్యక్షునికి కుర్చీ, టేబిలున్నూ – లేసుపని గుడ్డా, పువ్వుల జాడీ, మైక్రోఫోనూ టేబిలుని అలంకరిస్తాయి—రంగానికి ఎడమప్రక్కని తొందరతొందరగా లేవదీసిన మూడు నాలుగు అడుగుల యెత్తు ఇటిక గోడ – అప్పుడే కట్టినట్టు పచ్చిపచ్చిగా కనిపిస్తుంది— వాలంటీర్లూ, బంట్రోతూ, మాలీ కుర్చీలూ అవీ సర్దుతూ, అలాంటి మీటింగుల్లో పడవలసిన కంగారూ హంగామా పడుతూ ఉంటారు.]

తిమ్మయ్య : ఏమిట్రా అదీ, సీతయ్యా, మళ్ళీ అదేం పనిరా? అబ్బబ్బ. మడ్డీ ఫెలోస్. మీకు చెప్పేకంటె చేసుకుంటే నయం. ఒరేయ్, ఏ ర్యూం అయి చెబుతూఉంటే నీ క్కాదుట్రా? ముందువరస సోఫాలు, తరవాత కుషను ఛెయర్సు, ఆ తరవాతి అవుగో ఆ చేతులున్న మెత్తకుర్చీలు, ఆపైన చివరంటా చేతుల్లేని కొయ్యకుర్చీలున్నూ——ఊఁ. వేగం కానియ్. నోరు నొప్పెట్టోందిరా.

సీతయ్య : నిత్యం బాబు. తలో మాటా చెబుతు ఉంటే బంట్రోతుగాణ్ణి యేటి సెయ్యమను బాబూ.

తిమ్మయ్య : నేను చెప్పినట్టు చెయ్యి. ఇంక బ్రహ్మరుద్రులకు చెప్పినా వినకు.

సీతయ్య : చెప్పినోళ్ళంతా అలాగే అంటారు బాబయ్యా.

తిమ్మయ్య : ఛప్, వెధవా. నోరు ముయ్.

మాలీ : శంకరంబాబుగోరు యిలాగే సద్దమన్నారు బాబూ. ఆ మెత్తకుర్చీలు వోరసనిండా సాలవంట.

తిమ్మయ్య : ఏం, ఎందుకు చాలవూ? ఎక్కడ ఉన్నాడతను? పిలుచుకురా.

(మాలీ వెళ్ళి శంకరంతో తిరిగివస్తాడు)

శంకరం : పిలిచేవా తిమ్మయ్యా. ఇక్కడ నువ్వు ఉన్నావుగదా అని అవతల యేదో యేర్పాట్లు చూస్తున్నాను, మరి.

తిమ్మయ్య : అవును, ముందోవరస అంతా కుషనుఛెయిర్సు అనుకున్నాంగాదూ?

శంకరం : అనుకున్నాం అనుకో. ఇరవై కుర్చీలు పడతాయని లెక్క వేసేమా? తీరా బజారుకి వెళ్ళి అడిగేసరికి ఆ గాడిదకొడుకు ఛెయిరుకి రూపాయి అడిగేడు. కుషనుచెయిర్సుకి.

తిమ్మయ్య : అయితేమట్టుకేంపోయ్. మహా అయితే యింకో యిరవై రూపాయిలయ్యేవి!

శంకరం: అదుగో అక్కడే వస్తోంది చిక్కు! నీకు చెప్పినా బుర్రకెక్కదు ఏం ప్రారబ్ధమోయ్! ఇదుగో విను. ఇలా అందులో పది, యిందులో యిరవై, మరోదాంట్లో పాతికా అయిపోతూ ఉంటే చేసిన బడ్జెటుకీ చేసిన ఖర్చుకీ యెక్కడా లంగరు అందకుండా వుంది. (కొంచెం విసుగ్గా) ఇందుకే యీ ట్రెజరరు పదవి నాకొద్దు మొర్రో అన్నాను. ఎక్కి. ప్రతీవాడూ ఖర్చు పెట్టేమనేవాడే. అంతే గాని ఆ పోగుచేసిన నాలుగురాళ్లూ యీ ఉత్సవానికీ, టీపార్టీలకీ, ప్రెస్సువాళ్ళకీ అయిపోతే చేతులో మరికాసి మిగలదన్న మాట యెవ్వడికీ పట్టదు.

తిమ్మయ్య: అబ్బ. అప్పుడేనారోయ్. ఆ పనస చాలిద్దూ. (సానుభూతిగా) నేనుమట్టుకు కడుపులో యేడుస్తున్నాను కాదూ? (బుజ్జగింపుగా) ఇదుగో, చూడూ, శంకరం, యీ సెరిమనీ ఒక్కటే బాగా సజావుగా కనిపించాలి వచ్చినవాళ్ళకి. ఇందులో శాస్త్రకల్లి జరగల్లసేటట్లు చేస్తే, చందాలకీ వాళ్ళనీ వీళ్ళనీ ఆశ్రయించడానికి వీలూ, మనకి.

సుబ్బారాయుడు: నువ్వన్నమాటా నిజమే. ఈ రోజుల్లో మంత్రులకి చింతకాయలు రాలవు. మంత్రిగారొచ్చి శంఖుస్థాపన చేసేరంటే, బిల్డింగు లేవడానికి యింక ఆట్టే కాలం పట్టదని వాళ్ళకి నిబ్బరంగానే వుంటుంది. ఓ నాలుగురాళ్లు రాల్చినా రాలుస్తారు.

తిమ్మయ్య: అద్గదీమాట! ఇంకో కీలకం గమనించేవా సుబ్బారాయుడూ? వ్యవహారం మరీ వాసిగావుంటే ఆ మంత్రిగారి కాళ్ళమీదే పడొచ్చు, "స్వామీ మీరు పునాదివేసిన బిల్డింగు సగంలో ఆగిపోయింది చమురుచాలక" అంటూను. తను పూనుకున్న వ్యవహారం మధ్యలో అభాసయిపోయిందంటే తనకే చిన్నతనంగదూ? అంచేత ఆ తాపత్రయం అతనే పడతాడు ఆ తరవాత. ఇంకా కాదూ పోదూ అంటే, గవర్నమెంటు సబ్సిడీ కూడా సంపాదించి పెడతాడు కూడాను.

శంకరం: ఏవో బాబూ, అన్నీ తెలిసినవాళ్లు మీ రిద్దరున్నా. ఇహ యిప్పుడు యెందుకూ వ్యవధి లేదు. వెయ్యిమందికీ ఆహ్వానా లంపించేవా? వచ్చినట్టూ ఆ సన్మానాలు మాకు కోవలసింకే, కుదిరినంత బాగానూ.

తిమ్మయ్య: పిలుపులంతే త్వరగానూను. ఊc. నాలుగయిపోయింది అప్పుడేను. ఇంక ఒక్క గంట కన్నా లేదు టైము. అందులోనూ కొంతమంది అయితే వొచ్చిన దగ్గర్నుంచీ వాచీలే చూస్తూ కూచుంటారు, మరేమీ పనిలేనట్టు—వీళ్ళ పంక్చుఅలిటీ తగలెయ్యా!

(ఓ వాలంటీరు పువ్వులదండల పొట్లాం పట్టుకు వస్తాడు. దండల చివరలు పొట్లాంలోంచి తొంగి చూస్తూ వుంటాయి.)

తిమ్మయ్య: పూలహారాలా యేమిటయ్యా?

వాలంటీరు: మరేనండి.

తిమ్మయ్య: ఏదీ, చూడనీ, ఓ రోస్ ఫ్రెషుగ్గా వున్నాయ్ ఏ వరా.

శంకరం: ఎలాగ కొన్నావోయ్?

తిమ్మయ్య: (నవ్వుతూ) వోయ్, శంకరం, ఎకౌంటన్సు నీ ఎముకలని పట్టిపోయిందోయ్. నిన్ను ట్రెజరరు చేసేరంటే ఒడ్డినే చేసేరా, మరీ?

వాలంటీరు: పదేసి రూపాయిలండి.

శంకరం: (ఆశ్చర్యపోతూ) దండ పది రూపాయిలా! అంటే మాకు దండలకీ ముప్ఫై రూపాయిలా?

సుబ్బారాయుడు: కొంచెం చూసుకుని కొనుక్కుంటే బాగుండిపోను! ఇంతకన్నా చవకవి లేవుటోయ్?

వాలంటీరు: లేకేమండి స్వామీ. రకరకాలవి ఉన్నాయి, దండ రెండణాలు మొదలు యిరవై రూపాయలదాకాను. అయితే, దుకాణంవాడు అడిగేడు యెవరికని. మంత్రిగారొస్తారని విరదనుకున్నారుగారండీ మొన్న? ఆ ముక్కే అనేసేనండి. అపాళంగా యీ దండలుతీసి, దండ పదిరూపాయి లన్నాడండి. మంత్రిగారి దండ పదిరూపాయిలు.

శంకరం: కంట్రోలున్నర్లా యేమిటి వీటి కూడాను!

వాలంటీరు: కంట్రోలో, బ్లాకో తెలవదుగానండి—(అర్థోక్తి)

తిమ్మయ్య: సరేలే. వాటిని అలా ఆ మూల పెట్టి యిన్ని నీళ్లు జల్లిఉంచు; లేకపోతే వాడిపోగలవు...కోదండరావుగా రొచ్చేరూ? ఏదో పెద్ద ఆర్కిటెక్టని అతని చేతుల్లో పెట్టేను, ప్లాను కాగితం గీసి పట్టుకురమ్మనీ.

శంకరం: పనులు పురమాయించడానికి నీ తరవాతే నోయ్, తిమ్మయ్యా—ఎటొచ్చీ ఆ మనిషి అపుపించడుగానీ—

తిమ్మయ్య: ఊరుకోవోయ్, చాలునూ, అసలే చస్తూ ఉంటేను! అన్నట్టు మార్బిలు పలకేదీ?

శంకరం: అలాగ అడుగు! ప్రతీవాడూ పని నెత్తిమీద వేసుకోగానే సరా? చేసి చూపించాలి.

రాజావారు నిర్వహించిన పనదీ! అదుగో చూడు, ఆ గోడదగ్గిర. మార్బిలు పలకా, సిమ్మెంటూ, పెంకి తాపీ అన్నీ రెడీ.

తిమ్మయ్య: అమ్మయ్య! సవ్యం అయిన పని ఒక్కటయినా జరిగింది.

శంకరం: ఆ మార్బిలుపలక యెంత చవగ్గా చేయించేనో తెలుసా? హాఫ్ రేటు.

తిమ్మయ్య: ఎలా కొట్టేసేవోయ్? అసాధ్యుడివి!

శంకరం: దానికేం లే—అస లేవిటంటే—అమృత్య జగ్గయ్యమ్మగారి పేర సత్రవుకట్టిద్దాం అనుకున్నారు గదూ? అందుకోసం చెక్కించిన పలక అది.

తిమ్మయ్య: (నీళ్లు గారిపోతూ) హోరినీ తెలివి తెల్లారిపోనూ! సత్రవు పేరున్న పలక సంఘానికి యెలా పనికి వొస్తుందనుకున్నావోయ్?

శంకరం: చివరంటా విను మరీ. ఏవో సందర్భాలు కుదరక ఆ సత్రవుపని విరమించుకున్నారు వాళ్లు. ఈ పలక వృధాగా ఉండిపోయింది. మనం వెళ్లి చవగ్గా కుదుర్చుకుని, ఆ రెండోపక్క చెక్కించేం సంఘం పేరూ వగైరాలు. ఆ రెండో వేపు యెదురగా కనపడేటట్టు ఎత్తిస్తే సరి. అలా విస్తుపోతా వేవిటి? ఉపాయం యెరగనివాణ్ణి ఊళ్లోంచి తగిలెయ్యమన్నారు!

సుబ్బారాయుడు: నయమే నీపుణ్యవా అని కాస్తముందుగా చెప్పేవు!

(ఓ బంట్రోతు కోటన్న మొక్కల గోలేలు పట్టుకుని బరువుగా వస్తాడు)

బంట్రోతు: ఈ గోలే లెక్కడెట్టమంటారు బాబూ?

తిమ్మయ్య: నా నెత్తిమీద!

(బంట్రోతుకి ఏమీ తెలియక కంగారుపడి చూస్తూ, టక్కు మొగం వేసుకుని వెళిపోతాడు.)

అవునా ఫోటోగ్రాఫరు మాటేవిటి, శంకరం? వస్తానన్నాడా, రానన్నాడా?

శంకరం: ఆ గొడవంతా రాజారావు చూస్తున్నాడు లేవోయ్. ప్రతీదానికీ నువ్వే ఆరాటపడితే యెలాగ? అతణ్ణి కేకేసుకు వొస్తానుండు. (వెళిపోతాడు)

సుబ్బారాయుడు: దండలు వెయ్యడం మతలబీ గుర్తుంచుకున్నారు కదూ, తిమ్మయ్యగారూ? మీారు సెక్రటరీ కూడాను!

తిమ్మయ్య: కంఠతా వొచ్చేస్తేనే. మంత్రిగారు కారుదిగ్గానే మీారు వేస్తారు మొదటిదండ. ఆయన ఉపన్యాసం ప్రారంభించేటప్పుడు నేను వేస్తాను రెండోది. మార్బిలు స్లేబ్ స్థాపితం చేస్తూన్నప్పుడు వైస్ ప్రెసిడెంటుగారు వేస్తారు మూడోది. ఏం? అంతేనా సంగతి?

సుబ్బారాయుడు: అయితే మరి సేట్జీ మాటేవిటి?

తిమ్మయ్య: సేట్జీమాటా? అదేవిటి?

సుబ్బారాయుడు: శంకరం చెప్పలేదా యేవిటి కర్మ?

(లేదన్నట్టు తిమ్మయ్య తల అడ్డంగా తిప్పుతాడు)

సుబ్బారాయుడు: వెయ్యిరూపాయిలకి చెక్కు యిస్తూ సేట్జీ మరీమరీ చెప్పేట్ట, తనచేతి తిప్పకుండా పువ్వుల దండ వేయించాలని. మంత్రిగారితో ఏవో వ్యవహారా లున్నాయట అతనికి.

తిమ్మయ్య: ఉహ్—చాల్లెద్దూ. అంతగా కావలిస్తే ఆయన వెళ్లిపోడానికి కారెక్కుతూన్నప్పుడు వెయ్యమను!

(రాజారావు వచ్చి, నిలుచుంటాడు—మాటలు వింటూ)

సుబ్బారాయుడు: ఓహో సేట్జీని నీ కింకా తెలియదు కాబోలు! పదిమందీ చూస్తూ ఉండగా, ఓమూల ప్రెస్సు ఫోటోగ్రాఫర్లు కెమెరాలు రెడీగా పట్టుకుని ఉంటే, వళ్లిగా దండవేసి—మంత్రిగారూ తనూవున్న ఫోటో పేపర్లో చూసి బొజ్జ నిమిరించుకుందాం అని అనుకుంటున్నా డతను. ఫోటో అంటే జ్ఞాపకం వచ్చింది. ఫోటోగ్రాఫ రేడీ?

రాజారావు: అయిదునిమిషాలు ముందుగా వొస్తానని కబురెట్టేడు. అంతకన్నా పెందరాళే రావడానికి అర్జంటుగా గంటస్తంభందగ్గిర ఏదో పనుందిట, బజార్లోను.

తిమ్మయ్య: బజార్లో పనేవిటి? ఏ కాఫీ హోటలులో తగలడతాడు. ఇక్కడే ఏడుద్దుగాని అని రమ్మనకపోయా?

రాజారావు: అది కాదోయ్. అక్కడ యెవడో లబ్బీసాయిబు ధాన్యపుకొట్లు కట్టేట. వాటికి ఓపెనింగ్ సెరిమనీ, ఫోటోలున్నూ.

సుబ్బారాయుడు: లబ్బీసాయిబూ, ధాన్యపుకొట్లూ ఫోటోలూనా? లక్షణంగా వుంది!! పోనీ వాడిబాధ మన కెందుకు? టైముకి తగులడతా నన్నాడు గద—ఊం. పువ్వుల దండలమాట అనుకుంటూ ఎందులోంచో ఎందులోకో పోయేం.

తిమ్మయ్య: ఓపని ఎందుకు చెయ్యకూడదూ? ఇప్పుడు మరి కలుపసిదు. ఈమాటు ఏకైవా

యిలాంటి సందర్భం వచ్చినప్పుడు నీ చేతే వేయిస్తాం అని వచ్చు చెబుతేనో ?

సుబ్బారాయుడు : అంత వెర్రి బాగులాడు కాదు వేటు. ఏంచేసాడో తెలుసా ? చెక్కు రేపటి తారీకు వేసి యిచ్చేడు. ఇప్పుడు మనం ఏదైనా తంటా తెచ్చిపెట్టేమా, రేప్పొద్దున్నే ఫోనులో చెప్పేస్తాడు బేంకువాళ్ళకి, ఫలానా చెక్కు పట్టొద్దని. నీ మాత్రం గడుసుతనం లేకపోలేదు, వాడికి !

రాజారావు : పోనీ, మంత్రిగారి ఉపన్యాసం ముగుస్తూ ఉండగా చెయ్యమంటేనో ?

తిమ్మయ్య : ఏడిచినట్టే వుంది. అసలు ఆయన ఉపన్యాసం ముగుస్తుందని నీకా ధీమా యేమిటి కొంత మంది, ఉపన్యాసాలకి ఆరంభిస్తే అంతంటూ మరి కనపడదు ! కాకపోయినా అలా చెయ్యడం లాంఛనం కూడా కాదు.

సుబ్బారాయుడు : ఏదో ఏడుస్తాడు లెద్దూ.

తిమ్మయ్య : వాడిమాటకేంగాని, నా కొక్కమారు బావురుమనా లనిపిస్తోంది—యీ పెద్ద గజిబిజిలో మతికొస్తా పోయి ! ఈ మాటెందు కెప్పటికి తేవులుతుందో గాని !

(ఎలక్ట్రిషియను కొన్ని వైర్లూ, పట్టకారూ, స్క్రూడ్రైవరు యిత్యాదులతో ప్రవేశం)

సుబ్బారాయుడు : ఏమండీ, లౌడ్‌స్పీకర్లు అవీ సరిగా వున్నట్టేనా ?

ఎలక్ట్రిషియను : ఇదుగో. మైక్ టెస్టు చెయ్యడానికే వచ్చాను.

(మైక్ దగ్గిరకి వెళ్లి మునివేళ్లతో టకటక కొడతాడు. ధ్వని వినిపించదు)

తిమ్మయ్య : ఏమి స్వామీ, ఉలుకూ పలుకూ లేదు మైకూ ?

ఎలక్ట్రిషియను : నిముషంలో రైటుచేస్తానండీ. ఎక్కడో లూజ్ కనక్షను ఉన్నట్టుంది.

(మైక్ ఎక్విప్‌మెంటులో తంటాలుపడుతూ ఉంటాడు. మిగతావాళ్లూ సుబ్లు వెళ్లబెట్టి ఎంతో ఆతృతగా చూస్తూ వుంటారు)

ఆఁ. అదుగో ! నే ననుకున్నట్టే అయింది. వాల్వు కాలిపోయింది.

రాజారావు : స్పేరు యింకోటి వుందా ? యిప్పుడు కొని తేవడానికి టైము లేదు.

ఎలక్ట్రిషియను : మరేం భయంలేదండి. రాత్రల్లా ఉండిపోవలసివచ్చినా సరే. దీన్ని బాగుచేసి తీరతాను.

రాజారావు : రాత్రల్లా నువ్వెందుకూ ఉండిపోవడం? మాకు టీ దండుక్కూ కాకపోతేనూ !

శంకరం : ఇదుగో, ఏమండోయ్, మాకు మరో పావుగంటకల్లా మైకు రెడీ అవాలి. రాత్రీ రేపూ మీరు యేం చేసుకున్నా మాకు అవసరం లేదు.

ఎలక్ట్రిషియను : (వీళ్ల మాటలు వినిపించుకోకుండా, అక్కడో సీలా, యిక్కడో స్క్రూ బిగిస్తూ) అదీ–ఈసారి సరిపడిందండి. మీరో రెండు ముక్కలు అనండి మైకులోకి.

[సుబ్బరాయుడు దర్జాగా మైకుదగ్గిరకి వెళతాడు. కాని, యేం మాట్లాడాలో తెలియదు. ఒక్కనిమిషం నిశ్శబ్దంగా నిలుచుని, గట్టిగా గొంతు సవరించుకుంటాడు. ఆ దగ్గు (*Exaggerate*) అయి విపరీతమయిన ధ్వనిగా వినిపిస్తుంది.]

ఎలక్ట్రిషియను : ఓ, సరిగానే ఉంది. ఏదీ యీ సారి రెండుమాట లనండి. లెవల్ ఎడ్జస్టు చేస్తాను.

సుబ్బరాయుడు : (మళ్లీ ఏం చెప్పాలో తెలియక, జేబులోంచి ఉపన్యాసం కాగితం తీస్తాడు) "మంత్రివర్యా, సోదరసోదరీమణులారా ! నేను యీ శుభసమయాన మన సంఘానికి యీ పునాదిరాయి వెయ్యడానికి మహామహులయిన శ్రీ మంత్రిపుంగవులు పూనుకోడం అన్నది మన సంఘపు మహాద్భాగ్యం...

(ఈ స్పీచ్ చెబుతూన్నంతసేపూ, ఎలక్ట్రిషియను ఏవో మీటలు నొక్కి సీలలు బిగిస్తూనే వుంటాడు. కంఠధ్వనిలో హెచ్చూ, తగ్గూ, అప్పటప్పటి "కంయ్ కుంయ్" మనీ, "గుంయ్ బంయ్" మని శబ్దాలూ పుట్టి చాలా వికృతంగా వినిపిస్తుంది) మంత్రిగారి మూర్తిమంతం ఎంత స్థూలమో వారి హృదయం అంత విశాలం అనీ, మాపులు అంత చల్లనివనీ—(అర్ధోక్తి)

తిమ్మయ్య : (మాటకి అడ్డొస్తూ) వారి ఖద్దరు బట్టలు అంత తెల్లనివనీ మాకు వేరే చెప్పనక్కరేదు!... వెరీగుడ్...ఏమయ్యా, మెకానిక్కూ ? యింక సరిపోయిందా?

ఎలక్ట్రిషియను: సరిగానే వుంది కానండీ, మైకుకి కాస్త దూరంగా నుంచుని మాట్లాడాలండి మరి. లేకపోతే—

సుబ్బారాయుడు : తెలుసు లేవయ్యా. బొత్తిగా స్కూలుపిల్లలకి చెప్పినట్టు చెబుతా వేం?

(శంకరం కంగారుగా ప్రవేశం)

తిమ్మయ్య : (ఏదో పుట్టిమునిగిందని గ్రహించి) ఏమిటి శంకరం?

శంకరం : సెట్టి పది నిముషాల్లో వొస్తున్నానని కబురంపేడు. ఈలోగా వాడు చదవడానికి చిన్న ఉపన్యాసంట—మనం—

సుబ్బారాయుడు : (మండిపడుతూ) ఏమిటీ నాన్సెన్సు !

శంకరం: ఉపన్యాసం చెప్పిస్తే మరో రెండు వందలు విరాళం యిస్తానన్నాడు.

సుబ్బారాయుడు: ఇదేం స్టాక్ ఎక్స్ఛేంజి అనుకున్నాడా వాడి మనసులో?

తిమ్మయ్య: వంకాయలబేరంకన్నా కవి కష్టంగా ఉంది.

రాజారావు: ఇదో రక్తం బ్లాకు మార్కెటింగు!

శంకరం: (చేతిలో పర్సు అటూ యిటూ ఆడిస్తూ) మీరేమన్నా సరే గాని, మనకి ఓ నాలుగు రాళ్లు చేరడం ప్రధానం. ఎలా సంపాదించినా సరే. ట్రెజరర్ని నా మాట వినండి. ఇప్పట్లో డబ్బు యెంతైనా అవసరం, మనకి.

సుబ్బారాయుడు: సరే, ఏడవనుస. ఉపన్యాసాలే ఏడుస్తాడో భరతనాట్యాలే అఘోరిస్తాడో సు!

(ఆర్కిటెక్టు కోదండరావు ప్రవేశం — కాకీ నిక్కరూ, తెల్లటి టెన్నిసు షర్టూ, చొక్కా చేతులు పైకి మడిచివుంటాయి—కాలికి, క్రిందికి మడిచిన సాక్సూ, పంజాబీ సాండల్సు—నిజరు పెట్టెలోంచి ఓ సిగరెట్టు తీసి, ఆప్యాయంగా మాసి మళ్ళీ పెట్టేసి, దాని పక్కనే వున్న బీడీతీసి ముట్టిస్తాడు!

సుబ్బారాయుడు: ఏమండీ కోదండరావు గారూ, మీరూ యిలా చేస్తే యెలాగ చెప్పండి! ప్లైను ఎంతయిందో చూసేరా?

కోదండరావు: నిన్న రాత్రి అల్లా మీ బిల్డింగు ప్లానే రాస్తూ కూచున్నానండి. తెల్లారగట్ల లేచి కూడాని పూర్తిచేసేను. (నోటినిండావున్న పొగ మేఘంలాగ వొదుల్తూ) అయితే, దీని మొహం లేగ తెమ్మా, నిద్దరకళ్ళని యెక్కడ పెట్టేనో గాని—(అర్థోక్తి)

సుబ్బారాయుడు } (ఆదుర్దాగా) కొంపదీసి
తిమ్మయ్య } కనపళ్ళేదా యేమిటి?

కోదండరావు: ఆఁ. అలాగని పూరుకుంటావా మరి? దాని తాతలాంటిది యింకోటి కనపడింది. హాల్లో అలంకారంగా వుంటుందని తీసుకొచ్చేను. చూడండి ఎంత పెద్ద స్కేల్లో వేసిన ప్లానో! చివర కుర్చీలో కూచున్నవాడికి కూడా స్ఫుటంగా అనుతుంది.

సుబ్బారాయుడు: సరే—ఆ వేపుగా తగిలించండి. డ్రాయింగ్ పిన్ను పట్టుకొచ్చేరా? ఊఁ—మీ పనిమీద మీరుండండి. ఇంక ఆట్టే వ్యవధి లేదు మరి.

(కోదండరావు పక్కకి వెళిపోతాడు)

తిమ్మయ్య: ఏదయితే నేంగాని పెద్ద ప్లానే పట్టుకొచ్చేడు పాపం, కదూ రాజారావ్?

రాజారావు: కాని, అబ్బాయ్. యెవ్వడూ నమ్మడు. అందులో ఒకచోట "ఆపరేషను గది" అనికూడా నాకంట పడింది.

తిమ్మయ్య: ఆఁ. అంతలాగ యేమడు చూడో చ్చేడు లేవోయ్. అసలు మనుషుల్ని ఆ వేపుకి వెళ్ళనిస్తే కదూ—(ఆరాస్తగా) ఉండు, రాజారావు. ఏదో కారు ఆగిన చప్పుడులా వుంది. అతిథులంతా వస్తున్నారు కాబోలు. శంకరం! నువ్వెళ్ళి రిసీవ్ చేసుకోమరి.

శంకరం: ఇదుగో వెళుతున్నా (వెళిపోతాడు)

సుబ్బారాయుడు: అవునో యీమాటు వరసగా వినిపిస్తున్నాయి హారన్లు! (వాచీ చూసుకుని) ఇహ నేం? అయిదుకి రెండు నిముషాలుంది. రాజారావ్! నువ్వుకూడా వెళ్ళి కాస్త చూడవోయ్. శంకరం ఒంటిగాడు అయిపోయేడు, పాపం. నేనూ, తిమ్మయ్యా కూడా వచ్చేస్తున్నాం ఒక్క నిమిషంలో.

(రాజారావు వెళిపోతాడు. అప్పటికి గుంపులు గుంపులుగా ప్రజలువస్తారు. ఒకరిని ఒకరు పలకరిస్తూన్నట్టూ, నవ్వుతూ మాట్లాడుకుంటూన్నట్టూ ధ్వనులు—అందులో కొంతమంది—పేద గాంభీర్యంవున్న అనామధేయులు—ముందు సీట్లకోసం పరుగులెడతారు. అంతలో బొజ్జ ఆడించుకుంటూ సేట్జీ, అతని వెనకాలే శంకరంన్నూ ప్రవేశిస్తారు)

సేటు: (ఓ పెద్ద సోఫాలో కుప్పలాగ కూలబడి) నాకిది సరిపోయింది లెండి, శంకరంగారూ మీరింక అట్టే శ్రమపడకండి.

శంకరం: (అత్రితుడిలాగ పళ్లికిలిస్తూ) చిత్తం. చిత్తం.

సేటు: ఇదుగో, శంకరంగారూ, మాట—మీ ప్రెసిడెంటుగారితో (ఆపై మాటలు ఆడియిన్సు గోలలో వినపడవు).

శంకరం: అలాగే యిప్పుడే చెప్తాను. (శంకరం వెళిపోతాడు)

సుబ్బారాయుడు: ఏమిటంటాడు శంకరం, సేటూ?

శంకరం: సేటుతో మాట్లాడ్డం మానేవుకదూ? అయిదు వేలు విరాళం యిచ్చినట్టు ఎనౌన్సు చేస్తే అయిదువందలు యిస్తాట్ట.

తిమ్మయ్య: అయిదువందలూ, నూట పదహార్లూ కాదబ్బాయ్. వెయ్యి యిమ్మను. కేష్‌డౌన్!

(శంకరం వెళ్లి తొందర తొందరగా సేటు చెవిలో గుసగుసలాడి తిరిగివస్తాడు)

శంకరం : జెయ్యికి ఒప్పుకోలేదుగానీ, ఏడు వందల యాభై యిస్తానన్నాడు, అది కష్టంమీద.

తిమ్మయ్య : ఆల్ రైట్ అన్నట్టు శంకరం, మరిచిపోయేవు సుమీ ఫలానావారు అయిదువేలు చందా అని చెప్పి చెప్పడంతోనే చప్పట్లు మిన్ను ముట్టిపోవాలి. నువ్వొక్కొట్టి మన వాళ్లందరిచేత కొట్టించు నాలుగు మూలలా సద్ది ఉంచు మనుషుల్ని లేకపోతే ఏడురూపాయిలైనా రాలవు !

(అడియన్సులో కలకలం)

సుబ్బారాయుడు : అవతల ఏదిటా సందడీ! మంత్రిగారొచ్చేరు బాగుంది. ఇంక బయటికిపోదాం రండి.

(సుబ్బారాయుడూ, తిమ్మయ్యా వాళ్లూ తొందరతొందరగా పువ్వులదండలూ అవీ పట్టుకెళ్లి మంత్రిగారిని కలుసుకుంటారు. మంత్రిగారికి కమిటీ మెంబర్లనీ, సేట్లనీ పరిచయం చేస్తారు)

తిమ్మయ్య : చిత్తం. చిత్తం. తమరు యీరోజు వేంచెయ్యడం నిజంగా మా నోములు ఫలించేయి. ఇంక సభ ప్రారంభిద్దామా ? ఇదుగో, ప్రోగ్రాం కాగితం చిత్తగించండి

మంత్రి : ఒక్క నిముషం ఆగండి. కారు యీ వీధిమలుపు తిరుగుతూ ఉంటే—ఆగడి ఓసారి యిక్కడికి వచ్చినట్టనిపించింది. ఏదో పొరపాటే అయివుంటుంది లెండి—కాని ఏదో లీలగా జ్ఞాపకమొస్తున్నట్టుంది. మరి క్రిందటేడూ—యీదసరా రోజుల్లోనే—యిక్కడ ఏదో పబ్లిక్ లైబ్రరీకో, రీడింగు రూముకో శంఖుస్థాపనచేసినట్టు లీలగా గుర్తు! ఏమంటారు ?

(సుబ్బారాయుడూ, తిమ్మయ్యా, శంకరం ఒకరి మొగాలు ఒకరు చూసుకుంటారు. జవాబు మాత్రం శూన్యం)

మంత్రి : మిమ్మల్నే అడుగుతూఉంట, సెక్రటరీగారూ !

తిమ్మయ్య : సార్. ఆరునెలక్రితంనుంచీ నేను సెక్రటరీనండిసార్. మరి అంతకుముందు ఏం జరిగిందో నాకు ఎలా తెలుస్తుంది చెప్పండిసార్ !

మంత్రి : మీ కేమయినా జ్ఞాపకం ఉందండీ, ప్రెసిడెంటుగారూ ?

సుబ్బారాయుడు : అబ్బే, లేదుసార్. ఏడాదికి తొమ్మిదినెలలు నాకు క్యాంపులే నాయిరి! బొంబాయీ, కలకత్తాను. షాపూ, వ్యాపారమూ కాదుటండీ ?

మంత్రి : (తలపంకిస్తూ) ఆహా—సరే. అయితే యీ జాగా మీ సంఘానికి దఖలుపడిందా ?

సుబ్బారాయుడు : దఖలుపడినట్టేనండి. ఇంకా హక్కు భుక్తాలు లేవుగానీ అంటే అదే, యింక కొద్దికాలంలో కానేస్తాం సార్.

మంత్రి : బాగానే వుంది. కాని ప్రస్తుతానికి (ఒక్క సెకండు ఆగి) యీ జాగాలో మీకు ఏమీ హక్కు లేదన్నమాట. అంటే, ట్రెస్పాస్ ! ఏం ?

(కత్తివేస్తే నెత్తురు లేకుండా సుబ్బారాయుడూ, తిమ్మయ్యా, శంకరం, మొహాలు దించుకునుంచుంటారు. సేఠ్జీ హఠాత్తుగా జ్ఞాపకంవచ్చి, చేతులో పువ్వులదండ చూసుకుంటాడు; ఇంకా అవకాశం చెయ్యిజారిపోకుండా మంత్రిగారి మెడలో వెయ్యబోతాడు.)

మంత్రి : (నివారిస్తూ) ఒక్క నిముషం ఆగండి సెట్జీ-ఈమున్న పునాదిరాళ్లు వేసివేసి జబ్బలు నొప్పెడుతున్నాయి. అసలీ వ్యవహారం కాస్త తిరిచి చూసి ఎలావుందీ...ఊఁ (నాలుగు మూలలా కలియజూచి) ఆ గోడమీద ప్లానేమిటి?

తిమ్మయ్య : (నూతిలోంచి మాట్లాడినట్టు అంటాడు) మా బిల్డింగు బ్లూప్రింటండి.

మంత్రి : అచ్చా. ఏదీ, పదండి చూద్దాం.

(మంత్రిగారు ముందూ, సుబ్బారాయుడూ. తిమ్మయ్యా, శంకరం అతని వెనకనా వెళతారు, కాళ్ళకి ముచ్చెమటలూ పోసిపోయి, రుమాలుతో ఒకడూ, పర్సు చేత్తో ఒకడూ, పంచె కొంగుతో యింకొకడూ మొహాలు తుడుచుకుంటారు సేటు కూడా కాస్త వెనకాలే వెంటబడతాడు.)

మంత్రి ; బాగుంది. ఎవరు వేసేడో గాని ప్లాను మట్టుకు మా చక్కగా ఉంది. రెండంతస్థులు కూడాను. అందంగానే వుంది.

సుబ్బారాయుడు : (యిచ్చకంగా) తమ ఆశీర్వచన బలం వుంటే చాల్ను సార్. జిల్లా మొత్తం మీద యిలాంటి అందమైన బిల్డింగు యింకోటి లేదనిపించేస్తాం.

మంత్రి : (ఆమాట వినిపించుకోకుండా, ప్లాను చూస్తూ) ఇదేమిటండోయ్ ? ఆపరేషను గది అని రాసుందేమిటి ?

(తిమ్మయ్యకి ప్రాణాలు నిలువునా ఎగిరిపోయి) బుష్షర్టు బొత్తాంలు విప్పి, ప్రోగ్రాం కాగితంతో విసురుకుంటాడు.)

మంత్రి : (ఇంకా ప్లాను చూస్తూనే) అరెరే! యిది కంపౌండింగ్ రూమ్! అది ఫీమేలు వార్డు! శాభాష్. ఏమండీ సుబ్బారాయుడుగారూ? మీరు

లోకం మరమ్మత్తు సంఘానికేనా అధ్యక్షులు? అప్పత్రికా? లేకపోతే నేను గానీ దారితప్పి తప్పు చోటికి చేరుకొన్నానా... దారి తప్పిపోవడమూ కద్దు లెండి. మొన్న ఓమాటు యిలాగే, ఏదో బ్రిడ్జి తెరవడానికని వెళ్ళేవాణ్ణి—డ్రైవరు ధర్మమా అని—అనాథపిల్లల స్కూల్లో ప్రైజులు పంచిపెట్టి చక్కా వచ్చేను!

సుబ్బారాయుడు }
తిమ్మయ్య : } (చివర వాక్యం విని) ఇ—హీ—హీ (అని నవ్వుతారు)
శంకరం : }

మంత్రి : అవును గాని, నే నడిగినమాట.

(సీట్లో చల్లగా జారిపోతాడు)


సుబ్బారాయుడు : తిమ్మయ్యగారు సెక్రటరీ అండి. ఆతనికి బాగా తెలుసును.

తిమ్మయ్య : సెక్రటరీ నన్న మాటేగా నండి, సార్, అసలు కీలకం అంతా శంకరంగారికి తప్ప యింకెవ్వరికీ తెలవదండి. ట్రెజరర్ అయితే నేం గాక.

శంకరం : (ఘటాల్న) ఫస్. నోరు నుయ్. అంటే, సార్ మిమ్మల్ని కాదండి. నే నెవరోనండి. మరెవరోనండి...(నీళ్ళు నమిలేస్తాడు)

మంత్రి : (మైకుదగ్గిరకి వెళ్లి) లేడీస్ అండ్ జెంటిల్మెన్ (సభలో చప్పట్లు మిన్ను ముట్టాయి. ఆగోల తగ్గనిచ్చి) సోదర సోదరీమణులారా! మీరంతా, పాపం, అనేకం అయినపనులు మానుకుని చాలా సేపయి వచ్చిఉన్నారు. ఇంక ఆట్టే ఆలస్యం లేకుండానా ఉపన్యాసం చప్పున ముగించేస్తాను. నేను యీ సమావేశానికి వచ్చి యిక్కడ మిమ్మల్ని అందర్నీ కలుసుకోవడం నాకు యెంతఆనందకరంగా ఉందో, మాటల్లో వివరించలేకుండా వున్నానంటే నమ్మండి (సభలో చప్పట్లు) అందులో యిలాంటి కమిటీ మెంబర్లని కలుసుకోవడం మరీ సరదా అనిపించింది (హియర్, హియర్ అని కేకలూ, చప్పట్లు) ఇంక ఒక్కటే ఒక్క తుది వాక్యం. నా విధినిర్వహణలో చెప్పవలసినమాటాను. ఈలోకం మరమ్మత్తు సంఘానికి తలపెట్టిన శంఖుస్థాపన కార్యక్రమం—అన్యాయం, చట్టవిరుద్ధమున్నూ.

(అంటూ తిమ్మయ్య చేతుల్లో పూలమాల తీసుకుని సుబ్బారాయుడి మెడలో వేస్తాడు. సుబ్బారాయుడు పక్కన ముహం తిరిగి పడిపోతాడు. జాలిగా తెర వాలుతుంది!)



ఒనీడా సమితి - హంఫ్రీ నాయిస్

★

కొన్నాళ్లక్రితమే మన తెలుగుదేశంలో చాలా మందికి ఫ్రీలవ్ సొసైటీ పేరు పరిచయమైంది. కాని ఒక మహా సిద్ధాంతం పేరిట సుదుకీకం అది ఏర్పరిచి, శాస్త్రసిద్ధంగా దాన్ని ఆచరణలో పెట్టించి, తను అలజడిపాలై దేశాన్ని సంరంభ పెట్టిన మహాత్ములు లేకపోయారు కాదంటే, స్వేచ్ఛా విహారులను నిందించటానికి 'ఫ్రీలవ్ సొసైటీ' అనే మరొక 'తిట్టు' కూడా సనాతనులకు ఆసరాగా దొర కటం మాత్రం జరిగింది.

ఒక శతాబ్దం క్రిందే అమెరికా న్యూయార్క్ పరగణాలో "ఒనీడా సమితి" అని ఒకటి బయలు దేరింది. దాన్నే మావూళ్లభాషలో అమెరికన్లు ఫ్రీలవ్ సొసైటీ అనేవారు. ఆ సమితిని స్థాపించి సిద్ధాంతాలు తీర్చిదిద్దిన ఋషి, జాన్ హంఫ్రీ నాయిస్. "పరిపక్వ సంఘంలో ఆహార పానీయాల విషయా లలో లేని నిగ్రహనియమాలూ, సాంఘిక నిబంధనలూ మిగుల కర్మ విషయంలో, ఉండవలసిన న్యాయమేదీ కనిపించదు. సిగ్గుపడవలసిన విషయం కూడా, వాట్లలో లేనట్లే, ఈ విషయంలోనూ లేదు" అని ప్రకటించాడు.

ఆ రోజుల అమెరికన్ సంఘానికి ఈ సూక్తులు మహా ఘోరంగా గోచరించాయి. నాయిస్ స్థాపించిన వింత సంఘం, ఇతరత్రా చాలా వృద్ధిలోకి వచ్చినా, తను బయలు దేరిన నాటి ఆదర్శాన్ని—స్వేచ్ఛావిహా రాన్ని—వదులుకోవలసివచ్చింది. కాని ఒనీడా సంఘం స్వయంపోషకమై ప్రారంభించిన పారిశ్రా మిక వ్యాపారంమాత్రం, గొప్ప అభివృద్ధిపొంది పెద్ద అమెరికన్ వ్యాపారసంస్థగా అయింది.

జాన్ నాయిస్ వెర్మాంటర్ అనే పట్టణంలో ౧౮౧౧ సంవత్సరంలో జన్మించాడు. ౧౯ ఏట డార్ట్‌మత్‌లో ఉత్తమశ్రేణిలో పట్టభద్రుడయ్యాడు. న్యాయశాస్త్రాభ్యాసం ప్రారంభించాడు. యేల్ డివినిటీ (మత) పాఠశాలలో చేరాడు. అక్కడి పూర్వాచార మతభోగలు, సాంప్రదాయిక సిద్ధాం తాలు, ఆ ఆయుక్తికపోగ అంతా అతనికి తలనొప్పి చేసింది. పాపరహితమైన పరిపూర్ణత్వం, బ్రతికుం డగా భూమిమీదే సాధించవచ్చునని అతని విశ్వాసం. ఆ విశ్వాసంతో అక్కడినుంచి వెర్మాంట్ వచ్చేసి, తనతో ఏకీభవించే కొందరిని చేర్చుకొని, "పరిపూర్ణ వాదు"లని ఒక సంఘాన్ని ఒక పత్రికనీ స్థాపిం చాడు. రాను రాను సంఘం వృద్ధి కాజొచ్చింది. ౧౮౪౮ నాటికి సంఘంలో ౫౮ పెద్దలూ, ౫ పిన్నలూ సభ్యులుగా ఉండేవారు. కాని సంఘంచుట్టూ పొగ రాజుకొని ఊరంతా నిప్పుమంట మండించసాగింది.

అప్పటికే నాయిస్ తన అనుచరులకు తన సిద్ధాంతాన్ని, అపూర్వమైన సిద్ధాంతంగా బోధిం చాడు. దానికి 'మేల్, కాన్టినెన్స్' అని పేరు పెట్టాడు. (ఆంగ్లవైద్యులు కోయిటస్-రిజర్వేటస్ అంటారు. సంభోగంలో వీర్యపతనం అవకుండా జాగ్రత్త పడటం)

ఇప్పుడు ఇక 'సంకీర్ణ వివాహ' సిద్ధాంతాన్ని, (*Complex Marriage*) ప్రవచించాడు. స్థూలంగా ఈ సిద్ధాంతం చెప్పేది; ఒక సంఘంలో సభ్యు లందరూ ఒకరొకరు సమానంగా ప్రేమించు కొంటారు. శాస్త్రీయ వివాహం, పాతివ్రత్యాన్ని పెద్ద చేసి, ఆ విషయానికే ఎక్కువ ప్రాముఖ్య మియ్యటం వల్లే, మరీ హీనగా తయారయింది. ఇల్లాంటి హీనపు "పత్నీ సంఘంలాంటి" సంఘాలు సులభంగా వదులు కోవచ్చును. ఈ సంఘంలో స్త్రీ పురుషులు, సంఘం వారలలో ఎవరి ఇష్టంవచ్చినవారితో వారు స్వేచ్ఛగా విహరించవచ్చు. అప్పుడు కలను ప్రసక్తి ఉండదు. అయితే ఈ కలయికలవల్ల సంతానం మాత్రం కలుగకుండా జాగ్రత్తపడాలి. ఆ పత్నీ సంఘంవారు స్తంభనమాత్రాన్ని, ఈ స్వైరవిహార

సూత్రాన్ని కూడా ఆమోదించి, ఆచరణలో పెట్ట సాగారు.

౧౮౪౭ లో పట్నీ వెర్మాంట్ రాష్ట్రంలో ఒక చిన్న కుగ్రామం. అల్లాంటిచోట ఇల్లాంటి అనాచార విజృంభణం ఏ కొద్దిమందిలో ఎక్కడ ఎల్లా జరుగుతున్నా ఊళ్ళో నలుగురు నోళ్ళల్లో పడక దాగదు. ఈ "పరిపూర్ణవాదుల" సంఘ చర్యలు కూడా ఊళ్ళో అలజడి కలిగించక మానలేదు. కాని అల్లాగే నాలుగేళ్లు గడిచిపోయాయి. ఇంతలో, ఒక లోకసేవకుడు, పల్లెటిపడుచులను, ముగ్గురను, ముగ్గురిని ఈ సంఘంవారు, తమ వలలోకి ఈడ్చారని అక్కడ వదటంకంటే, ఆ అమాయిక కన్యలకు మరణం మేలనీ, ఊరి పెద్దలకు ఉద్బోధించాడు. ఆ పిల్లలను మాయచేసి బలాత్కరించారని ఊరి గవర్నమెంటు ప్లీడరు కేసు పెట్టాడు. ౧౮౪౭ జూన్ ౧౦ తారీఖున కేసు విచారణకు వచ్చింది. నాయిస్ ను, వ్యభిచార నేరంమీదా, మరిద్దరిని, అసభ్యరతి నేరం మీదా విచారణచేయ ప్రారంభించారు. నాయిస్ ను అరెస్టుచేసి, 2000 డాలర్ల బాండుమీద విడుదల చేశారు. నాయిస్ తరఫు లాయరు, సంఘంవారంతా మొత్తంగా ఆ వూరినుంచి మకాం ఎత్తివేయటం మేలనీ, లేకుంటే ఆ కోపంమీద గ్రామ ప్రజలు ఉద్రేకంతో వాళ్ళ నేంచేసినా చెయ్యగలరనీ సలహా యిచ్చాడు.

నాయిస్ కి తన ఉద్యమాన్ని గాని తన స్నేహితులను గాని వదలాలని ఎంతమాత్రమూ లేదు. న్యూయార్క్ జిల్లా మాడిసన్ తాలూకాలో ఒనీడాక్రీక్ అని అడవులమధ్య ప్రదేశంలో జొనాథన్ బర్ట్ అనే స్నేహితుడు దొరికాడు. ఆయన నాయిస్ "పరిపూర్ణ వాద" మతాన్ని ఆ సంఘపత్రికలలో చదివి ఆమోదించి ఉన్నాడు. ఒనీడాక్రీక్ అనే భూఖండం ఆయనదే. నాయిస్ ఆయన సంఘం అంతా వచ్చి తన ప్రదేశంలో నివాసం ఏర్పరచుకోవచ్చని ఆహ్వానించాడు. నాయిస్ కి పద్ధతి నచ్చింది. అనుచరులంతా ఒక్కొక్కరే అక్కడికి చేరసాగారు. ౧౮౪౮ వసంతం నాటికి ఏబదిమంది పైగా అక్కడ చేరారు. వాళ్లు సోమరులు కారు. కార్యదీక్షాపరులు. ఒక మహోత్సాహంతో, ఆ జీబు అడివినంతా, తెగనరికి, పుట్టలు కట్టుకొంటూన్న చీమలలాగా అనవరతం శ్రమచేసి, ఒక ఋషివాటికగా తయారుచేశారు. ఒక రంపం ఫ్యాక్టరీ స్థాపించారు. చెట్లు స్వయంగా నరికి, దూలాలన్నీ తయారుచేసి ఇళ్లు కట్టుకోసాగారు. నేల చదును చేశారు. పొలాలు దున్నారు. "పరిపూర్ణవాద పాఠశాల"ను ఒక చిన్న గుడిసెలో ప్రారంభించారు. అక్కడ చేరినవారంతా ఇరవై ముప్పయి ఏళ్ళ మధ్యనున్న పడుచువారు. తమ గురువుగారి, ప్రబోధ, ఆదరణలవల్ల ఉత్తేజితులై మహోత్సాహంతో కార్యదీక్షకు పూనుకున్నవారు. వాళ్ళల్లో అన్ని వృత్తులవారూ, కంసాలులూ, కమ్మరులు, వడ్రంగులు, తాపీపనివారు, అన్నిరకాల కార్మికులూ ఉన్నారు. అక్కడచేరిన యువతులందరూ, గృహవిద్యలన్నీ బాగా నేర్చుకున్న కుశలులు. నూలు వడకటం బట్టలు నేయటం, బట్టలు కుట్టటం, అల్లికలో పిలు, నేసుబుట్టలు సంచులు, పెట్టెలు, మొదలైన చేతిపనులన్నీ చేయగలవారు. చేతిపనుల వస్తువులను బజారులో అమ్మించి, సంఘానికి డబ్బు చేకూర్చిపెట్టేవారు.

అన్నీ చక్కగా సాగిపోతున్నాయి. ఇంక సభా భవన నిర్మాణానికి పూనుకొన్నారు. మూడంతస్తుల మేడ కట్టారు. పైన పెంకుకప్పుతో నాల్గవ అంతస్తు కూడా ఉంది. కట్టడం ౧౦౦ అడుగులు పొడుగు 70 అడుగులు వెడల్పు ఉంచారు. భవనంలో అందరికీ ఒకే సమిష్టి భోజనశాల, బడి, అచ్చు ఆఫీసు. మూడవ అంతస్తులో వివాహిత దంపతులకు ఒంటరి ఆడవాళ్ళకూ వసతి. పెళ్లి కాని పురుషులూ, బాలురూ, నాలుగవ అంతస్తు పెంకుటిపాకలో పడుకొనేవారు. భవనం అంతా, ఆవిరియంత్రాల గొట్టాలవల్ల వెచ్చదనం కలిగిఉండేట్లు సౌకర్యం చేశారు. ఒక శతాబ్దం క్రిందట న్యూయార్కులో, ఈ గృహసౌకర్యాలు ప్రారంభం ఇక్కడే అని చెప్పవచ్చు.

౧౮౬౨ డిసెంబరు క్రిస్మస్ పండుగనాడు సంఘంవారు, మహోత్సవంతో ఈ భవనంలో గృహప్రవేశం చేశారు. ఆరోజు వాళ్ళంత మహోత్సాహంగా ఉండటంలో విశేషమేమీ లేదు. వాళ్ళ అపారమైన కృషికి నిదర్శనంగా ఆ భవనం తదితర సౌకర్యాలూ చేకూర్చుకో గలిగారు. తర్వాత ఇరవై యేళ్ళదాకా వాళ్ళసంఘం చాలా విజయవంతంగా నడిచింది.

ఆతర్వాత బాలమందిరం నిర్మించారు. "మాతా శిశువుల మధ్య మూర్ఖమైన భక్తి, అపేక్షలను" తొలగించాలనీ, అందుకని పిల్లలందరినీ ఒకే మందిరంలో, వాళ్ళ పోషణ, రక్షణ, శిక్షణలకు నియమింపబడిన ఉద్యోగుల చేతుల్లో పెంచాలనీ, నాయిస్ ప్రబోధించాడు. సంఘంలోని పక్షిపిల్లలనందరినీ ఈ మందిరంలోకి మార్చారు. తలిదండ్రులు పిల్లలను రోజుకొకసారి చూచివస్తో ఉండవచ్చును. కాని వాళ్ళ పెంపకం అంతా ఆ పనులకై నియమింపబడ్డ ఉద్యోగుల చేతుల్లోనే జరుగుతుంది.

ఆడవాళ్ళ వేషభాషలలో కూడ మార్పులు రాసాగాయి. ఒనీడా సంఘంలోని ఆడవాళ్ళందరివీ క్రాపు తలలు. పొట్టిగౌనులు వాళ్ళే మొదలుపెట్టారు. పొట్టిగౌనులు లేకపోతే పంట్లాములు. అవీ అక్కడే మొదలు. కాని వీళ్ళుకూడా ఊళ్ళోకి పోవలసివచ్చినప్పుడు అప్పటికి మామూలు దుస్తులుకూడా వేసుకొనేవారట.

సంఘానికి కొత్తసభ్యులు రాసాగారు. కాని చాలా మందికి ప్రవేశం లభించలేదు. పందొమ్మిదేళ్ళయేటప్పటికి ఒనీడా సంఘసభ్యత్వము ౨౦౫ దాకా పెరిగింది. చుట్టుపట్ల ఇంకా కొంత భూమిని సంఘానికి కొని, సాముదాయిక కృషి సాగించారు. సంఘం పొలాలలో గోధుమలు, ఓట్సు, బార్లీ, పత్తి, మొదలైన పంటలు సంఘసభ్యులే ప్రముఖంగా పండించసాగారు. పట్టుపురుగులను పెంచి పట్టుపరిశ్రమ వృద్ధిచేశారు. సంఘంలో చేతిపనుల కృషి అపారంగా సాగిపోతూ సంఘానికి ధనం చేకూర్చసాగింది. ఎప్పటికప్పుడు కొత్తభవనాలు నిర్మాణం అవుతూ వచ్చాయి. వారానికొకసారి పీఠాధిపతి సంఘసభ్యులకు ఉపన్యాసాలిస్తుండేవాడు.

అప్పటి రోజులలో ఆ ఉపన్యాసాలు ఎక్కువగా "సంకీర్ణ వివాహాన్ని" గురించి, "మేల్ కాంటినెన్సు" (సంభోగ సమయంలో వీర్యపతనం కాకుండా జాగ్రత్తపడటం) గురించీ ఉండేవి. ఈ ప్రయోగ విధానము ప్రతివారు నిపుణులవద్దనుంచి నేర్చుకోవాల్సిన శిక్షావిధానంగా ఉండేది. యువకులకు ఈ రహస్యాలు వృద్ధాంగనలు బోధించేవారు, యువకులు పురుషవృద్ధులవద్ద నేర్చుకొనేవారు. ఇంక సంకీర్ణ వివాహం విషయంలో. సంఘానికి 'అవాంఛనీయమైన వ్యక్తి సంబంధాల తాకిడీ తగలనీయకుండా సంఘభద్రత్వాన్ని రక్షించుకోటంలో చాలా జాగ్రత్త తీసికోబడేది. ఈవిషయంలో, మధ్యవర్తుల ద్వారా తప్ప ఏ స్త్రీని ఎవరూ సమీపించరాదు. కేవలం ఏ ఇద్దరు స్త్రీ పురుషుల మధ్యా ఏకాగ్రమైన ప్రణయబంధం ఉండటం సంఘం నిషేధించేది. సంభోగం అనేది ఏ స్త్రీపురుషు లిద్దరి మధ్యావినా, పరస్పరాంగీకారం ఉంటే చాలు. ఆ విషయంలో సంఘశాసనం లేదు. కాని—ముఖ్యమైన విషయమేమిటంటే—సంఘపెద్దల అనుమతిలేనిది ఇల్లాంటి కూటములవల్ల సంతానోత్పత్తి మాత్రం జరగకూడదు.

"పూర్వ దాంపత్యవిధానంలో, సంతానోత్పత్తి బహుళంగా, అతి విరివిగా సాగిపోతూ, చాలా క్రూరమైన శిక్షగా తయారయింది. వివేచనతో సంతతి విధానంలో, ఉత్తమ సంతానాన్ని మాత్రమే సృష్టించటంపై మా దృష్టిని కేంద్రీకరిస్తున్నాము. సంతానాన్ని కనటం, ఒక విశిష్టశాస్త్రంగా వృద్ధి పొందేవరకూ, జాతి వినాశనంనుంచి బైటపడటం కష్టం" అని నాయిస్ ఉద్ఘాటించాడు.

ఉత్తమ సంతాన సృష్టికి 'స్టిర్పికల్చర్' అని నాయిస్ పేరుపెట్టాడు. తరువాతి శాస్త్రజ్ఞులు దీనినే "యూజెనిక్సు" అనే శాస్త్రం క్రింద తయారుచేశారు. ఈ సంఘ జీవితకాలంలో ఈ విధానం క్రింద ౫౮ మంది శిశువుల సృష్టి చేయాలని ప్రణాళిక చెయ్యబడింది. నాయిస్ ఆశించినట్లు ఈ ౫౮ మంది శిశువులూ, మామూలువారికన్నా చాలా ఆరోగ్యవంతులూ, మేధావంతులూగానే జన్మించారనీ, జీవితంలో తక్కినవాళ్ళకన్న చాలా ముందంజ వెయ్యగలిగారనీ వాళ్ళ జీవితాలు నిరూపించాయి.

నాయిస్ తన బోధను తన సంఘానికే పరిమితం చేసుకు ఊరుకోలేదు. ప్రపంచం అంతా కూడా తన ప్రబోధాన్ని స్వీకరించాలనే ఆశించాడు. ఈ కృషిలో చాలా ధనము, వెచ్చించి, రాత్రింబవళ్లు కృషిచేస్తూ, "ఒనీడా సర్క్యులర్" అనే పత్రికను నడపసాగాడు. తపాలాఖర్చు లున్నచోటికల్లా ఆ పత్రికను పంపసాగాడు. "స్టిర్పికల్చర్" మీద తన ఉపన్యాసాలను కూడా ఎప్పటికప్పుడు కరపత్రాలుగా అచ్చువేసి దేశమంతటా వెదజల్లించాడు. ఈ కృషి, సంఘంపై ఆర్థికంగా విపరీతమైన

ప్రారంభించింది. సంఘసభ్యులు అనవరతం కృషి చేస్తుండేవారు. సంఘంలో తయారైన వస్తువులమీద బజారులో చాలా డబ్బే వచ్చేది. కాని పత్రికా, కరపత్రాలూ, ఈ ధనం ఎక్కువగా మింగేయ సాగాయి. సంఘం దివాలా తీసేస్థితిలోకి వచ్చింది.

సంఘంలో సివిల్ న్యూహాస్ అనే వృత్తి కారు డుండేవాడు. సంఘశ్రేయస్సుకు, తన కానుకగా, న్యూహాస్, పాలుసరి రెండువేల కత్తిర బోనులను తయారుచేసి ఇస్తుండేవాడు. ఈ బోను లను అమ్మిన డబ్బు సంఘానికి చేరేది. ఈ బోనులు అప్పటికి దేశమంతటా ప్రఖ్యాతిలోకి వస్తున్నాయి. అప్పటికి వాటికోసం సంఘానికి వచ్చే ఆర్డర్లు అన్నీ నిర్వహించటం ఏ ఒకరిద్దరవల్లా, చివరికి పదిమంది వల్లా కూడా సాధ్యమయేదికాదు. ఆ బోనుల విశేషం అంతా, ఆ ఉక్కుపనుసుకు గేవటంలో ఉంది. నాయిస్ న్యూహాస్‌తో సంప్రదించి బోనులు తయారీ ఫ్యాక్టరీలో పెద్ద మోతాదులో తయారు చేయిద్దామని ఒప్పించాడు. తయారీ మేలిమి వాసి తగ్గకపోతే తన కేమీ అభ్యంతరం లేదని న్యూహాస్ అన్నాడు. సంఘంలో యంత్రాగారం స్థాపించారు. సంఘసభ్యులే న్యూహాస్ ఆధ్వర్యాన యంత్రాలపై పనిచేయ సాగారు. వేలకువేలు కత్తెర బోనులు, పూర్వపు మేలిమి ఏమాత్రం తగ్గకుండా, యంత్రాల మీద తయారుకాసాగాయి. యంత్రాలను విద్యుచ్ఛక్తితో నడపసాగారు. ప్రశస్తమైన కత్తెర బోనులు పల్లెపల్లెలా వ్యాపించి, సంఘానికి డబ్బు చేకూర్చి పెట్టాయి. కొద్ది సంవత్సరాలలో ఏటా 300,000 కత్తెర బోనులు కర్మాగారం తయారుచెయ్యసాగింది.

సంఘం ఆర్థికంగా కూడా పుష్టి చేకూర్చుకొని, మంచి ఉచ్ఛదశలోకి వస్తున్నకొద్దీ, బైటి ప్రపంచంలో అలజడి అంత ప్రమాణంలోనూ ఎక్కువ కాసాగింది. ఇక్కడి "స్వైరవిహారా"లను వర్ణిస్తూ, అభాండపు వ్యాసాలన్నీ పత్రికల్లో రాసాగాయి. ఒనీడా లెక్క చెయ్యలేదు. ౧౮౫౦ లో ఆ ప్రాంతా లలో రైలుస్టేషన్ పడింది. సంఘాన్ని చూట్టానికి తీర్థప్రజ ఎక్కువ రాసాగారు. ప్రముఖ పత్రికలన్నీ ప్రత్యేక విలేఖరులను పంపి, పత్రికలను ఒనీడా కథ లతో నింపసాగారు.

వచ్చిన ప్రేక్షకుల కందరికీ మర్యాదగా సంఘం లోపల అన్నీ చూపించి, వారి ప్రశ్నలకు అరమరలు లేకుండా సూటియైన జవాబు లియ్యవలసిందని నాయిస్ ఉపదేశించాడు. ఇందులో దాచవలసిం దేమీ లేదని లోకానికి చాటాడు.

౧౮౫౦ నాటికి వాల్లింగ్‌ఫర్డులో సంఘశాఖ మరొకటి స్థాపింపబడింది. అక్కడ వెండిపళ్ళాల పరిశ్రమ ప్రారంభించారు. ఆ సంఘం తయారుచేసిన పళ్ళాలు మేలిరకం అవటంవల్ల, వాటికూడా అమ్మకం చాలా విరివిగా ప్రాప్తించింది. "కమ్యూనిటీ" పళ్ళాలకు ఈనాటికి అమెరికాలో మంచి చెలామణీ ఉంది. నాయిస్ రెండు సంఘశాఖలలోను సగం సగం కాలం గడపసాగాడు. ఏ శాఖలోనైనా, ఏ ఇరువురి మధ్యనైనా, స్నేహబంధాలు మరీ బలీయమై సంఘానికి అభద్రంగా తయారవుతున్నాయంటే, వారిరువురినీ వేరుపరిచి, ఆ శాఖనుంచి ఈ శాఖకో ఇక్కడినుంచి అక్కడికో పంపించేవాడు.

పత్రికల ప్రచారం మరీ ఎక్కువైపోయింది. చర్చివారు నడిపే "ఇండిపెండెంట్" అనే పత్రిక ఒనీడాసంఘంపై తీవ్రంగా దాడి సాగించింది. సంఘంలోని మతిచుతి గుణాన్ని సంఘం పారిశ్రామికంగా సాధిస్తున్న మహత్తరకృషిని విస్మరించి, సంఘంలోని వామాచార విధానాలను దుమ్మెత్తి పోయసాగింది. రాష్ట్రమంతటా "ఒనీడా సంఘాన్ని" నిర్మూలించాలంటూ సభలూ సమావేశాలూ జరిగాయి. పత్రికలన్నీ ఘోష పెట్టసాగాయి. సంఘానికి వ్యతిరేకంగా ప్రచారం తీవ్రంగా సాగింది.

కాని, సంఘంలోపలినుంచే అంతఃకలహం బైలుదేరి ఉండకపోయి ఉన్నట్లయితే, కేవలం ఈ ప్రచారంవల్ల సంఘం అంతరించి ఉండేది కాదేమో!

ఒనీడా సంఘంలో శిశువులుగా పెరిగి పెద్దలైన బాలురు, కాలేజీలకు పోయి చదువుకో సాగే టప్పటికి, బైట సంఘంలోవాళ్ళ బ్రతుకు దుర్భరం కాసాగింది. తోటిపిల్లలు వాళ్ళను సంకరులని హేళన చేయసాగారు. అదీకాకుండా వాళ్ళకు తక్కిన లోకంలో అందరిలాగే బ్రతికాలని తీవ్రమైన కోర్కెలు బయలుదేర సాగాయి. ఆ యువకు లంతా నాయిస్‌మీద విప్లవం ప్రారంభించారు.

నాయిస్ చెప్పే, "శాస్త్ర ప్రబోధాన్ని" తుంగలో తొక్కమన్నారు. పెద్దలకు ఎదురుతిరిగారు. ఆనాటి చట్టాలప్రకారం నాయిస్‌ను అరెస్టు చేయిస్తామని బయలుదేరారు. పెద్దలకు గత్యంతరం కనబడలేదు. నాయిస్ వృద్ధుడైపోయాడు. చెముడు కూడా వచ్చేసింది. ఈ బాధ పడలేక కెనడాకు వెళ్లిపోయి "నయాగరా జల పాతం" వద్ద నివాసం ఏర్పరుచుకొని అక్కడినుంచి తపాలుద్వారా సంఘ వ్యవహారాలు నడపసాగాడు.

ఆగస్టు ౨౦ ౧౮౭౯ న, సంఘాన్ని ఆపేస్తున్నామని నాయిస్ సందేశం పంపించాడు. సంఘంలో జేగంట మ్రోగింది. నాయిస్ సందేశం వినటానికి అంతా ప్రశాంతంగా హాలులో మూగారు. సంకీర్ణ వివాహపద్ధతి ఇక ఆపివేయబడుతూందనీ, సంఘ ఆస్తిపాస్తులనూ, పరిశ్రమలనూమాత్రం సంఘీయులంతా సాముదాయిక యాజమాన్యంలో నడపవలసిందనీ నాయిస్ సందేశం పంపించాడు. రెండేళ్ళ తర్వాత సంఘం నశించింది. అక్కడి జనమే జాయింట్ స్టాక్ కంపెనీగా తయారయి, వందమంది పెద్దలు, పిల్లల పేర్లతో, ఒనీడా కమ్యూనిటీ లిమిటెడ్ అన్న పారిశ్రామికసంస్థగా రూపొందింది. కొన్నాళ్లకు పరిశ్రమల కేంద్రం కూడా నయాగరాకు మార్చబడింది.

జాన్ హంఫ్రీ నాయిస్, ౧౮౮౬ ఏప్రిల్ ౧౩ వ తారీఖున చనిపోయాడు. సంఘవ్యాపారం మాత్రం నానాటికీ బాగానే వృద్ధిపొందింది. నాయిస్ కుమారుడు, పీర్‌పాంట్ నాయిస్ ఈ వ్యాపారాభివృద్ధికి చాలా శ్రమించాడు. ఈ నాటికీ ఈ కంపెనీలో అధికారులు, పారిశ్రామికులూ అందరూ చాలామంది ఒనీడా సంఘం సంతతివారే.

నాయిస్‌ను, "అమెరికా మార్గదర్శకులలో ప్రప్రథముడని" హేవిలాక్ ఎల్లిస్ శ్లాఘించాడు. "ప్రపంచ ప్రతిభాశాలురలో ప్రథమశ్రేణికి చెందినవాడని" బెర్నార్డ్‌షా, నాయిస్‌ను కీర్తించాడు.

ఆ కనులు

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

మసక వెన్నెల గదలాడు మబ్బులోనా—
ఆమె ప్రతిదిన మాదారి నరుగునెటకొ
ఆమె ఎవ్వరో ఎఱుగ నేనసలు, కాని
ఆకనులు మాత్రమే స్వప్నలోకములనొ
నా కనుల ముందు తిరుగాడి నాట్యమాడి
చిరునగవు తేనె జిలుకరించి నటులుండు.
ఏ ఎడారినో ఒంటిగా నేను బోవు
నపుడివే కన్ను లెప్పుడో అతివిమల
సలిలములు నిండిన 'ఒయాసిసుల' విధాన
గాన వచ్చిన స్మృతి ఏదో కదలు నెడద.
జీబుగా చీకటిగ నున్న చెట్లలోపు
నందమావాస్య రాత్రి నేనరుగు నపుడు
నరిగనివె రెండు తరళ నక్షత్రములయి
అకుసందుల మెఱసిన యట్లుదోచు.
చిమ్మచీకట్ల గది నయు శృంఖలాల
నెందో నేనుండి నప్పుడీ దృక్కరాలు
ఛదపు రంధ్రాలలోనుండి మొనటి వెలుగు
రేకలై వ్రాలి నను పల్కరించె నేమొ?
లోతు తెలియని మున్నీటిలోన నెపుడో
ఒక నిశీధిని నే నీదుచున్ననాడు
దూరమున కానవచ్చిన దోనెలోని
చిన్నిదీపాల నీ కనుల్ స్మృతికి దెచ్చు.
ఆమె కనుపడ దపుడపుడు-విన నన్ను
వెంబడించుచు, మెలకువ వేళలందు
స్వప్నముల, చిరునవ్వుల పదనుకత్తు
లీ ఎదను నాటు నా కనులు ....

వనితాలోకం :

జానకి - పాంచాలి

★

శ్రీమతి మల్లాది వసుంధర

రామాయణ మహాభారతములు మనకు పూజ్యములగు పవిత్ర ప్రాచీన గ్రంథరాజములు. రామాయణమున జానకి మహాభారతమున పాంచాలి విభిన్న ప్రకృతులు కలిగియు హైందవ నారీలోకమున కర్ణమణులై యలరారుచున్నారు. వీరు మహాపతివ్రతా పంచకమునం దగ్రగణ్యలు. రామాయణ కర్త మహర్షి వాల్మీకి. మహాభారత ప్రణేత కృష్ణద్వైపాయనుడు. రామాయణము పరిపూర్ణ మహోన్నతాదర్శ పరిణతి. మహాభారతము కేవలము వాస్తవికానుష్ఠేయ విషయ పరమావధి. వాల్మీకి కరస్పర్శ సామాన్య విషయములగూడ మహోన్నతి మొనర్చును. అతని మధుర మోహన దృష్టి ఎల్లపుడు అనుష్ఠేయములైన జీవితముల యందలి వాస్తవికతల యందు ప్రసరింపక సురుగంభీర మహోన్నతాదర్శములనే ప్రతీక్షించును. కృష్ణద్వైపాయనుని ప్రకృతి అటులగాక స్వానుభవపూర్ణములగు మానసిక ప్రహేళికలయందు నిమజ్జితమగును. అనతిక్రమణీయములగు మానవధర్మములను నిర్భీకముగ కార్య కారణ సంబంధోపేతముగ ప్రతిష్ఠాపన మొనరించు వ్యాఖ్యానబుద్ధి పారాశర్యునిది. అతని ధీశక్తి అంధకారావృత జటిల సమస్యలను తన జ్యోతిః కిరణ ప్రసారముచే ఆలోకిత మొనర్చును. ఈ మహాభారతమున వాస్తవికములును ఆదర్శ యుతములును అగు మానవసమస్య లన్నింటిని సర్వతోముఖముగ చర్చింప నొకే యొక వ్యక్తికి సాధ్యమగుట విస్మయావహముగ నుండును. ఇది రామాయణమువలె కాక విస్తృతమై భిన్న ప్రకృతులు గల కౌరవ పాండవుల మధ్య జరిగిన సంఘర్షణాత్మకమగు నితివృత్తము గలది. వైషయిక ప్రలోభనములకు లోనై పరస్పరము కలహించుకొని పగలు సాధించుకొన్న సామాన్య మానవ ప్రకృతు లిందు ప్రతిభాతములగుచున్నవి. రామాయణమున నట్లుకాదు. కేవలము స్వాప్నిక జగత్తున విహరింప వాంఛించు నొక మహా మానవుని చరిత్రమును యథాతథముగ నభివర్ణించును. వాల్మీకి చిత్తమున కావ్యనాయకునియం దుద్దీప్తములు కాదగిన శౌర్య శీలౌదార్య సౌందర్య గాంభీర్యములు శ్రీరాముని పాత్రమున ప్రతిఫలించుచున్నవి. సోదరునికై సర్వత్యాగ మొనర్పగల లక్ష్మణుని భాతృస్నేహబుద్ధి వర్ణనాతీతము. ఇక జానకి యందుమా! భర్తృగతైక ప్రాణ. రూపొందిన హైందవ పాతివ్రత్యము ఆమె సౌందర్యము మనోజ్ఞత మిగుల గాఢముగ సమాకర్షించును. కాని పాంచాలి స్వతంత్ర భావనాసంపన్న. ధీమతి. స్త్రీ సహజమగు మృదు మధుర భావావధి నామె ప్రకృతి యధిగమించుచున్నట్లుండును. నారీసహజమగు ఔన్నత్యము, అహంకృతి, గంభీరతలకు పాంచాలి ప్రతిబింబము. జానకి అబలాసుగుణములకు సుందరతాలావణ్య మాధుర్యములకు నిదానము.

ఇరువురును అపూర్వ సుందరీమణులేయైనను వారియందలి తారతమ్యముల నెంచుటకు మన మాకృష్టమగుచున్నది. పాంచాలి ప్రకృతి కనుగుణ్యమగు నామె సౌందర్యము సానపట్టిన ప్రఖరోజ్జ్వల వజ్రము. జానకి సంద్రమునుండి వెలార్చిన నవస్నిగ్ధ మౌక్తికము. పాంచాలి నవోద్గతలలిత పల్లవ ప్రసూన జాలయై సహకారాలింగన మొనర్చు మాధవీవల్లరి. సహకారశాఖల భావమగుచో నిస్సహాయయగు ననాధవోలె భూమి పడి ధూళిధూసరిత కావలసినదే. నిజ కోమల సుమ సౌరభములచే సర్వ జనాకర్షణ మొనర్చు తరుణోన్నత గుల్మరాజము జానకి. ప్రాభాత తరుణారుణ తరణి కిరణవార ప్రసార ప్రకాశిత ఉన్నతనగ శృంగోపరిస్థిత గండోపలంబుల నిజ జలధారలచే దొర్లించుకొని దుముకుచు ప్రవహించు నిర్ఝరిణి పాంచాలి. సమతల తరంగ విరహిత నిర్మల స్ఫటిక కాసారమున ప్రవహించు శరద్రాకాసుధాకరస్నిగ్ధ రజత జ్యోత్స్నా స్రవంతి జానకి. జానకి భర్తృ చరణ సరసీరుహ మరంద ధ్యానైక తత్పర. పాంచాలి అటులగాక పాండవపంచకమునం దనురాగ బద

యయ్యు ప్రత్యేక వ్యక్తిత్వ విశిష్ట. ఆమె తన మానసిక పరిణతివలన పాండవులకనురాగాతిశయ గౌరవాస్పద రైనది. దుర్యోధన సభాసదనమున నిరాశా దుఃఖాహతయయ్యు ధైర్యమును విడనాడక పాంచాలి మర్మభేదన కరములగు నర్మవాక్యముల అచటి విజ్ఞాన ధనులగు కురువృద్ధుల శిరోగ్రముల నిర్వాక్కులుగా నొనర్చిన ప్రజ్ఞాధురీణ. ఒకవంక సముల్లలిత లావణ్యరాజవైభవోపేత భోగవిలాసిని యయ్యు పాంచాలి నారీజనసహజమ్మైన మధుర ప్రవర్తనాతీత పరుష స్వభావ. పాండవుల కరణ్యవాసావసర మొదవినపుడు పాంచాలిని తమ ననుగమించుటను గూర్చి పృచ్ఛింప నవసర మొదవకుండుట లక్షింప దగియున్నది. పాంచాలివినా పాండవు లేగవచ్చునా యను తలంపు వారి కొదవనే లేదు. ప్రవాస సంభవక్లేశముల గురించి ఆమెకు వ్యక్తమొనర్ప నగత్యముకూడ వారి మనోవీధి సంచరింపలేదు. నిర్భీకయు స్థిరసంకల్పయు గాన అరణ్యమునం దామెను గూర్చిన ప్రత్యేక బాధ్యత పాండవుల తలపున నుదయింప నెపము లేదు. హృదయ విదారక పరిస్థితులలను కొన్నపుడు సైతము ఆమె ఆత్మనిగ్రహమును కోల్పోక అలసటచే కార్య పరాఙ్ముఖులగు భర్తల నుద్యమశీలుర నొనర్చును. అరణ్యమున అబలాత్వముగాని సర్వక్షీణ బాధ్యతగాని వారికి కలుగనీయ కుండుటయేగాక ధార్తరాష్ట్రులచే తన కొనర్పబడిన అవమాన ప్రతీకారమునకై నిజనాథుల నున్ముఖుల నొనర్చిన ధీరోదాత్త స్వాంతపాంచాలి. అరణ్యమున కరుగునపుడు ప్రేమార్ద్ర హృదయముతో కుంతీదేవి తన ప్రేమాస్పదుడగు సహదేవుని ప్రత్యేకముగ పాంచాలీ హస్తములందుంచి స్వేచ్ఛగా నిశ్చింతగా నిలిచిపోగల్గినంతటి ప్రేమమయి పాంచాలి.

మనము క్షణమాత్రమైన జానకిని గురించి యీ విషయము భావమూహింప గలవా? శ్వశుర రాణ్మందిరమున సుకుమారముగను సాదరముగను ఉపలాలింపబడి అపూర్వసంపత్స్యగా వెలిగిన జానకికి సంభవింపనున్న దుర్భర ప్రవాసక్లేశమునకై కౌసల్యాదుల హృదయములు విదీర్ణములైనవి. దుఃఖపూర్ణములు నివార్త వ్యథిత హృదయముతో రాముడు జానకి కెరిగింప జాలెను. అత్తమామలు సేవించుచు అయోధ్యయందే నిలువుమని రాముడు నుడివినపుడు జానకి "సంపూర్ణముగ నాథుడు తన్ను అపార్థము చేసికొనినాడని పల్కెను. తనయందామెకు గల సీమారహితానుపమానురాగమనెడి శక్తి ప్రవాసజనితక్లేశముల నామె సహించుకొను నట్లు చేయగలదని రాముడు గ్రహింప జాలెను. కాననసీమల కరుదేరకుండుటకై యామె నెంతగా నిరుత్సాహ పరచుచున్నను జానకీవియోగము తనకును దుర్భరము గాన ఒకవేళ జానకి ఆ సూచన కంగీకరించునేమో యను భయముకూడ రాముని హృదయమందు లేకపోలేదు. జానకి తన్ననుసరింపదను భావము రాముని కుండియుండె నేని విపిన సీమల కరుగునపు డాతని వదన మంతయు రుచిర మందహాసాలంకృతముగను ధైర్య సాహసోపేతముగను నుండియుండెడిది కాదు. తన జామాతయందు గల నారీత్వభావనను గాంచినయెడల తన జనకు డెంతగా సిగ్గిలునోగదాయని జానకి వ్యంగోక్తిగా వాక్రుచ్చిన రాము డమందానందతరంగిత హృదయుడు కాకుండ నుండజాలక ఆమె రాకను సహర్షముగ నంగీకరించెను. సంభాషణ యించుక యతిరిక్తమైనను తనయందలి ప్రేమభావమును ఇతరులు పోనాడజాలనంతటి మధురహృదయ జానకి. నిర్గమన సందేశాకాంక్షిత మనస్కుడగు సుమంత్రుని కామె యొసగు నీరవసందేశమంతయు తన నాథు నొకసారి విస్ఫారిత నేత్రయుగళి దిలకించి తిరుపరి సుమంత్రు నాలోకించి అశ్రుపూర్ణనయనయై అధోవదన యగుట ఆమె హృదయ మార్దవ మెంతయు ప్రదర్శిత మగును. ఇంతకు మించిన లావణ్యమయ సన్నివేశ మెందైన నుండజాలునా? పాంచాలి మనకు స్తవనీయ. జానకి ప్రేమపాత్రి. పాంచాలిని మన మామె ఆత్మనిశ్చయ బుద్ధిచే నభినూతులమై గౌరవింతుము. జానకియందు ఆమెకు గల సౌజన్యపూర్ణ సురమ్య వర్తనయందు మనము సహానుభూతులమైయుందుము. జానకికన్నను గఠినములగు అగ్ని పరీక్షలకు లోనైన సమయములందును పాంచాలికి సహజ సిద్ధముగ ప్రబలమైన రాజసప్రకృతి దుర్దమనీయమై వెలుగొందును. కౌర్యసంభరత్వమునం దామెకు గల యభిమానమును ధర్మజాని క్రియాశూన్య తాత్వికత సంపూర్ణముగ తృప్తిపరుపజాలక పోయెను.

జానకి ప్రధానముగ రామాయణము విరచితమైనది. అటుల కానిచో కావ్య మంత విస్తృత మయ్యె

డిది కాదు. రాజ్యలోభముచే అనుదినము పరస్పరము కలహించుకొను కౌరవ పాండవుల మధ్య పాంచాలీ పాత్ర లేకపోయినను భారత ప్రతిభ తరుగజాలదు. భారతమం దామె ప్రదర్శితమైన తావులందెల్ల నామె పాఠకుల అభిరుచిని తన బుద్ధివైశిత్యముచేతను మనోదార్ఢ్యము చేతను ఉద్దీపింపచేయుచున్నది.

ఒక దృష్టిని తిలకించుచో పలు తావులందు పాంచాలి జానకికంటె విషాదకరపరిస్థితుల నెదు ర్కొనినట్లు విశదమగును. ఇతరుల విశృంఖల కృత్యములకై పాపము పాంచాలి బలియైపోయినది. కాని జానకి కష్టపరంపరలన్నియు స్వనిరచితములే. లక్ష్మణుని వినయ పూర్వకానునయమును త్రోసిరాజని సువర్ణ కురంగశాబకమునకై అవివేకముగ నాకృష్ట గాకున్నచో రావణుని హస్తగత కావలసిన దుస్థితి ఆమె కెట్లొదవెడిది? జుగుప్సా పూర్ణమైన నిరాశాహత హృదయముతో సుస్వభావుడగు లక్ష్మణుని తన సన్నిధినుండి వెడలనడిచిన హృదయశూన్య కటూక్తుల నెవరు మన్నింప గలరు? దేవతాస్వరూపిణి యైన జానకి భర్తృగతైక ప్రాణ కావున నిజనాథుని ప్రాణోత్క్రమణ సమయార్తారవము నాలకించినపు డామె యుద్విగ్నమానసము నుండి వెలువడిన ఆసుర ప్రవణత క్షమార్హమే యగునేమో ననిపించుచున్నది. ఒంటరిపాటున నిస్సహాయముగ మరణించు తన ప్రాణకాంతుని దుస్థితి జానకీ నయనయుగ్మమున దర్పణము నందలి బింబమువోలె ప్రతిభాసితమగుచు ఆమె శోకోన్మత్త చిత్తయైనది. లక్ష్మణునియం దామె యనుసరించిన పరుషవర్తన ఆమెకు జీవనోచ్ఛ్వాసమున కెనయగు రామునియందలి గాఢానురాగము నే వ్యక్తపరచును. భర్తృస్మృతి ఆమె నుగ్రశీల నొనర్చి క్రియాశూన్యభావము నధిగమింపజేసి ప్రసన్నురాలిగా జేయును. సాధువేషధారియైన రావణునితో కాల్పనిక మనోభావములయం దస్థిర చిత్తయై ఆత్మరక్షణ సైత మొనరించుకొనజాలని అనవద్య హృదయయు దుర్వారభర్తృ ప్రేమావిహ్వలయు అగు జానకి తనను గురించియు తమ స్థితిని గురించియు సల్పిన సంభాషణక్రమ మెంతయు గర్హింపదగియున్నది. అత్రిమహర్షి ఆశ్రమమున అతని సహధర్మచారిణియగు అనసూయాదేవి జానకిని ప్రేమాలింగన మొనర్చి సమస్త రాజ వైభవోపేతములగు భోగముల విడనాడి వనవాస క్లేశములకు జంకక పతి ననుగమించి విపిన భూముల కరుదెంచిన ఆమె సౌశీల్యమును కొనియాడును. సామాన్య హైందవ స్త్రీలకు సైతము భర్త యెంతటి నికృష్టుడైనను దైవసమునిగ చూచుకొనవలయునని శ్రుతు లాదేశించుచుండ పురుషోత్తముడును జగదేకవీరుడును అగు శ్రీరామచంద్రుని తా ననుగమించుటలో కీర్తనీయాంశమే మున్నదని జానకి యడుగ పూజ్యపాద అనసూయాదేవి సహర్షయై ప్రేమసించిత హృదయముతో నామె నాశీర్వదించి వరముల నొసంగినది. ఇంతటి మహోన్నత సీమలయం దామె భాసించినను ఆతపవిరహిత ఛాయ నెటుల నూహింప నేరమో అటులనే రాముని అభావమున జానకియు శూన్యహృదయను. రాముని నుండి విశ్లేషిత యగు నామె యాకృతి దుఃఖాబ్ధి ఘూర్ణితమై శక్తిశాలియగు లంకాధిపునకు సైతము ఆమెను తన యిచ్ఛానువర్తినిగ దిద్దుకొనుట దుర్లభ మొనరించెను. కను విప్పినంత లంకేశ్వరు సైతము భిస్త్రఘాతి మొనర్పజాలు మహిమాన్విత యయ్యు ఉపాఖ్యానములందలి మేషశాబకము పోల్కి అబలభాతి నిలచిపోయెను.

పరిస్థితులు భిన్నము లయ్యెను బలపూర్వకముగ దూరదేశమున ప్రవాసితగ ఏకాకిగ నుంపబడక పోయినను తుల్యావస్థయం దవకాశ మొదవినపుడు పాంచాలి యెంతటి భీకరాకృతి దాల్చినది? విరటు రాజ్ఞితో అనన్య సౌందర్యరాశియగు పాంచాలి భూరి బలశాలురైన యేవురు గంధర్వులకు తాను ప్రేమపాత్ర నగు పత్నిననియు అనవరతానిమేషదృష్టితో వారామెను ఈగ వాలినసైత మోపక పరిరక్షించుచుందురనియు నుడువుటలో విరటు పత్నియగు సుదేష్ణకు తనకును తన భర్తకును తమ రాజ్యమునకును కూడ ఆమెయెడల స్వల్పాపరాధమేని ముప్పు నొదవింపజేయునను భీతి నొదవజేసెను. పాంచాలియం దుర్దామమోహపీడితుడై కీచకుడు సోదరి సుదేష్ణతో తెలిపి తన మనోరథసిద్ధికొరకై ఆమె సాహాయ్యము నర్థింప ఆమె "సైరంధ్రి సాధారణ యువతి కాదనియు ఆమెతోటి సాంగత్యము అగ్నితోడి చెలగాట మనియు" నుడువ మూర్ఖకీచకుడు వానిని పెడచెవి నిడె. పాంచాలి కీచకుని దురభిసంధి నెరిగినదై తన యేవురు గంధర్వపతులగురించియు

వారి భుజబలముల గూర్చియు విశదపరచి పరుషపురుష నామార్థకు మరింత మోహమున బలిమిమై తన హస్తముల నామె నంట నుంకింప నామె దండతాడిత భుజంగివోలె మండిపడుచు విరటుకొల్వుకూటము నకు పర్విడి శీలరక్షణకై మొరలిడినది. అవమానితురాలైన ఆమె ప్రచండవిరాశాక్రోధము ప్రళయ సమయ విజృంభితపంచభూతాక్రోశమును పోలి యుండెను. నిరంతర నిగ్రహాత్మకమగు పాంచాలి దుర్వారప్రకృతి పరమేశ్వరు నాజ్ఞానుసారము తట ప్రతిహతభగ్నోర్మికా వాలాకులంబై ప్రచండోద్వేగమున భీకరగర్జనల సల్పెడి మహోదధి సీమాతిక్రమణ మొనర్పకుండెడిరీతి కనయగును. ఆమె యందు ప్రతిహింసాతృష్ణ ప్రబలముగనున్నది. సర్వలోకముఖమగు కూటనీతిజ్ఞ కాన ఆమెకు ప్రతిహింసావిధానమునకై నానుప్రాపు గావలయునో తెలియును. నిశీథసమయమున భీము విశ్రాంతస్థానమున కొంటరిగా జేరి మేల్కొల్పి అతని భుజస్కంధంబుపై మూర్ధంబునిడి కరుణముగ విలపించుచు సుద్దాంతమైన అతని పౌరుషాగ్నికింధనముల సంధించును. స్వయముగ తాను రాజ్ఞియైయుండి అజాతశత్రుని చెలికత్తెనై సైరంధ్రివలె వర్తింపవలసిన స్థితి తన కుత్పన్నమగుటకు చింతించెను. మిగిలినవారికి బాని సత్వ మభిలషిత మగుచో అనుభవింపనిండు. భీము డైన తాను తన కన్నుకవైన భార్యా దుస్థితికి పొల్పడినపుడు ఊరక చూచుచుండ గలడాయని యాక్రోశించెను. పాంచాలి నిజకరద్వయము భీముడెదసారించి పరిచారికగా నుండి పనులు చేయుటవలన కార్కశ్యము హస్తములకు కలుగుట భర్తలగు వారి మూలముననే కదాయని వ్యంగ్యముగ వాక్రుచ్చెను. అంతట భీముడామె హస్తముల స్వహస్తములం జేర్చి కన్నీటితో ముద్దిడి జరిగిన యవమానమునకు ప్రతీకార మొనర్తునని ప్రతిన సల్పెను. అపుడు పాంచాలి ప్రతిహింసా పూర్ణావతార రుద్రాణివోలె దర్శన మొసంగును. ఆత్మమర్యాదకు, వ్యక్తిత్వ గౌరవమునకు భంగము వాటిల్లు నెడల ఆమె స్త్రీ సహజమగు కోమలతను విడనాడగలదు.

దుర్యోధన సభాభవనమున అవమానితరాలై పాంచాలి యొనర్చిన ప్రచండ ప్రతిజ్ఞను రావణ పరాక్రాంతయై దురపిల్లిన జానకి! "నిష్పాపు లేరును నుండరేరరు గాన నెల్లరు క్షమార్హులే"యని పల్కిన పలుకులను పోల్చిచూడ దేవతాత్మయైన జానకికిని ఆత్మాభిమానయగు పాంచాలికిని గల తారతమ్యములు సింధుబిందుతుల్యములని రూఢమగును. ప్రతిహింసాపరాయణాత్మయగు పాంచాలి స్వభావము ప్రాచీన భారత రమణీమణుల వాస్తవికాదర్శములకు వ్యతిరిక్తమైనది.

సౌందర్యము, గాంభీర్యము, మృదుత్వము, కార్కశ్యము జగదాధారములగు పంచభూతముల దలపించుచుండును. ఆమె క్రియాశీలత పురుషోచిత లక్షణమగు శౌర్యమును, స్త్రీ సహజమగు లావణ్యతను కలిగియుండుట ఆశ్చర్యము. జానకి యిట్లుగాక నిరాడంబరత, మనోజ్ఞత, సుందరత ఆకృతిగొన్న నారీత్వ పరమావధివలె గోచరించుచున్నది. కాని పాంచాలి తీక్ష్ణస్వభావము సమ్మోహన కరమగు ప్రేమభావము, ఒక తరి యవతారమందిన యోగిమూర్తి మరియొకతరి రూపొందిన మోహినీ మూర్తి ప్రకృతులు పరస్పర భిన్నములుగాక వేరుకావు. ఒక పరి యనన్యభక్తి తత్పరత భర్తలయెడల జూపును. వేరొక పరి పూర్ణ వ్యక్తిత్వముతో క్రియాచరణమునందు భర్తలకు సలహాల నిచ్చు మార్గదర్శిని యగును. శ్రీకృష్ణునియందామెకు గల భక్తి యనన్యమై మన మనోవీథుల సంచరించును, క్షణాంతరమున ప్రతిహింసాచరణోన్మాద మూర్తిగ మనకు గోచరించును. ఆమె ప్రవర్తన యెట్టిదైనను విమర్శనా విశ్లేషణముల కామె యెట్లాగ జాలినను మహోన్నత ప్రాబల్యము కలిగిన వ్యక్తిత్వ శాలినియై మహాభారతేతిహాసనభోవీధి ధృవతారయై యలరారుచున్నది. ఆమె ప్రతిభనుగూర్చిన మన మనోభావమెన్నడును పేలవత్వమును జెందక నిరంతర మొకరీతి విరాజిల్లుచుండును.

విజ్ఞానవిశేషాలు :

రేడియో ఐసోటోప్స్

సమ్నర్. టి. పైక్

గత ఏళ్ళలో, అణుశక్తి పరిశోధనలు, మానవ జాతికి మహోపకార విషయాలను వెలువరుస్తూ అపారమైన విజ్ఞానాన్ని చేకూర్చాయి. విలయశక్తిగానే కాక మానవ పురోగమనానికి, నిత్య ప్రయోజనాలకు వినియోగపడే శక్తిగా అణుశక్తి రూపొందుతోంది. "అగ్ని' తర్వాత మానవుడు పొందిన మహావరం 'అణుశక్తి'" అన్నాడు ఒక శాస్త్రజ్ఞుడు. "శాస్త్ర విజ్ఞానానికి తోడ్పడిన నూతన విషయాలలో 'మైక్రోస్కోప్' తర్వాత మళ్ళీ ఇంతటి నూతన విషయం లేద"న్నాడు మరో శాస్త్రజ్ఞుడు.

అణ్వస్త్ర నిర్మాణంలో గౌణఫలితాలుగా లభించిన "రేడియో ఐసోటోప్స్" అన్న పదార్థాలవల్లే ఈ విజ్ఞానావకాశం అపారంగా వృద్ధిపొందింది. "ఈ పదార్థాలతో ఎరువుల మొదలైన వాటి విషయమైన పరిశోధనలు, ఏబది ఏండ్ల తిరితర పరిశోధనఫలితంగా చేకూరనివి కూడా గత మూడేళ్ళలో తెలిసివచ్చా" యని వ్యవసాయిక శాస్త్ర నిపుణులు అంటున్నారు.

ఈ పరిశోధనమూలక వస్తువులను "రేడియో ఐసోటోప్స్" అంటారు. మామూలు బొగ్గు, ఇనుము, భాస్వరము మొదలైన మూలద్రవ్యాలకు (*Elements*) రేడియో ఆక్టివ్ స్వరూపాలు, ఈ పదార్థాలు. అంటే బొగ్గు, రేడియో ఆక్టివ్ బొగ్గు, రెండూకూడా రాసాయనికంగా, ఒకటేగాని, రేడియో ఆక్టివ్ బొగ్గులో నిత్యం విద్యుదణు ప్రసారం విశేషలక్షణంగా వుంటుంది. ప్రతి రేడియో ఆక్టివ్ అణువులోనూ, మామూలు అణువులోకన్న శక్తి ఎక్కువగా ఉంటుంది. ఆ అణువు ఎప్పుడో అప్పుడు పగలక తప్పదు. అప్పుడు, ఆ అధికశక్తి రేడియో ఆక్టివ్ ప్రసరణగా వెలువడి, అణువు సామాన్యస్వరూపం అందుకొంటుంది. ఒక్కొక్కప్పుడు ఈ విచ్ఛిత్తిలో మూలద్రవ్యమే. (*Element*) మారిపోయి కొత్త ఎలిమెంటు తయారు కావచ్చును కూడా. ఇక్కడ "శక్తి" లభ్యమవటంలోనే ఈ అణువుల విశేషం ఉంది. ఈ రేడియేషన్ శక్తిని ఉపయోగించుకొంటే చాలా పనులు సాగించుకోవచ్చును. ఉదాహరణకు ఈ రేడియేషన్ శక్తి రాచపుండును రూపుమాపగలదు. కాని ఈ శక్తి అక్కడి జీవకణాలనుకూడా చంపగలదు కాబట్టి, ఈ రేడియో ఐసోటోప్సును నిపుణులైన వైద్యులు, శాస్త్రజ్ఞులు తప్ప వాడటానికి వీలులేదు.

ఈ రేడియోశక్తి ప్రసారాలన్నీ, గైగర్ కౌంటర్స్ అన్న సూక్ష్మ యంత్రాలవల్ల తెలుసుకోవచ్చును. కాబట్టి ఈ రేడియో ఐసోటోప్స్, జంతువులకుగాని మనుష్యులకుగాని వృక్షాలకుగాని, తినపెట్టినప్పుడు, లేక ఇంజెక్షన్ద్వారా లోపలికిచ్చినప్పుడు, దేహం పర్యంగాలలో ఇవి ఏఏ మార్గాలగుండా, ఎంత శీఘ్రంగా ప్రసారమౌతున్నదీ కూడా, ఈ సూక్ష్మ యంత్రాలవల్ల బైటిసుంచే కనిపెట్టవచ్చును.

కొన్ని కొన్ని రేడియో ఐసోటోప్ పదార్థాలు ప్రకృతిలోనే లభిస్తాయి. ఉదాహరణకు, జీవమున్న వాటిల్లో అల్లా రేడియో కార్బన్ (బొగ్గు) ఉంటుంది. దీన్ని కార్బన్ ౧౪. అంటారు. ఇది ప్రకృతిలోనే నిత్యం, నత్రజని అణువులు కాస్మిక్ కిరణాల తాకిడివలన ప్రబద్ధలై, విరూపమైన ఈ 'కార్బన్ ౧౪.' అణువులు తయారవుతాయి. వృక్ష జీవాలూ, తద్వారా వానిని తిని బ్రతికే జంతుజాలమూ, ఈ అణుసంతతిని సంగ్రహిస్తూ ఉంటాయి. మృత్యుసమయంలో, ఈ క్రియాకలాపం ఆగిపోయి, రేడియో కార్బన్ విచ్ఛిత్తిపొంది మామూలు కార్బన్ (బొగ్గు) గా క్షీణించి స్థిరపడిపోతుంది. ఈ మార్పు కొన్ని వేల సంవత్సరాలు కూడా పట్టవచ్చును. రేడియో కార్బన్ విచ్ఛిత్తిపొందుతూ వచ్చినకొద్దీ, అందులో ఉన్న కార్బన్ అణువుల సంఖ్యతో పోల్చిచూస్తే, రేడియో

కార్బన్ అణువులసంఖ్య నానాటికి క్షీణిస్తూ వస్తుంది. రేడియో కార్బన్‌ల విచ్ఛిత్తికి కాలప్రమాణం గణించటం సులభమే కనుక, శాస్త్రజ్ఞులు ఏ వృక్షము ఏనాడు చచ్చిపోయిందో, అందులో కార్బన్ రేడియో కార్బనుల శాతాన్ని (*Proportion*) బట్టి తేలికగా గ్రహించగల్గుతారు.

కొందరు అమెరికన్ ఇండియనుల అస్థిశేషాలలో ఈ కార్బన్-రేడియో కార్బన్‌లశాతాన్ని పరీక్షించి ఈ ఇండియన్‌లు ౫౦౦౦ ఏండ్ల క్రిందకూడా నివసించి ఉన్నారని, ౧౯౫౦ లో అణుశాస్త్రజ్ఞులు నిర్ణయించగలిగారు. అల్లాగే రేడియోకార్బన్ కాలమానం ప్రకారం, ౨౫౦౦౦ ఏళ్ళనాటి జీవ విషయాలనుకూడా శాస్త్రజ్ఞులు గ్రహించగలుగుతున్నారు. ఈ పరీక్షలు ఈజిప్టు మమ్మీలు, అమెరికన్ అనాది జాతుల వస్తుశేషాలు, మొదలైనవాటన్నిటిమీదా జరిగాయి.

అయితే ఈ రేడియో ఐసోటోప్‌లలో పరిశోధనలు చాలామటుకు ప్రకృతిసిద్ధమయిన ఐసోటోప్స్‌తో కాక, ప్రయోగరీత్యా అణ్వస్త్ర నిర్మాణంలో శేష ద్రవ్యాలుగా లభించిన రేడియో ఐసోటోప్స్‌తోనే జరుగుతోంది. ఈ తయారీ, అమెరికా, ఓక్రిడ్జ్ నేషనల్ లేబరేటరీలోని ఆటంపైల్ ప్రయోగశాలలో అమెరికన్ ఆటంశక్తి సంఘంవారి ఆధ్వర్యాన జరుగుతూంది.

౧౯౪౬ నుంచి, ప్రపంచం నాలుమూలలా ఉన్న అనేక వైద్యశాలలకు శాస్త్రపరిశోధనశాలలకు కూడా, ఓక్రిడ్జినించి పీపలకొద్దీ రేడియో ఐసోటోప్స్, వైద్యశౌకర్యార్థం, చికిత్సలకోసం, ప్రయోగాలకోసం పంపబడ్డాయి. ఇందులో ముఖ్యమైన పదార్థాలు, రేడియో ఐయొడిన్, రేడియో ఫాస్ఫరస్, పారిశ్రామిక పరిశోధనంకోసం కూడా, అనేక రేడియో ఐసోటోప్స్, పీపలకొద్దీ అన్ని దేశాలకు పంపబడ్డాయి.

వైద్యంలో రేడియో ఐసోటోప్స్ రెండు విధాలుగా ఉపయోగిస్తున్నాయి. (౧) తక్షణ చికిత్సకూ, (౨) పరిశోధన ప్రయోగాలకూ. మానవ దేహంలో, కొన్ని ప్రత్యేకాంగాలు, కొన్నికొన్ని ప్రత్యేక మూలపదార్థాలను ఎక్కువగా జీర్ణించుకొంటాయి. ఐయొడిన్ దేహంలో ప్రవేశించగానే, కొన్ని క్షణాలలోగా థైరాయిడ్ గ్రంథులలోకి కూడుకొంటుంది. థైరాయిడ్ గ్రంథిమూలక వ్యాధులలో, ఈ రేడియో ఐయొడిన్‌ను, చికిత్సను, రోగస్థానంనుంచి థైరాయిడ్‌కు చేరుకొనేటట్లు చేయగలం అనుకొందాం. రేడియో ఐయొడిన్ కేవలం ఈ పనే చేస్తుంది. ఈ రేడియో ఐయొడిన్ విచ్ఛిత్తిపొందటంలో వెలువడ్డ శక్తిప్రసారాలు, థైరాయిడ్ టిష్యూలను రూపుమాపుతాయి. థైరాయిడ్ మూలకమైన "కాన్సర్"లో కూడా ఈ రేడియో ప్రసారాలు కాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. థైరాయిడ్ వ్యాకోచాధిక్యంవల్ల వచ్చిన రోగాలు చాలామటుకు ఈ రేడియో ఐయొడిన్ చికిత్సవల్లబాగుపడ్డాయి.

భాస్వరము (*Phosphorous*), దేహంలోకి పోగానే, ముందుగా రక్తం తయారుచేసే కేంద్రాలలోకి—ఎముకలలోని మజ్జ, కాలేయము, లింఫ్ గ్రంథులు—వీట్లలోకి చేరుకుంది. భాస్వరానికున్న ఈ ప్రవృత్తిని దృష్ట్యా, రక్తవ్యాధుల చికిత్సకు రేడియో భాస్వర-చికిత్స చాలా ప్రయోజనకారిగా ఉపకరించింది. ముఖ్యంగా రెడ్ కార్పసుల్స్ ఎక్కువయిన పాలీసిథిమియా అన్న వ్యాధిలో ఈ చికిత్స బాగా పనిచేసింది.

శస్త్రచికిత్స మినహా, కాన్సర్ నిర్మూలనకు x-రే ప్రసారం, రేడియో ప్రసారం, చికిత్సలుగా ఉపయోగిస్తూ వచ్చాయి. ఇప్పుడు వీటికి రేడియో కోబాల్టు తోడైంది. ౩౦ లక్షల వోల్టుల శక్తిఉన్న విద్యుద్యంత్రంనుంచి తయారుగాగల x-రే కిరణాలు ఎంత తీవ్రంగా కాన్సర్‌పై పనిచేయగలవో, ఈ రేడియో కోబాల్టునుంచి వచ్చే ప్రసారంకూడా అంత తీవ్రంగానూ పనిచేయగలుగుతుంది. రేడియంకన్న ఎంతో చవక. అంతకన్న ఎక్కువ ప్రయోజనకరంగానూ, ఎక్కువ ప్రయోగ సౌకర్యంగల రూపంలోనూ, రేడియో కోబాల్టు తయారుచేసే అవకాశం ఎక్కువవుంది. కోబాల్టును రేడియో ఆక్టివ్‌గా తయారుచేసేముందే, సూదులుగాని, పూసలుగాగాని, చికిత్సకు అనుగుణంగా ఏ రూపంలో కావాలిసివస్తే ఆ రూపంలోనే పోతపోసికొనే సౌకర్యం ఉండటంవల్ల, రేడియంకన్న ఇది చాలా ప్రయోజనకరం అవుతుంది. ౧౦౦౦ గ్రాముల రేడియంనుంచి (అంటే ౨ కోట్ల డాలర్ల విలువ) పొందగల రేడియో ప్రసారాన్ని తెప్పించగల రేడియో కోబాల్టును తయారుచెయ్యటంలో ఓక్రిడ్జ్‌లోని ఐసోటోప్ శాస్త్రజ్ఞులు నిమగ్నులై ఉన్నారు.

అస్థిగతంగా పాతుకుపోయిన కాన్సర్ వ్రణ చికిత్సలో రెండు సమస్యలు ఏర్పడుతాయి. మొదటిది అసలు వ్రణమూలంయొక్క ఉనికి గ్రహించటం. రెండవది, ఈ వ్రణక్రిములను నిర్మూలించటంతో పాటు, ఈ రేడియో ఆక్టివ్ కిరణాలు, దేహంలోని జీవనాణువులను కూడా నిర్మూలించకుండా చూడటం. ఈ రెండు చిక్కులను తప్పించుకోటానికి కూడా రేడియో ఐసోటోప్స్ వైద్యులకు బాగా వినియోగపడుతాయి. న్యూయార్కు మెమోరియల్ ఆస్పత్రి

లోని రేడియోలజిస్టులు. ఈ రేడియో ఆక్టివ్ ప్రసారాలను శరీర అంతర్భాగాలపై ప్రయోగించటానికి కొత్త పద్ధతులు కనిపెట్టారు. కేవలం ఒక దిక్కునుంచి రేడియో ప్రసారాన్ని కేంద్రీకరించి, వ్రణభాగంపై ప్రసరింపచేయటం కాక, ఆ దేహభాగంలో అన్ని వైపులనుంచి పల్చపల్చగా రేడియో ప్రసారాలని వ్రణం దిక్కుగా పరసింపచేస్తారు. అందుచేత చికిత్సకు కావలసిన రేడియో ప్రసారం మొత్తం ఒకటే అయినా, మధ్యనున్న జీవకణాలకు విడివిడిగా తగిలే ప్రసారం విస్తృతరంగంలోనుంచి ప్రవేశిస్తూండ బట్టి, జీవకణాలను సమూలంగా నిర్మూలించే అంత శక్తికలిగి ఉండదు. వ్రణంచుట్టూ ఉన్న జీవకణాల ప్రతి ఒక్క దానిపై కాన్సర్ ను నిర్మూలించే ప్రసార శక్తి శతసహస్రాంశం మాత్రమే పనిచేస్తుంది కాబట్టి అపాయం తగ్గిపోతుంది.

కాన్సర్ వ్రణం మూలమెక్కడో కనిపెట్టటానికికూడా కొత్త పద్ధతులు కనిపెట్టారు. చుట్టూ ఉన్న మాంసపు పొరలకన్నా కాన్సర్ వ్రణ మాంసపు పొరలు, చాలా త్వరగా వృద్ధిపొందుతాయి. దేహంలో మాంసకృత్తులు ఆరోగ్యంగా వృద్ధిపొందటానికి కొన్ని ప్రత్యేక ధాతువులు కావాలి. ఉదాహరణకు భాస్వరం. కాన్సరు వ్రణంలో పెరిగే మాంసం ఈ భాస్వరాన్ని తక్కువ భాగాలకన్నా ఎక్కువగా వినియోగించుకొని పెరిగిపోతూ వస్తుంది. రేడియో ఫాస్ఫరస్ ను ఇయ్యటంవల్ల, రోగి దేహంలో ఏయే భాగాలు ఫాస్ఫరస్ ను అతి ఎక్కువగా పీల్చుకొంటున్నాయో, అంటే వ్రణంగా తయారవుతూన్న మాంసం ఎక్కడెక్కడ ఎక్కువగా కూడుకట్టుకొంటుందో, వైద్యులు రేడియో ప్రసారం ఇస్తూన్న మార్గం బట్టి, గైగిన్ కౌంటర్ లలో నిరూపించుకో గలుగుతారు. అంతతో దుష్టమాంసం ఉన్న భాగాలను, జీవమాంసం ఉన్న భాగాలనుంచి వేరుపరుస్తూ చికిత్స ప్రారంభించగల్గుతారు.

ఇల్లా ఒక మార్గం అవకాశం ఉందని తెలిసి వచ్చినా రేడియో భాస్వరం ప్రయోగంవల్ల, ఫలితాలు అంత సుముఖంగా రాలేదు. అంతకన్నా రేడియో ఆక్టివ్ ఫ్లూరోసిన్ డై నొకదానిని, (అంటే ఈ పై మాంసంలో చొచ్చినంతమేరా, x-రే ఫోటోగ్రాఫ్ లోనూ, లేదా సరాసరి ఫ్లూరోస్కోప్ లోనూ, ఉజ్జ్వలంగా కనబడుతుంది) తలలోపుట్టే వ్రణాల మీద ప్రయోగించి, వ్రణమూలాన్ని, దుష్టమాంసాన్ని, శస్త్రంద్వారా తీసివేయగలగటానికి వైద్యులకు శస్త్రచికిత్సకు అవకాశం కల్గింది.

కాని, ఈనాటికీ రేడియో ఐసోటోప్స్ ప్రయోగంలో, చివరి అంచుల్లో మాత్రమే పరిభ్రమణ జరుగుతోంది తప్ప, తెలిసికోవలసిన మూలవిశేషాలు ఇంకా చాలా ఉన్నాయి.

మొత్తంగా చూస్తే దాదాపు ౪౦౦ దాకా రేడియో ఆక్టివ్ ధాతువులున్నాయి. వీట్లల్లో ప్రతి ఒక్కదానికీ ఒక్కొక్క విశిష్టత్వముంది. కొన్నిటిలో రేడియో ప్రసారం ఉలిపిరి కాగితం అడ్డుపడితే ఆగిపోతుంది. మరి కొన్నిటిలో దేహంలో ఇటునుంచి అటుదాకాపోయి కొన్ని అంగుళాల సీసపు కవచాన్నికూడా ఛేదించుకొంటూ ప్రసారం పోగల్గుతుంది. ఈ అపూర్వ వస్తువులలో ఏ కొద్దివాటిమీదో మాత్రమే ప్రయోగాలు పరిశోధనలూ పరీక్షలూ జరిగాయి. రేడియో స్ట్రాంటియమ్ కలిపిన కంటిపట్టీలతో, కన్నుజబ్బులలో కెరాటైటిస్ అనేదాన్ని కుదర్చగలిగారు. చర్మాన్ని మాత్రమే అంటిపెట్టుకొని ఉన్న కాన్సర్ వ్రణచికిత్సకు రేడియో గాలియమ్ ఉపయోగమైంది. రేడియో బంగారము, ద్రావకంలో కలిపి, సూటిగా కాన్సర్ వ్రణందగ్గిర చర్మంలోకి ఇంజెక్షన్ ఇస్తే ప్రయోజనకారిగా కనబడింది. రేడియో బంగారం త్వరగా తన ఈ ప్రసారశక్తిని కోల్పోతుంది. కాబట్టి వ్రణంచుట్టూ ఉన్న జీవభాగాలను ఈ ప్రసారం నాశనం చేయదు.

వైద్యంలోకన్నా కూడా, తదితర శాస్త్రాల పరిశోధనలలో ఈ రేడియో ఐసోటోప్స్ చాలా సహకరించాయి. వ్యవసాయ శాస్త్రము, జీవశాస్త్రం, పశుశాస్త్రం, ఇల్లా జీవధాతువుల పరిశోధన అవకాశం ఉన్న శాస్త్రాలన్నిటిలోనూ ఈ ఐసోటోప్స్ చాలా ప్రయోజనకరమయాయి.

రేడియో ఐసోటోప్స్ తో కనుగొన్న మొదటి పరిశోధనలే, జీవపదార్థాల ప్రాథమికతత్వ పరిశోధనకు శాస్త్రవృద్ధికి చాలా సహకరించాయి. ఈ రేడియో ఐసోటోప్స్ ప్రయోగాలవల్ల, జీవధాతువుల వృద్ధిక్షయ స్వరూపాలను నిశితంగా ఏ అంతరాని కా అంతరంలో తెలుసుకోటానికి అపారమైన అవకాశం కల్గింది. జీవవస్తువులలో ఎంతెంత క్షణక్షణ పరివర్తనాలు కలుగుతున్నాయో, ఇవి ఎంతెంత సంక్లిష్టంగా ఉంటాయో, రేడియో ఐసోటోప్స్ వల్లనే తెలిసి వచ్చింది.

పంచభూతాలలోని తేజోభూతాన్ని జీవం తన ఉనికికి ఎల్లా గ్రహించుకొంటూందో చూస్తే మహా ఆశ్చర్యకరమైన విషయాలు బైలుపడుతాయి. ఈ తేజాన్ని తనకు అనువుగా గ్రహించటం జీవంయొక్క ప్రాథమిక కృషి. ఈ తేజోగ్రహణంలో, మొక్కలు, సూర్యరశ్మి శక్తితో, నీటిని బొగ్గుపులుసు వాయువును, శక్తి విహితములైన కార్బోహైడ్రేట్ ధాతువులుగా మార్చుకొంటాయి. ఈ ప్రక్రియ లోతుపాతు

లను తిరుచుకొంటూపోయి, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయశాస్త్రజ్ఞులు కొన్ని పరిశోధనలు చేశారు. రేడియో ఆక్టివ్ కార్బన్‌డై ఆక్సైడ్ వాతావరణంలో వెలుగులో ఒక మొక్కను, కొన్ని చోట్ల మొక్కలో భాగాలను పెంచారు. తరువాత మొక్కలను ఏ భాగానికా భాగం ఛేదించిచూశారు. రేడియో ప్రసారం ఉన్న భాగాలు, ఈ శోషగ్రహణ ప్రక్రియలో మొదట ఏర్పడిన భాగాలే అని రుజువయింది. ఈ రేడియో ఆక్టివ్ ప్రసార ప్రయోగం ౫ సెకన్లకంటె ఎక్కువసేపు చేస్తే ప్రసారం మొక్కలోని అన్ని భాగాలకు పాకిపోయి, ప్రయోగానికి మొదలు తుదలు తెలియకుండా పోతాయి.

రేడియో ఐసోటోప్స్ సంచార మార్గమంతా గెగిన్ కౌంటర్ లాంటి యంత్రాలతో అనుసరించేందుకు అనువుండటంవల్ల, దేహంలో రక్తప్రవాహం మొదలైనవాటి చేటి సంచారం పూర్తిగా గ్రహించాలన్నా, రేడియో ఐసోటోప్స్‌లను ఆ ప్రవాహంలోకి ఎక్కించటంవల్ల శాస్త్రజ్ఞులు తేలికగా గ్రహించగల్గుతున్నారు. రేడియో ఆక్టివ్ గంధకం ఎలుకలచేత తినిపించి, ఏఏ అంగమాంస భాగాలకు అది ప్రయాణం చేస్తోందో పరీక్షించారు. ఆరోగ్యంగా ఉన్న ఎలుకలు, జబ్బుపడ్డ ఎలుకలు రెంటిమీదా ప్రయోగించటంవల్ల, తేడాలు తెలిసికోగలిగారు. ఆ తర్వాత రక్తం, మాంసం, చర్మం, ఎముక, నరాలు, ఇన్నీ పరీక్షించటంవల్ల, ఈ గంధకం ఏ రూపాల్లో అక్కడ చేరుతోందో ఎంతమటుకు జీవధాతువులుగా జీర్ణం కాగలిగిందో ఎంతవరకూ కాలేదో, ఇత్యాది పరిశోధనలన్నీ చేయగలిగారు.

ఇనుమును, శరీరం ఏవిధంగా ఉపయోగించుకొంటుంది? రేడియో ఇనుము కుక్కలకు తినిపించి చూశారు. తక్కిన అన్ని పదార్థాలలాగా కాక ఇనుము శరీర ధాతుసృష్టిలో పునఃపునః ఉపయోగించబడుతుంది. ముందు రక్తంలోని ఎఱ్ఱకణాలలో చేరుతుంది. అవి నాశనం అవుతూంటే మళ్ళీ కొత్తకణాలను చేరుకొంటుంది. మామూలుగా తిన్నవాట్లనుంచి కొద్దిపాటి ఇనుమునుమాత్రమే శరీరం జీర్ణం చేసుకొంటుంది.

దోమల గ్రుడ్లను రేడియో భాస్వర వాతావరణంలో పొదగనిస్తే, ఆ దోమలు బ్రతికున్నంతకాలం రేడియో ఆక్టివ్‌గానే పనిచేస్తాయి. ఇలాంటి కొంత గుంపును పెంచటంవల్ల, దోమలు ఎంతకాలం బ్రతికేది, ఎంతదూరందాకా విస్తరించి పర్యటనం చేసేది కూడా ఈ రేడియో ఆక్టివ్ దోమలద్వారా కనిపెట్టగలిగారు.

రేడియో ఆక్టివ్ సోడియమ్‌ను రక్తనాళాలలోకి ఎక్కిస్తే, రక్తప్రవాహ వేగాన్ని కొలవవచ్చును. డిజిటాలిస్ మందునిచ్చే మొక్కలను (ఫాక్స్‌గ్లోవ్) రేడియో బొగ్గు వాతావరణంలో పెంచితే రేడియో ఆక్టివ్ డిజిటాలిస్ తయారవుతుంది. దీన్ని జంతువుల మీద ప్రయోగిస్తే హృదయ సంచలనాలన్నీ స్ఫుటంగా తెలిసికోవచ్చును.

వ్యవసాయిక, వృక్ష శాస్త్రపరిశోధనలలో కూడా రేడియో ఐసోటోప్స్‌కు అపారమైన స్థానం కల్గింది. మొక్కలు ఎల్లా పెరుగుతాయో, ఏయే రసధాతువులను ఏవిధంగా స్వీకరిస్తాయో అన్నీ కూడా స్పష్టంగా తెలుస్తూవచ్చాయి. జీవం నిలవటానికి, మొలిబ్డినమ్, జింక్, కోబాల్టు, మొదలైనధాతుద్రవ్యాలు, మొక్కలు చాలా స్వల్ప ప్రమాణంలోనే స్వీకరిస్తూ ఉంటాయనీ, ఇవి లేకపోతే మొక్కలు పసివాడి ఎండిపోతాయనీ శాస్త్రజ్ఞులు రేడియో ఐసోటోప్స్‌తో చేసిన పరిశోధనలవల్ల కనిపెట్టగలిగారు.

('ఎడ్యుకేషన్' పత్రిక మార్చి ౧౯౫౧ సంచికలో సమ్నర్ టి. పైక్ వ్రాసిన వ్యాసానికి కృతజ్ఞతతో.)

కోలాట

★

శ్రీ. రా. కృ. చక్రవర్తి

సూర్యోదయమునుండి అస్తమానమువరకు పొలములలో చెమటూడ్చి కృషిచేయు పల్లెటూరి రైతుకు ఆ శ్రమను పోగొట్టి మనస్సునకు ఉల్లాసమును, ఉత్సాహమును ఇచ్చు వినోదపు టాటలలో ముఖ్యమయినది కోలాట. వయసు చెల్లినివారు కూడ ఇందులో పాల్గొని యువకులకు మార్గదర్శకు లగుదురు. కోలాట యనగా బాలకులు పాఠశాలలో వేయు జడ కోలన్న యను భావము పాఠకులకు కలుగవచ్చునేమొ. అదియు నిదియు వేరు. రెండింటికిని హస్తిమశకాంతరము కలదు, పల్లెలలో పురుషులు వేయు కోలాట యందలి ఉద్రేకము ఉత్సాహములు చూచి యానందింపవలసినదే. కాదు. చూచినంతమాత్రాన వారి యానందము తృప్తిగాంచదు. జట్టులోచేరి కోలాట వేసి ఆనందింప కోరిక జనించును.

ఈ వేడుకకు కనీసము ౧౬ గురయిన నుండుట బాగు. వీరిలో ౮ గురకు "లోఉద్ది" యనియు, నిలిచినవారికి "ఎలిఉద్ది" యనియు పేరు. లోపలివారు లోపలను బయటివారు బయటను ఇంచుక వెనుక ముందుగ ప్రక్క ప్రక్కనవర్తులాకారముగ నిలుతురు. లోపలివారు అపసవ్యముగను బయటివారు సవ్యముగను తిరుగుచు కోలాట వేయుదురు. ఒక్కొక్కరును మూరెడు పొడవుగల కట్టెలను చెరియొకటి చేతబట్టియుందురు. ఏ కట్టెయయినను కోలాటకు ఉపయోగింపవచ్చు. అయినను, దానియందెక్కువయుత్సాహపరులు "కలిలి" కట్టెతో వానిని తయారుచేయుదురు. ఆ కట్టె ధ్వని చెవులకు కటువుగ నుండక ఇంపుగ నుండును. ప్రతియొకడును కాళ్లకు గజ్జెలుకట్టుకొని యుండును.

కోలన్న వేయించువానికి "మేళగా" డనియు "కట్టెచెప్పువా" డనియు పేరు. ఈ మేళగా డుధ్యాపకు డయిన గావచ్చును. లేక జట్టులో బాగుగ విద్య నేర్చిన బుద్ధిమంతుడైన గావచ్చును. ప్రారంభము, ముగింపు అతనిమాటపై నడచును. ఇతడె ముందుపాట కాడు. కోలన్న వేయుటలో విలంబితముగాని ద్రుతముగాని మేళగాని నోట వెడలు పాటగతినిబట్టి యుండును. ఒక్కొక కోపులో ఈరెండును మిళితమై నడచుటయు కలదు. కొందరు మేళగాని సహాయార్థము ముఖవీణె వాయించువానిని మధ్యనుంచుకొనుటయు కలదు. గీతము, తాళము, నృత్యము యీ మూడును పరస్పరము సహకరించుచు నడచుట యీ వేడుకలోని విశేషము.

ఇందులో నుపయోగించుపాట లన్నియు ప్రాచీన జానపదగేయములు. కాని వానికి కాలదోషము పట్టియవి వెనుకకు బడిపోగా, సినిమాపాటలు నెంచునాటక పాటలు వాని స్థానము నాక్రమించుచున్నవి. ఈమార్పు, కోలాటకు రసపుష్టి నియ్యలేదు, సరికదా, కుదరనివారిదైనది. ప్రాచీనగేయములతో భావానుగుణ్యముగ నడచుచుండిన గతి, క్రొత్తపాటలలో కుంటుపడుచున్నది. ఆ ప్రాచీన గేయములు పూర్తిగ నశింపక, అచ్చటచ్చట ఒకటి రెండు నిలచినవి.

మచ్చునకొకటి రెండుపాటలు:

కుచోని చెరిగే కోపు

కుచోని చెరిగే, చేటికురులపై
తుమ్మెద లాడిం,దో లాలా
ఘనతుమ్మెదలాడిం,దో లాలా ||

చెమటకు తడిసి, చెదరినగంధము
ఘుమఘుమలాడిం,దో లాలా
అది ఘుమఘుమలాడిం,దో లాలా ||

ముఖమున యుండే, కస్తూరి తిలకం
ముక్కుకుజారిం,దో లాలా
కొనముక్కుకుజారిం,దో లాలా ||

గొప్పది రోకలి, సుప్పున దంచగ
సుబ్బలు కదలిన,వోలాలా
ఘనసుబ్బలు కదలిన,వో లోంగా ॥
సెరిగేటప్పుడు, చేతిలోగాజులు
గలగల లాడెం, దోలాలా
అవి గలగలలాడిన,దోలాలా॥
హంస నడుపులు, నకీచేభామకు
అందెలు కదలెం,కోలాలా
కాలందెలు కదలినవో లాలా ॥

ఈ పాటలో వర్ణితమైన వ్యక్తిస్వరూపము పాఠకులకు కన్నులయెదుట కాన్పించకపోదు. ఈ కోలన్న వేయునపుడు జట్టులోని వారందరు ఏకకాలమున సుప్పున కూర్చొని, కట్టెయాడి, లేచుచు, ముందుకు బోవుచుందురు.

మల్లన్న కోపు

నాపేరు మల్లన్న, నాదిరేకలకుంట,
కదిరి భూమండలము,
నడరేసున్నదన్నాడే-మల్లన్న
భియమేసున్న దన్నాడే,
సాకివారి చిన్నవాడే, మల్లన్న
బోగవోళ్ల చిన్నవాడే ॥

ఎద్దునుసు కనుములో, ఏనుపేండలపైన,
చిలుకవలె కూకోని
మలకవిహాసముదిప్పినాడె, మల్లన్న
భైరివిహాసము దిప్పినాడె
తనపేరు తెలజెప్పినాడె మల్లన్న,
లంకమలచేరినాడె ॥

ముందు చరణములు లభించలేదు. పాపలయందు చిత్రమైన పౌరుషము, ఉదాసీనత, గుండెదిటవు కోలన్న నడకయందును కాన్పించును.

ఎలిఉద్ది చిత్రాకి

"వచ్చేనురా, రంగ, వచ్చేనురా
పెన్నోబుళము తేరు జూడ, వచ్చేనురా
గుడ్లకోడి జంపుకో, సుజ్జంగ వండుకోని
గుత్తిలోన తెల్లవార, వచ్చేనురా
కారుకోడి జంపుకోని, కమ్మంగ వండుకోని
కదిరిలోన తెల్లవార, వచ్చేనురా
అత్తిమామ గొలిచేటి, గుత్తినరసింహునికు
వత్తిలేని దీపంబెట్టి, వచ్చేనురా
వచ్చేంటనుండేటి, నా చిన్నిబాలునకు
నల్రాళ్ల పాలుబోసి, వచ్చేనురా
పాలుబోసి పండబెట్టి - వచ్చేనురా
నీళ్ళుబోసి నిద్దరూపి - వచ్చేనురా."

ఈ పాటలో చిత్రింపబడిన తరుణి పెన్నోబళం తేరుకు తన "రంగ"ని జతలో పోవుటకు తన యింటిపనుల నన్నిట బిరబిర ముగించుకొని సిద్ధపడుటలో చూపెడు ఆతురతకోలన్న గతియందును, గాంచనగును.

నరసన్న కోపు

"యాలేస్తివి, నరసన్న, సెరుకుతోట
ఎందుకేస్తివి, నరసన్న, సెరుకుతోట
చుట్టుముట్టు తోటలన్ని
చుట్టుకొని కొచ్చినాయి
నరసన్న తోటలోన,
నక్క కొరుక, పచ్చిలేదు
అయగాళ్ల కింతపాయ,
పాయగాళ్ల కింత పాయ
అప్పులోళ్ల కింతపాయ
అడిగినోళ్ల కింతిపాయ."

నరసన్న రెండ గ్రామజనులు చూపు సానుభూతి యొకవంక, పరిహాసోక్తు లింకొకవంక కోలన్న నడకయందు చూడవచ్చును.

సాధారణముగ కోలాట "చుట్టుకట్టె" తో, గణపతి ప్రార్థనా గీతిముతో, నారంభమగును. పాట ముగియగనే మేళగాడు ద్రుతగతి నెత్తును. దీనికి "సెలగట్టె" యని పేరు. విలంబగతి త్రిపుటతాళమున నడచినను ద్రుతగతి ఆదితాళమున బోవును. గతికి తగిన పాటపాడి తుదకు "జంతిక, జంతిక, తత్ర జ్ఞంతిక, తాకిడజంతిక" అను తాళగతిని మాత్రము పలుకుచు త్రిపురములకు, ముందువెనుకలు నడచుటకు, చిటికెలు వేయుటకు తాళగీతియందే మేళగాడు హెచ్చరిక లిచ్చుచు "తియ్యక" తద్దిమిత అని ముగించును.

తరువాత "కోపు"లు వేయుదురు. వీనిలో ముఖ్యమయినవి "చిత్రాకి" కోపులు ఇవి యన్నియు ఆదితాళముపై నడచునవి. నిండుచిత్రాకి పాల్లచిత్రాకి, ఎలిఉద్ది చిత్రాకి, మానంది బుగ్గలు, కుచోనిచెరిగే, మల్లన్న, నరసన్న, దమరిచూపులు, ఉంగారము, ఎరికులసాని మొదలయినవి కొన్ని

ముఖ్యములు అన్నియు నొక్క "చిత్రాళి" జాతికి చేరినను ఒకటే తాళగతిని వచించినను, ఆవర్తమునందును కోలాట గతియందును కొంత భేదముండును. ఇవిగాక జగడము, బజారు, సువ్వి, గొల్లభామ పెద్ద మదన, గీరుకట్టె, పూలచెండ్లు మొదలగు కోపులు వేర్వేరుగతుల నడచునవి, చాలగలవు, జగడముకోపును చూచినపుడు దొంటికలహము ప్రత్యక్షముగ కాన్పించును. బజారు కోపువేయుచు నాలుగువీథులు చుట్టిరావచ్చును. మేళగాడు ప్రారంభించిన పాటనుబట్టి ఏకోపువేయవలెననుట జట్టిలోని వారందరెరుగుదురు. తుదకు మంగళములో కోలాట ముగియును.

అన్ని విషయములందును పాశ్చాత్యానుకరణమున మునిగియున్న మనకు, ప్రాచీనమై, మనదేశమునకే ప్రత్యేకమయిన యీ వేడుక, నాగరక శిఖామణుల కపహాస్యకరముగ కాన్పించుచున్నది. ఇందులో పాల్గొనుటగానీ తుదకు వేడుకగ చూచి యానందిందించుటకుగాని వారి నాగరకత కొక న్యూనత నాపాదించునని వారి భావము. కావుననే ఈవేడుకకు తగిన ప్రోత్సాహము లేక పల్లెలయందు సహా నశించి పోవుచున్నది. ఇప్పటికి సుమారు ౩౦,౪౦ సంవత్సరముల క్రిందటివరకు, పల్లెలలో గొంచికాక, వెన్నెలరాత్రులు రాగానే జట్టివారి నందరి పిలిపించి కనీసము ౨,౩ గంటల పొద్దయిన కోలన్న వేయించుటయు, గ్రామమునందలి స్త్రీపురుషులందరు ఆవేడుకను చూచి యానందించుటయు, నాచారముగ నుండెడిది. ఇపుడాయాచారము నశించుచున్నది. యువకులలో సహా ఉత్సాహము నశించుచున్నది. జాతరలు రథోత్సవములు జరుగు స్థలములకు దూరగ్రామములనుండి జట్లువచ్చి ఒకరినిమించి యొకరు మిన్నగ కోలన్న వేయుచుండిరి. ఇపుడు ఏ ఒకటి రెండు జట్లోవచ్చి, ఉబుసుపోకకు, కోలన్న వేసినను, చూచువారు గాని చూచి యానందించు వారుగాని అరుదైనారు.

ఈకోలన్నయందు, వేడుకమాత్రమేగాక, శరీర వ్యాయామమునకును అవసరమగు అవకాశము లేకపోలేదు. హైస్కూలు, కాలేజీలయందలి విద్యార్థులు బ్యాడ్మింటన్ ఆటనాడుటకు బదులు దీని నభ్యసించిన కొంతయోగుణముగలదు. రాగ, తాళ జ్ఞానములు కలుగుటకు సహాయకారి. అన్నిటికి మించి రసపుష్టిగల జానపదగేయములు పూర్తిగ నశించిపోవుటకుముందే పునరుద్ధరింపబడుట కవకాశమేర్పడును.

గ్రంథ విమర్శనము

కుంతి:

[పద్య కావ్యము]

గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రి. అరుణాశ్రమము, పెదకుదురు, కాకినాడ.

వెల: రెండు రూపాయలు.

ఇది కుంతీదేవి జననం మొదలు మరణంవరకు జరిగిన సంఘటనలన్నీ ఆయా ఘట్టాలలో వర్ణించే పద్యకావ్యము. ఈ కావ్యంలోని చాపల్యము, సంశయ విమోకనము, కుమారాస్త్ర విద్యా సందర్శనము మొదలయిన పూర్వోత్తర ఖండాలలోని, ఆయా సత్తికలలో కుంతీ జీవితంలోని ప్రత్యేక ఘట్టాలు, మానసిక పరిస్థితులు వర్ణిస్తూ రచయిత సమగ్ర కుంతీస్వరూపం పాఠకులకు కళ్ళకు కట్టినట్టు చిత్రించారు.

అయితే రచయిత ఈ కావ్య చిత్రణంలో కుంతిలో కొన్ని ప్రత్యేక స్వభావాలు ప్రవేశపెట్టారు.

భారతకాలంలో ఒక విశిష్టమైన పాతివ్రత్య ధర్మం అవలంబింపబడుతూ ఉండేది. ఆరోజుల్లో ద్రౌపది బహుభర్తృకత్వము మొదలైన ఆచారాలేవీ పాతివ్రత్యధర్మానికి విరుద్ధమైనవని ఆ కాలంలోని ధర్మనిష్ఠలెవరు భావించలేదు. ఇంచుమించుగా ఇలాంటి ఆచారమే అవలంబించి కుంతీదేవికూడా మంత్రోపాసనా బలంవల్ల, సూర్యానుగ్రహంవల్ల కర్ణుని కన్నది. కాని ఈ కావ్యంలోమాత్రం ఆమెలో ఆ తరవాతకూడా కొంత సంకోచం బాధిస్తూనే ఉంది. అప్పుడు సూర్యుడు ఆమె ధర్మసందేహం తీరుస్తున్నాడు.

"నీ సందేహము లే తొలంగితివి
దన్వి దీనికై యింత సం
త్రాసంబా? భవితవ్యతాఫలము
గాదా యిద్ది? నిష్కారణం
బా సంకోచము మాని తప్పక
వివాహంబాడు మేనాటికో
నీ సంతానము మాట తెల్లముగ
దానే ప్రాప్త కాలంబునన్"

ఆ పైన సూర్యుడు కుంతికి కన్యాత్వం చెడకుండా వరంకూడా అనుగ్రహించాడు.

'అయినా కుంతికి తాను 'దుష్కళంకిత' ననే భావం పోనేలేదు. ఈ అర్థంగల ఈ పద్యం ఇక్కడ ఉదాహరిస్తున్నాను.

"అనుకని యుత్తరంబిది మహాత్మ!
వరే! యగుగాక! దుఃఖపూ
రిత గృహిణీ స్వరూపము ధరించెద
నేపటినుండి 'దుష్కళం
కిత' యని రాదలంచు నపకీర్తి
ధరించెద నోర్పుమై మదా
హ్వృతము దాశకవ్యక చరిత్రము
నాదగు జీవితమ్మునన్"

ఇలాగ కుంతి భావించడం—ఆ కాలంలోని ఆచార పరిసరాలకు అనుకూలంగా లేదు. ఇక్కడ రచయిత ఈ కాలంలోని అప్పుడే పాతివ్రత్య భావాల దృక్పథంతో కుంతికి 'కళంకిత'నే భావం అంటగట్టినట్టు కనిపిస్తున్నది. అదీగాక పాండురాజుతో వివాహం జరిగినతరవాత కూడా దేవతా ప్రసాదంవల్ల కుంతికి సంతానం కలుగుతూనే వచ్చింది కూడాను. ఈ పరిస్థితుల్లో పై 'కళంకభావన' కుంతికి ఎంతమాత్రము స్వభావోచితంగా లేదు.

శ్రీ రామకృష్ణశాస్త్రిగారి కుంతీ చరిత్ర పరిశీలనంలో పాఠకులకు అనుభవం ఆంధ్ర భారతంలో కుంతీచరిత్ర ఘట్టాలైనా స్ఫురణకువచ్చి తీరతాయి. ఇలాగ తారతమ్య పరీక్ష చెయ్యడానికి వీలైనది ఈ 'కుంతి'లోని 'ప్రస్థాన' ఘట్టము.

తెలుగు భారతంలో ఈ ఘట్టం కుంతీ చిత్రణం చాలా ఉదాత్తంగా నడిచింది. అసలు కుంతి వనవాసానికి ప్రయాణమయ్యే సూచనే ఆ ఘట్టంలో లేదు. ధృతరాష్ట్రాదులనందరినీ సాగనంపడానికి బయలుదేరినట్టుగానే ఆమెకూడా ప్రయాణమౌతుంది. అలాగ కొంతదూరం పోయేసరికి ధర్మరాజీ సంగతి చల్లగా గ్రహించి ఆమెను తిరిగి మళ్ళిపొమ్మని అర్థిస్తాడు. కాని ఆమె అతని ప్రార్థన వినిపించుకోకుండానే అతనికి ఏవేవో ధర్మోపదేశాలు చేస్తుంది. ఇలాగ అనాలోచితంగా అరణ్యవాసానికి బయలుదేరడంవల్ల ఆమెలో ఒక ఠీవి, రాజ్ఞీగాంభీర్యము గోచరిస్తున్నాయి.

కాని శ్రీ రామకృష్ణశాస్త్రిగారి ప్రస్థానంలో కుంతి మొట్టమొదలుగానే ధర్మరాజుతో తన ప్రయాణ సన్నాహం తెలియజేస్తుంది. దీనివల్ల మూలంలో

కథాకథనం ద్వారా వచ్చిన వ్యంగ్యం లోపించి పోయింది.

ఈ రోజుల్లో తెలుగులో కేవలం పద్య రచయితలు సుమారు రెండుమూడు వందలదాకా ఉన్నారు. వీరందరిలోను కవులనిపించుకో దగినవారు చాలా తక్కువే. కాని శ్రీ రామకృష్ణశాస్త్రిగారు ఎన్నదగిన ఈ కవివర్గంలో ప్రత్యేకంగా పేర్కొన దగిన వారు.

సంస్కృతాంధ్ర శబ్దాలు సరియైన సాంప్రదాయికార్థాలలో వాడుతూ కథ నడిపించుకు పోవడంలో ఈ కవి గట్టిదిట్ట. వీరి వృత్తి రచనలో కథాను కూలమైన గాంభీర్యం పొంగిపొర్లుతూ ఉంటుంది. ఈ కావ్యంలోని ఘట్టాలన్నిటిలోను కుంతి జీవిత పరిసమాప్తి ఘట్టం బాగా పాకంలోపడింది. ఈ ఉత్తమ ఘట్టంలోని ఈ మూడుపద్యాలు వీరి కవితాస్వభావం చాలావరకు స్ఫురింపజేస్తాయి.

"నా యపచార ఘోర పరిణామ
ఫలము వివశ దాను బాధ్యురాలై
పోయెను గర్భ శోకకృతి పూర్ణులు
బోయెదరు దివ్య భూమికిన్!
ఓ యతివర్య! మీ కరుణయుండినచో
నొకమారు వాని నా
హ్యాయము మీరజూచుకొని
భాగ్యము పట్టదు నేను నాకిటన్

చాలును స్వామి! నైజ
కవన స్ఫురితంబగు, దివ్యకుండల
శ్రీ లలితంబగు కాంతి మనురీకృతి
బోసుకు కర్ణునెల్లరన్!
బాల దినేశ మండలము భాతిని
నీ కరుణా ప్రశాంతిలో
జేలుట జూచుకొంటి నిక
దీరె సమస్తము చిత్తభారమున్

ఈ యానందము తీరిపోవుటకు మున్నే
నేను శాంతిమ్ముగా
దాయంబోరెడు నా ప్రియాత్మజాని
క్లిష్టంబైన నా జీవితా
ధ్యాయంబిట్లు ముగింపనిమ్ము! పరమేశా!
నిత్య కళ్యాణమూ
ర్తీ! యానంద కళావధీ! విమల శాంతి
జ్ఞాన సుక్షేత్రనిధీ!"

ఈ కావ్యానికి శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు, గడియారం వెంకటశాస్త్రిగారు మొదలయిన ప్రముఖులు ప్రశంసాత్మకమయిన పీఠికలు వ్రాశారు. సత్యనారాయణగారు కావ్యంలో కొన్ని ముఖ్యమైన గుణదోషాలుకూడా పేర్కొన్నారు.

Printed & published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No 7, Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad